సంపుటము-II
సమావేశము-2 - 15వ శాసన సభ
నంబరు. 4

వెల : రూ. 15-00
17 జూలై, 2019
బుధవారం (ఐదవ రోజు)
(శక సంవత్సరము-1941
ఆషాడం - 16)

ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు
ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక
OFFICIAL REPORT
విషయ సూచిక

క్రమ సంఖ్య	విషయం		పేజీ నం.
1.	సభ ప్రారంభం (ఉ.గం.9.00 లకు)	....	01-01
2.	వాగ్రూప ప్రశ్నలు - సమాధానాలు	....	01-46
3.	సభ సమక్షంలో ఉంచబడిన పత్రములు	....	46-46
4.	వాయిదా తీర్మానం - తిరస్కరణ (రాష్ట్రంలో ఇసుక కొరత గురించి)	....	47-47
5.	ప్రభుత్వ బిల్లు ప్రవేశపెట్టుట (The Andhra Pradesh Electricity Laws (Andhra Pradesh Amendment) Bill, 2019)	....	47-47
6.	బడ్జెట్‌పై చర్చ (చివరి రోజు)	....	47-98
7.	బడ్జెట్‌పై ఆర్థికశాఖామంత్రిగారి సమాధానం	....	98-112
8.	సభ వాయిదా(మధ్యాహ్నం 2.52 ని.లకు)	.....	112-112

ఆంధ్రప్రదేశ్ శాసన సభ

ప్రధాన అధికారులు

గౌరవ సభాపతి	:	శ్రీ తమ్మినేని సీతారాం
గౌరవ ఉప సభాపతి	:	శ్రీ కోన రఘుపతి
కార్యదర్శి(ఇన్‌చార్జ్)	:	శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు
ఉప కార్యదర్శులు	:	శ్రీ కె. సత్యనారాయణ రావు
		శ్రీ ఎం. విజయరాజు
సహాయ కార్యదర్శులు	:	శ్రీ పి.వి.సుబ్బారెడ్డి
		శ్రీ కె.రాజకుమార్
		శ్రీమతి ఆర్.వనితారాణి
		శ్రీమతి డా.వై.కామేశ్వరి
		శ్రీ కె.వెంకటేశ్వరరావు
		శ్రీ డి.జగన్‌మోహన్‌రావు
		శ్రీ బి.ప్రభాకర్‌రావు
		శ్రీమతి కె. భారతి
		శ్రీమతి డి. విజయకుమారి
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ శ్రీనివాస్ అల్లాడి

ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY
Wednesday, the 17TH July, 2019

(The House assembled at 9.00 am with the Hon'ble Speaker in the Chair)

***

మిస్టర్ స్పీకర్: ఈ రోజు రెవిన్యూ మినిష్టర్ గారికి కౌన్సిల్‌లో బిజినెస్ ఉండడం మూలంగా ఆయన క్వశ్చన్‌ని ముందుగా take-up చేసి తరువాత ఫాలోయింగ్ క్వశ్చన్స్ చూద్దాం. Question No.32.

SRI PILLI SUBHASH CHANDRA BOSE: Good Morning Sir, Thank you for giving me this opportunity.

శాసనసభ్యులకు ప్రభుత్వ అతిథి గృహాలలో వసతి

ప్రశ్న నెం.32 (46)

శ్రీ చింతల రామచంద్రారెడ్డి,ఎంఎల్ఏ.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా

అ) విజయవాడలో ఉన్న వాటిలో ప్రభుత్వ వసతి గృహాలలో ప్రత్యేకించి ఎం.ఎల్.ఏలకు వసతిని కల్పించడంలో సాధారణ పరిపాలన శాఖ ప్రాధాన్యతను ఇవ్వడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా

ఆ) అయితే, దానిపై తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి తరపున ఉపముఖ్యమంత్రి (శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్) :

అ) లేదండీ

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

మిస్టర్ స్పీకర్: సి.హెచ్ రామచంద్రారెడ్డి గారూ..

(శ్రీ సి.హెచ్. రామచంద్రారెడ్డి గారు సభలో కనిపించలేదు)

రామచంద్రారెడ్డిగారు రాలేదా?

(సభ్యులు శ్రీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడడానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

డా.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (DR.CHEVIREDDY BHASKAR REDDY): అధ్యక్షా, గౌరవసభ్యులు రామచంద్రారెడ్డిగారు అడిగిన ప్రశ్న ఇది. గవర్నమెంట్ గెస్ట్ హౌస్‌లు ఏవైతే ఉన్నాయో వాటిలో శాసనసభ్యులకు ప్రాధాన్యతనివ్వాలని దాని ఆలోచన. మేము కూడా అదే రిక్వెస్ట్ చేస్తున్నాం. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు చాలామంది ఉన్నారు. వారు గవర్నమెంట్ గెస్ట్ హౌస్‌లకు వెళ్లినపుడు వాళ్లు పట్టించుకోవడం లేదని, శాసనసభ్యులకు కనీసం రూమ్ కూడా ఇవ్వడం లేదని ఒక ఆలోచన ఉంది. అధికారులకు ఇచ్చిన ప్రాధాన్యత సభ్యులకు ఇవ్వడం లేదు. చివరకు స్థానిక జిల్లా అధికారికైనా రూము ఇస్తున్నారు గాని, శాసనసభ్యులకు ఇవ్వడం లేదు. కాబట్టి గవర్నమెంట్ గెస్ట్ హౌస్‌లలో శాసనసభ్యులకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నాము ఒకటి. రెండోది ఏదైతే టూరిజం గెస్ట్ హౌస్ ఉందో ఈ టూరిజం గెస్ట్ హౌస్‌లో అధికారులు ఏదైతే 30 శాతం, 20 శాతం వాళ్లకి డిస్కౌంట్ ఇస్తున్నారు. అదే శాసనసభ్యులు అడిగితే డిసౌంట్ ఇవ్వడం లేదు. ఇంకా క్వార్టర్స్ లేవు కాబట్టి చాలామంది శాసనసభ్యులు టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఉన్నారు. టూరిజం గెస్ట్ హౌస్‌లకు శాసనసభ్యుడు వెళ్లినపుడు 100శాతం అమౌంట్ కట్టమని కోరుతూ బయటి వ్యక్తిలాగా చూస్తున్నారనే భావనతో వారు ఈ ప్రశ్న వేయడం జరిగింది. మీ ద్వారా గౌరవ మంత్రివర్యులను రిక్వెస్ట్ చేసేదేమంటే గవర్నమెంట్ గెస్ట్ హౌస్‌కు వెళ్లినపుడు ఎంఎల్‌ఏకి ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే తమిళనాడులో ఎలా టూరిజం గెస్ట్‌హౌస్‌కి వెళ్లినప్పుడు 50శాతం డిస్కౌంట్ ఇస్తున్నారో ఎంఎల్‌ఏ సెల్ఫ్ వెళ్లినపుడు ఆ ప్రకారం ఇక్కడ కూడా ఇస్తే బాగుంటుందనే ఆలోచనతో రిక్వెస్ట్ చేస్తున్నాం. శాసనసభ్యులు ఎక్కడికి వెళ్లినా ప్రభుత్వేతర గృహాలలో గానీ, టూరిజం గెస్ట్‌హౌస్‌లలో గానీ ప్రాధాన్యతనివ్వవలసిందిగా తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాం.

(శ్రీ సి. హెచ్.రామచంద్రారెడ్డిగారు మాట్లాడడానికి అవకాశాం ఇవ్వాల్సిందిగా కోరసాగారు)

కూర్చోండి రామచంద్రారెడ్డిగారు..

SRI PILLI SUBHASHCHANDRA BOSE : Sir, After bifurcation of the State of Andhra Pradesh, the State Guest house at Vijayawada within capital region is not sufficient to allot the guest house to VIPs Sir. As per the requisition made by the Hon'ble MLAs the Government have allotted accommodation which is providing on top priority to the MLAs at Vijayawada Sir. కండిషన్స్ ఏమిటంటే On par with the MLAs, MLCs and MPs some of the State guests are also VIPs to government Sir. We are providing accommodation according to top priority to the State guests. If accommodation is not available readily, ప్రైవేట్ హోటల్స్‌లో accommodation ఇవ్వవలసిన బాధ్యత గవర్నమెంట్ మీద ఉంది. అందుచేత గౌరవ శాసనసభ్యులు కోరినట్లు there is no doubt that MLAs, MLCs and MPs are most VIPs to the Government Sir. అందుచేత accommodation చాలా తక్కువగా ఉంది కాబట్టి keeping in view non-availability of guest houses in Vijayawada, I request all the Hon'ble Members to please cooperate with the Government in this regard.

MR.SPEAKER: Members as and when they would like to visit constituency or at the district headquarters... సహజంగా రాష్ట్రానికి ఎవరైనా అతిథులు వచ్చినపుడు వారిని గౌరవిస్తూ టూరిజం గెస్ట్‌హౌస్‌లను కేటాయించడంలో వారికి ప్రాధాన్యతనిస్తాం. దానిని సభ్యులు కూడా అర్థం చేసుకోగలరు. ఇప్పుడు బైఫర్‌కేషన్ తరువాత lack of accommodation కారణంగా problem ఉంది. అయినా శాసనసభ్యులు వెళ్లినప్పుడు ఉన్నదాంట్లో ప్రయారిటీనిచ్చి కేటాయించే విధంగా జిల్లా ఉన్నతాధికారులకు, కలెక్టర్లకు తమరి దగ్గర నుంచి ఒక డైరక్షన్ ఇవ్వండి.

SRI PILLI SUBHASHCHANDRA BOSE: We will definitely inform this matter to all the District Collectors.

డా.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (DR.CHEVIREDDY BHASKAR REDDY): టూరిజం గెస్ట్‌హౌస్‌ల విషయంలో కూడా గౌరవముఖ్యమంత్రిగారు డిపార్ట్‌మెంట్ అధికారులకు ఆదేశాలు ఇచ్చేవిధంగా చూడండి.

మిస్టర్ స్పీకర్ః వారు అడిగిందేమంటే ఇతర రాష్ట్రాల టూరిజం గెస్ట్‌హౌస్‌లలో సబ్సిడీ ఇవ్వాలని ఉంది. అది ఇక్కడి సభ్యులకు కూడా వర్తింప చేసే అవకాశాన్ని పరిశీలించమని గౌరవసభ్యులు కోరుతున్నారు. Please have coordination with the Minister for Tourism also.

శ్రీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ః తప్పకుండా సార్.

MR.SPEAKER: Question No.44

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల సత్వర పూర్తి

ప్రశ్న నెం 44 (41)

సర్వశ్రీ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కాకాని గోవర్ధన రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, కుందూరు నాగార్జున రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు – ఎంఎల్‌ఏలు.,

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని పెంచడమయిందా

ఆ) అయితే అంచనా వేసిన వ్యయాన్ని పెంచబడిన ప్రాజెక్టుల వివరాలు మరియు అందుకు గల కారణాలేమిటి

ఇ) రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రి (శ్రీ పోలుబోయిన అనిల్ కుమార్) :

అ) అవునండీ

ఆ) ప్రాజెక్టుల వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

అంచనా వ్యయ పెంపుదలకు గల కారణాలను క్రింద చూపడమైనది.

1. భూ సేకరణలో జాప్యం మరియు 2013, క్రొత్త భూ సేకరణ చట్టం మరియు ఆర్.ఆర్.పాలసీ అమలు.
2. పర్యావరణ మరియు అటవీ క్లియరెన్స్‌లను పొందటంలో జాప్యం.
3. ఇ.పిసి పనుల కోసం 23.02.2015 తేదీగల జి.ఓ.ఎంఎస్.నెం.22 మరియు 12.06.2015 తేదీగల జి.ఓ.ఎంఎస్.నెం.63 అమలు.
4. క్రొత్త ఏజెన్సీలకు మొత్తం కాంట్రాక్టుగా 60 (సి) క్రింద ఇపిసి పనులలో కొంత భాగాన్ని అప్పగించడం.
5. పనుల పరిధిలో మార్పు.
6. ఎన్.హెచ్.ఏ.ఐ, రైల్వేలు, జెన్‌కో/ట్రాన్స్‌కో, గెయిల్, అటవీ శాఖ వంటి వివిధ ప్రభుత్వ సంస్థలకు చెల్లింపు కొరకు సవరించిన నిబంధన.
7. మిగిలిన పనులు/ఆపివేసిన పనుల కొరకు షెడ్యూల్ రేట్ల సవరింపు.

ఇ) షెడ్యూలు ప్రకారం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటున్నది.

- భూ సేకరణ మరియు ఆర్ & ఆర్ సమస్యలను వేగంగా పరిష్కరించడం.
- పెండింగులోని అటవీ క్లియరెన్సులు మరియు పర్యావరణ క్లియరెన్సుల కొరకు కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం సంప్రదించడం.
- వీలైనంత త్వరగా అడ్డంకులను పరిష్కరించడానికి ఎన్.హెచ్.ఏ.ఐ, రైల్వేలు, జెన్ కో/ట్రాన్స్ కో, గెయిల్ మొదలగు ఇతర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం.
- పూర్తి కావస్తున్నట్టి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం.

Sl.No	Name of Project
	2014-2015
1.	Pushkara Lift Irrigation Scheme
2.	Surampalem Reservoir Project
3.	Yadikicanal System (PABR Stage II) (P 32,33,41 & 42)
	2015-2016

1.	B.R.R.Vamsadhara Project Phase-II of Stage-II
2.	Gorakallu Balancing Resorvoir
3.	HNSS Phase-I
4.	HNSS Phase-II
5.	GNSS Phase - I works
6.	Tarakarama Thirtha Sagaram Reservoir Project
7.	SH - 31 Road work
8.	Modernization yeleru Delta System
	2016-2017
1.	V.K.M.N.Janjhavathi Reservoir Project
2.	Musurumili Reservoir Project
3.	Chintalapudi Lift Irrigation scheme
4.	Gundlakamma Project
5.	Siddapuram Lift Irrigation Scheme
6.	Telugu Ganga Project
7.	Modernisation of Mid Pennar south Canal from Km 0.000 to km 84.000
8.	Providing CC lining to Dharmavarm Branch Canal form km 0.000 to km 34.450
	2017-2018
1.	Mahendratanaya Offshore Reservoir Project
2.	Tadipudi Lift Irrigation Scheme
3.	Telugu Ganga Project
	2018-2019
1.	Polavaram
2.	Madduvalasa - II
3.	Pula Subbaiah Veligonda
4.	GNSS Phase - II
5.	Flood Banks of Godavari River
6.	Modernization of Pennar Delta (Nellore Barrage)

శ్రీ తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి(SRI THOPUDURTHI PRAKASH REDDY)(రాప్తాడు): అధ్యక్షా, ముందుగా నాకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన దివంగత మహానేత డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారికి నేను ఈ సభ ద్వారా నా కృతజ్ఞతలను తెలియజేస్తాను. అదేవిధంగా ఈ సభలో అవకాశం కల్పించిన మా నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గారికి కూడా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఈరోజు మొదటిసారిగా మాట్లాడుతున్నాను. తాగునీటి ప్రాజెక్టులలో జరిగిన అవినీతి గురించి మాట్లాడాలంటే క్వశ్చన్ అవర్‌లో టైం సరిపోదు. గత ఐదు సంవత్సరాలలో ప్రాజెక్టుల అంచనాలను పెంచుకుని అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టుల విషయం గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఇందులో ఇచ్చిన వివరణ ఏమాత్రం కూలంకషంగా లేదు. కేవలం జిఓ నెం.22, జిఓ నెం.63 ద్వారా అంచనాలు పెరిగాయనేసి భూసేకరణ 2013 New Land Acquisition Act వల్ల భూసేకరణ ధరలు పెరగడం వల్ల అంచనాలు పెరిగాయనేది పూర్తిగా అవాస్తవం. మొట్టమొదటగా 60(c) నిబంధనల కింద ప్రాజెక్టులను EPC కాంట్రాక్టులు రద్దు పరిచి కొత్త కాంట్రాక్టర్లకు నామినేషన్ మీద ఇవ్వడం లేదా రీటెండర్ల మీద ఇవ్వడం

అనేది అనంతపురం జిల్లాలో మొదలు అయ్యింది. మా అనంతపురం జిల్లా అప్పటి మంత్రిగారు శ్రీమతి పరిటాల సునీత గారు రాసిన ఈ లేఖ ద్వారా (సభలో ఆ లేఖను చూపిస్తూ) 2014 జూలై 16న రాసిన లేఖకు అదేరోజున అప్పటి మంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుగారు వెంటనే on war foot basis ప్రమోట్ చెయ్యడం అదేరోజున ఇంజనీరింగ్ చీఫ్ అదే లేఖను కిందకు forward చెయ్యడం, మరుసటి రోజున చీఫ్ ఇంజనీర్ అదే లేఖను రెకమండ్ చెయ్యడం యథాతథంగా ఆ మరుసటిరోజు సూపరింటెండెంట్ ఇంజనీర్ దగ్గరకి వెళ్లి కొన్ని కాంట్రాక్టులు రద్దు విషయమై on war foot basis చర్య తీసుకోవడం జరిగింది. నామినేషన్ మీద ఇవ్వడానికి సంబంధిత అనంతపురం సర్కిల్‌కు, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒప్పుకోకపోవడంతో దానిని ఆ రెండు ప్రాజెక్టులు ప్యాకేజీ 53(8) ఆ రెండు ప్రాజెక్టులు ప్యాకేజీలను మదనపల్లిసర్కిల్‌కి వెంటనే మార్పిడి చేసి అదే రోజు వాళ్లకి కాంట్రాక్టులు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంత వెంటనే రెండు ప్యాకేజీలను పూర్తి మొత్తంలో డిలీట్ చేసి 60(c) కింద ఇవ్వాలనే పరిస్థితి ఎందుకు వచ్చింది? అదేవిధంగా 60(c) నిబంధన అంటే ఏదైతే డెలివరీ టైంలో అంటే మనం రైతులకు నీళ్లు ఇవ్వాల్సిన అత్యవసర పరిస్థితుల్లో కొంత భాగాన్ని తీసి వేరే కాంట్రాక్టరుకు ఇవ్వవచ్చు. కానీ రూ.150కోట్ల పనులను అప్పనంగా తీసి నామినేషన్ల మీద పనులు అప్పజెప్పడం ఈరోజుకి కూడా ఆ పనులు పూర్తి కాలేదు. ఆ SR Constructions కాంట్రాక్టరు ప్యాకేజి కింద 8 పనులు తీసుకున్నారు.

ఉ.9.10

ఆ పనులను పూర్తి చేయడానికి వీలులేని పరిస్థితుల్లో మరలా ఆయన దగ్గర నుంచి కూడా రూ.1.63కోట్ల పనిని మరొక ఏజెన్సీకి ఇవ్వడం జరిగింది. అదే విధంగా నామినేషన్ పద్ధతిలో పనులే కాకుండా 60(సి) నిబంధన కింద అనంతపురం జిల్లాలో హంద్రీ-నీవా మొదటి దశలో 36వప్యాకేజ్‌లో జీడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి ముఖ్యమంత్రిగారు అక్కడొక సమీక్ష నిర్వహించారు. ఆ సమీక్ష సమయంలో ఆ ఏజెన్సీ ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోవడంతో అక్కడికక్కడే మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడంతో ఆ ప్యాకేజ్‌లో రూ.54కోట్ల విలువైన పనిని రద్దుచేశారు. దానిని రీటెండర్ నిర్వహించి రిత్విక్ ప్రాజెక్టుకు రూ.246కోట్లతో ఒక భాగం, రూ.20కోట్లతో మరొక భాగం ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చారు. దాదాపు రూ.54కోట్ల పనిని దాదాపు ఐదు రెట్లు పెంచి రూ.270కోట్లకు ఇచ్చారు. తప్పించిన కాంట్రాక్టరు తప్పు ఏమీ లేదు. రూ.80కోట్ల భూసేకరణ పని మిగిలి ఉండగానే ఆ కాంట్రాక్టరును తప్పించారు. భూసేకరణ జరగకపోవడం ప్రభుత్వ తప్పిదం. అయినా ఆ కాంట్రాక్టరును తప్పించినా కూడా రిత్విక్ ప్రాజెక్టు సంస్థ పనులు పూర్తి చేసిందా అంటే లేదు. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క ఎకరానికి కూడా నీరివ్వలేదు. ఇప్పటికీ కూడా 25శాతం లోపే పనులలో ఉన్నారు. ఇప్పటికి తొమ్మిది నుంచి పదిశాతం మాత్రమే పనులయ్యాయి.

కాంట్రాక్టర్లను తప్పించి తమ సొంత కాంట్రాక్టర్లకు, తమ పార్టీకి అనుకూలమైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడానికి మాత్రమే 60(సి) నిబంధన ఉపయోగించుకున్నారు. రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు గాలేరు- నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో 29వ ప్యాకేజ్‌లో రూ.11కోట్ల మిగులు పనిని రూ.110కోట్లకు ఇచ్చారు. 27వ ప్యాకేజ్‌లో కూడా రూ.20కోట్ల మిగులు పనిని రూ.120కోట్లకు ఇచ్చారు. హంద్రీ-నీవా సుజల స్రవంతిలో రెండో ప్యాకేజ్‌లో రూ.10.43కోట్ల మిగులు పనిని అదే కాంట్రాక్టరు ఆ పనిని మేమే చేస్తామని సదరు సద్భావనా ఇంజనీరింగ్ కంపెనీ కోర్టుకు వెళ్లినా కూడా దానిని రద్దుచేసి దానిలో ఇప్పటివరకు రూ.87కోట్ల వరకు బిల్లులు చేసున్నారు. రూ.10.43కోట్లు ఎక్కడ, రూ.87కోట్లు ఎక్కడ? వాటిలో భూసేకరణ ఎక్కడా లేదు, అప్పటికే భూసేకరణ పూర్తి అయింది. హంద్రీ-నీవాలో ప్యాకేజ్ నం.3లో రూ.50కోట్ల మిగులు పనిని అంచనాలు పెంచి రూ.115కోట్లు చేశారు. ఆ కాలువ అటవీ ప్రాంతానికి ఆనుకొని వెళ్లే కాలువ. అక్కడ కంట్రోల్ బ్లాస్టింగ్ అవసరం లేదు. హార్డ్ రాక్ బ్లాస్టింగ్‌కు ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.243 ఉంటే దానిని రూ.470కు పెంచారు. సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దానిని రెస్ట్రిక్ట్ చేస్తూ రూ.17కోట్లకు తగ్గిస్తే అంచనాలు పెంచుకొనే స్థాయి నుంచి కాంట్రాక్టింగ్ సంస్థలు ఇందులో ఇన్‌వాల్వ్ అవుతున్నారు. అధికారుల ప్రమేయం లేకుండా ఏదీ కూడా జరగడంలేదు. సద్భావని సంస్థ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటే వారితో లాలూచీపడి మీ విత్‌హెల్డ్ అమౌంట్ మీకు ఇస్తామని చెప్పడంతో వారు కోర్టునుంచి కేసు ఉపసంహరించుకున్నారు. రిత్విక్ ప్రాజెక్టుల ప్యాకేజ్‌లలో అంచనాలు పెంచడం జరిగిందో అన్ని కూడా క్వాంటిటీ పెరగడం, డీవియేషన్స్ మాత్రమే. కేవలం రెండు స్ట్రక్చర్లలో అరవై వేల క్యూబిక్ మీటర్లు. రూ.10.43కోట్ల పనిని రూ.87కోట్లకు పెంచడానికి ఒక కమిటీని వేస్తారు, ఆ కమిటీలో రిటైర్డ్ ఈఎన్‌సీలు ఉంటారు. రిటైర్డ్ ఈఎన్‌సీలు తిరిగి రిత్విక్‌లో ఉద్యోగులుగా ఉంటారు. వారితో రెవ్యూ చేయించి మను అనిపించి క్వాంటిటి పెంచారు. (బెల్) అదే విధంగా హంద్రీ-నీవాలో ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అర్హత లేకున్నా పనులు ఇవ్వడమే కాకుండా 60(సి) నిబంధన ప్రకారం తొలగించిన పనుల గురించి కాగ్ నివేదిక కూడా ఇచ్చింది. గొల్లపల్లి రిజర్వాయర్‌లో అధికంగా ఆరు కోట్ల చెల్లింపు చేయలేదు.

అదేవిధంగా మైక్రోఇరిగేషన్ టెండర్లలో చూస్తే మధ్యప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులలో హెక్టారుకు రూ.1.5లక్షలు అవుతుంటే మన రాష్ట్రంలో సిఎన్‌డిపి ప్రాజెక్టులలో హెక్టారుకు రూ.4.15లక్షలు ఖర్చుపెడుతున్నారు. ఇది ఎవరి సొమ్ము? అనంతపురం జిల్లాలో కరవు ఉండడంతో వలసలు అధికమయ్యాయి, రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ప్రాజెక్టులకు నిధులు సక్రమంగా కేటాయిస్తేనే ప్రాజెక్టులు పూర్తవుతాయి. అయితే కేటాయించిన నిధులు కాంట్రాక్టర్ల జేబులలోకి వెళితే పనులు పూర్తి కావు. గోరకల్లు రిజర్వాయరుకు ముఖ్యమంత్రిగారు వెళ్లినపుడు కేవలం ఐదు టిఎంసీల నీరుండగా పది టిఎంసీలు నీరుందని బోర్డు పెట్టి గేట్లు ఎత్తారు. గోరకల్లు రిజర్వాయర్‌కు రూ.60కోట్లు కేటాయిస్తే 12.44టిఎంసీలు నిల్వ చేయవచ్చు. కానీ రూ.60కోట్లు ఇవ్వాలనే ఆలోచన వారికి రాలేదు. శిలాఫలకాలు వేయడానికి మాత్రమే ఆయనకు సమయం ఉంటుంది.

పులిచింతల ప్రాజెక్టులో ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించి నిధులు కేటాయిస్తే అందులో 44టిఎంసీలు నిల్వ చేయవచ్చు. రూ.200కోట్లు ఆర్ అండ్ ఆర్‌కు ఇవ్వడానికి వారికి చేతులు రావు. పులిచింత కాంట్రాక్టరు రూ.250కోట్ల విలువైన పనులు చేసి నిధుల విడుదల చేయకపోవడంతో ఆ సంస్థ ఆర్బిట్రేషన్‌కు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే దానిపై ప్రభుత్వం అప్పీల్ చేయకుండా రూ.250కోట్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అన్ని ప్రాజెక్టులలో అంచనాలు పెంచుకునే కార్యక్రమాన్ని కచ్చితంగా నియంత్రించాలి. కేవలం ఇంజనీర్ల ద్వారా నివేదికలు తెప్పించుకుంటే కాదు. ఇంజనీర్లు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మారతారు కాబట్టి వాస్తవాలు బయటికి రావు. మా రాప్తాడు నియోజకవర్గంలో యూపీపీ ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకంలో పుట్టకనుమ రిజర్వాయర్ హంద్రీ–నీవాలో సర్కిల్ 2కు సంబంధించిన నాలుగో డివిజన్ అధికారులు 2009లో 27లక్షల క్యూబిక్ మీటర్లతో అంచనాలు వేశారు. 2018కు వచ్చేసరికి అదే పుట్టకనుమ రిజర్వాయర్‌కు 77లక్షల క్యూబిక్ మీటర్లకు అమాంతం పెంచారు. దానిలో నిల్వ సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా................ (మైక్ కట్ అయింది)

శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి(SRI KAKANI GOVARDHAN REDDY)(సర్వేపల్లి): అధ్యక్షా, సోదర సభ్యులు ప్రకాశ్‌రెడ్డిగారు చాలా విషయాలు చెప్పారు. అయితే గత ప్రభుత్వం నీటిపారుదల శాఖను నిర్వహించిందా, నిధులపారుదల శాఖను నిర్వహించిందా అని ముందుగా మాకు అనుమానం కలుగుతున్నది. ఇబ్బడిముబ్బడిగా రేట్లు పెంచి దోపిడీకి పాల్పడ్డారు. గతంలో మంత్రి నీటిపారుదలశాఖకు పనిచేశారా లేక నిధులపారదుల శాఖకు మంత్రిగా పనిచేశారా అని ఈరోజు తెలియాల్సిన అవసరముంది. సోదరసభ్యులు అన్ని ప్రాజెక్టులవారీగా నిధుల దుర్వినియోగం గురించి చెప్పారు. నీటిపారుదలశాఖకు గత ప్రభుత్వం రూ.17వేల కోట్లు ఖర్చుపెడితే పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తప్ప మిగతా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఆగస్టు 2014లో శ్వేతపత్రం విడుదల చేస్తూ రూ.17వేల కోట్లతో మిగిలిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చెప్పి, రెండు నెలలో డీల్ కుదరగానే అక్టోబర్‌కల్లా రేట్లు పెంచిన విషయం వాస్తవమా, కాదా? ఆ ప్రభుత్వంలో నీటిపారుదల రంగానికి రూ.68వేల కోట్లు ఖర్చుపెట్టారు. అయినా ప్రాజెక్టులు పూర్తి కాలేదు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా పూర్తి కాలేదు. పోలవరం ప్రాజెక్టు అంచనాలు పెరిగాయంటే అందుకు కేంద్రంలోని మంత్రి ఒప్పుకున్నారని అంటున్నారు. అదెలా ఉందంటే వెలగపూడిలో దొంగతనం జరిగితే విజయవాడ సత్యనారాయణపురం వెళ్లి దొంగతనం జరగలేదని సర్టిఫికెట్ తెచ్చుకున్నట్లు ఉంది. వాస్తవంగా అంచనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. అందుకు నేను ప్రత్యక్ష సాక్షిని, కావాలంటే రమ్మనండి రికార్డులు చూపిస్తాను. నా నియోజకవర్గంలో డేగపూడి–బండేపూడి కెనాల్‌కు రూ.30కోట్లతో కాంట్రాక్టు పిలిస్తే సంబంధిత ఇంజనీర్ ఆ పనిని నామినేషన్ పద్ధతిపై ఇవ్వమని ఆ కంపెనీ పేరును కూడా సూచించి ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. దానిమీద మేం గొడవ చేస్తే అసలు ఈ విషయం సదరు ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందని అన్నారు తప్ప విధానంలో తప్పు జరిగిందని ఆలోచన చేయలేదు. ఇపుడు అదే కాంట్రాక్టు మరలా టెండరు పిలిస్తే దానిలో 12శాతం తక్కువకు కోట్ చేశారు.

ఉ 9.20

అధ్యక్షా, ఈరోజు అదే కాంట్రాక్ట్‌కు టెండర్లు పిలిస్తే 12 శాతం తక్కువకు వేశారు. అంటే రూ.30 కోట్లలో రూ.4 కోట్లు ఎవరి జేబులోకి వెళ్లడానికి మీరు పథకం రచించారు, అటువంటి అధికారి మీద మీరు ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు అనే దానికి ప్రధానంగా సమాధానం చెప్పాలి. అధ్యక్షా, ఎంత దౌర్భాగ్యమైన పరిస్థితి అంటే ఈరోజు చంద్రబాబు నాయుడు గారి ప్రవర్తన చూస్తే ఆయన చేసిన పొరపాట్లకు మా మీద ఎదురు దాడి చేసే పరిస్థితి. అంటే బ్యాంకుకు కన్నం వేసి నగలు, నగదు దోచుకుపోయిన వ్యక్తే పోలీసులు విచారణకు వస్తే వాళ్ల దగ్గర దీని గుట్టు తేల్చాల్సిందే, దీని విషయం బయట పెట్టాల్సిందే, ఎవరో బాధ్యులు చూడాల్సిందే అంటే మీరు దోచుకున్న దానికి ఎవరు బాధ్యులో ఎవరు తేలుస్తారు? అందుకనే నేను మంత్రి గారిని అడిగేది, ఈరోజు చాలా సంతోషం ముఖ్యమంత్రి గారు అవినీతి ఉండకూడదనే ఆలోచన చేస్తున్నారు. నిజంగా ముఖ్యమంత్రి గారిని అభినందిస్తున్నాను. ఎక్కడైతే అదనంగా పనులకు సంబంధించి కాంట్రాక్టులు ఇచ్చారన్నారో వాటికి రివర్స్ టెండరింగ్ పెడతామన్నారు. ఇబ్బంది లేదు. మేము కోరేదేమంటే ఇప్పటికే పోలవరానికి సంబంధించి, పట్టిసీమకు సంబంధించి కాగ్ తప్పుబట్టింది. కాబట్టి ఈరోజు ఉన్న సిస్టమ్‌లో ఎక్కువగా అంచనాలు వేసిన వాటికి, దాదాపుగా మనం రివర్స్ టెండరింగ్ పెడతాము. తిన్న దానిని ఏమి చేయాలి? ప్రజల సొత్తు దోచుకున్న వాళ్లను ఏమి చేయాలి? కాబట్టి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలి. దాదాపుగా రూ.60,000 కోట్లు దోపిడీ జరిగింది. ఆ రూ.60,000 కోట్లు తిరిగి కట్టించగలిగితే ఈరోజున్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసే అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి మీద్వారా నేను కోరేది ఈరోజు మీరు పారదర్శకంగా రివర్స్ టెండరింగ్ నిర్వహించడంతో బాటు గతంలో జరిగిన అవకతవకలు, బాధ్యులైన వ్యక్తులు, ఆ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు వాళ్లందర్నీ గుర్తించి ఏ విధంగా ఆ సొమ్ము రికవరీ చేస్తారో చూడాలి. ప్రజల సొత్తు యథేచ్ఛగా దోపిడీకి గురైంది. రైతు పేరు చెప్పి దోచుకున్న ప్రభుత్వాలను ఎప్పుడూ చూడలేదు. రైతు పేరు చెప్పి దోచుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే గతంలో చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో పనిచేసిన తెలుగుదేశం ప్రభుత్వం. దానిని విడిచి పెడితే అది మంచి పద్ధతి కాదు. కాబట్టి నీటి పారుదులకు బదులుగా నిధుల పారుదలను కేటాయించి, నిధుల పారుదలకు ఒక మంత్రిని కేటాయించి ఆ మంత్రి ఇష్టానుసారంగా ప్రవర్తించి, ఆ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా ఆడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం జరిగింది. దోచుకోవడం జరిగింది. కాబట్టి మంత్రి గారిని నేను కోరేది లోతైన విచారణ జరిపించి ఎవరైతే బాధ్యులైన వ్యక్తులు ఉంటారో వాళ్ల దగ్గరి నుంచి ఆ సొమ్మును రికవరీ చేయించి, ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. కాబట్టి తక్షణమే దీనిమీద విచారణ జరిపించాల్సిందిగా నేను డిమాండ్ చేస్తున్నాను.

(శ్రీ కె.అచ్చెన్నాయుడు మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని కోరారు)

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి(SRI CHIRLA JAGGIREDDY)(కొత్తపేట): ధన్యవాదాలు అధ్యక్ష. 2004 నుంచి 2014 వరకు రాజశేఖర్ రెడ్డి గారు 23.49 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి అపర భగీరథుడిగా మిగిలితే తదుపరి వచ్చిన ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పులమయం చేసి, ముఖ్యంగా నీటిపారుదల శాఖను పూర్తిగా దుర్వినియోగం చేసిన పరిస్థితి ఉందని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. సహచర శాసనసభ్యులు మాట్లాడుతూ చాలా విషయాలు తెలియచేశారు. వారు తెలియచేసినవి కాకుండా మిగిలినవి చెబుతాను. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు నాయుడు గారు గోదావరి–పెన్నా నదుల అనుసంధానం ఈ విధంగా 17 ప్రాజెక్టులు సుమారు రూ.18,648.71 కోట్లు వంశధార, వైకుంఠపురం బ్యారేజీ ఈ విధంగా అనేక కాంట్రాక్టులు వారిని రాత్రి వెళ్లి కలిస్తే పొద్దుటే అయిపోయే సాంప్రదాయం ఉండేది. అందుచేత మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయన్న తరుణంలో వేల కోట్ల రూపాయలు కేవలం నలుగురు కాంట్రాక్టర్లకు మాత్రమే కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటో సభాముఖంగా వారు చెప్పాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. (బెల్)

అధ్యక్షా, అదేవిధంగా నిబంధనల ప్రకారం 5 శాతం దాటి ఎక్కడైనా ఎక్కువ ఉంటే ఆ టెండర్‌ని సిఓటి రద్దు చేస్తుంది. కానీ ముఖ్య కార్యదర్శి లాంటి అధికారులు ఎవరైతే ఉన్నారో వారిచేత తప్పులు చేయిస్తూ ఉన్న నిబంధనలను మరలా జీ.ఓ.నెం.94లో సడలించి వారికి 13.19 శాతానికి నిధులన్నీ కేవలం కొంత మంది కాంట్రాక్టర్లకే కట్టబెట్టడం చేశారు.(బెల్) అధ్యక్షా, రెండు నిమిషాలు. ఇరిగేషన్ విషయంలో ఇంకా అనేక కార్యక్రమాలు జరిగాయి. వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్నా పరవాలేదు అన్న చందంగా ఇంతకు ముందున్న మంత్రిగారికి ఒక డి.ఇ.గారున్నారు. ఆయన 5 సంవత్సరాలు వ్యాపారం చేసుకున్నాడు. కనీసం ఉద్యోగం కూడా చేయలేదు. అట్లాంటి వారు ఆ మంత్రి గారు రాగానే వారు డి.ఇ. నుంచి సి.ఇ. అయిపోయారు. అక్కడ సి.ఇ.గా వారు చేసిన పనులు ఏమిటంటే పోలవరంలో కన్‌స్ట్రక్షన్ వారే చేస్తే దానిమీద నిఘా ఉండాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారి కూడా ఆయనే అయ్యారు. అంటే ఇచ్చేవాడు ఆయనే, దోచేవాడు ఆయనే అన్న విధంగా అధికారులతో సైతం తప్పు చేయించే కార్యక్రమం గత ప్రభుత్వం చేసింది. దీనిమీద పూర్తి స్థాయి విచారణ చేయవలసిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో థర్డ్ పార్టీ ఎంక్వైరీ వేస్తామన్నారు. చాలా సంతోషం. సాక్షి పేపర్‌లో వస్తే వారు నమ్మరు. వారి కళ్లకు కనిపించదు. వారి పచ్చ మీడియాలో వచ్చిన "ఇదే ఆ ధనం!" అనే ఒక శీర్షికను ఒకసారి చూడాలని కోరుతున్నాను. ఇందులో ఏమి రాశారో ప్రతిపక్ష నాయకులు తెలుసుకున్నారో లేదో ఎందుకంటే వారికి ఇది సర్టిఫికేట్ లాంటిది. పోలవరం ప్రాజెక్టు ఒప్పందం గడువుకు ముందే అక్కడుండే ప్రధాన గుత్తేదారు.... టెండరు కండిషన్ గానీ, టెండరుకు ఉన్న టైము గానీ పూర్తి కాకుండానే వారికి ఎక్కువ ధరలకు ఇచ్చేయడం వలన రూ.1331 కోట్లు పోలవరంలో దోచుకున్నారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. (బెల్)

ఒక్క నిమిషం అధ్యక్ష. మొబిలైజేషన్ అడ్వాన్సుల విషయం, గుత్తేదారులకు పనులు వడ్డీ విలువ వెనక్కు కట్టించాల్సింది కూడా రూ.84 కోట్లు కట్టించలేదు. గుత్తేదారులు ప్రత్యేక నిధి క్రింద చెల్లింపులు అంటే రూ.141 కోట్లను కట్టించే కార్యక్రమం కూడా చేయలేదు. పోలవరంలో జలవిద్యుత్ ప్రాజెక్టును మనం వెళ్లి చూశాం. ఆ విషయంలో కనీసం సైటు కూడా హ్యాండోవర్ చేయలేదు. సైటు హ్యాండోవర్ చేయకుండా ఏ.పి.జెన్‌కో ద్వారా రూ.787 కోట్లు ధారాదత్తం చేశారన్న విషయాన్ని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః మీరు కన్‌క్లూడ్ చేయాలి.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి(SRI CHIRLA JAGGIREDDY): అధ్యక్షా, ఒక్క విషయం చెప్పి నేను ముగిస్తాను. మా ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. అంటే వరదలు వచ్చినప్పుడు అన్నీ మునిగిపోయి వారు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల వలన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఇవాళ ఎవరైతే తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ రకంగా నిధులు దోచుకున్న నాయకులందరూ కూడా వేరే పార్టీలకు వలస వెళ్లే కార్యక్రమం చేస్తున్నారు. అటువంటి వారిమీద గట్టి నిఘా పెట్టి వెంటనే హౌస్ కమిటీ వేసి దానిమీద విచారణ చేయించే కార్యక్రమం చేయాలని కోరుతున్నాను. (బెల్)

MR.SPEAKER: Please put your question.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి(SRI CHIRLA JAGGIREDDY): అధ్యక్షా, దీనికి ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టాలి.

మిస్టర్ స్పీకర్ః మీరు ప్రశ్న వేయాలి.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి(SRI CHIRLA JAGGIREDDY): నిధుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జగన్మోహన్ రెడ్డి గారు తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నాను.

(శ్రీ కె.అచ్చెన్నాయుడు మాట్లాడటానికి అవకాశం ఇవ్వాల్సిందిగా కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ః ముందుగా సిగ్నేటరీస్ మాట్లాడిన తరువాత మీకు అవకాశం ఇస్తాను. This is the privilege of Signatory.

శ్రీ కుందూరు నాగార్జునరెడ్డి (SRI KUNDURU NAGARJUNA REDDY)(మార్కాపురం): ధన్యవాదాలు అధ్యక్ష. పశ్చిమ ప్రకాశ ఆశాదీపం వెలిగొండ ప్రాజెక్టు. రాజశేఖర్ రెడ్డి గారు 2004 నుంచి 2009 వరకు వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్–1, టన్నెల్–2 రెండూ 60 నుంచి 65 శాతం పూర్తి చేశారు. దాని తరువాత గడచిన 10 సంవత్సరాల కాలంలో 7 నుంచి 9 శాతం ప్రాజెక్టు మాత్రమే ముందుకు కదిలింది. ఈ పది సంవత్సరాల తరువాత ప్రజలందరూ కలలు గన్న రాజన్న రాజ్యం మరలా వచ్చింది. రైతు రాజుగా బ్రతికే కాలం మరలా వచ్చింది. వెలిగొండ ఇరిగేషన్ ప్రాజెక్టును ఒక్కసారి చూస్తే రిజర్వాయర్ కెపాసిటీ 53.85 టిఎంసీలు. ఇరిగేషన్ ఎకరాలు 4 లక్షల 47ఎకరాలు. కవర్ అయ్యేది 33 మండలాలు. 15 లక్షల మందికి డ్రింకింగ్ వాటర్‌కి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఇది ఫేజ్–1, ఫేజ్–2 గా వేరు చేశారు. ఫేజ్–1 లో టన్నెల్-I, పేజ్–2 లో టన్నెల్-2. నిన్న బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన జలయజ్ఞంలో చూస్తే Government is equally committed to complete the Poola Subbaiah Veligonda Project Tunnel-1 in a period of one year so that water can be provided to 1.19lakh acres. Tunnel-2 and Phase II works will be completed within a period of two years to create the balance ayacut. ఇది ఒకటి, రెండు సంవత్సరాలలో కచ్చితంగా పూర్తి చేస్తారని జగనన్న మీద పూర్తి నమ్మకముంది. ఈరోజు నేను ఇరిగేషన్ మంత్రి గారిని అడిగేదేమంటే మనం 4 లక్షల 47 ఎకరాల ఆయకట్టు ద్వారా అన్ని ఎకరాలను కవర్ చేస్తున్నాం. ప్రజలు గడచిన వంద, రెండొందల సంవత్సరాల కాలంలో వాళ్ల చెరువులు నిండితే మరలా పూర్వ వైభవం వచ్చిందనే ఆనందం, కాన్ఫిడెన్స్ ఎక్కువగా ఉంటుంది. 4 లక్షల 47 ఎకరాల పారిన దాంట్లో ఎక్కడా చెరువులను కలపలేదు. నేను వెలిగొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారితో మాట్లాడాను. సార్ డెడ్ స్టోరేజీ 10 టిఎంసీలు ఉంటుంది కాబట్టి గ్రౌండ్ వాటర్ పెరిగే అవకాశం ఉంది, చెరువులన్నింటికీ ఊరట కలిగే ఛాన్స్ ఉందా అంటే అది పూర్తిగా సాయిల్ మీద ఆధారపడుతుంది, నల్ల మట్టి ఉంటే పూర్తిగా గట్టిపడుతుంది, అది ఏ విధంగానూ నీటిని కిందకు పోనివ్వదు, గట్టిగా అక్కడే ఆపేస్తుంది. నా భయమంతా నాగార్జునసాగర్ డ్యాము ఏదైతే ఉందో అది చాలా పెద్దది.

ఉ 9.30

కాకపోతే చుట్టుప్రక్కల మాచెర్ల నియోజకవర్గంలో చూస్తే ఎక్కడా గ్రౌండ్ వాటర్ ఉండదు. ఏడు వందలు, ఎనిమిది వందలు, తొమ్మిది వందల ఫీట్లు బోర్లు వేసినా గ్రౌండ్ వాటర్ దొరకదు. అందుకోసం నేను రిక్వెస్ట్ చేసేదేమంటే మైనర్ ఇరిగేషన్ పరంగా, మార్కాపురం, తర్లుబాడు, పొదిలి, కొనకనమిట్ల ఈ నాలుగు మండలాలలో 500 ఎకరాల పైన ఏవైతే చెరువులు ఉన్నాయో, ఆ చెరువులన్నింటినీ నింపడానికి 0.8TMC అవుతుంది. ఆ ఏడెనిమిది చెరువులను కాపాడగలిగితే పూర్వ వైభవం వస్తుంది. ప్రజలందరూ సంతోషంగా ఉంటారు. దానితోబాటు వెలిగొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారితో మాట్లాడితే, ఈ చెరువులన్నింటినీ గ్రావిటీతోనే నింపొచ్చు, ఏ విధమైన లిఫ్ట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. అందు కోసం ఎంతో కాలం నుంచి ప్రజలు ఈ చెరువుల మీద పూర్తిగా ఆధారపడి ఉన్నారు. దయచేసి ఇరిగేషన్

శాఖామంత్రిగారు ఈ చెరువులను చిన్నచిన్న కెనాల్స్‌తో కలపగలిగితే, 500 ఎకరాల పైన ఉండే ఆ ఎనిమిది తొమ్మిది పెద్ద చెరువులను కలిపితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్‌గారూ.. మాట్లాడండి.

శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్(SRI POLUBOINA ANILKUMAR): అధ్యక్షా ముందుగా ఏదైతే సభ్యులు ప్రకాశ్‌రెడ్డిగారు మాట్లాడారో, గత అయిదు సంవత్సరాల్లో చూసుకుంటే, ఏదైతే 60–సి క్రింద తీసుకున్న వర్కులను తీసుకుంటే, హెచ్ఎన్ఎస్ఎస్‌లో.. జెస్ట్ ఎగ్జాంపుల్ వాళ్ల ఏ విధంగా escalate చేశారనేది చెబుతున్నాను. ఎంత అమౌంట్ అనేది ఒక్కసారి చూడండి. ప్యాకేజీ–2 క్రింద రూ.10 కోట్ల 43 లక్షలది తీసుకుంటే రూ.92 కోట్లు అయ్యింది. ప్యాకేజీ నెం.4 క్రింద రూ.15 కోట్లది తీసుకుంటే రూ.50 కోట్లు అయ్యింది. ఇంకొకటి రూ.15 కోట్లు బ్యాలెన్స్ ఉంటే రూ.60 కోట్లు అయ్యింది. ఆరు కోట్లది రూ.35 కోట్లు అయ్యింది. రూ.14 కోట్లది రూ.51 కోట్లు అయ్యింది. రూ.6 కోట్లది 30 కోట్లు అయ్యింది. రూ.17 కోట్లది రూ.50 కోట్లు అయ్యింది. రూ.16 కోట్లది రూ.69 కోట్లు అయ్యింది. ఈ విధంగా 1:5 రేషియో, 1:10 రేషియో ఈ విధంగా పెంచుకుంటూ ఇష్టానుసారంగా.. దీంట్లో ఎవరు చేశారంటే గతంలో ఉన్న వాళ్ల సభ్యులే పూర్తిగా చేశారు. రాజ్యసభ సభ్యులో లేక మరొక సభ్యులో పూర్తిగా ఈ పనులన్నీ తీసుకెళ్లి పూర్తిగా వాళ్లకే కట్టబెట్టడం జరిగింది. ఇందాక మరొక ప్రాజెక్టు గురించి కూడా చెప్పారు. రూ.10 కోట్లు బాలెన్స్ ఉంటే రూ.110 కోట్లు చెప్పారని సభ్యులు ప్రకాశ్‌రెడ్డిగారు చెప్పారు. గాలేరు–నగరి ప్యాకేజీ నెం.29 దాంట్లో రూ.10 కోట్లు కూడా కాదు, రూ.171 కోట్లు పనైతే, పని జరిగింది రూ.166 కోట్లు, ఇంకా బాలెన్స్ రూ.5 కోట్లు. దానికి ఏమి చెప్పారంటే The Agency has represented due to normal increase in CC wall, sidewall quantities as per actual. ఆ రూ.5 కోట్లు ఎంతైందో తెలుసా అధ్యక్షా? రూ.137 కోట్లు అయ్యింది. రూ.5 కోట్ల విలువ చేసే మిగిలిన పనిని రూ.137 కోట్లుగా చేసి ఇష్టానుసారంగా చేశారు.

(అధికారపక్ష సభ్యులు 'షేమ్.. షేమ్ ' అన్నారు)

ఇందాక గౌరవసభ్యులు గోవర్ధన్‌రెడ్డిగారు చెప్పారు. అప్పటికి 36 ఇయర్స్ ఇండస్ట్రీ అనుకుంటాను. వాళ్లు వచ్చిన తర్వాత ఆగస్టులో ఒక వైట్ పేపర్‌ని రిలీజ్ చేశారు. ఆ వైట్ పేపర్‌లో వాళ్లు చెప్పిందేమంటే రూ.17 వేల కోట్లది రూ.36 వేల కోట్లు సరిపోతుంది ఎక్స్‌క్లూడింగ్ పోలవరం అని ఇచ్చారు. కానీ, వీళ్లు ఆ ప్రాజెక్టుకి సంబంధించి ఎంత పెంచారో తెలుసా? దాదాపు రూ.16 వేల కోట్ల ఎక్సెస్‌కి వెళ్లారు. అంటే అంతకు అంత. ఆయనకు అన్ని సంవత్సరాల అనుభవం ఉంది. మేము చూస్తే అనుభవం లేని వాళ్లం, వాళ్లకు అనుభవం ఉంది కాబట్టి ఏ విధంగా తీసుకోవాలో, ఏ విధంగా వాళ్లకు సంబంధించిన వ్యక్తులకు కట్టబెట్టాలో వారి 36 సంవత్సరాల అనుభవం may be Rs.17 వేల కోట్లను రూ.36 వేల కోట్లకు పెంచేసిందో నాకైతే అర్థం కావడం లేదు. ఇదేకాదు అన్ని ప్రాజెక్టుల్లో కూడా ఏ ప్రాజెక్టును తీసుకున్నా, తవ్వేకొద్దీ రోజుకొకటి వస్తుంది. నిన్ననే సాయం కాలం కూర్చొని ఈ విధంగా

మాట్లాడుతుంటే మా అధికారులు ఒకటి చెప్పారు. ఒక బిల్ వచ్చింది, ఏంటని చూస్తే ఆయన ఒక గేటు గట్టున ఫొటోదిగిన అడ్వర్‌టైజ్‌మెంట్ కాస్ట్ రూ.2 కోట్ల 30 లక్షలు. అన్ని గేట్లు కూడా ఇంకా పూర్తిగా రాలేదు. ఆయన వెళ్లి ఒక గేటు ముందు ఊరకే నేను గేట్లు పెట్టేశానని చెప్పి అక్కడ గేటు దగ్గర నిలబడి ఒక ఫొటో దిగిన దానిని అడ్వర్‌టైజ్ చేయడానికి అయిన కాస్ట్ ఎంతో తెలుసా అధ్యక్షా? రూ.2 కోట్ల 30 లక్షలు. ఇట్లా ఎన్ని ఉన్నాయో తెలియదు. అన్నీ కూడా తీస్తుంటే, ముందుకు పోతుంటే ఈ విధంగా ఎన్ని సినిమాలున్నాయో, ఎన్ని యాడ్‌లున్నాయో, ఎన్నెన్ని వీడియోలు ఉన్నాయో తెలియడం లేదు. దీనికి ఎన్నెన్ని కోట్ల రూపాయలను ఈ విధంగా తగలేస్తున్నారో తెలియడం లేదు. ఈ డబ్బులన్నీ సక్రమంగా ఖర్చు చేసుంటే ఈ పాటికే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవి.

అలాగే దీనికి సంబంధించిన అన్ని వర్కులకు సంబంధించి కూడా చెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదైతే మేము స్పష్టంగా చెప్పామో, మా ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గారు ఈ భారదేశంలోనే ఇప్పటిదాకా నాకు తెలిసి ఒక్క కోల్ ఇండియాలోనే ఉంది రివర్స్ టెండరింగ్ అనేది. ఇప్పటిదాకా దేశంలో ఎక్కడా లేదు. కానీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారాన్ని చేసిన రోజునే చెప్పారు. మేము ప్రాజెక్టులను ఏ విధంగా పారదర్శకంగా తీసుకుంటాము. ఏదైతే దానికి సంబంధించి ఒక జడ్జ్‌ని అపాయింట్ చేసి ఆయనకు ఒక టెక్నికల్ కమిటీని అందజేస్తాం.

ఏ ప్రాజెక్టు అయినా, ఏ టెండరైనా It is under scrutiny of Public domain. ఏడు రోజులపాటు పబ్లిక్ డొమెయిన్‌లో పెడతాము. ఎవరైనా దానికి సంబంధించిన క్వాలిఫికేషన్స్ గానీ, ఏదైనా గానీ వాళ్లు ఎగ్జామిన్ చేయించుకోవచ్చు, దానికి సంబంధించిన సూచనలు ఇవ్వొచ్చు, జుడీషియరీ నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే టెండర్ వస్తుంది. ఆ టెండర్లో ఎవరైనా పార్టిసిపేట్ చేసే విధంగా, ఎక్కువ మంది పార్టిసిపేట్ చేసే విధంగా చూస్తాము. దానికి సంబంధించి, ప్రభుత్వానికి డబ్బులను మిగిలించే కార్యక్రమాన్ని తీసుకురావాలనే ఉద్దేశంతో భారతదేశ చరిత్రలో టెండరింగ్ సిస్టంలో జుడిషియల్ సిస్టాన్ని తీసుకొచ్చిన మొట్టమొదటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారని చెప్పే దానికి గర్వపడుతున్నాము. ఎక్కడా లేని విధంగా రివర్స్ టెండరింగ్ సిస్టాన్ని తీసుకొస్తున్నాము. ఎందుకంటే, escalation ఇవన్నీ చూస్తున్నప్పుడు, ఇందాక సభ్యులు చెప్పారు. సరే ఇప్పుడు వచ్చిన పనులు, మిగిలిన పనులను మనం చేయొచ్చు. కానీ 2017–18లో ముక్కలుముక్కలుగా చేసి హడావుడి హడావుడిగా ముక్కలు చేసి ఏదైతే అంటగట్టారో దాని పరిస్థితి ఏమిటని అడిగారు. దానికి సంబంధించి ఒక సబ్–కమిటీని నియమిస్తున్నాం. ఆ సబ్–కమిటీ ఈ ప్రాజెక్టుల్లో ఏ విధంగా పెంచారు? ఏ విధంగా చేశారనేది రెవ్యూ చేస్తారు. అన్ని ప్రతి ఒక్క ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను ప్రజల ముందు ఉంచుతాము. అంతేకాకుండా ఈరోజు చూస్తున్నాము రివర్స్ టెండరింగ్ మాత్రమే కాదు, జుడిషియల్ సిస్టాన్ని తీసుకురావడమే కాదు, ఈరోజు ప్రతి ఒక్కటి, ఇందాక మరొక సభ్యులు చెప్పినట్లు, నాలుగు సంవత్సరాల 6 నెలలు కామ్‌గా ఉన్నారు. ఇంకా మూడు నెలలు ఎన్నికలు ఉన్నప్పుడు దాదాపు రూ.20

వేల కోట్లకు వర్కులను హడావిడిగా పిలిచేసి మొత్తం ముగ్గురుకో నలుగురుకో వాళ్ల సభ్యులకు కట్టబెట్టి దాంట్లో కూడా అన్నీ ప్రాజెక్టులో 80 పర్సెంట్ ఆఫ్ వర్క్స్ all above 4percent excess. నాకు తెలియక అడుగుతున్నాను ఏ వర్కు చేసినా ఫలానా కాంట్రాక్టర్లకే ఎక్సెస్ వస్తుందా అధ్యక్షా? అంటే ఆ విధంగా క్వాలిఫికేషన్‌ని సెట్ చేయడం జరిగింది. వీళ్లు తప్ప.. ఎలా ఉంటారంటే ఈయన 1 ఉంటారు, ఆయన దీంట్లో–2 ఉంటారు. ఇంకొక వర్కులో ఆయన 1 ఉంటాడు ఈయన 2 ఉంటాడు మొత్తం వాళ్లే ఉంటారు. వీళ్ల ముగ్గురికే మొత్తం వర్కులను పంచే కార్యక్రమంలో, దీనికి సంబంధించిన క్వాలిఫికేషన్ క్రైటీరియాను సెట్ చేయడం, వాళ్లను ఒక cartel form చేయడం, ఫార్మ్ చేసిన తర్వాత వాళ్లకు కట్టబెట్టే కార్యక్రమం. ఈ ప్రాజెక్టులన్నీ మొత్తం రెవ్యూ చేస్తున్నాము. రెవ్యూ చేయడమే కాదు దేని రేటునైతే మేము తగ్గించగలమో ఆ ప్రయత్నం చేస్తున్నాము. We are crystal clear. మేము ఎవరి మీద కూడా, ఈ కొత్త ప్రాజెక్టులు గానీ, రివర్స్ టెండరింగ్ గానీ, ఏ కాంట్రాక్టర్ మీద కూడా మాకు ఏ విధమైన ద్వేషాలు లేవు. But, our Government intention is very clear. మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిగారు very crystal clear. ఈరోజు ఒక రూపాయి తగ్గించినా కూడా, వాళ్ల అయిదు సంవత్సరాలు చెప్పుకొంటూ వస్తున్న మాట మేము చెప్పింది కాదు. వాళ్లు మాకు రూ.3 లక్షల 60 వేల కోట్ల రూపాయల అప్పుతో ప్రభుత్వాన్ని అప్పగించినా, అన్ని వేల కోట్ల రూపాయల బకాయిలను మా మీద వేసి పోయినా, ఈరోజుకు కూడా మేము ఎక్కడా డబ్బులు లేవు మేము చేయలేము, రాష్ట్రం పాడైపోతోంది అయినా నేనే చేస్తున్నాను అని డప్పు మాత్రం మేము కొట్టుకోవడం లేదు.

ఉ 9.40

అధ్యక్షా, మేం ఒక positive way లో పోతున్నాం. మాకు ఒక నమ్మకం ఉంది. మా ముఖ్యమంత్రి గారికి ఒక నమ్మకం ఉంది. కచ్చితంగా మేం దీన్ని forgo చేస్తాం. ముందుకు వెళ్తాం అనే ఒక ఆలోచనతో మేం ముందుకు వెళ్తాం. అంతేగానీ, గత ఐదు సంవత్సరాల పాటు డబ్బులు లేవు, రాష్ట్రం అప్పుల్లో ఉంది, కష్టాల్లో ఉంది. ఈ రాష్ట్రంలో నేనొక్కడినే ఉదయ 7.00 గంటల నుంచి రాత్రి 11.00 గంటల దాకా కష్టపడుతున్నాను. నేను తప్ప ఎవరూ కష్టపడటం లేదు అని చెప్పుకుంటూ, ఇన్ని వేల కోట్ల రూపాయలు దోపిడి చేయడం జరిగింది. ఇన్ని వేల కోట్ల రూపాయలు ఈ విధంగా anomalies ఉన్నాయి.

శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్(SRI POLUBOINA ANILKUMAR): ఇవన్నీ కూడా మేం చూస్తున్నాం. కచ్చితంగా మేం మరో సారి చెబుతున్నాం. మాకు ఏ కాంట్రాక్టర్ల మీద గానీ, లేకపోతే ఏ అధికారుల మీద గానీ మాకు ఏ విధమైన ద్వేషం లేదు. But, దీంట్లో రాజకీయ ఒత్తిడి కావచ్చు, వేరే ఏదైతే ఇతర కారణాలు కావచ్చు, కానీ ఏవైతే జరిగిన escalations ఉన్నాయో, అవన్నీ కూడా ఎంత వరకు తగ్గించి, ఏ దాంట్లో ఎంత వరకు తగ్గించి, కనీసం ఎంతో కొంత అమౌంట్ ప్రభుత్వానికి మిగిలించి, ఆ డబ్బును ఆదా చేయాలనే ఒక ప్రక్రియతో ఈరోజు మేం ముందుకు వెళ్తున్నాం. దానికి సంబంధించి

మేం ఒక కమిటీని కూడా ఏర్పాటుచేయడం జరిగింది. ఇప్పటికే మేం మేజర్ ప్రాజెక్ట్స్‌ను top priority క్రింద తీసుకోవాలనుకుంటున్నామో, ఏదైతే పోలవరం, వెలిగొండ, హెచ్.ఎన్.ఎస్.ఎస్., జి.ఎన్.ఎస్.ఎస్. మరియు వంశధార వంటి ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతోంది. First top five projects ఐదింటి పైన కమిటీ ద్వారా రిపోర్ట్సు తెప్పించుకుని త్వరితగతిన నిర్మాణాలను చేపట్టే దిశగా ఈ ప్రభుత్వం పయనిస్తోంది. ఇందాక మన సోదరులు చెప్పినట్లు దాదాపు ఆ రూ. 20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల్లో ఏ ప్రాజెక్టులు మాకిప్పుడు అవసరమో వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటాం. వాటి పైన కూడా రివ్యూ చేయడం జరుగుతుంది. దేనికి ఎంత పర్సంటేజి ఎక్సెస్ రేటు క్రింద వేశారో, దేనికి ఎంత percentage of amount has been escalated అనేది కూడా కచ్చితంగా దాంట్లో కూడా రూ.2 నుంచి రూ.3వేల కోట్లు పైబడి అంచనాలు పెరిగాయి. దాన్ని కూడా కమిటీ రివ్యూ చేస్తుంది. కచ్చితంగా దాన్ని కూడా బయటపెడతాం. ఈ విధంగా ప్రతి ఒక్క దాంట్లో, దేంట్లో చూసినా కూడా ఈరోజు దాదాపు 268 వర్కులు సెక్షన్ 60 (c) క్రింద తీశారు. ఆ విధంగా సెక్షన్ 60 (c) క్రింద ఆ 268 వర్క్స్‌ను తీసి, దాంట్లో రిత్విక్ కంపెనీకి రూ.1,600.00 కోట్లు విలువైన పనులను కట్టబెట్టారు. దాని తర్వాత వాళ్లకు మిగిలిన వర్క్స్ కూడా ఎంతో తెలుసా? దాదాపు రూ.300 నుంచి 400 వరకు పనులు పెండింగ్‌లో ఉంటే, దాన్ని అమాంతంగా రూ.1,500.00 కోట్లకు పెంచి, ఇవాళ రిత్విక్ కంపెనీకి పనులను ఇచ్చారు. ఈ విధంగా ప్రాజెక్టులకు సంబంధించిన ఇంజనీరింగ్ పనులను వాళ్ల ముఖ్య అనుచరులకు, లేకపోతే వాళ్ల పార్టీకి బాగా అనుకూలంగా ఉన్న వాళ్లందరికీ అప్పగించడం జరిగింది. దానికి సంబంధించి ప్రతి ఒక్కటి కూడా మేం సబ్‌కమిటీ పరిధి లోనికి తీసుకువస్తున్నాం. దానికి సంబంధించిన ప్రతిది కూడా రివ్యూ చేయడం జరుగుతుంది. ఈరోజు ఒకటే చెబుతున్నాం, అన్ని ప్రాజెక్టులను కూడా రివ్యూ చేసిన తదుపరి కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా అన్ని మేజర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని మేం కంప్లీట్ చేయడం జరుగుతుంది. అన్ని విషయాల్లో పూర్తి చర్యలు చేపట్టడం జరుగుతుంది. This Government, టెండరింగ్ సిస్టమ్‌లో ఒక transparent system ను ఎవరూ కూడా కనీసం క్వశ్చన్ చేయలేనటువంటి ఒక జుడిషియల్ సిస్టమ్‌ను తీసుకువచ్చే దిశగా ఈరోజున మేం ముందుకు వెళ్తున్నాం. We are proud, మా సిస్టమ్‌ను ఏదైతే ముఖ్యమంత్రి, జగన్మోహన్ రెడ్డి గారు తీసుకువచ్చిన ఈ జుడిషియల్ సిస్టాన్ని, చూడండి మేం చెబుతున్నాం ఏమిటంటే, this system will be followed by entire Country. దేశం మొత్తం దీన్ని ఫాలో అవుతుంది. (ఆ సందర్భంలో గౌరవ ప్రతిపక్ష నాయకులు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నవ్వారు) ఈ విషయంలో కొంత మంది పాపం నవ్వుకోవచ్చు, ఏమైనా చేయొచ్చు, ఇబ్బంది లేదు. ఎందుకంటే, ఇప్పుడు వాళ్లు కక్కలేక మింగలేక నవ్వుకుంటూ, ఎందుకంటే పాపం ఆయన గత ఐదు సంవత్సరాల్లో నవ్వింది ఏమి లేదు. ఆయన నవ్వితే చూడాలని చాలా మంది ఉన్నారు. పాపం ఎప్పుడూ నవ్వింది లేదు. ఎందుకంటే, నవ్వడం రాదు కదా! అందుకే ఇప్పుడు నవ్వు తెచ్చుకొని కొందరు నవ్వుతున్నారు. ఏం పర్వాలేదు. కానీ, అన్నీ కూడా తొందర్లోనే బయటపడతాయి.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(SRI KINJARAPU ATCHANNAIDU) (టెక్కలి) : అధ్యక్షా, ఇంపార్టెంట్ క్వశ్చన్ అవకాశం ఇవ్వండి. కొంత చెప్పాల్సి ఉంది. ప్రతిపక్షానికి కూడా అవకాశం ఇవ్వాలి.

మిస్టర్ స్పీకర్: బ్రహ్మనాయుడు గారూ, మాట్లాడండి. One of the signatory. దయచేసి కూర్చోండి అచ్చెన్నాయుడు గారూ............ తర్వాత మైక్ ఇస్తాను.

శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు(SRI BOLLA BRAHMA NAIDU)(వినుకొండ): అధ్యక్షా, మా వినుకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య చాలా ఉంది. మా వినుకొండ నియోజకవర్గంలో ఐదు మండలాలుంటే, ఆ ఐదు మండలాల్లో ఎక్కడ కూడా తాగడానికి నీళ్లు లేని పరిస్థితి ఉంది. గ్రామాలకు ట్యాంకర్లు పెట్టి నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉంది. అదే విధంగా బొల్లాపల్లి మండలానికి గతంలో కూడా చెప్పాం. అట్లాగే మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలానికి వరికపూడి శెల ప్రాజెక్టు ద్వారా **24,900** ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి అవసరమైన ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. దానితో పాటు ఆ ప్రాజెక్టు నిర్మాణానికి **extension** ఇస్తే, మా బొల్లాపల్లి మండల పరిధిలోని **50** వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఆ ప్రాంతమంతా సస్యశ్యామలం కావడానికి అవకాశం ఉంది. దానికి సంబంధించిన మొత్తం ఖర్చు కూడా రూ. **300.00** కోట్లు మాత్రమే. వెల్దుర్తి మండలానికి ఆ మేరకు ఖర్చు అవుతుంది. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలానికి సాగునీరు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. అదే **extension** చేస్తే అదొక రూ. **300.00** కోట్లు ఇదొక రూ. **300.00** కోట్లు మొత్తం రూ. **600.00** కోట్ల ఖర్చుతో ఆయా ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసినట్లైతే బ్రహ్మాండంగా పూర్తి స్థాయిలో రైతులకు సాగునీరు అందే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు కావల్సిన తాగునీటి అవసరాలు కూడా తీరడానికి అవకాశం ఉంది. తద్వారా సాగునీటి సమస్య కూడా పరిష్కారం కావడానికి అవకాశం ఉంది. అదే విధంగా వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల మండలంలో బ్రహ్మాండంగా గుండ్లకమ్మ నది ఆ వైపున ప్రవహిస్తుంటే, ఆ నదికి మనం నాలుగు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయడం జరిగింది. కానీ, అది ఇప్పటికి అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం పరిపాలన సాగించిన ఐదు సంవత్సరాల కాలం నుంచి ఆయా ఎత్తిపోతల పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ చిన్న డ్యామ్ నిర్మాణం జరుపుకుంటే, మా వినుకొండ ప్రాంతానికి వరికపూడి శెల ప్రాజెక్టు నిర్మాణం ఎంత అవసరమో, అదే విధంగా తంగిరాల డ్యామ్‌ను ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో నిర్మించడం జరిగింది. ఆ తంగిరాల డ్యామ్‌కు శంకుస్థాపన చేసి బ్రహ్మాండంగా ఏర్పాటు చేసిన మాట వాస్తవం. అందులో భాగంగా అప్పుడు స్వరాజ్యం వచ్చింది, వాళ్లు వెళ్లిపోయారు. కానీ, మా పరిస్థితి అప్పటి నుంచి ఇప్పటి వరకు అలాగే ఉండిపోయింది. వినుకొండ టౌన్‌కు తాగునీళ్లు లేక **25** కిలోమీటర్ల దూరం ట్యాంకర్ వెళ్లి నీటిని తీసుకువచ్చి, మొత్తం **50** కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్లతో నీటిని తీసుకు వచ్చి, సుమారు **70** వేల జనాభా ఉన్న ఆ పట్టణానికి తాగునీరు అందించే పరిస్థితి ప్రస్తుతం ఉంది. ప్రజలందరూ తాగునీరు సరిగా అందక అల్లాడుతున్న పరిస్థితి కనబడుతోంది. దానికి కనీసం ఈరోజుకు కూడా పూర్తి స్థాయి పరిష్కారం దొరకని పరిస్థితి. గత ప్రభుత్వంలో వినుకొండ మునిసిపాలిటీలో ఉన్నా

డబ్బులు కూడా జీరో చేసి ఇచ్చారు. పన్నుల రూపంలో వచ్చిన డబ్బును జీరో చేశారు. మునిసిపాలిటీలో నిధులు లేవు. మొన్న జిల్లా కలెక్టర్ గారు వినుకొండ పట్టణానికి వచ్చారు. "జలశక్తి అభియాన్" అనే ఒక ప్రాజెక్టును కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. ఆ ప్రాజెక్టు క్రింద వినుకొండకు తాగునీళ్లు ఇచ్చే అవకాశం వచ్చింది. అందువల్ల ఇరిగేషన్ మంత్రి గారు తక్షణమే అత్యంత ప్రాధాన్యతనిచ్చి నాగార్జున సాగర్ నుంచి కనుక మాకు త్రాగునీరు ఇవ్వగలిగితే, వినుకొండ ప్రజానీకం అంతా కాస్తా ఊపిరి పీల్చుకుంటామనే విషయాన్ని తమరి ద్వారా ఇరిగేషన్ మినిస్టర్ గారికి తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్(**SRI POLUBOINA ANILKUMAR**): అధ్యక్షా, సభ్యులు బ్రహ్మనాయుడు అన్న గారు చెప్పినట్టుగా ఏదైతే ఒక **four months back, six months back** వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలో అది కేవలం **24** వేల ఎకరాలకు మాత్రమే డిజైన్ చేసి దాదాపు రూ. **300.00** కోట్లకు వర్క్స్ పిలవడం జరిగింది. దానికి కూడా **4.90%** ఎక్సెస్ రేటుతో హార్డ్ వర్క్స్ చేయడం జరిగింది.

అధ్యక్షా, మా నాయకుడు దాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటూ, ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా ఏ విధంగా పూర్తిచేయాలనే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఎలాగు ఆ ప్రాజెక్టు కూడా ఎక్సెస్ రేటులో ఉంది కాబట్టి దాన్ని కూడా తొందరగా రెవ్యూ చేసి ఎక్కడైనా ఖర్చును తగ్గించవచ్చా అనే విషయమై ఆలోచన చేస్తూ, కేవలం **24** వేల ఎకరాల వరకే ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని డిజైన్ చేశారు. కానీ, అదే మండలంలో ఇంకో **14** వేల ఎకరాలు సాగులో ఉంది. అదే కాకుండా దానికి సంబంధించి ఏదైతే వినుకొండ ప్రాంతంలోని మూడు మండలాలు, ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఒక మండలానికి సంబంధించి పూర్తిగా విస్తరించి, మొత్తం లక్ష ఎకరాలకు సంబంధించిన పల్నాడు ప్రాంతంలో పూర్తిగా దాన్ని విస్తరించాలనే ఆలోచన మన ముఖ్యమంత్రి గారు చెప్పడం కూడా జరిగింది. దానికి సంబంధించి పూర్తిగా ఏదైతే ఈ వారం, పది రోజుల్లో టెండర్లు ఫైనలైజ్ అయిన తర్వాత తొందరగా ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా అది కేవలం **24** వేల ఎకరాలకే పరిమితం కాకుండా, పూర్తిగా లక్ష ఎకరాలకు సంబంధించి ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఆ ప్రాంతమంతా విస్తరింపజేసి పల్నాడు ప్రాంతానికి పూర్తిగా సాగునీరు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవడానికి మా గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక దృఢ నిశ్చయంతో ఉన్నారనే విషయాన్ని తెలియజేసుకుంటూ, అలాగే మంచినీటికి సంబంధించి ఇప్పటికే **Rural Water Supply(RWS) Department** ఒక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. రాష్ట్రం మొత్తంలో ప్రతి ఒక్క మనిషికి తలసరిగా వంద లీటర్ల వాటర్‌తో పాటు, అలాగే **cattle** కు, అందరికీ సంబంధించి పూర్తిగా ఒక **D.P.R.** నుతయారు చేస్తున్నారు. పూర్తిగా దానికి సంబంధించి పది సంవత్సరాల మెయింటెనెన్స్ వంటి విషయాలను కూడా పరిశీలించే పనిలో డిపార్ట్‌మెంట్ ఉంది. పూర్తిగా దానికి సంబంధించిన ప్రక్రియ జరుగుతోంది. ప్రతి ఒక్కరికి త్రాగునీటిని

అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తొందర్లో RWS Department take up చేస్తోంది. దానికి సంబంధించిన పూర్తి అంశాలను RWS Department పర్యవేక్షిస్తోంది.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(SRI KINJARAPU ATCHANNAIDU): అధ్యక్షా, ఇంపార్టెంట్ క్వశ్చన్. అవకాశం ఇవ్వండి. కొంత చెప్పాల్సి ఉంది. ప్రతిపక్షానికి కూడా అవకాశం ఇవ్వాలి.

మిస్టర్ స్పీకర్: క్వశ్చన్ అవర్‌లో only signatories కి మాత్రమే అవకాశం ఇవ్వబడుతుంది.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(SRI KINJARAPU ATCHANNAIDU): ఇదేమిటి సార్ కొత్త సంప్రదాయం. ఇంపార్టెంట్ క్వశ్చన్ సార్, ఇది. మేం ప్రశ్న అడుగుతాం.

మిస్టర్ స్పీకర్: ప్రకాష్ రెడ్డి గారూ చెప్పండి.

శ్రీ తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి(SRI THOPUDURTHI PRAKASH REDDY): అధ్యక్షా, ఎక్స్‌పర్ట్ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి. క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైతే కన్సల్‌టెంట్స్‌ను వినియోగించాలి. 268 ప్రాజెక్టులు ఏవైతే రీటెండర్లు అయ్యాయో, వాటి మీద, ఇంకా not started works ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ. 25 వేల కోట్లు పనులకు టెండర్లను గత ప్రభుత్వం పిలిచింది. వాటి మీద కూడా చర్యలు తీసుకోవాలి. వాటి అంచనాలు ఏ విధంగా రూపొందించారనే విషయంలో సర్వే చేశామని అంటున్నారు. ఎక్కడ కూడా ఫీల్డ్ లెవెల్‌లో సర్వే చేసి అంచనాలు రూపొందించింది లేదు. ఆఫీసుల్లో కూర్చొని లైన్ ఎస్టిమేట్స్ వేశారు. ఈ అవినీతిపై నిగ్గు తేల్చాలంటే కన్సల్‌టెంట్స్‌ను ఏర్పాటుచేసుకోవాలి. Field level లో క్షేత్రస్థాయి సర్వేలు జరిపించాలి. శాసనసభ్యులతో కూడిన శాసనసభ కమిటీని కూడా ఏర్పాటుచేయాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఈ ప్రాజెక్టుల విషయంలో చాలా మంది ప్రజలు లోకాయుక్తను మరియు హైకోర్టును కూడా ఆశ్రయించడం జరిగింది. ఆయా కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. థ్యాంక్యూ సార్.

ఉ 9.50

శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్(SRI POLUBOINA ANILKUMAR): అధ్యక్షా, దానికి సంబంధించి నిపుణుల కమిటీతోపాటు కేబినెట్ సబ్‌కమిటీ కూడా వేసి ఉంది. ఇరిగేషన్‌కు సంబంధించింది ప్రతీ ఒక్కటి పూర్తిగా తీసుకుని దానికి సంబంధించి కచ్చితంగా విచారణ జరిపిస్తాము.

(ప్రతిపక్ష ఉపాధ్యక్షులు శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని, మొత్తం అందరూ మామీదే మాట్లాడారని, ముఖ్యమైన ప్రశ్న అని అన్నారు)

MR.SPEAKER: Question No.67

ఉద్యోగులకు మధ్యంతర భృతి

ప్రశ్న నెం.67 (42)

సర్వశ్రీ గద్దె రామ్మోహన్‌రావు, డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి– ఎంఎల్‌ఏలు.,

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించిన విషయం వాస్తవమేనా; అయితే ఆ వివరాలేమిటి;

ఆ) మధ్యంతర భృతిని 2019 ఏప్రిల్ 1 నుండి కల్పించట్లేదనే విషయం కూడా వాస్తవమేనా;

ఇ) అయితే దానికి గల కారణాలేమిటి?

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రి (శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్) :

అ) అవునండీ, 2019 జూలై 1 నుండి ప్రభుత్వ ఉద్యోగులందరికీ 27 శాతం మూలవేతనంపై మధ్యంతర భృతిని మంజూరు చేస్తూ ఆర్థిక (పిసి & టిఎ) శాఖ 06-07-2019 తేదీగల జి.ఓ.ఎంఎస్.నెం.60 ద్వారా ఆదేశాలను జారీ చేసింది.

ఆ & ఇ) ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు 2019, జూలై 1 నుండి నగదు ప్రయోజనంతో మధ్యంతర భృతిని చెల్లించడమవుతున్నది.

మిస్టర్ స్పీకర్: అచ్చెన్నాయుడుగారూ మీరు గమనించాలి. Now, time is 9.50am. After 10'0 clock single supplementary only. మీరు వేరే ఫార్మ్‌లో రండి.

(సభ్యులు శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని, మొత్తం అందరూ మామీదే మాట్లాడారని, ముఖ్యమైన ప్రశ్న అని అన్నారు)

అచ్చెన్నాయుడుగారూ క్వశ్చన్‌కు కన్‌ఫైన్ అయి మాట్లాడండి.

(సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

శ్రీధర్‌రెడ్డిగారూ మీకు కేటాయించిన సీటుకు దయచేసి వెళ్లండి. మీ సీటు దగ్గరికి వెళ్లి మాట్లాడండి. ఇక్కడ వద్దు, ఇక్కడ మైకు ఇవ్వను. దయచేసి మీ సీటు దగ్గరకి వెళ్లండి. సభ ఆర్డర్‌లో ఉండాలి కదా! మీ స్థానం దగ్గరికి వెళ్లి మాట్లాడండి.

(సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారికి కేటాయించిన సీటు వద్దకు వెళ్లి కూర్చున్నారు)

(సభ్యులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డిగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి(SRI ANAM RAMANARAYANA REDDY)(వెంకటగిరి): అధ్యక్షా, ఇప్పుడు క్వశ్చన్ అవర్ జరుగుతోంది. తమరేమో 10 గంటల తర్వాత సింగిల్ సప్లిమెంటరీ అన్నారు. సభ్యులేమో చాలా ఆత్రుతగా ప్రశ్నలు వేస్తున్నారు. ఫస్ట్ క్వశ్చన్ దాదాపు 50 నిమిషాలు జరిగింది. తమరు ఫైనాన్స్ మినిస్టరుగారిని ఇంకొక క్వశ్చన్‌కు ఆన్సర్ చేయమన్నారు. వారు ఆన్సరు చేయడం కూడా అయిపోయింది. ఇప్పుడు మళ్లీ పాత క్వశ్చన్‌కు సప్లిమెంటరీస్‌కు వెలితే ఈ క్వశ్చన్ ఎలా జరుగుతుంది? తమరు కొంచెం వెసులుబాటు ఇచ్చి ఈ క్వశ్చన్స్ అన్నీ కూడా గం.10.30ని. లోపు పూర్తయ్యేటట్లు చేస్తే ఎక్కువ బిజినెస్ చేయడానికి అవకాశం ఉంటుంది.

(సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ః కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారూ దయచేసి కూర్చోండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (SRI KOTAMREDDY SRIDHAR REDDY) (నెల్లూరు గ్రామీణం) (మైకు లేకుండా)ః అచ్చెన్నాయుడుగారు ఆయనకు కేటాయించిన సీటులో లేరు సార్. అచ్చెన్నాయుడుగారు కూర్చున్న సీటు బుచ్చయ్యచౌదరిగారిది, బుచ్చయ్య చౌదరిగారు కూర్చున్న సీటు అచ్చెన్నాయుడుగారిది, నన్ను నా సీటుకు పంపించారు. నేను ఒబే చేస్తాను. వాళ్లు కూడా ఒబే చేయాలి సార్. వారు నిబంధనలను ఉల్లంఘించారు.

మిస్టర్ స్పీకర్ః బుచ్చయ్య చౌదరిగారూ మీకు కేటాయించిన సీటులోకి మీరు రావాలి. అచ్చెన్నాయుడుగారూ మీరు కూడా మీకు కేటాయించిన సీటులోకి రావాలి.

(సభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరిగారు లేచి ప్రతిపక్ష నాయకుని వెనుక సీటులోకి వెళ్లి కూర్చున్నారు)

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): అధ్యక్షా, డెప్యూటీ లీడర్స్ సీటు అడ్జెస్ట్‌మెంట్‌లో మాకు ప్రయార్టీ ఇవ్వాలి, ఎట్లా అయితే కేబినెట్ మినిస్టర్స్‌కు మీరు ఇస్తున్నారో, కనీసం అది ఒక సంప్రదాయం. అచ్చెన్నాయుడుగారికి ఈ సీటు (ప్రతిపక్ష నాయకుని పక్క సీటును చూపిస్తూ) కేటాయించండి. మిగతా ఇద్దరు డెప్యూటీ లీడర్స్ నా వెనకాల కూర్చుంటారు. That's our request.

మిస్టర్ స్పీకర్: మీ రిక్వెస్ట్‌ను మేము ఎగ్జామిన్ చేస్తాం.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): ఇంతకుముందు కూడా ఈ సంప్రదాయం ఉంది అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్: మేము డెసిషన్ తీసుకున్న తర్వాత తప్పనిసరిగా... మీ రిక్వెస్ట్‌ను ఎగ్జామిన్ చేస్తాం.

(సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారూ మాట్లాడుతూ, వాళ్లను (ప్రతిపక్ష సభ్యులు శ్రీ కె.అచ్చెన్నాయుడు గారిని మరియు శ్రీ కె. బుచ్చయ్యచౌదరిగారిని) సీట్లు మారమనండి సర్, నాకు ఒక రూలు, వాళ్లకు ఒక రూలా సార్ అన్నారు.)

అదేం కాదులే, శ్రీధర్‌రెడ్డి గారూ కూర్చోండి. మినిస్టర్ ఫర్ లెజిస్లేటివ్ అఫైర్స్.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, వెరీ క్లియర్‌గా బుచ్చయ్య చౌదరిగారి సీటు ఎక్కడుంది అనేది చెప్పడం జరిగింది. బుచ్చయ్య చౌదరిగారు పాపం అక్కడినుంచి నడుచుకుంటూ ఆయన సీటును ఆక్యుపై చేసుకునేందుకు రావడం కూడా జరిగింది. ఈరోజు బుచ్చయ్య చౌదరిగారి డ్రెస్ కూడా, చాలా స్మార్ట్‌గా, హ్యాండ్సమ్‌గా ఉన్నారు. (సభలో నవ్వులు)

అచ్చెన్నాయుడుగారేమో అక్కడినుంచి (తను కూర్చున్న సీటు నుంచి) కదలడం లేదు. కనీసం మీరు (గౌరవ సభాపతి) చెప్పిన తర్వాత అయినా ఎవరి సీటును వారు ఆక్యుపై చేసుకుంటే బాగుంటుంది. వారు సీట్లు మారకపోతే, శ్రీధర్‌రెడ్డిగారు కూడా ఇంతకుముందు కూర్చున్న సీటునే ఆక్యుపై చేసుకుంటారు. అధ్యక్షా, మాది కూడా రిక్వెస్ట్. సీటింగ్ అలాట్‌మెంట్ జరిగింది. అలాట్‌మెంట్ జరిగిన తర్వాత ఎవరి సీట్లల్లో వాళ్లు కూర్చుంటే దానికి ఇక సిస్టం ఏముంటుంది? అలాట్‌మెంట్ ఆఫ్ సీట్స్ ఏవిధంగా జరిగి ఉంటుంది? మామూలుగా, సీనియారిటీని బట్టి, పోర్టుపోలియోను బట్టి, ఆల్ఫాబెటిక్ లెటర్స్ ప్రకారం, వివిధ క్రైటీరియాను బట్టి అలాట్‌మెంట్ జరుగుతుంది. దీంట్లో ఎవరి ప్రమేయం లేదు, purely the Chair has done the allotment.

MR.SPEAKER: Yes..

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): దాని ప్రకారం అధ్యక్షా దయచేసి కనీసం ఇప్పుడైనా... It has come to your notice కాబట్టి ఇప్పుడైనా కూర్చోబెట్టండి.

(సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిగారూ మాట్లాడుతూ కావాలంటే కన్సిడర్ చేయండి సర్ అని, కన్సిడర్ చేసేదాకా ఈలోగా అచ్చెన్నాయుడుగారిని బుచ్చయ్య చౌదరిగారి సీటులో కూర్చోబెట్టండి అని గౌరవ సభాపతితో అన్నారు.)

అధక్షా, ప్రతిపక్ష నాయకుడు గారు ఒకవేళ అచ్చెన్నాయుడుగారి పక్కలోనే కూర్చోవాలి అనుకుంటే అచ్చెన్నాయుడుగారు వెనుకాలకు పోయి ప్రతిపక్షనాయకుడు కూడా వెనుకాలకు పోయి కూర్చున్నా మాకేమీ అభ్యంతరం లేదు. సీటు అలాట్‌మెంట్ ప్రకారమైనా చేయండి అధ్యక్షా. (సభలో నవ్వులు)

మిస్టర్ స్పీకర్ః ఓకె, అచ్చెన్నాయుడుగారూ...

(గౌరవ ప్రతిపక్ష నాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

చంద్రబాబునాయుడుగారూ మాట్లాడండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): అధ్యక్షా, రాజేంద్రనాథ్‌గారు రెండవ సారి ఎమ్మెల్యే అయ్యాడు. అంతే కదా!

(అధికార పార్టీ సభ్యులు “అబ్బా అని, ఈయన డెబ్బైసార్లు అయినట్టు” అన్నారు.)

అప్పటికే మీకు మొత్తం ప్రపంచమంతా తెలిసినట్లు మాట్లాడుతున్నారు. మీరు గుర్తు పెట్టుకోవాలి. సంప్రదాయాలు ఉన్నాయి. కొత్తగా మీరేమీ innovate చేయాల్సిన పని లేదు. మూడోసారి అపోజిషన్‌లో, నాలుగు సార్లు అధికారపార్టీలో మేము ఉన్నాము. ఆ విషయం మీరు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఈరోజు అధ్యక్షా మీరు గుర్తు పెట్టుకోవలసింది. మీరు సీనియర్ మెంబరు. మీరు కూడా ఇటుపక్క అపోజిషన్‌లో ఉన్నారు, రూలింగ్‌లో కూడా ఉన్నారు. స్పీకర్‌గారు ఎప్పుడు కూడా డెప్యూటీ లీడర్స్ గాని, ప్రతిపక్ష స్థానాలు గాని ముఖ్యమైన స్థానాలు కాబట్టి అపోజిషన్ లీడర్‌కే అవకాశం ఇస్తారు తప్ప ఇంకొకటి కాదు. ఆ సంప్రదాయాలు పాటించమని నేను కోరుతున్నాను. దానికి కూడా వెటకారాలు ఎందుకు రాజేంద్రనాథ్ గారు? అప్పుడే ఏమి అయిపోయింది? దానికి కూడా వెటకారాలు చేస్తారు. ఈ

వెటకారాలు అవసరం లేదు. మీరు ఒకటే అనుకుంటున్నారు. నన్నేదో అవమానం చేస్తే ప్రతిరోజూ మీకు పాపులారిటీ వస్తుందని అనుకుంటున్నారు కానీ, అది ప్రజలే నిర్ణయించుకుంటారు. ఆ విషయం మీరు గుర్తు పెట్టుకోవాలి. గౌరవించే సంప్రదాయం నేర్చుకుంటే మీకు గౌరవం పెరుగుతుంది.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, సీటింగ్ అనేది కరెక్టా కాదా? అలాట్‌మెంట్ చేసేది మీరా కాదా? మా ప్రకారం మేము సర్దుబాటు చేసుకోవచ్చని ఇప్పుడు ప్రతిపక్షనాయకులుగారు అంటున్నారు, అది కరెక్టా కాదా అనేది ఇప్పుడు మీరు రూలింగ్ ఇవ్వండి.

(సభ్యులు శ్రీ బుచ్చయ్య చౌదరి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్: బుచ్చయ్య చౌదరిగారు ఒక్క నిమిషం కూర్చోండి.

(గౌరవ మంత్రివర్యులు శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

రామచంద్రారెడ్డిగారూ మాట్లాడండి.

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి(SRI PEDDIREDDI RAMACHANDRA REDDY): అధ్యక్షా, గత శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా జగన్మోహన్‌రెడ్డిగారు ఉన్నప్పుడు ఆయన ప్రక్క సీటులో నా పేరు ఉండేది. కానీ మేము ఆనాడు జగన్మోహన్‌రెడ్డిగారి ప్రక్కన జ్యోతుల నెహ్రూగారిని కూర్చోబెట్టాం. అప్పుడు లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్‌గా ఉన్న శ్రీ యనమల రామకృష్ణుడుగారు నీ సీట్లో నువ్వు కూర్చోలేదు, జ్యోతుల నెహ్రూ కూర్చున్నారని అన్నారు. అప్పుడు ఒక రూలు ఇప్పుడు ఒక రూలు. వాళ్లకు ఏవిధంగా అనుకూలంగా ఉంటే ఆవిధంగా మాట్లాడతారు.

(ట్రెజరీ బెంచీల సభ్యులు బల్లలు చరిచారు)

ఇప్పుడు మేమెవరం ఆయన్ను క్వశ్చన్ చేయకూడదు. చేస్తే అనుభవం లేదు, రెండోసారి ఎమ్మెల్యే అంటాడు. ఎన్నిసార్లు ఎమ్మెల్యే అయితే ఏమి సార్ ***సరిగా ఉండాలి కదా!

మిస్టర్ స్పీకర్: అచ్చెన్నాయుడుగారూ, don't put me embarrassing the Chair. దయచేసి మీకు కేటాయించిన సీటుకు మీరు వెళ్లండి. లీడర్ ఆఫ్ ది అపోజిషన్ అప్పీల్ చేశారు, నేను తప్పనిసరిగా

***Expunged as ordered by the Chair

దానిమీద డైరెక్షన్ ఇస్తాను. దయచేసి మీకు కేటాయించిన సీటుకు మీరు వెళ్లాలి. వారు అప్పీల్ చేశారు, దానిని కూడా నేను ఎగ్జామిన్ చేస్తానని చెప్పాను. మీకు కేటాయించిన సీటుకు మీరు వెళ్లాలి. You must respect the Chair. ఆ సీటులో ఎవరు ఉన్నారనేది కాదు.

(సభ్యులు శ్రీ కె. అచ్చెన్నాయుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

(అధికార పార్టీ సభ్యులు మాట్లాడుతూ సీటు మారకపోతే మైకు ఎలా ఇస్తారు సార్ అన్నారు)

బుచ్చయ్య చౌదరి గారూ మీకు కేటాయించిన సీటులోకి మీరు వెళ్లండి. అక్కడికి వెళ్లి మాట్లాడండి.

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు లేచి తనకు కేటాయించిన సీటు వద్దకు వెళ్లి కూర్చున్నారు తదుపరి సభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వచ్చి ప్రతిపక్ష నాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి ప్రక్కన కూర్చున్నారు)

(అధికార పార్టీ సభ్యులు మాట్లాడుతూ బుచ్చయ్య చౌదరిగారికి ప్రమోషన్ ఇచ్చారని అన్నారు)

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY) (రాజమండ్రి గ్రామీణం): అధ్యక్షా, గత శాసనసభలో జగన్మోహన్‌రెడ్డిగారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన ప్రక్కన ఎవరెవరు ఎక్కడ కూర్చునేవారో మేము చూశాం. రూలింగ్ రూలింగే. కానీ సీట్ల సర్దుబాటులో ఆరోజున జ్యోతుల నెహ్రూగారు జగన్మోహన్‌రెడ్డి గారి ప్రక్కనే ఉండి సలహాలు చెబుతూ కూర్చునేవారు. ఈరోజు ప్రత్యేకించి రూలింగ్ ఇస్తున్నారు. ఇవాళ సీట్లు సర్దుబాట్లు జరిగాయి. నాకేం నేను స్మార్ట్‌గానే ఉంటాను. కొత్తగా చెప్పేది కాదు. నా వయస్సు 73 సంవత్సరాలు దాటి 74వ సంవత్సరం వస్తోంది. మరి ఆర్థిక శాఖామాత్యులు గారికి నా వయస్సు వచ్చేటప్పటికి ఆయన నడుస్తారో లేదో నాకైతే తెలియదు. కానీ, ఇంకొక 25 సంవత్సరాలు ఘనంగా ఉంటాను. మా నాన్న 105 సంవత్సరాల వరకూ బతికారు మొన్ననే చనిపోయారు. అందువలన నాకేం ఫర్వాలేదు. I am always smart. I never be...

(సభలో నవ్వులు)

ఉ 10.00

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (**SRI BUGGANA RAJENDRANATH**): వారికి (బుచ్చయ్య చౌదరి గారిని ఉద్దేశించి) ఒక కాంప్లిమెంట్ ఇస్తే దానికి కూడా సర్కాస్టిక్‌గా (వ్యంగ్యంగా) మాట్లాడుతున్నారు. బుచ్చయ్య చౌదరి గారు వేసుకున్న షర్ట్ బెస్ట్ షర్ట్ అవునా కాదా అని సభలో సభ్యులను అడగండి అధ్యక్షా.

(సభ్యులు బల్లలు చరిచారు)

సభ్యులు బల్లలు కూడా చరుస్తున్నారు.

MR.SPEAKER: Yes, we have no time, business should be completed.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (**SRI GORANTLA BUTCHAIAH CHOWDARY**):డ్రస్సే కాదు నా మనస్సు కూడా **ever fresh, no problem,** దాని గురించి ఏ సమస్యా లేదు. ఈవాళ సీటింగ్‌కు సంబంధించి ముఖ్యమైన డెప్యూటీ లీడర్ల గురించి సీట్ల సర్దుబాటులో మేము ఉన్నాం. మేము అభ్యర్థించాం. అధికారపార్టీ సభ్యులు కూర్చున్న దగ్గర నుంచి వచ్చి మేము కూర్చున్న సీట్ల ప్రక్కన అరవడం, మాపై దాడిచేయడం కోసం వస్తే సమస్య గానీ, మేము మా సీట్లు వదలడం లేదు కదా!

వారం రోజుల నుండి చూస్తున్నారు, మేము ఎప్పుడైనా పోడియం దగ్గరకు వచ్చామా? మీ టేబుల్ దాకా వచ్చామా అధ్యక్షా? మా నిరసనను మేము ఇక్కడి నుంచే వెలిబుచ్చుతున్నాము.

మిస్టర్ స్పీకర్ : పోడియం దగ్గరకు ఎవరు వచ్చినా సభా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. సభా నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా స్పీకర్‌కు ఉన్న అధికారాలను కచ్చితంగా అమలుచేస్తాం. That is a different matter. మీరు సీట్ల గురించి చెబుతున్నారు, సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారిని వారికి కేటాయించిన సీటుకు వెళ్లమని చెప్పాం. అది వచ్చినపుడు ఈ సబ్జెక్ట్ వచ్చింది. **In fact I don't know,** అచ్చెనాయుడు గారి సీట్ ప్రతిపక్ష నాయకుడి వెనుక అని, మీ (బుచ్చయ్య చౌదరి) సీటు ప్రతిపక్ష నాయకుడి గారి పక్కనని నాకు తెలియదు. ఇది తెలిసిన తరువాత సభలోని సీటింగ్ ప్రకారం ఆర్డర్‌లో నేను ఉంచుకోవాలి కదా!

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (**SRI GORANTLA BUTCHAIAH CHOWDARY**): నేను సీనియర్ సభ్యుడ్ని, నేను కూడా ఎనిమిది మాసాలు మంత్రిగా పని చేశాను. ఆయన (శ్రీ కె.అచ్చెన్నాయుడు) కూడా ఐదు సంవత్సరాలు మంత్రిగా పని చేశారు, ఆయన కూడా సీనియర్ శాసనసభ్యుడు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మాట్లాడిన దానిని దృష్టిలో పెట్టుకొని దయచేసి సీట్ల సర్దుబాటు చేయండి.

మిస్టర్ స్పీకర్: ఆయన (ప్రతిపక్ష నాయకుడు) అప్పీల్ చేశారు, దానిపై నేను ఎగ్జామిన్ చేస్తానన్నాను కదా!

(సభ్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు తాను మాట్లాడడానికి అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

అచ్చెన్నాయుడు గారూ, దేనికి అవకాశం ఇవ్వాలి? ఏంమాట్లాడుతారు?

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(**SRI KINJARAPU ATCHANNAIDU):** (మైక్ లేకుండా) మొదటి ప్రశ్నకు సంబంధించి నేను మాట్లాడుతుంటే సభలో సీట్ల గురించి గందరగోళ పరిస్థితి వచ్చింది. దానిపై నేను మాట్లాడాలి, నాకు మైక్ పర్మిషన్ ఇవ్వండి.

MR.SPEAKER: That question is over, now we are in second question.

(సభ్యులు శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు గారిచే సభకు అంతరాయం)

రామకృష్ణ బాబు గారు కూర్చోండి, ఆ ప్రశ్న అయిపోయింది తరువాత ప్రశ్నకు వెళ్లాం. ప్రతి దానికి మీ స్థానాల నుంచి లేచి నిలబడి సభకు అంతరాయం కలిగించడం సమంజసం కాదు.

(మా సభ్యుడు శ్రీ కె.అచ్చెన్నాయుడు ఆ ప్రశ్న గురించి ఇంకా మాట్లాడాలి, ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వండని ప్రతిపక్ష నాయకుడు తన సీట్లో లేచి నిలబడి గౌరవ సభాపతిని కోరసాగారు)

చంద్రబాబు నాయుడు గారు ఆ ప్రశ్న అయిపోయింది. అయిపోయిన దానిపై ఎలా మాట్లాడతారు. నేను మైక్ ఇచ్చిన తరువాత గౌరవ సభ్యులు రామనారాయణ రెడ్డి గారు వారి అభిప్రాయం చెప్పారు. సమయాన్ని దృష్టిలో పెట్టుకొని నేను చాలా క్లియర్‌గా చెప్పాను. పది గంటల తరువాత single supplementary. ఆ ప్రశ్నకు ఎక్కువమంది అధికారపార్టీ సభ్యులు కూడా సంతకాలు చేశారు. కాబట్టి ఆ ప్రశ్న ముగించడానికి ఎక్కువ సమయం తీసుకుంది. మీరు అంటున్నారు కాబట్టి క్వశ్చన్ అవర్‌లో సిగ్నేటరీస్‌ను మాత్రమే రేపటి నుంచి అనుమతించడం జరుగుతుంది. Hereafter, I am not allowing any other without signatories in questionnaire.

('శాసనసభ చరిత్రలో అలా ఎప్పుడూ జరగలేదు సార్' అని సభ్యులు శ్రీ కె. అచ్చెన్నాయుడు అన్నారు)

శాసనసభ చరిత్రలో లేకపోవచ్చు...

(ప్రతిపక్ష సభ్యులందరు తమ స్థానాలను విడచి లేచి ప్రతిపక్ష నాయకుడి గారి స్థానం దగ్గరకు వచ్చి సభకు అంతరాయం కల్గించసాగారు)

('భారతదేశ చరిత్రలో ఏ సభ్యుడ్ని ఒక సంవత్సరంపాటు సస్పెండ్ చేయలేదు, గత ప్రభుత్వంలో వీళ్లు చేశారు' అని కొంతమంది అధికారపక్ష సభ్యులు అన్నారు)

(ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం)

ఇలా చేస్తే సభను రన్ చేయడం సాధ్యం కాదు.

('ఎప్పుడూ లేని సంప్రదాయాన్ని ప్రవేశపెడుతున్నారు' అని ప్రతిపక్ష నాయకుడు తన స్థానం నుంచి లేచి అన్నారు)

సంప్రదాయం కాదండి, మీరు కూడా సభను సంప్రదాయం ప్రకారం నడిచే విధంగా చూడాలి. ప్రశ్నోత్తరాల సమయంలో మీకు సమయం ఇచ్చినపుడు సద్వినియోగం చేసుకోవాలి.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

You are diverting the subject. దయచేసి కూర్చోండి. కూర్చోని మాట్లాడండి.

(అంతరాయం కొనసాగింది)

మీ లీడర్ (ప్రతిపక్ష నాయకుడు) మాట్లాడుతున్నారు మీరు (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) కూర్చోవాలి.

(అంతరాయం కొనసాగింది)

సిగ్నేటరీస్‌కు అవకాశం ఇచ్చాను. మీకు (ప్రతిపక్షం) మాట్లాడే అవకాశం ఇస్తుంటే మీరు అవకాశాన్ని అన్ని వేళలా మిస్యూజ్ చేస్తున్నారు. You are polarising the situation, కాబట్టి కచ్చితంగా ఒక direction ఇచ్చాం.

(అధికార, విపక్షాల నడుమ వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి)

('మిస్యూజ్ అని స్పీకర్ చెప్పడం తప్పు' అని ప్రతిపక్ష నాయకుడు, ప్రతిపక్ష సభ్యులు అన్నారు)

('ఆయన ఇంకా అధికారంలో ఉన్నాడని అనుకుంటున్నారు సార్' అని ఉప ముఖ్యమంత్రి శ్రీ అమ్జత్ బాషా షేక్ బేపారి అన్నారు)

మీరు చెప్పినట్లు సభను రన్ చేయాలా? I am not allowing this.

('సభను డిక్టేట్ చేస్తున్నారు సార్, ఆయన (ప్రతిపక్ష నాయకుడు) హావభావాలు చూడండి అధ్యక్షా' అని ఉప ముఖ్యమంత్రి శ్రీ అమ్జత్ బాషా షేక్ బేపారి అన్నారు)

చంద్రబాబు నాయుడు గారు బెదిరించకండీ.

('చైర్‌ను డిక్టేట్ చేస్తున్నారు అధ్యక్షా' అని కొంతమంది అధికారపార్టీ సభ్యులు అన్నారు)

Chandra Babu Naidu garu, don't dictate the terms to the Chair. చంద్రబాబు నాయుడు గారు బెదిరించొద్దు... బెదిరించొద్దు... బెదిరించొద్దు

(సభలోని అధికారపక్ష సభ్యులందరూ ఒక్కసారిగా లేచి 'చంద్రబాబు నాయుడు గారు చైర్‌కు డిక్టేట్ చేయకండి, బెదిరించకండి' అన్నారు)

సభను హోల్డ్ చేయకండి. Don't hold the Podium.

(ప్రతిపక్ష సభ్యులు 'వియ్ వాంట్ జస్టిస్' 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ పలుమార్లు గట్టిగా నినాదాలు చేశారు)

మీరు బెదిరించకండి. ఆనం రామనారాయణ రెడ్డి గారు, మాట్లాడండి.

(ఆరోపణ ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శల మధ్య సభ సాగుతోంది)

No sarcastic comments please. రామనారాయణ రెడ్డి గారు చెప్పండి.

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి(**SRI ANAM RAMANARAYANA REDDY**): ఇప్పుడు జరిగిన దాంట్లో అందరం చూస్తున్నాం.

(అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి)

మొదటి ప్రశ్న అయిపోయాక, రెండవ ప్రశ్నను పిలిచారు. ఆర్థిక మంత్రి గారు సమాధానం ఇచ్చారు.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

వీళ్లు (ప్రతిపక్షం) మరలా మొదటి ప్రశ్నపై మాట్లాడతామని అడుగుతున్నారు. ఒక ప్రశ్న పూర్తి అయ్యాక మరలా వెనక్కు వెళ్లి మొదటి ప్రశ్నకు సంప్లిమెంటరీ ఇచ్చే సంప్రదాయం గతంలో ఎప్పుడూ ఈ శాసనసభలో లేదు.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

మూడు దఫాలు ప్రతిపక్షంలో, మూడు దఫాలు అధికారపక్షంలో ఉన్నానని పెద్దలు, ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. మేము కూడా మూడు దఫాలు ప్రతిపక్షంలో ఉన్నాం, మూడు దఫాలు అధికారపక్షంలో ఉండి శాసనసభలో పనిచేశాం, వారు గమనించాలి. ఈవాళ ఏమి జరుగుతోంది. ఈవాళ శాసనసభ స్థానాన్ని అగౌరవపరిచేలా..

(ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరాలను వెలిబుచ్చసాగారు)

ప్రతిపక్ష నాయకుడు మాట్లాడడం చాలా హాస్యాస్పదం అధ్యక్షా.

(అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి)

దీనికి ప్రతి ఒక్కరం బాధపడాల్సిన విషయం.

('వియ్ వాంట్ జస్టీస్' అంటూ ప్రతిపక్ష సభ్యులు సభకు అంతరాయం కల్గించసాగారు)

ఈ సభను సజావుగా నడిపించడంలో మీకున్న అధికారాలను ఉపయోగించండి.

(సభ గందరగోళ పరిస్థితుల మధ్య సభ్యులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారి ప్రసంగం కొనసాగింది)

అధ్యక్షా ఈ సభను నడిపించడంలో పూర్తిస్థాయిలో మీ నిబంధనల్ని, మీ అధికారాల్ని ఉపయోగించి సభను నిర్వహించండి.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

ఈరోజు సభా నాయకులు, సభ్యులు, మంత్రులు అందరూ కూడా మీ ఆదేశాల ప్రకారం శాసనసభలో ఎలా ఉండాలో ఆ విధంగా ఉండేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

('వియ్ వాంట్ జస్టీస్' అంటూ ప్రతిపక్ష సభ్యులు సభకు అంతరాయం కల్గించసాగారు)

ఒక ప్రశ్న పూర్తి అయ్యి రెండో ప్రశ్నకు సమాధానం ఇచ్చాక మరలా మొదటి ప్రశ్నకు సప్లిమెంటరీకి పోవడం శాసనసభ చరిత్రలో ఎప్పుడూ లేదు.

(అంతరాయం కొనసాగింది)

కొత్త సంప్రదాయం, కొత్త విధానం ఈవాళ ప్రతిపక్ష నాయకుడు చెబుతుంటే వినాలంటే మాకు కూడా బాధగానే ఉంది. శాసనసభలో వారికి (ప్రతిపక్ష నాయకుడు) ఎంత అనుభవం ఉందో మాకు కూడా అంతే అనుభవం ఉంది. వారితోపాటు చాలా దఫాలు మేమూ కూడా పనిచేశాం. మేము అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రతిపక్షంలో ఉన్నారు. మేము డా.రాజశేఖర్ రెడ్డి గారితో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారు అధికారంలో ఉన్నారు. ఇలా ఎలా మాట్లాడుతారు అధ్యక్షా?

ఉ. 10.10

(ప్రతిపక్ష సభ్యులంతా తమ నాయకుడు నిలబడిన స్థానం వద్దకు వచ్చి మైకు ఇవ్వండి సర్ అని, వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలను చేయసాగారు)

శ్రీ అంబటి రాంబాబు (SRI AMBATI RAMBABU)(సత్తెనపల్లి): అధ్యక్షా, సభలో జరుగుతున్న వాతావరణాన్ని చూస్తుంటే మనల్ని గమనిస్తున్న ప్రజానీకం చాలా బాధపడతారు. ఎందు కంటే, నాకు మైకు ఇచ్చారు, నేను మాట్లాడుతున్నాను. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు నిలబడి noise చేస్తుంటే ఏమి మాట్లాడాలో నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ జరుగుతున్న విధానం చూస్తున్నప్పుడు, నాకే కాదు ఈ రాష్ట్రంలో చూస్తున్న ప్రజానీకం అందరికీ బాధ కలుగుతుంది. మీరు ఏమన్నారంటే, సిగ్నేటరీలకు తప్ప ఎవరికీ రేపటి నుంచి అవకాశం ఇవ్వనూ అన్నారు.

(ప్రతిపక్ష సభ్యులు వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు)

మీరు కోపంతో ఏమీ అనలేదు. సభలో సమయపాలన పాటించాలనే ఉద్దేశంతో మీరు సౌలభ్యం కోసం అన్నారు. అన్న దానికి ప్రధాన ప్రతిపక్ష నాయకులువారు లేచి సంప్రదాయాలు లేని దానిని మీరు ఎలా సృష్టిస్తారండి? ఏమి మాట్లాడుతున్నారనే బెదిరింపు ధోరణితో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నేను ఒకటి చెప్పదలచుకున్నాను. మీరు గతశాసనసభలో సంప్రదాయాలను ఎలా పాటించారండి? గత శాసనసభలో సభ్యురాలు రోజా గారు, వారు తప్పు చేశారనే అభియోగంతో మీరు సంవత్సరంపాటు బహిష్కరించారు. వారు మళ్లా హైకోర్టుకి వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నారు. వారు ఆర్డర్ తెచ్చుకున్న తర్వాత కూడా కాదని చెప్పి మీరు సంవత్సరం పాటు బహిష్కరించారు. ఎప్పుడైనా భారతదేశ చరిత్రలోగానీ, శాసనసభ చరిత్రలో గానీ, ఎప్పుడైనా మీరు సంవత్సరం పాటు బహిష్కరించిన సంఘటన ఏదైనా ఉందండి? ఇలాంటి సంప్రదాయాలను మీరు ప్రవేశపెట్టి, సభా సౌలభ్యం కోసం, సభలో సమయపాలన కోసం, స్పీకర్‌గారు తీసుకున్న నిర్ణయాన్ని కాదని, ఇంకా ఒకవేళ నిర్ణయం తప్పు అని అనుకుంటే ప్రతి పక్ష నాయకులు మిమ్మల్ని అర్థించవచ్చు, మీరు ఎప్పుడూ చేయనటువంటి సంప్రదాయాలు మీరు చేస్తున్నారు. సభ్యులు నష్టపోతారని చెప్పొచ్చు. వారు (ప్రతిపక్షనాయకుడిని ఉద్దేశించి) లేచి మీరు ఎలా తీసుకుంటారు, ఎప్పుడూ లేని దానిని మీరు ఏమి చేస్తారు. ఇలాంటి బెదిరింపు ధోరణులతో అనుభవజ్ఞులైన చంద్రబాబునాయుడు గారు మాట్లాడటం మొదలు పెడితే... ఏమిటి ఇది, నాకు అర్థం

కావడం లేదు... ఇది సందర్భం కాదు. ముఖ్యంగా సభలో ఉన్న ప్రతిపక్ష సభ్యులకు మరియు ప్రతిపక్ష నాయకులు గారికి మనవి చేస్తున్నాను. గత నాలుగైదు రోజుల నుంచి చూస్తున్నాను. మీరు సింపతి డ్రామాలు వేస్తూ ప్రజల దగ్గర మార్కులు కొట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఏదో ఒక సింపతి పొందాలనే తాపత్రయంతో మీరు ఉన్నారు. ఇది సరైన విధానం కాదు. ఇప్పటికైనా మీ సీట్లలో మీరు కూర్చొని సభ సజావుగా జరిగేందుకు సహకరించాల్సిన బాధ్యత మీమీద ఉన్నది. మాజీ ముఖ్యమంత్రిగారు సభలో ఉన్న ప్రతిపక్ష సభ్యులు మందిలో కలిసిపోయి వారిలాగా గొడవ చేసే కార్యక్రమం చేయడం సమంజసం కాదు. ఇది రాష్ట్ర ప్రజలు గమనిస్తునారు. ఇప్పటికైనా సరిచేసుకోమని వారిని వినయపూర్వకంగా కోరుతు న్నాను. ఏదో ఒక పాయింట్ దగ్గర అడ్జస్ట్ కావాలి కాకపోతే సభ జరగదు. మీరైనా, మేమైనా... నేను మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిని వినయపూర్వకంగా కోరుతున్నాను. సభ జరగడానికి సహకరించండి. ప్యాండిమోనియం సృష్టించడానికి మీరు ప్రయత్నించకండి. ఇది తప్పిదం. ఈ తప్పిదాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా దీన్ని గ్రహించి.. స్పీకర్‌గారు ఇలా లేని సంప్రదాయాన్ని మీరు ప్రవేశపెట్టొద్దు. దీనివల్ల నష్టం జరుగుతుందని మీరు అప్పీల్ చేయండి. దానిని **consider** చేస్తారో లేదో, బెదిరింపు ధోరణి మాత్రం సమంజసం కాదు. మీరు బెదిరిస్తే బెదిరిపోవడానికి ఇక్కడ ఎవ్వరూ లేరు... గుర్తు పెట్టుకోమని మనవి చేస్తున్నాను. ఎవ్వరూ బెదిరిపోరు అని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.

(గౌరవ శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

SRI BUGGANA RAJENDRANATH: Speaker Sir, I would like to draw your attention to Page 478 of Practice and Procedure of Parliament by M.N.Kaul and S.L.Shakdher. Chits sent in the House by the Members asking for an opportunity to put supplementary questions are not taken notice of. Asking of supplementary questions by Members who have not been called by the Chair has been deprecated, no member can claim a right to be called to ask a supplementary with respect to a particular question. It is left to the discretion of the Chair to call upon any Member to ask supplementary questions.

(ప్రతిపక్ష సభ్యులు వారు ఎందుకు చదువుతున్నారు సర్ అని అన్నారు)

సిగ్నెటరీలు కాకుండా సప్లిమెంటరిలో ఒకవేళ ఇతర సభ్యులు పార్టిసిపేట్ చేయాలని అడిగినప్పుడు స్పీకర్‌గారి అనుమతితోనే చేయవచ్చు. తప్ప వాళ్లు **deprecate** అని అర్థం. **disapproved** అంటే తప్పు అని అనబడటం. ఈరోజు గౌరవ ప్రతిపక్ష నాయకులు అంటూ ఉన్నారు. మీరు రెండో సారి, మూడో సారి అని అంటున్నారు. ఒకటో సారో రెండో సారో మూడో సారో కాదు. ఎన్ని సార్లు అయినా **it remains to be the same.** పోయిన సారి సభలో న్యాయంగా మాకు రావాల్సింది అడిగితే కూడా వాళ్లు మాట మాట్లాడితే ట్యూషన్ పెట్టుకోండి, కౌల్ అండ్ షక్దర్ చదవండి అని అనేవాళ్లు. ఇదే కౌల్ అండ్ షక్దర్ చదువుతున్నప్పుడు వాళ్లు ఆరేడు సార్లు కౌల్ అండ్ షక్దర్ చదివారా లేదా అని నాకు అనుమా నంగా ఉంది. అసలు కౌల్ అండ్ షక్లర్ చదివి ఉంటే, రూల్స్ తెలిసి ఉంటే, తన గౌరవాన్ని వదిలిపెట్టి ప్రతి

పక్ష నాయకులు ఆ విధంగా నిల్చొని ఉండరు, వాస్తవంగా కూర్చొని ఉంటారు. ఎందుకో పాపం నిలబడి ఉన్నారు. ఏమన్నా అంటే గట్టిగా, బిర్రుగా చూసి భయపడించే ధోరణితో ఉన్నారు. అది తప్పు .. కౌల్ అండ్ షక్దర్ రూల్ పొజిషన్ ..

(గౌరవ సభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్యచౌదరి "పాయింట్ ఆఫ్ ఆర్డర్" అన్నారు)

మిస్టర్ స్పీకర్: మీరు ఆర్డర్‌లో ఉంటే పాయింట్ ఆఫ్ ఆర్డర్ పైన అవకాశం ఇస్తాను. **Ask them to sit in their respective seats**. సభ్యులు వారివారి స్థానాల్లో కూర్చొంటే మాట్లాడేందుకు అవకాశమిస్తాను. ప్లీజ్... ప్లీజ్.... లీడర్ ఆఫ్ ది హౌస్...

(ప్రతిపక్ష సభ్యులు వారివారి స్థానాల్లో కూర్చున్నారు)

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి **(SRI Y.S.JAGANMOHAN REDDY)**: అధ్యక్షా, ఇందాకటి నుంచి జరుగుతున్న డ్రామాని చూస్తున్నాను. నేను చంద్రబాబునాయుడు గారిని సూటిగా రెండే రెండు ప్రశ్నలు అడుగుతున్నాను. ఇది పర్మిట్ చేస్తే గనుక ఇది మంచో చెడో అనేది ఆయన్నే చెప్పమని అడుగు తున్నాను. మొదటిది సీటింగు గురించి మాట్లాడారు. అసలు ఈ సీట్ల అడ్జెస్ట్‌మెంట్‌లో మేము ఎవ్వరం కూడా ఇన్వాల్వ్ కాలేదు. టోటల్‌గా ఒక రూల్ ప్రకారం సీట్లు కేటాయింపు చేశారు. ఆ సీట్ల ప్రకారం కూర్చోవడం జరిగింది. సభ ప్రారంభమైనప్పటి నుంచి ఆ సీటులోనే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి గారు కూర్చుంటున్నారు. మీకు దగ్గరగా కనిపించే పరిస్థితి ఉంటుంది. ఇక్కడైతే మంత్రులు, సభ్యులు అందరూ ఇక్కడే ఉంటారు. అక్కడ ఖాళీగా ఉందని కూర్చుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అతను అక్కడే కూర్చునేవాడు. ఇప్పుడు ఆ సీటు మీద కొంచెం... (సభలో నవ్వులు) ఆ సీటు మీద కొద్దో గొప్పో వ్యామోహం ఉండొచ్చు. సభ మొదలైన దగ్గర నుంచి అక్కడే కూర్చుంటున్నారు. ఈరోజు ఏదో శ్రీధర్‌రెడ్డిగారు వచ్చి అక్కడే కూర్చొని ఉంటున్నారనడం తప్పు. **He was sitting for the past**... నేను చూసినప్పుడల్లా నాకు అక్కడే కనిపించేవాడు. తను ఏదో కూర్చొంటున్నాడు, తప్పు అని నాకు అనిపించలేదు. **But ok whatever said and done**. మీరు (స్పీకర్ గారిని ఉద్దేశించి) ఎవరి సీట్లలో వారు కూర్చోవాలని అన్నారు. పాపం శ్రీధర్ రెడ్డి గారిని ఉద్దేశించే మీరు అన్నారు. పాపం అతను మంచి వాడు గనుక ఒక్కమాట కూడా మాట్లాడకుండా తన సీటుకి వెళ్లి కూర్చున్నాడు. అంత లోపలనే చంద్రబా బునాయుడుగారి రియాక్షన్ స్టాట్ అయ్యింది. చంద్రబాబునాయుడుగారిని నేను సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నాను. మీ ప్రకారమే చేద్దామా? ఎవరైనా ఎక్కడైనా కూర్చొవచ్చని అనుకుందామా.. అట్లే అనుకుంటే రూల్ ప్రకారం అట్లే వద్దాం, పోని మీ ప్రక్కనే కూర్చుందామని వ్యామోహ పడుతున్నాడు... అందరూ వచ్చి అక్కడే కూర్చుంటారు. అందరికీ ఒకే రూల్ పెడదాం. ఏదో ఒక పద్ధతి పెడదాం. ప్రతీది ఇష్యూ చేయాలి. ఆ ఇష్యూ ద్వారా మీకేదో అన్యాయం జరిగిపోయినట్టుగా **sympathy gain** చేసుకోవా లనే తప్పుడు ఆలోచనలు చేయడం ధర్మం కాదు. రెండు వీళ్లు అడిగిన ఇంకొక పాయింట్ ఏమంటే, ఒక క్వశ్చన్ దాటి రెండో క్వశ్చన్‌కి మంత్రిగారు రిప్లై ఇవ్వడం మొదలు పెట్టారు. రిప్లై కూడా పూర్తి అయి

పోయింది. రెండో క్వశ్చన్‌కి రిప్లై ఇచ్చిన తరువాత, లేదు లేదు మేము మొదటి క్వశ్చన్‌కి పోతాము, మొదటి క్వశ్చన్ పైన మాట్లాడటానికి నాకు అవకాశమివ్వండని మళ్లీ మొదలు పెడతారు.

ఇదే కార్యక్రమం గత ఐదు సంవత్సరాల్లో మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన ఇక్కడ అధికార పక్షంలో ఉన్నప్పుడు కనీసం ఒక్క సందర్భంలోనైనా మాకు అవకాశం ఇచ్చారా లేదా అన్నది వాళ్ల మన సాక్షిని అడగమని చెబుతున్నాను. గుండెల మీద చేతులు వేసుకొని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోమని అడుగుతున్నాను. మూడవది, మాటిమాటికి వీళ్లు అడిగేది ఆరు సార్లు, 40సంవత్సరాల ఇండస్ట్రీ .. ఏంటి సర్ నలభై సంవత్సరాల ఇండస్ట్రీ మీకు ఉండేది? ఆ కౌల్ అండ్ షక్దర్ పుస్తకం .. పార్లమెంట్ పుస్తకం... స్పీకర్‌గారికి మీరే రూల్స్ చెబుతారు.

(శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి గారి దగ్గర నుంచి కౌల్ అండ్ షక్దర్ పుస్తకాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్నారు)

.. ఆరు సార్లు ఎమ్మెల్యే అయినా ఇదే కౌల్ అండ్ షక్దర్ పుస్తకంలోని రూల్స్‌ని పాటించాలి ఒకటి, రెండు సార్లు ఎమ్మెల్యే అయినా ఇదే కౌల్ అండ్ షక్దర్ పుస్తకంలోని రూల్స్‌ని ఎవరైనా పాటించాలి. ఆరుసార్లు ఎమ్మెల్యేగా మీరు ఎన్నికయ్యారు కాబట్టి ఒకసారి ఓడిపోయారు కాబట్టి that does not give you an additional advantage over others. ఒక్కసారి గెలిచిన శాసనసభ్యుడైనా అయినా ఇదే చట్టసభలోకి వచ్చి కూర్చొంటాడు.

ఉ. 10.20

ఒక్కసారి ఓడిపోయి మళ్లీ గెలిచి వచ్చినా కూడా ఇదే శాసనసభలో ఇక్కడే వచ్చి కూర్చుంటారు. రూల్స్ ఏమీ మారవు. రూల్స్ ఏమి చెబుతాయో నేను చదువుతాను ఒకసారి వినండి. రూల్స్ ఏమి చెబుతున్నాయంటే, Chits sent in the House by the Members asking for an opportunity to put supplementary questions are not taken notice of. Asking of supplementary questions by Members who have not been called by the Chair has been deprecated; no member can claim a right to be called to ask a supplementary with respect to a particular question. It is left to the discretion of the Chair to call upon any member to ask supplementary questions. ఇంత స్పష్టంగా రూల్ చెబుతుంటే, ఈ విషయంలో కూడా స్పీకర్ గారిని అగౌరవపరుస్తూ మాట్లాడడం, వారు చేసే పనుల వల్ల ఏమి సాధిస్తున్నారు? నేను సూటిగా ఒకే ఒక్క ప్రశ్న అడుగుతున్నాను. ఇన్నిరోజుల నుంచి శాసనసభ జరుగుతోంది. వారికి మేము ఇచ్చిన సమయం, వారికిచ్చిన వెసులుబాటు గత 5సంవత్సరాల్లో వారు మాకు ఎప్పుడైనా ఇచ్చారా? నేడు వారికి 23మంది శాసనసభ్యులే ఉన్నారు. ఆనాడు మాకు 67మంది శాసనసభ్యులు ఉన్నారు. అంటే, వారికంటే మూడు రెట్లు ఎక్కువమంది శాసనసభ్యులు వచ్చి అక్కడ కూర్చున్నా కూడా ఈరోజు వారికి ఔదార్యంతో మేమిస్తున్న వెసులుబాటులో కనీసం మాకు 20శాతం లేదా 10శాతం కూడా వారు ఇవ్వలేదు. కావాలంటే వారి గుండెలమీద చేతులు వేసుకుని వారి మనస్సాక్షిని అడగమనండి. మేము ఒక మంచి ఉద్దేశంతో వారివైపు తక్కువ మంది

సభ్యులున్నా కూడా వారికి సరైన అవకాశం ఇవ్వాలని, వారిని అకామడేట్ చేయడం కోసం మేము out of the way వెళుతున్నాము. మేము out of the way పోతూంటే, ప్రతి సందర్భంలోనూ దానిని వక్రీకరించడం, దానిలో నుంచి తప్పుదోవ తీసుకుని, దానిపై రచ్చచేసి ఏదో సింపతిని గెయిన్ చేసుకోవడం కోసం తాపత్రయపడుతున్న నేపథ్యంలో వారు ఏ రకంగా మంచి చేస్తున్నారో ఒక్కసారి వారి మనస్సాక్షిని అడగమని తమరి ద్వారా వారిని కోరుతున్నాను. ఇంత దారుణంగా వారు వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాల్సిందిగా తమరి ద్వారా వారిని విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: దయచేసి వినండి. నేను సభకు ఒక విషయాన్ని సబ్మిట్ చేయాలని అనుకుంటున్నాను. Hereafter, ఇలాగే మిస్యూజ్ జరుగుతుందని, సిగ్నటరీస్‌ను కాదని డీవియేట్ చేయడం మూలంగా వారు కూడా ప్రివిలేజస్ లాస్ అవుతున్నారు. In the question hour, that is the privilege of the Member. అంటే, సభ్యులెవరైతే ప్రశ్నలు అడుగుతున్నారో ఆ సిగ్నటరీలకు మాత్రమే ప్రివిలేజ్ ఉంటుంది. సరే, ఇది కన్వెన్షన్ అంటారో, ఏమంటారో నా విచక్షణాధికారంతో ఈరోజు నేను ఇస్తున్న రూలింగ్ ఇదని కచ్చితంగా చెబుతున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): (మైకు లేకుండా) అది రూలింగ్ కాదు. This is not correct. We are opposing. We are not going to accept.

మిస్టర్ స్పీకర్: నేను కచ్చితంగా చెబుతున్నాను. మీరు అపోజ్ చేసుకునే హక్కు మీకుంది. There is a Rule. ఏదైనా అడగాలనుకున్నప్పుడు చైర్ నుంచి మీరు అనుమతి తీసుకోవాలి, అది రూల్. సిగ్నటరీ కాకుండా మిగిలిన ఏ సభ్యులైనా, they have to seek permission from the Chair. చైర్ నుంచి అనుమతి తీసుకుని మాట్లాడాలి. అప్పుడే మీకు అవకాశం వస్తుంది. కానీ, ఈవిధంగా బుల్డోజ్ చేస్తే అవకాశం రాదు. చంద్రబాబు నాయుడు గారూ, బుల్డోజ్ చేస్తే మాట్లాడే అవకాశం రాదు. నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. మీరు మాట్లాడే ముందు అనుమతి తీసుకోవాలి. You must seek permission from the Chair.

SRI NARA CHANDRABABU NAIDU: Your ruling is not acceptable. No...

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY): (మైకు లేకుండా) అధ్యక్షా, ఇది ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఇచ్చే సూచనలు, సలహాలు ప్రభుత్వానికి అవసరం.

మిస్టర్ స్పీకర్: బుచ్చయ్యచౌదరి గారూ, ప్రజాస్వామ్యం గురించి నాకు కూడా తెలుసు. మీరు చైర్ నుంచి అనుమతి తీసుకోవాలి. మీరు అనుమతి తీసుకుంటే మాట్లాడేందుకు అవకాశమిస్తానని నేను చెబుతున్నాను.

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే సభలో అంతరాయం)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్, ప్లీజ్ కూర్చోండి. సిగ్నటరీస్ ఎవరైతే ఉన్నారో వారికి అది హక్కు. కాబట్టి ఆ హక్కును కచ్చితంగా వారు ఎక్సర్‌సైజ్ చేసిన తర్వాత అదనంగా ఎవరైనా పార్టిసిపేట్ చేయాలనుకుంటే మీరు చైర్ నుంచి అనుమతి తీసుకోవాలి. మీరు బుల్డోజ్ చేస్తే ఎలా? నాకు తెలుసు. మీరు కూర్చోండి. నేను కూడా 6సార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను. మంత్రిగా కూడా నేను పనిచేశాను. దాని తర్వాత ఈ శాసనసభ ఏకగ్రీవంగా నన్ను స్పీకర్‌గా ఎన్నుకుంది. అందుకే మీకందరికీ నేను చెబుతున్నాను. సభను సజావుగా నడిపించాలంటే, సభ్యులంతా సహకరించాలి. ఆ విధంగా ఉండి ఈసభ హుందాతనం పెంచాలి. అంతేగానీ, అధ్యక్షస్థానాన్ని మేము బుల్డోజ్ చేస్తామంటే మాత్రం అది జరిగే పని కాదు. తర్వాత మీరు అడగండి. ఇప్పుడు అచ్చెన్నాయుడు గారి సీటు విషయంలో ప్రతిపక్ష నాయకులు ఇలా ఉందని చెప్పారు, తప్పనిసరిగా మేము ఎగ్జామిన్ చేయడం కోసం ఆలోచిస్తామని చెప్పడం జరిగింది.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (**SRI NARA CHANDRABABU NAIDU**): (మైకు లేకుండా) అధ్యక్షా, మీరు మైకిస్తే, నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: చెప్పండి చంద్రబాబునాయుడు గారు.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (**SRI NARA CHANDRABABU NAIDU**): అధ్యక్షా, మీ గౌరవాన్ని కాపాడుతూ, మా గౌరవాన్ని కాపాడుకోవడం కోసం అచ్చెన్నాయుడు గారు ఆయన సీటుకు పోవాలంటే నేనే అచ్చెన్నాయుడును రిక్వెస్ట్ చేశాను. మీరు ఒక మాట అన్నారు. ఆర్థికమంత్రి రాజేంద్రనాథ్ గారు మాట్లాడినప్పుడు అచ్చెన్నాయుడుగారికి అవకాశం ఇచ్చారు. ఇచ్చినపుడు సీటు గొడవ వచ్చింది. ఆ గొడవ వచ్చినపుడు మీరు చెప్పినపుడు, నేను రిక్వెస్ట్ చేసి వెనుక సీటుకు పోయి మాట్లాడమని ఆయనకు చెప్పాను. మళ్లీ మీరు ఆయనకు అవకాశమివ్వకుండా రామనారాయణ రెడ్డి గారు చెప్పారని ముందుకు పోయే పరిస్థితికి వచ్చారు. అంటే, మీరు చెప్పిన మాటను మేము ఆనర్ చేసినప్పుడు మీరిచ్చిన మాటను మీరు ఆనర్ చేయాలి కదా స్పీకర్ గారూ?

మిస్టర్ స్పీకర్: రామనారాయణ రెడ్డిగారు చెప్పిందేమంటే, సభకు ఒక సంప్రదాయం ఉంది. ఒక ప్రశ్న పూర్తయిన తర్వాత మళ్లీ మంత్రి గారిని అనుమతించి ఆయన జవాబు ఇచ్చిన తర్వాత మళ్లీ మీరు వెనుకకు వెళ్లి అవకాశం ఇస్తున్నారన్నారు.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(**SRI KINJARAPU ATCHANNAIDU**): సార్, నేను చెయ్యెత్తి అడిగాను.

మిస్టర్ స్పీకర్: అందరూ చేతులెత్తుతారు. నేను అనుమతించాలి. Everybody will raise their hands. చేతులెత్తడం కాదు నేను అనుమతించాలి కదా! అందుకే ఈసభ ఎట్టి పరిస్థితుల్లో కన్వెన్షన్లకు డీవియేట్ కాము. సిగ్నటరీలకు తొలి అవకాశం, దాని తర్వాత మీరు అనుమతి కోరండి. అనుమతి ఇవ్వాలో, లేదో ఆలోచించి ఇవ్వాలనుకుంటే అవకాశం ఇస్తాను. ఆవిధంగా ఇచ్చే అధికారం స్పీకర్‌కు ఉంది. అంతేతప్ప, ఈవిధంగా బుల్‌డోజ్ చేయడం కరెక్టు కాదు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (**SRI BUGGANA RAJENDRANATH**): అధ్యక్షా, ఇక్కడ మూడు విషయాలు ఉన్నాయి. ఒకటి, సహజంగా ప్రశ్న జరిగేటపుడు సిగ్నటరీస్ కాక సమయాన్ని బట్టి, పరిస్థితిని బట్టి, ఆ సబ్జెక్టును బట్టి ఇతర సభ్యులు అడిగితే స్పీకర్ గారి డిస్క్రిషన్‌తో అవకాశం ఇస్తారు. అది మీరు ఫాలో అవుతూనే ఉన్నారు.

మిస్టర్ స్పీకర్: ఆ విషయాన్నే నేను కూడా చెప్పాను.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (**SRI BUGGANA RAJENDRANATH**): రెండవ పాయింటు అధ్యక్షా, ఇక్కడున్న కొన్ని పరిస్థితులు, ఉదాహరణకు, ఇప్పుడే చూస్తున్నాము, మమ్మల్ని రెండోసారి, మూడోసారి శాసనసభ్యులని అన్నారు. సరే, ఒప్పుకుంటాము.

ఉ.10.30

అక్కడ గౌరవసభ్యులందరూ కూడా కూర్చొని ఉండగా ఒక్క ప్రతిపక్షనాయకులు మాత్రమే నిలబడి వివాదం చెయ్యడం చూడడానికి ఏమైనా బాగుందా? మాములుగా రివర్స్‌లో ఉంటుంది. ప్రతిపక్షనాయకులు కూర్చొని ఉంటారు. సభ్యులు లేచి ఉంటారు. అది రెండవ పాయింట్. దానిని కూడా వాళ్ల విజ్ఞతకే వదిలిపెడదాం. మూడవది స్పీకర్ గారితో ఏదైనా మాట్లాడాలి అనుకున్నప్పుడు వచ్చి మీ ఛాంబర్‌లో మాట్లాడాలి కానీ ఇక్కడ సభలోపల స్పీకర్‌తో మీరు ఇట్లా అన్నారు, నేను ఇట్లా అన్నా, నేను అన్నా కాబట్టి మీరు అనాలి, మీరు అన్నారు కాబట్టి నేను అనాలి అది కరెక్టు కాదని మేము భావిస్తున్నాం.

మిస్టర్ స్పీకర్ః గద్దె రామ్మోహన్ రావు గారు.

శ్రీ గద్దె రామ్మోహన్ రావు (విజయవాడ తూర్పు) : స్పీకర్ సార్.........

(గౌరవ ప్రతిపక్షనాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

(మీ మాట మీద మీరు నిలబడండి అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్: కూర్చోండి.. ఏంటి చెప్పండి చంద్రబాబునాయుడు గారు..

శ్రీ నారా చంద్రబాబునాయుడు : అధ్యక్షా,

మిస్టర్ స్పీకర్: ఇప్పుడు ఈ ఇష్యూని కంక్లూడ్ చెయ్యండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు **(SRI NARA CHANDRABABU NAIDU)**: ముఖ్యమంత్రి గారు ప్రధానంగా రెండు, మూడు ఇష్యూస్ రైజ్ చేశారు. ఒకటి సీట్ల విషయం రైజ్ చేశారు. జనరల్‌గా సీట్స్ అలాట్‌మెంట్ అనేది ఏవిధంగా చేస్తారంటే మినిష్టర్లు వారి సీనియారిటీ ప్రకారం మీకు ఒక లిస్ట్ ఇస్తారు. అదేమాదిరిగా ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు కూడా జనరల్‌గా ఎప్పుడు జరిగే సాంప్రదాయం ఎవరెవరు ఎక్కడ కూర్చోవాలో ఇంపార్టెంట్ లీడర్స్‌కి మేము సీట్ల లిస్ట్ ఇస్తాం. మిగిలిన వాళ్లు అందరినీ **alphabetical order** లో పెట్టుకుని మీరు వెళతారు. ఎట్లా జరిగిందో నాకు తెలియదు. **Alphabetical order** ప్రకారం అచ్చెన్నాయుడే ముందు వస్తారు. "A" first వస్తుంది. బుచ్చయ్యచౌదరిగారు తర్వాత వస్తారు. కానీ ఎట్లా జరిగిందో అది. నేను మిమ్మల్ని రిక్వెస్ట్ చేశాను. ఇంతకుమునుపు మీరు కూడా ఎంఎల్ఏగా ఉన్నారనుకుంటా అప్పుడు ఎన్టీరామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెనుక ఎవరు కూర్చోవాలో LOP.............

(అచ్చయ్య బుచ్చయ్య అని అధికారపక్షసభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్ పద్మశ్రీగారు..ఆగండి. కంక్లూడ్ చెయ్యనివ్వండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు **(SRI NARA CHANDRABABU NAIDU)**: ఎన్.టి.రామారావుగారు అపోజిషన్ లీడర్‌గా ఉన్నప్పుడు వెనుక ఎవరు కూర్చోవాలో, ప్రక్కన ఎవరు కూర్చోవాలో మేమే నిర్ణయించి ఇస్తే, అలాగే **allocate** చేశారు. రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ప్రక్కన ఎవరు ఉండాలి, ఎవరెవరికి ఏయే స్థానాలు ఇవ్వాలో ఆయన అడిగిన దాని ప్రకారం జరిగాయి తప్ప, ఎప్పుడూ ఆ సాంప్రదాయాన్ని పాటిస్తాం. అంతేకానీ ఇప్పుడు లీడర్ ఆఫ్ ద హౌస్ చెప్పినట్లు....

(''అప్పుడు మమ్మల్ని అడగలేదు సార్'' అంటూ అధికారపక్షసభ్యులచే అంతరాయం)

అప్పుడు కూడా accommodate చేశారు. మీరు ఎక్కడ కూర్చోవాలో, మీ ప్రక్కన ఎవరు కూర్చోవాలో వాళ్లందరికీ accommodation ఇచ్చారు తప్ప, అప్పుడు కూడా ఒక పద్ధతి ప్రకారమే జరిగింది. ఈ విషయం మీరు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

(అప్పుడు మమ్మల్ని అడగలేదు సార్ అని అధికారపక్షసభ్యులు అన్నారు)

మిస్టర్ స్పీకర్: ఆగండి......ప్లీజ్... అయిపోనివ్వండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): అంటే అప్పుడే మీరు ఒక intention తో వెళ్లిపోతే ఎట్లండీ ... ఇంకా చాలా ఉంది.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్ ఒక్కనిమిషం మీరు ఆగాలి... చంద్రబాబునాయుడు గారు కంక్లూడ్ చెయ్యండి.

(ఆయన సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని కొందరు అధికారపక్షసభ్యులు అన్నారు)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్ ఒక్కనిమిషం

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): ఇది ఒక్క ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనే కాదు. మన దేశంలో ఎన్నో అసెంబ్లీలు ఉన్నాయి, పార్లమెంటు కూడా ఉంది. సభాసాంప్రదాయాలు ఉన్నాయి. అదేవిధంగా ఇప్పుడు వారు చదివిన కౌల్ అండ్ షక్దర్ పుస్తకం చూస్తే, ఏముంది? ఏయే మెంబర్లు మాట్లాడదలుచుకున్నారో వాళ్ల పేర్లు ఉంటాయి. మీరు వాళ్లకి అవకాశం ఇస్తారు.

మిస్టర్ స్పీకర్: అదే చెబుతున్నానండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): ఏ ప్రజాస్వామ్యంలో అయినా ఇదే జరుగుతుంది. అట్లా కాకుండా వీళ్లకే confine చేస్తాం, సప్లిమెంటరీస్ ఇంకెవరికి అవకాశం ఇవ్వమంటే అది ప్రజాస్వామ్యం కాదు. ఇంకొక ప్రక్క ప్రజాస్వామ్యంలో.....

MR.SPEAKER: You are mistaken. నేను ఏమన్నానంటే సిగ్నేటరీస్‌గా ఉన్న వాళ్లకి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. తర్వాత మీరు అడగండి అంటున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): అది చెప్తుంటే ఇష్యూలేదు .. సాంప్రదాయం..

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

ఎప్పుడు అదే జరుగుతుంది. ముందు సిగ్నేటరీస్‌కి ఇస్తారు. తర్వాత సమయం ఉంటే మిగిలిన సభ్యులకు అవకాశం ఇస్తారు. సమయం లేకపోతే ఇవ్వరు. దాని గురించి మేము ఫైట్ చేస్తుంటాం, వాకౌట్ చేస్తుంటారు. అన్ని జరుగుతుంటాయి. ప్రజాస్వామ్యంలో అన్ని సాంప్రదాయాలు ఉంటాయి.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

ఇక రెండో రూల్. మేము పోడియం దగ్గరకు రాకూడదన్నారు. మేము కూడా రావడం లేదు. కానీ పార్లమెంటులో ఏమి జరుగుతుంది? మీరు చూడలేదా? ప్రజాస్వామ్యంలో ఎప్పుడు కూడా ఒకొక్క ఇష్యూని బట్టి, సమస్యను బట్టి.... వీళ్లు ఎన్ని సార్లు ఆందోళన చేపట్టారు.........

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః ఆగండి ప్లీజ్......... పార్లమెంటరీ డెమోక్రసీలో పార్లమెంటు అయినా, శాసనసభ అయినా పోడియం దగ్గరకి వెళ్లిన దానిని accept చేస్తామా?

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): చేస్తామా? లేదా? అనేది వేరే విషయం అధ్యక్షా...........

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

మీరు వినాలి. What is happening. ఏమౌతుంది. నిన్న కూడా రాజ్యసభలో మీరు చూశారు. మొన్న లోక్‌సభలో చూశారు. ఆంధ్రప్రదేశ్ విభజన అంశం వచ్చినపుడు మొత్తం అంతా చూశాం.

మిస్టర్ స్పీకర్ః చంద్రబాబునాయుడు గారు ప్లీజ్ కంక్లూడ్ చెయ్యండి.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): ఇష్యూ అది కాదు. ఈ రోజు సభను నడపడం మీ బాధ్యత. సహకరించడం మా అందరి బాధ్యత. రెండు రాజకీయ పార్టీలు ఉన్నప్పుడు ఇద్దరి viewsతో వెళ్లవలసిన అవసరం ఉంది. అధికారపక్షం మమ్మల్ని విమర్శించినప్పుడు, మా మీద కావాలని ఆరోపణలు చేసినప్పుడు దానికి సమాధానం చెప్పే స్వేచ్ఛ మాకు ఈ హౌస్‌లో లేకపోతే ఇక ఇక్కడ ఏమి కూర్చుంటాం అధ్యక్షా...........

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

ఒక ప్రశ్న పైన చర్చ జరిగింది. 50 నిమిషాలు మీరు వారికి అవకాశం ఇచ్చారు. వాళ్లు తీవ్రమైన ఆరోపణలు చేశారు. కనీసం ఇది అవును, కాదు అని చెప్పే అవకాశం కూడా మీరు మాకు ఇవ్వకపోతే ఇంక ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంది?

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

అదే మేము అడిగితే. మీరు మైకు ఇస్తామన్నారు.

మిస్టర్ స్పీకర్: చంద్రబాబునాయుడు గారు ఒక్క నిమిషం రామచంద్రారెడ్డిగారు మీరు చెప్పండి.

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి **(SRI PEDDIREDDI RAMACHANDRA REDDY)**: అధ్యక్షా, చంద్రబాబునాయుడుగారు ప్రతిపక్షనాయకుడిగా ఈరోజు చాలా బాగా ప్రజాస్వామ్యం గురించి, స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు. గత ఐదు సంవత్సరాలలో ఆయన ఇటువైపు ఎంతమందికి సైగలు చేశారో చూపించండి. ఎంతమందికి స్లిప్‌లు పంపించాడు? ఏ కార్యక్రమం చేశారు? మేము పోడియం దగ్గర ఉంటాము, అప్పుడు ఇక్కడ మంత్రులకు శాసనసభ్యులందరికీ వారు ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛ ఇస్తారు దివంగత రాజశేఖర్‌రెడ్డిగారిని, అప్పుడు మా ప్రతిపక్షనాయకుడుగా ఉన్న జగన్మోహన్‌రెడ్డిగారిని అందరినీ తిట్టే కార్యక్రమం చేశారు తప్ప ఏదైనా శాసనసభలో జరిగిందా అని అడుగుతున్నాను. ఈరోజు స్వేచ్ఛ గురించి మాట్లాడతాడు. ఈరోజు ఎక్కడంటే అక్కడ అటు సీటింగ్‌లో కూర్చోవచ్చు అంటున్నారు. అప్పుడు ఎందుకు రామచంద్రారెడ్డిని అక్కడ కూర్చోండని Legislative Affairs Minister చేత నువ్వు చెప్పించావు. ఆయనకి ఒక నీతి. మాకొక నీతా? ఇది అంతా గురివింద సామెత మాదిరిగా ఉంది సార్.. ఇంత వళ్లిస్తున్నారంటే మీరు ఆలోచన చెయ్యాలి.

మిస్టర్ స్పీకర్: మీరు కంక్లూడ్ చెయ్యండి చంద్రబాబునాయుడుగారు.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు **(SRI NARA CHANDRABABU NAIDU)**: ఇప్పుడు గౌరవమంత్రి రామచంద్రారెడ్డిగారు చెప్పారు. నేను పాతరోజులలో ఏదో ఎప్పుడో సైగలు చేశానని చెబుతున్నారు. నిన్న మీ ముఖ్యమంత్రిగారు లేవండి, లేవండి అని సైగలు చేస్తున్నారు.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

చూశారా, చూడలేదా? మీరు రికార్డులను చూడండి. మీరు రికార్డులలోకి వెళ్లండయ్యా. చూస్తే, చూస్తున్నారు (ముఖ్యమంత్రిగారిని ఉద్దేశించి). ఇవన్నీ వద్దు. ప్రజాస్వామ్యంలో లీడర్‌గా ఉండే వాళ్లు ఏవిధంగా వాళ్ల యొక్క సభ్యులను అదుపు చేస్తారనేది ముఖ్యం. అప్పుడు మీరు అవకాశం ఇవ్వలేదు కాబట్టి ఇప్పుడు మేము అవకాశం ఇవ్వమనడం ఇది ఎక్కడి న్యాయమండీ? ఆరోజు మీరు ఎన్నిసార్లు పోరాడారు? ఎన్నిసార్లు పోడియం దగ్గరకు వెళ్లారు? ఎన్నిసార్లు స్పీకర్‌గారిని తిట్టారండి? మీరు ఎన్నిసార్లు నన్ను తిట్టారండి ? తిట్టలేదా మీరు?(బెల్) ఇప్పుడు తిడుతున్నారు. అప్పుడు కూడా తిట్టారు.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

మీ అంత అసభ్యంగా నేను ఎప్పుడూ మాట్లాడలేదు. ఆ విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం కొనసాగింది)

మీ సభ్యుల సంఖ్య ఎక్కవ ఉందని ప్రతి ఒక్కరు నామీద దౌర్జన్యం చెయ్యాలనుకుంటే నేనేమి భయపడను. నేను ప్రజాసమస్యలమీద పోరాడుతూనే ఉంటాను.

మిస్టర్ స్పీకర్: చెప్పండి రాజేంద్రనాథ్ గారు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (**SRI BUGGANA RAJENDRANATH**): అధ్యక్షా, మీరు చాలా హుందాగా, చాలా **flexible** గా ఉన్నందుకు **honest** స్పీకర్‌గారితో డిస్కషన్ మాదిరిగా జరుగుతుంది. ఎప్పుడైనా గానీ స్పీకర్‌గారు ఒకటి చెబుతారు. మేము వింటాం. అంతేగాని, ఈ విధంగా డిస్కషన్ ఏమిటీ? రెండవ పాయింట్ ప్రతివిషయం మేము గమనిస్తున్నాము. అది ఫైనల్‌గా ఎక్కడకు వస్తుందో తెలుసా? ప్రజలు గమనిస్తున్నారు. అంతే **sympathy**. సబ్జెక్ట్‌కి రండి అంటే సబ్జెక్ట్‌కి రావడం లేదు. ప్రతిదానికి **sympathy**. ఇంతకుముందు సీటింగ్ గురించి చెప్పారు. ఇంతవరకు ఒక రిక్వెస్ట్ ఉందా? ఇప్పుడు వాళ్లు రూల్స్, రూల్ పొజిషన్ అండ్ **conventions** గురించి చెబుతున్నారు. ఇంతవరకూ వాళ్లు ఎక్కడైనా మాకు ఇక్కడ సీటు కావాలని రిక్వెస్ట్ చేశారా? లేదా రిక్వెస్ట్ చేసేదానికి ప్రయత్నం చేశారా? రెండూ లేవు కానీ ఈ రోజు పబ్లిక్ చూస్తున్నారు. ఈ **questions and supplementaries** కి వచ్చేటప్పటికీ మీరు ఏమి అన్నారు. అర్థగంట సేపు వారు సభా సమయమంతా వృథా చేసి ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షంలో సభ్యులు కూర్చొని ఉంటే నాయకులు మాత్రం నిలబడి ఉండటం ఇది ఎక్కడైనా చూశామా? చూసిన తరువాత ఫైనల్‌గా నెట్ రిజల్ట్ ఏమి వచ్చింది?

ఉ.10.40

ఎవరో ఫోన్ చేసి **is it double two double two double two** అని అడిగితే **no, no this is wrong number. It is triple two triple two** అన్నారంట. వారడిగింది కూడా అదే కదా! ప్రశ్నలు వేసినవారిలో సిగ్నేటరీస్ కాకుండా ఎవరైనా మాట్లాడాలనుకుంటే పరిస్థితిని బట్టి నేను ఇస్తాను, మీరు అడగండి అంటున్నారు. ప్రతిదానికీ వారు సభాసమయాన్ని వృథా చేస్తున్నారు.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (**SRI Y.S.JAGANMOHAN REDDY**): అధ్యక్షా, ప్రశ్నోత్తరాలు ఉదయం గం.9.00లకు ప్రారంభమై 10.30 గంటలవరకు జరిగి ఆ తరవాత జీరో అవర్ పూర్తి అయిన తరవాత బడ్జెట్‌పై చర్చ జరగాలి. అదేమైనా జరుగుతున్నదా? ఇప్పటివరకు కేవలం రెండు ప్రశ్నలే పూర్తయ్యాయి. అతి ముఖ్యమైన బడ్జెట్ మీద చర్చించాలనే కనీస ఆలోచన కూడా వారికి లేకుండా ఎవరు ఎక్కడ కూర్చోవాలి, ఎవరు వారిపక్కన కూర్చోవాలి, ప్రశ్నకు సంతకం పెట్టకపోయినా మేం వేలు చూపిస్తే మాకు అవకాశం ఇవ్వాల్సిందే అని, అది మా హుకుం అని, ఒకవేళ మీరు ఇవ్వకపోతే

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తారా అని ఈ అంశంపైనే గత అరగంట నుంచి చర్చ జరిగింది. చంద్రబాబు నాయుడుగారు లేచి ఏదో అన్యాయం జరిగినట్లు గింజుకోవడం, వారి వెనకాల ఉన్నదే కొద్దిమంది సభ్యులైనా వారందరూ లేచి మరలా దానికోసం గింజుకోవడం. పది ప్రశ్నలు జరగాల్సిన చోట ఇప్పటికి కేవలం రెండే ప్రశ్నలు పూర్తయ్యాయి. బడ్జెట్‌పై చర్చను వదలివేయకుండా దానిపై చర్చ ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోమని తమరిని కోరుతున్నాను.

(Interruptions)

MR.SPEAKER: No running commentary please అధికారపక్షనుంచి గానీ, ప్రతిపక్షనుంచి గానీ రన్నింగ్ కామెంటరీ వద్దు.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు **(SRI KINJARAPU ATCHANNAIDU):** (మైక్ లేకుండా) ధర్మశ్రీగారు అచ్చయ్య, బుచ్చయ్య అంటున్నా మీరు ఏమీ అనరు. ముఖ్యమంత్రిగారు వ్యంగ్యంగా లావుగా, పొడుగ్గా ఉన్నావని మాట్లాడినా మీరు ఏమీ అనరు. మేం చెప్పుకుందామంటే మీరు మైక్ ఇవ్వరు.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ **(SRI BUGGANA RAJENDRANATH):** అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పేది, చాలా ఆశ్చర్యంగా ఉంది. నెల్లూరులో ప్రతి ఒక్కరినీ అయ్యా అంటారు, అచ్చయ్య, బుచ్చయ్య అని రెస్పెక్ట్‌తో అంటారు. వారు గత సభలో పాతేస్తాం, తోలేస్తాం, పూడ్చేస్తాం, మీరు మొగోళ్లా అని చాలా మాటలు మాట్లాడారు. ఇపుడు వాటి గురించి వాళ్లా మాట్లాడేది?

శ్రీ అంబటి రాంబాబు **(SRI AMBATI RAMBABU):** అధ్యక్షా, అచ్చయ్యా, బుచ్చయ్యా అన్నా మీరు మాట్లాడరు. లావుగా, పొడుగ్గా ఉన్నారు అన్నా మీరు మాట్లాడరు అన్నారు. దీనిలో ఏముంది అధ్యక్షా, అచ్చయ్యగారు, బుచ్చయ్యగారు లావుగాను, పొడుగ్గాను ఉన్నమాట వాస్తవమేగా. దీనిలో తప్పేముంది? ఆయన పొడుగ్గా, లావుగా లేరా ఏమిటి? నేను పొట్టిగా సన్నగా ఉన్నానంటే దానిలో తప్పేముంది? అదేమీ అన్‌పార్లమెంటరీ కాదు.

(సభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అభ్యంతరాలు వ్యక్తం చేయసాగారు)

మిస్టర్ స్పీకర్: బుచ్చయ్య చౌదరిగారూ... కూర్చోండి. రామ్మోహన్ గారూ మాట్లాడండి. ఎట్టి పరిస్థితుల్లోనూ పదకొండు గంటలకు ప్రశ్నోత్తరాలు పూర్తి కావాలి. తర్వాత బడ్జెట్‌పై చర్చ కొనసాగుతుంది.

(Interruptions)

Only signatories will be allowed. For other Members, it is the discretion of the Speaker కూర్చోండి. ఎందుకలా వాదులాటకు వస్తారు? Do you have any.

(Interruptions from Sri Karanam Dharmasri)

ధర్మశ్రీగారూ, ఆగండి. తప్పండీ, మీరు కూర్చోండి. మీరు సీనియర్ శాసనసభ్యులు. కూర్చోండి.

శ్రీ గద్దె రామ్మోహన్ రావు (SRI GADDE RAMAMOHAN RAO): అధ్యక్షా, ఈ ప్రశ్న ఎనిమిది లక్షల మంది ఉద్యోగులకు, పింఛనుదార్లకు సంబంధించినది. దీనికి ప్రభుత్వం ఇచ్చిన సమాధానం చూస్తే ఉద్యోగులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి లోపించిందనే అనుమానం వస్తున్నది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దుచేయాలనే ధ్యేయంతోబాటు వారు అధికారంలోకి వచ్చిన తరవాత ప్రజలకు మేలు చేయాలనే ధ్యేయం తక్కువగా ఉన్నట్లు కనిపిస్తున్నది. ప్రతి అయిదు సంవత్సరాలకు వేతన సవరణ చేస్తున్న సందర్భంలో1.7.2019 నుంచి వేతన సవరణ జరగాలి. గత ప్రభుత్వం 2018 జూలైలో వేతన సవరణ కమీషన్‌ను నియమించింది. ఆ కమిటీ రిపోర్టు సమర్పించడానికి సాధారణంగా సంవత్సర కాలం పడుతుంది కాబట్టి మధ్యలో మధ్యంతర భృతి ఇవ్వడం ప్రతిసారీ ఆనవాయితీ, సర్వసామాన్యం. ఆ సందర్భంలోనే గత ప్రభుత్వం జీవో నెం.21 ద్వారా తేది.18.2.2019న 20శాతం మధ్యంతర భృతిని మంజూరు చేస్తూ 1.7.2018 నుంచి నోషనల్‌గానూ, 1.04.2019 నుంచి నగదుగా చెల్లించడానికి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత వారిచ్చిన హామీ ప్రకారం మధ్యంతర భృతిని పెంచుతూ జీవో ఇచ్చినా దానిని 1.7.2019నుంచి అమలయ్యే విధంగా ఇచ్చారు. దానిలో పింఛనుదార్ల ప్రస్తావన అసలు రాలేదు. దానివలన జీవో నెం.21ను రద్దుపరచినట్లుగా భావించి ఉద్యోగులలో ఆందోళన జరుగుతుంది, అనేకమైన అనుమానాలకు దారితీస్తుంది. పాత జీవోను రద్దుపరచడంవలన మూడు నెలల కాలంలో రిటైరైన ఉద్యోగులకు లక్ష రూపాయల మేర నష్టం జరుగుతున్న విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందా? అదే కాకుండా మధ్యంతర భృతి 20శాతం నుంచి 27శాతానికి పెంచడం వలన ఏడు శాతం పెరిగినట్లు కనపడుతున్నది కానీ ఒకసారి మనం లెక్కిస్తే ఏప్రిల్ 2019 నుంచి డిసెంబర్ 2019వరకు వచ్చే మొత్తానికి జూలై 1, 2019 నుంచి 27శాతం మధ్యంతర భృతి లెక్కిస్తే ఉద్యోగులకు చాలా నష్టం కలుగుతున్నది. ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.30వేల నుంచి రూ.90వేల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 20శాతం మధ్యంతర భృతి ఇస్తే ఉద్యోగులు సంతృప్తి చెందుతారు. ఉద్యోగుల ఆందోళన తగ్గించినవారవుతారు. అదే కాకుండా మధ్యంత భృతి 1.7.2019 నుంచి ఇవ్వడంవలన పీఆర్సీ అమలు కూడా 1.7..2019నుంచి అమలుచేస్తే దాదాపు సంవత్సరం కాలం వచ్చే వేతన సవరణ ప్రయోజనం ఉద్యోగులు కోల్పోతారు. మీద్వారా మంత్రిగారిని రెండు ప్రశ్నలు అడుగుతున్నాను. పింఛనుదార్ల ప్రస్తావన లేదు కాబట్టి వారికి మధ్యంతర భృతి ఇచ్చే ఆలోచనా ఉందా, లేదా? గత మూడు నెలలనుంచి సుమారు మూడు వేల నుంచి అయిదు వేల మంది ఉద్యోగులు రిటైరయ్యారు. వారు లక్షలాది రూపాయలు నష్టపోతారు కాబట్టి వారికి కాంపెన్సేషన్‌గా ఇచ్చే ఉద్దేశం ఏమైనా ఉందా? ఉద్యోగులందరూ చాలామంది ఈ ప్రభుత్వానికి అనుకూలంగా

ఓటువేశారనేందుకు ఆధారాలున్నాయి కాబట్టి మీరు వారికి ద్రోహం చేస్తున్నారనే విషయాన్ని గమనించారా అని మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, గౌరవసభ్యులు గత ప్రభుత్వ కాలంలో పాలకవర్గంలో ఉన్నారు. ఈ అంశంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు గానీ, వారు జారీ చేసిన జీవోలు గానీ, గత ప్రభుత్వానికి ప్రభుత్వోద్యోగుల పట్ల, వారి విధినిర్వహణపట్ల, వారి బాగోగులపట్ల ఉన్న చిత్తశుద్ధి వారికి తెలిసే ఉండాలి. బహుశా ఆ జీవోలు గౌరవసభ్యుల వద్ద లేవేమో, నేను ఒకసారి చదివి చెబుతాను. గత ప్రభుత్వం జీవో నం.21 తేది.18.2.2019న జారీ చేసినపుడు వారి ప్రభుత్వమే అధికారంలో ఉంది.

ఉ.10.50

20 శాతం ఐ.ఆర్. అది కూడా తేది.01.04.2019 నుంచి అంటే ఫిబ్రవరిలో జీ.ఓ. ఇచ్చారు. ఏప్రిల్ నుంచి అమలు చేస్తున్నామని చెబుతూ నగదు మాత్రం జూన్‌లో ఇస్తామన్నారు. ఫిబ్రవరిలో 20 శాతం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఏప్రిల్ నుంచి with effect అని చెబుతారు. కానీ పేమెంటు జూన్ నుంచి జరుగుతుంది. మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు వస్తున్నాయని ఎవరికైనా తెలియని వాళ్లున్నారా? జూన్ నుంచి అప్లికబుల్. అంటే వాళ్ల ఉద్దేశం ఏమిటి? ఏదీ కూడా వాళ్లకు సంబంధం లేకుండా వచ్చే ప్రభుత్వం ఎవరైతే ఉన్నారో వాళ్ల తలకాయ మీద పెట్టేద్దామనే ఉద్దేశం తప్ప ఇందులో వేరే ఉద్దేశం ఏమైనా ఉందా? జీ.ఓ.ఎం.ఎస్.నెం.21, తేది.18.02.2019న ఇచ్చారు. ఇదీ వాళ్లకున్న చిత్తశుద్ధి. ఫిబ్రవరిలోనే ఐ.ఆర్. అమలు చేయాలంటే ఎవరైనా ఆపారా? మార్చిలో అమలు చేయాలంటే వాళ్లను ఎవరైనా ఆపారా? అదేవిధంగా జి.ఓ.ఎం.ఎస్.నెం.30, తేది.21.02.2019 న అంటే మరలా మూడు రోజులకి ఇచ్చారు. అది కూడా సేమ్. 20 శాతం ఇచ్చారు. తేది.01.04.2019 నుంచి అమలవుతుందని ఇచ్చారు. అది payable in the month of June, 2019 అని ఇచ్చారు. ఇది ఎట్లా ఉందంటే మనం కిరాయికి ఒక ఇంట్లో ఉంటాము. ఇంట్లో ఉన్నంతసేపు కరెంటు బిల్లులు కట్టేది లేదు. దానికి ప్రాపర్టీ ట్యాక్సు కట్టేది లేదు. దానికి మునిసిపాలిటీ ట్యాక్సు కట్టేది లేదు. పోయే ముందు మాత్రం వచ్చేవాడు ఎవరైతే ఉన్నారో వాళ్లు ప్రాపర్టీ ట్యాక్సు కట్టాలి అని మనం హుకుం జారీ చేసి పోతాము. వచ్చేవాడు ఎవరైతే ఉన్నారో వాళ్లు కరెంటు బిల్లులు కట్టాలి. వచ్చేవాడు ఎవరైతే ఉన్నారో దీనికి మరమ్మతులు చేయాలి. ఇది సమంజసమా? వాళ్లకు చిత్తశుద్ధి ఉందా అని స్పష్టంగా అడుగుతున్నాను. చిత్తశుద్ధి ఉంటే వాళ్లను ఎవరైనా ఆపారా? ఫిబ్రవరి నుంచే ఎఫెక్ట్ చేయాలనుకుంటే ఎవరైనా ఆపారా? రెండవ పాయింటు గౌరవ సభ్యులు అడిగినట్లుగా పింఛనుదారులకు తొందరలోనే ఇవ్వబోతున్నాము. తొందరలోనే పింఛనుదారులకు రాబోతున్నది. రెండవది చాలా నష్టం అంటున్నారు. వాస్తవానికి నేను గౌరవ సభ్యులకు మీద్వారా తెలియచేస్తున్నాను. PRC effect date కి, IR effect date కి సంబంధం లేదు. IR effect date ఏది ఉన్నప్పటికీ కూడా PRC effect date ఏది ఉన్నప్పటికీ కూడా IR ఏదైతే

ఉందో అది ఫైనల్‌గా PRC ఎప్పుడైతే ఫైనలైజ్ అవుతుందో దాంట్లో set off కాబోతుంది కాబట్టి దీంట్లో నష్టం జరిగే పరిస్థితి ఏమీ లేదు.

డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA SWAMY)(కొండేపి): అధ్యక్షా, PRC అనేది IR ఇచ్చినప్పటి నుంచీ అమలవుతుంది. దీనిలో గత ప్రభుత్వం ఇచ్చిన జీ.ఓ.ప్రకారం తేది.01.07.2018 నుంచి నోషనల్‌గా అమలు చేస్తామని చెప్పారు. PRC ఇచ్చినట్లైతే ఆ తేదీ నుంచి అమలు అవుతుంది. దానివలన ఉద్యోగస్తులకు ఉపయోగపడుతుంది. ఈ మధ్య కాలంలో రిటైర్ అయిన ఉద్యోగస్తులకు వచ్చే అవకాశముంటుంది. దానితోబాటు ప్రభుత్వం కొత్త జీ.ఓ.ఇచ్చేటప్పుడు పాత జీ.ఓ.ను రద్దుపరుస్తున్నట్లుగా ఇవ్వలేదు. గత ప్రభుత్వం జీఓ ఇచ్చినప్పుడు ఎన్నో ఆశలతో ఉద్యోగస్తులు కొన్ని వేల మంది ఈ మూడు నెలల్లో రిటైర్ అయ్యారు. వాళ్లకు ఇది వర్తించడం లేదు. వాళ్లకు కూడా IR వర్తింపచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందా, PRC ని 2018 నుంచి అమలు చేస్తారా అని మంత్రి గారిని మీద్వారా ప్రశ్నిస్తున్నాను.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, ఇంతకు ముందే నేను చెప్పడం జరిగింది. వాళ్లకేమో ప్రభుత్వ ఉద్యోగుల పట్ల శ్రద్ధ లేదు. చిత్తశుద్ధి లేదు. వాళ్లకు అన్ని అధికారాలున్నప్పుడు మాత్రం వాళ్లేమీ చేయరు. కానీ అధికారంలోకి వచ్చి కేవలం 30 రోజులు మాత్రమే దాటిన ప్రభుత్వం మీద విపరీతమైన ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వాళ్లకు చాలా మమకారం ఉన్నట్లుగా, అభిమానం ఉన్నట్లుగా ప్రతీ ఒక్క ప్రశ్న వేస్తున్నారు. దీనికి సంబంధించి ఏదైనా చిన్నదో, పెద్దదో ఒక పాలసీ నిర్ణయం తీసుకునేటప్పుడు వ్యవహారాలు వస్తే ఆ సమయాన్ని, ఆ అవసరాన్ని బట్టి కచ్చితంగా ఏదైనా ఈ ప్రభుత్వం పాజిటివ్‌గానే ఆలోచన చేస్తుంది తప్ప వాళ్ల మాదిరిగా బాధ్యతను భుజాల మీద నుంచి కింద పడేసే పద్ధతి మాకు లేదు. అధ్యక్షా, IR కూడా ఒక నెల కాలంలోనే ప్రకటించాము. అది కూడా 20శాతం కాదు, 27శాతం IR ప్రకటించాము. ఉద్యోగుల బాగోగుల కోసం అది ప్రకటించామని తెలియచేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: ఇప్పటికే చాలా సమయమైంది. The remaining questions are postponed.

Now, paper included in the agenda is deemed to have been laid on the Table of the House.

PAPER LAID

1. “A copy of the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Ordinance, 2019 (A.P.Ordinance No.3 of 2019), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.”

వాయిదా తీర్మానం

రాష్ట్రంలో ఇసుక కొరత గురించి శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి గారు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

(టిడిపి సభ్యులచే సభకు అంతరాయం)

వాయిదా తీర్మానాన్ని తిరస్కరించాను. You please come in a different form.

Now tea break.

(The House then adjourned at 10.56 a.m.)

ఉ.11.30

(After Tea break the House re-assembled at 11.35am)
(Hon'ble Speaker in the Chair)

GOVERNMENT BILL

THE ANDHRA PRADESH ELECTRICITY LAWS (ANDHRA PRADESH AMENDMENT) BILL, 2019.

MR.SPEAKER: I shall now request the Minister for Energy to move the motion for introduction of the Andhra Pradesh Electricity Laws (Andhra Pradesh Amendment) Bill, 2019.

SRI.BALINENI SRINIVAS REDDY (MINISTER FOR ENERGY, FOREST, ENVIRONMENT, SCIENCE & TECHNOLOGY): Sir, I beg to move:

"That leave be granted to introduce the Andhra Pradesh Electricity Laws (Andhra Pradesh Amendment) Bill, 2019."

MR.SPEAKER: Motion moved. Now, the question is:

"That leave be granted to introduce the Andhra Pradesh Electricity Laws (Andhra Pradesh Amendment) Bill, 2019."

(PAUSE)

The Motion was adopted and the Bill was Introduced.

మిస్టర్ స్పీకర్ : ఇప్పుడు బడ్జెట్ మీద డిస్కషన్. మొన్న జరిగిన చర్చలో బుచ్చయ్య చౌదరిగారు 40 నిమిషాలు మాట్లాడారు. శ్రీ ధర్మాన ప్రసాదరావుగారు 40 నిమిషాలు మాట్లాడారు. శ్రీ అంబటి రాంబాబు గారు 55 నిమిషాలు మాట్లాడారు. కాబట్టి సమయ లభ్యతను బట్టి సభ్యులకు సమయాన్ని కేటాయించడం జరుగుతుంది. మీకు (టీడీపీ పార్టీని ఉద్దేశించి) మొత్తం 57 నిమిషాలు వచ్చింది, ఆ

సమయంలో దాదాపు అయిపోయింది. కేవలం 8 నిమిషాలు మాత్రమే ఉంది. మాట్లాడండి చూద్దాం. పార్థసారథిగారూ..

శ్రీ కొలుసు పార్థసారథి (SRI KOLUSU PARTHASARATHI)(పెనమలూరు): అధ్యక్షా మా ప్రియతమనేత జగన్మోహన్‌రెడ్డి గారి నాయకత్వంలో మా ఆర్థికశాఖామంత్రి శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్‌గారు ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద మాట్లాడే అవకాశాన్ని కల్పించినందుకు మీకు ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. మా ముఖ్యమంత్రిగారు గడచిన అయిదు సంవత్సరాల్లో ఎప్పుడూ ఒకటే చెబుతూ ఉండేవాళ్లు. మనం ఏదైతే చేయగలమో అదే ప్రజలకు చెప్పాలి తప్ప అధికారం కోసం మోసపూరితమైన మాటలు చెప్పొద్దని ప్రతిసారి చెప్పేవారు. మాలో చాలా మందిమి అనుకునేవాళ్లం. ఏంటీ జగనన్న ఇట్లా అంటున్నారు ముందు మనం అధికారంలోకి రావాలి కదా! చంద్రబాబు నాయుడుగారిని చూడండి, రైతు ఋణమాఫీ అన్నాడు, మహిళా ఋణమాఫీ అన్నాడు ఇప్పుడు చేస్తున్నాడా - మనం కూడా అట్లాగే చేద్దామని చాలా మందిమి అనుకునేవాళ్లం. ఎదురుగా చెప్పే ధైర్యం లేకపోయినా వెనకాల అనుకుంటుండేవాళ్లం. కానీ ఆయన మాత్రం ఏ రోజూ కూడా అధికారంలోకి రావడం కోసమే మనం హామీలను ఇవ్వాలనే దృకథంతో, ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఏ ఒక్క రోజు ఆ విధంగా ఆలోచించకపోవడం జగన్‌మోహన్‌రెడ్డిగారి ప్రత్యేకత అని మీ అందరికీ మనవి చేస్తున్నాను. ఎవరు అధికారంలో ఉన్నా బడ్జెట్ ఫిగర్స్ ఒక పది పర్సెంట్ లేక ఇరవై పర్సెంట్ అటు ఇటు మారతాయోమో గానీ ఎప్పుడు ఒకే విధంగా ఉంటాయి. కానీ ఈ అంకెలను ఎవరికి కేటాయించాలి? ఎవరికి వినియోగించాలి? ఏ విధంగా ఖర్చు పెట్టాలి? ఏ వర్గాలకు మేలు చేయాలనేది నాయకుడి యొక్క మనస్థత్వం మీద నాయకుడి యొక్క దృక్పథం మీద ఆధారపడి ఉంటుందని మీకందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఇంతకుముందు చంద్రబాబు నాయుడుగారు మాట్లాడారు. ఎంతసేపు ఆయన పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామిక వేత్తల మీటింగులని కాలయాపన చేశారు. ఆయన ఎంతసేపు స్విట్జర్లాండు, థావోసు లేక జర్మనీ అని మాట్లాడారు గానీ, ఈ రాష్ట్రంలో రైతులు ఏమైపోతున్నారు? ఈ రాష్ట్రంలోని బలహీన వర్గాలు, దళితుల పరిస్థితి ఏమిటి? మైనారిటీల పరిస్థితి ఏమిటని ఆలోచించకపోవడం వలన గత అయిదు సంవత్సరాల్లో ఈ అణగారిన వర్గాలు, రైతు వర్గమంతా తీవ్రమైన అన్యాయానికి గురైందని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఉ 11.40

అధ్యక్షా, చంద్రబాబు నాయుడు గారిని నేను ఈ ఎనిమిది రోజుల నుంచి చూశాను. చంద్రబాబు నాయుడు గారు మాట్లాడితే నలభై సంవత్సరాల అనుభవం ఉంది, నీకు నా అనుభవమంత వయస్సు లేదు అని, ఇంకా ఏదేదో చెబుతూ జగన్మోహన్ రెడ్డి గారిని ఉద్దేశించి మాట్లాడారు.

శ్రీ వి.జోగేశ్వర రావు: సార్ ఇది బడ్జెట్ ప్రసంగమా.......

శ్రీ కొలుసు పార్థసారథి (**SRI KOLUSU PARTHASARATHI**): వినండి సార్. చంద్రబాబు నాయుడు గారు ప్రతి సందర్భంలో అలాంటి మాటలు అంటుంటారు. నేననేది పరిపాలనకు కావల్సింది కేవలం అనుభవమే కాదు, ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల, పేద వర్గాల సమస్యల పట్ల సానుభూతి కావాలని నేను భావిస్తున్నాను. చంద్రబాబు నాయుడు గారిలో అటువంటి సానుభూతి లోపించడం మూలంగా గత ఐదు సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్రంలోని పేదవర్గాలన్నీ తీవ్రంగా నష్టపోయాయని నేను మీకు మనవి చేస్తున్నాను. పేదవర్గాలే కాదు, ఆయన స్వార్థపూరిత ఆలోచనలు మూలంగా కానివ్వండి లేకపోతే ఆయన తప్పుడు విధానాల మూలంగా కానివ్వండి ఈ రాష్ట్రం కూడా నష్టపోయిందని నేను మీ అందరికీ మనవి చేస్తున్నాను. ఈ బడ్జెట్ ముఖ్యమంత్రి, శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి ఆలోచనా సరళి కానివ్వండి, వారి తండ్రి గారైన డా. వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారి దగ్గర నుంచి వారసత్వంగా వచ్చిన పేదల పట్ల సానుభూతి కానివ్వండి, రాష్ట్రంలో సంవత్సరం పాటు **3,648** కిలోమీటర్ల దూరం వారు చేసిన పాదయాత్ర ద్వారా ఆయన తెలుసుకున్న సమస్యల మూలంగా కానివ్వండి, ఈరోజు ప్రజలకు ఏవైతే హామీలిచ్చారో, వాటినన్నింటిని అమలు చేసే దిశలో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టబడిందని నేను మనవి చేస్తున్నాను. ప్రత్యేకంగా ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తిగా నేను వారికి మరియు ఆర్థిక శాఖ మంత్రి గారికి కూడా ధన్యవాదాలను తెలియజేస్తూ అభినందిస్తున్నాను. ఎందుకంటే, ఈ బడ్జెట్ పేద వర్గాలకే కాకుండా బీ.సీలు, ఎస్సీల దృష్ట్యా చూస్తే, చరిత్రలో ఎవరూ కూడా ఇటువంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదని నేను మనవి చేస్తున్నాను. బలహీన వర్గాల గురించి ఇంతగా ఆలోచించిన వ్యక్తి ఎవరూ ఉండరు. మీకూ తెలుసు ఈ దేశంలో **50%** మంది బలహీన వర్గాలున్నారు. దురదృష్టమేమంటే, రాజ్యాంగపరంగా, ఈ తరగతులకు ఎటువంటి ప్రొటెక్షన్ లేదనేది మీకూ తెలిసిన విషయమే. ప్రతి ఒక్క రాజకీయ పార్టీ కూడా ఎన్నికలు రాగానే బలహీన వర్గాలని ఉద్దేశించి ఉపన్యాసాల్లో వాళ్లకేదో తాయిలాలు ప్రకటించి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నం చేశాయే గానీ వారి జీవితాల్లో ఏ విధంగా మార్పు తీసుకురావాలనే దిశగా ఏ రోజు కూడా ఆలోచించలేదు. మాట్లాడితే మేం సబ్సిడీ ఋణాలను బలహీనవర్గాలకు ఇచ్చాం, ఇస్త్రీ పెట్టెలిచ్చాం, మేం రెండు గొర్రెలను ఇచ్చామని చెప్పుకుని సమయపాలన చేశారు తప్ప ఎక్కడా కూడా వాళ్ల జీవితాల్లో మార్పు రావాలంటే ఏమి చేయాలని ఏ రాజకీయ పార్టీ కూడా ఆలోచించకపోవడం వల్ల బీ.సీ.లకు తీవ్ర నష్టం జరిగింది. కానీ, జగన్మోహన్ రెడ్డి గారి ఆలోచన విధానం రాజశేఖరరెడ్డి గారి దగ్గర్నుంచి మొదలైంది. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి కాగానే ఆయన ప్రవేశపెట్టి అమలుచేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం కానివ్వండి, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కానివ్వండి, వాటి మూలంగా ఏ విధంగానైతే బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందో, అదే విధంగా ఈరోజు జగన్మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన బడ్జెట్ మూలంగా కూడా గొప్ప మార్పులు రాబోతున్నాయని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మొన్న బుచ్చయ్య చౌదరి గారు మాట్లాడుతూ, బడ్జెట్ బుక్‌ను చూపించి ఇదేదో వైఎస్.ఆర్.సి.పి. మేనిఫెస్టో లాగా ఉందని చెప్పారు. అంటే టి.డి.ఎల్.పి.లో బడ్జెట్ బుక్ యొక్క కవర్

పేజీ గురించి ఆలోచించారు, చర్చించారు గానీ, దాంట్లో బలహీనవర్గాలకు ఎప్పుడూ లేని విధంగా ఏ విధంగా మేలు జరిగిపోతుందని చర్చించకపోవడం వాళ్ల భావదారిద్ర్యానికి మచ్చుతునక అని మీకు మనవి చేస్తున్నాను. బలహీనవర్గాలకు తెలుగుదేశం పార్టీ పదహేను సంవత్సరాల ప్రభుత్వ పాలనలో కానివ్వండి, లేకపోతే అంతకు ముందు సాగిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో కానివ్వండి, ఎవరూ ఆలోచించని రీతిలో జగన్మోహన్ రెడ్డి గారు ఆలోచన చేసిన విషయం మనందరికీ తెలిసిందే. మొత్తం మీద ఈ బడ్జెట్ జగనన్న ఆలోచనా ధోరణికి, ఆయనకు బలహీన వర్గాల పట్ల ఉన్న కమిట్‌మెంట్‌కు అద్దం పడుతోంది. ఏదైతే గత ఎన్నికల్లో ప్రజలకు హామీలిచ్చారో వాటన్నింటినీ అమలుచేసే దిశగా మొట్ట మొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమనేది చాలా సంతోషించదగ్గ విషయం.

అధ్యక్షా, ఒకసారి బీ.సీల పరంగా చూస్తే, ఎన్నికలకు ముందు బీ.సీ. గర్జనలో జగన్మోహన్ రెడ్డి గారు ఏ విధంగానైతే చెప్పారో, వాటినన్నింటిని అమలుచేసేందుకు అవసరమైన బడ్జెట్‌ను దాదాపు **80%-90%** వరకు కేటాయించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఇందాక బీ.సీల గురించి చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలు కూడా బీ.సీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలని గురించి ఊకదంపుడు ఉపన్యాసాలతో మాత్రమే సమయం గడిపాయి గానీ ఎక్కడ కూడా జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో జరిగిన స్టడీ కానివ్వండి, అసలు బలహీనవర్గాల సమస్యలేమిటి, బలహీనవర్గాలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలేమిటి, ఏమి చేస్తే ఆ వర్గాలకు మేలు జరుగుతుందనే ఆలోచన చేసింది జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలోని వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని నేను స్పష్టంగా చెప్పగలను. ఎందుకంటే, గతంలో మీరు కూడా వేరే రాజకీయ పార్టీలో ఉన్నారు. అలాగే నేను కూడా వేరే రాజకీయ పార్టీలో ఉండేవాడిని. కానీ, ఏ పార్టీ కూడా బలహీన వర్గాల అభ్యున్నతి గురించి, ఆ వర్గాల సంక్షేమం గురించి ఒక కమిటీని ఏర్పాటుచేసి ప్రతి నియోజకవర్గానికి వెళ్లి ఆయా నియోజకవర్గాల్లో ఉన్న బలహీన వర్గాలెవరు? మనకు కొన్ని తెలియని పేర్లు కూడా బలహీన వర్గాల్లో ఉన్నాయి. వాళ్లందరినీ ఒక చోటకు చేర్చి ఏమిటి మీ సమస్య? ఏమి చేస్తే మీ జీవితాలు బాగుపడతాయనే ఒక సమాచారాన్ని మొత్తం తీసుకువచ్చి, ఒక రిపోర్ట్ తయారు చేయించి దాని ఆధారంగా బీ.సీ. గర్జన సమావేశాన్ని జగన్మోహన్ రెడ్డి గారు ఏర్పాటుచేసి దాంట్లో చెప్పారు. బీ.సీ.లకు యేటా రూ. **15** వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు ఇస్తామని చెప్పారు. పక్కాగా బి.సి. ఉప ప్రణాళిక అమలుచేస్తాం, బి.సీల్లో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తామని చెప్పారు. మొన్న ఎవరో మాట్లాడితే నేను విన్నాను. ఏమిటి ఈ కార్పొరేషన్లు అని కానీ, వాళ్లకు ఏమి అర్థమవుతుంది? బలహీన వర్గాల మనోభావాలేమిటో, బలహీన వర్గాలు ఏ విధంగా సమాజంలో అవమానాలు పడుతున్నారనేది వాళ్లకు అర్థం కాదు కాబట్టి ఈ **139** కార్పొరేషన్లు కూడా వాళ్లకేదో పిచ్చి కాగితాల్లాగా అర్థమవుతుంది. వాళ్లకు సమాజంలో అవమానాలు ఎదుర్కొంటే గానీ అర్థం కాదు. ఎందుకంటే, ఈ బడ్జెట్ ప్రజల హృదయాలు తెలిసిన ఒక వ్యక్తి ప్రవేశపెట్టిన బడ్జెట్ గానీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదు. ఏదైతే చంద్రబాబు నాయుడు గారు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అని అనుకుంటాడో అటువంటి

వ్యక్తి ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అదే విధంగా 139 కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు ఇస్తామని అన్నారు. బి.సి.లకు రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీలకు నామినేటెడ్ పదవుల్లో **50%** రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. ఎప్పుడైనా మనం ఊహించామా? నేను ఇంత అసెంబ్లీలో చెబుతున్నాను, ప్రజావేదికల మీద బి.సి.ల గురించి, ఎస్సీల గురించి మాట్లాడతాను గానీ నియోజకవర్గానికి వచ్చేసరికి ఎక్కడో ఒక చిన్న భయం. మొత్తం బి.సీలకిస్తే, రేపొద్దున ఎన్నికల్లో మాకు సపోర్ట్ చేయరేమోననే భయం కల్గుతుంది. కానీ, ధైర్యంగా బి.సి.లకు ఇదొక హక్కు, చట్ట సభలు ప్రక్కన పెట్టండి. అన్నీ నామిటెడ్ పదవుల్లో కూడా బి.సీ.లకు **50%** రిజర్వేషన్ ఇవ్వాలని చెప్పిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(హర్షాధ్వానాలు)

అంతేకాదు, కాంట్రాక్టుల్లో కూడా రిజర్వేషన్లు ఇవ్వొచ్చని మీరు గానీ, నేను గానీ ఎప్పుడైనా ఊహించామా? మీరు ఆరు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. చాలా సీనియర్ శాసనసభ్యులు. మా తండ్రి గారితో సభలో ఉన్నారు. డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారి హయాంలో కూడా సభలో ఉన్నారు. ఎప్పుడన్నా కనీసం అసెంబ్లీ లాబీల్లో గానీ, రాజకీయ నాయకుల మధ్య గానీ, ఏ రోజైనా చర్చ జరిగిందా? కాంట్రాక్టు పనుల్లో కూడా బి.సి.లకు, దళితులకు **50%** రిజర్వేషన్ ఇవ్వాలనే ప్రస్తావన వచ్చిందా? కానీ, ఈరోజు ఆ విధానాన్ని మా జగనన్న తీసుకువచ్చారు. దానికి నిజంగానే ప్రతి బి.సి. నిరుద్యోగ యువకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ, నమస్కారాలు తెలియజేస్తున్నారు.

(హర్షధ్వానాలు)

ఎందుకంటే, మీ అందరికీ కూడా తెలుసు. అందరు ఎమ్మెల్యేలు నామినేషన్ పద్ధతిన కొన్ని కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులను మనం మన పార్టీ కార్యకర్తలకు ఇస్తుంటాం. కార్యకర్తలకు గానీ, అభిమానులకు కానీ కాంట్రాక్టు పనులను ఇస్తుంటాం. కానీ, ఎక్కడ కూడా బి.సీ.లకు ప్రత్యేకంగా కాంట్రాక్టు పనులను ఇద్దామంటే అవకాశం ఉండదు. ఉదాహరణకు మన పరిధిలో ఒక గ్రామం ఉంటుంది. ఆ గ్రామానికి వెళ్లగానే మనకు ఐదు సంవత్సరాల పాటు రాజకీయంగా ఎవరో ఒక అగ్రవర్ణాల వాళ్లో మరొకరెవరో మనకు ఉపయోగపడి ఉంటారు. ఆ పరిస్థితుల్లో వాళ్లను కాదని బలహీన వర్గాలకు ఇచ్చే ఆలోచన మనం చేయలేం. ఒకవేళ మనం బలహీన వర్గాల గురించి ఆలోచన చేసినా కూడా కాంట్రాక్టు పనులను ఇవ్వలేని పరిస్థితి గతంలో ఉండేది. కానీ, అటువంటి పరిస్థితుల్లో ఆయా వర్గాలకు అన్యాయం జరుగుతూ వస్తుంది. ఈరోజున మనకు స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 70 సంవత్సరాలైంది. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ బలహీన వర్గాలకు సంబంధించిన ఇదిగో ఒక కాంట్రాక్టరున్నాడు, లేదు ఒక పెద్ద పారిశ్రామికవేత్త ఉన్నాడని చెప్పుకోలేని పరిస్థితుల్లో ఈరోజున ఈ 70 సంవత్సరాల తర్వాత కూడా మనం ఉన్నాం. దీనికి కారణం ఈ వర్గాల వారికి ప్రభుత్వం తరఫున గానీ, రాజకీయ నాయకుల తరఫున గానీ ఎటువంటి అండదండలు లేకపోవడం మూలంగా ఇటువంటి పరిస్థితి వచ్చింది. ఈరోజు ఏదైతే జగన్మోహన్ రెడ్డి గారు నామినేషన్ పద్ధతిన ఇచ్చే కాంట్రాక్టు పనుల్లో కూడా **50%** రిజర్వేషన్ కల్పిస్తానన్నారో, తద్వారా కొన్ని వేల మంది నిరుద్యోగ యువతీ – యువకులకు ఈ కాంట్రాక్టు పనుల

ద్వారా ఎంతో కొంత ఉపాధి లభిస్తుంది. దీంట్లో ఎంతో కొంత మంది పైస్థాయికి వెళ్లి మొత్తం బి.సి, ఎస్సీ, ఎస్టీ సమాజం అభివృద్ధి చెందే అవకాశం ఉందనే విషయాన్ని నేను ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ ఎప్పుడు కూడా చెప్పుకుంటూ ఉంటుంది. బి.సి.లంతా మా ఓటు బ్యాంకు. బి.సి.లు మాకే ఓటు వేస్తారు. బి.సి.లు ఇంకెవరికీ ఓటు వేయరని వాళ్లు చెప్పుకుంటూ బి.సి.లు వాళ్ల ఓటు బ్యాంకుగా భావిస్తుంటారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ మనుగడ సాధిస్తుందంటే అది ఎన్.టి.రామారావు గారి ఫోటో, వాళ్లకు బలహీనవర్గాల అండ మూలంగా ఇన్ని రోజులు సాగింది.

ఉ 11.50

అధ్యక్షా, ఈరోజు తెలుగుదేశం పార్టీ మనుగడ సాధిస్తుందీ అంటే అది ఎన్.టి. రామారావుగారి ఫోటో, వాళ్లకు బలహీనవర్గాల అండ మూలంగా ఇన్ని రోజులూ నడిచింది. రాజశేఖరరెడ్డిగారు వచ్చిన తర్వాత రాజశేఖరరెడ్డిగారు ఏదైతే కార్యక్రమాలు చేశారో, ఫీజు రీయింబర్స్‌మెంట్ కానివ్వండి, లేదా ఆరోగ్యశ్రీ కానివ్వండి, వీటి మూలంగా బలహీనవర్గాల్లో చాలా మార్పు వచ్చి వారంతా రాజశేఖరరెడ్డిగారి నాయకత్వం పట్ల ఆకర్షితులయ్యారు. మరి ఇన్ని సంవత్సరాలు బీసీలు, ఎస్సీలు అని చెబుతున్న తెలుగుదేశం పార్టీ ఈ 5 సంవత్సరాల్లో చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో బడ్జెట్లను చూస్తే 2014-15లో రూ.6,001 కోట్లు కేటాయిస్తే వాళ్లు ఖర్చు పెట్టింది రూ.4,224 కోట్లు. అంటే 30శాతం కోత విధించేశారు. అదేవిధంగా కాపిటల్ ఎక్స్‌పెండీచర్ క్రింద రూ.1274 కోట్లు కేటాయిస్తే, రూ.500 కోట్లు ఖర్చు పెట్టారు. అంటే 61 శాతం కోత.

అదేవిధంగా 2015-16 తీసుకుంటే రూ.6,656కోట్లు కేటాయించారు. కానీ రూ.5,600 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 16 శాతం కోత. ఈ విధంగా ప్రతీ సంవత్సరం కూడా కోతలు కోసుకుంటూ ఆఖరికి 2018-19లో రూ.13,099 కోట్లు కేటాయించారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ వాళ్లు ఏమి చెప్పారు? మేము అధికారంలోకి రాగానే బీసీ సబ్‌ప్లాన్‌ను తీసుకొస్తాము, సంవత్సరానికి రూ.10,000 కోట్లు ఇస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ ఏ ఒక్క సంవత్సరం అయినా సరే బీసీలకు ఆ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించారా అని నేను ప్రశ్నిస్తున్నాను. ఏ ఒక్క సంవత్సరం కూడా. అంటే 5 సంవత్సరాల్లో రూ.50,000 కోట్లు ఇవ్వాల్సిన వాళ్లు మొత్తం 5 సంవత్సరాలు తీసుకుంటే కనీసం రూ. 16,000 కోట్లు కూడా ఇవ్వకుండా బీసీలకు వెన్నుపోటు పొడిచారని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను. ఆఖరికి, ఎన్నికల సంవత్సరంలో రూ.13,099 కోట్లు కేటాయించి రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం రూ.5,334 కోట్లు ఖర్చు పెట్టారంటే ఎంత సిగ్గుచేటో ఒకసారి ఆలోచించమని కోరుతున్నాను. అంటే 60శాతం కోత విధించారు. ఈరోజు మా ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డిగారి నాయకత్వంలో

బలహీనవర్గాలకు రూ.13,674కోట్లు కేటాయించి బలహీనవర్గాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధంగా మేము ఈరోజు ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాము.

అంతేకాదు, ఏదైతే ఎన్నికల ముందు చెప్పామో, దానిలో ప్రతీదీ కూడా అమలుచేసే విధంగా కూలంకుషంగా, ఏదో వేగ్‌గా కాకుండా, ఇన్ని కోట్లు ఇస్తున్నాము అని కాకుండా ప్రతీ కులానికి కూడా ఏవిధంగా మేలు చేయాలనే విధంగా ఆలోచించాము. బలహీనవర్గాలకు రూ.15,000కోట్లు కేటాయిస్తామని చెప్పాము. సబ్‌ప్లాన్‌కు రూ.15,000 కోట్లు కేటాయిస్తామని ఆరోజు ప్రకటించాము. 5 సంవత్సరాల్లో రూ.75,000కోట్లు కేటాయిస్తామని ఆరోజు జగన్మోహన్‌రెడ్డిగారు ప్రకటించారు. దానికి అనుగుణంగా బీసీ సబ్‌ప్లాన్ ప్రకారం బీసీ సంక్షేమానికి, ఇందాక సంక్షేమం గురించి చెప్పాను. బీసీ సంక్షేమం కానివ్వండి, అభివృద్ధి కానివ్వండి, రూ.15,061 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ దేశంలో ఏదైనా ఉందీ అంటే అది జగన్మోహన్‌రెడ్డిగారి ప్రభుత్వమే అని నేను మనవి చేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

ఈ రాష్ట్రంలో ఉన్న బలహీనవర్గాల వారందరూ జగన్మోహన్‌రెడ్డిగారిని అభినందిస్తున్నారు. అంతేగాకుండా ప్రతీ కులానికి కూడా మేలు చేయాలనే ఆలోచన చేశాము.

అధ్యక్షా, నాయి బ్రాహ్మణులకు సంవత్సరానికి రూ.10,000లు. ఈ సందర్భంగా ఒక్క విషయం మా నాయకుడికి కూడా గుర్తు చేయదలుచుకున్నాను. బీసీ గర్జనలో నాయి బ్రాహ్మణులకు, చేనేత కార్మికులకు ఏవిధంగా ఆర్థిక సహాయం చేసేది ప్రకటించారు. ఆ ఫ్లోలో కానివ్వండి, ఆ స్పీచ్‌లో కానివ్వండి రజకుల గురించి స్పెసిఫిక్‌గా చెప్పలేకపోయారు. తర్వాత జరిగిన మీటింగ్‌లో నేను మా ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకొస్తే, అయ్యో అట్లా జరిగిందా అని చెప్పిన వెంటనే రజకులకు కూడా రూ.10,000లు ఇస్తామని ప్రకటించారు.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

అంటే బలహీనవర్గాలకు చేయాలనే తాపత్రయం ఉన్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డిగారని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ సందర్భంగా నేను మరొక విషయాన్ని కూడా గుర్తుచేయదలుచుకున్నాను. గత సంవత్సరం దుర్గ గుడిలో పనిచేసే నాయి బ్రాహ్మణులందరూ "మాకు సరైన ఆదాయం రావడం లేదు, మంచి రోజుల్లో అయితే భక్తులు గుడికి వస్తే వాళ్లందరికీ క్షవరం చేయటం మూలంగా కొంత ఆదాయం

వస్తుంది, మంచి రోజులు కానప్పుడు అసలు ఒక్కళ్లు కూడా రారు, ఆరోజు మాకు ఎటువంటి ఆదాయం లేక మా కుటుంబాలు పస్తులుండే పరిస్థితిలు ఉన్నాయని" చెప్పి వాళ్లు ఒక ధర్నా చేశారు. ఆ ధర్నాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నేను కూడా అటెండ్ కావడం జరిగింది. పోలీసులతో వాళ్లమీద జులుం చేశారు. కొంతమందిని లాఠీలతో కొట్టించారు. ఆఖరికి మేము సాయంత్రం వరకూ ధర్నా చేసిన తర్వాత తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఒక మంత్రి సరే చర్చలకు రండి, అని చెప్పి సెక్రటేరియేట్‌కు పిలిపించారు. సరే, ఆ మంత్రిగారు మాట్లాడిన తర్వాత ముఖ్యమంత్రిగారు బయటికి వస్తుంటే చూసి వాళ్లందరూ ఎగబడ్డారు. అంటే ముఖ్యమంత్రిగారి దగ్గరికి వెళ్లి మన సమస్య చెప్పుకుందామని వాళ్లంతా కూడా అక్కడికి వెళ్లారు. ఏమి చేయాలి అధ్యక్షా? నిజంగా ప్రజల సమస్యల గురించి సానుభూతి ఉన్న ఏ నాయకుడైనా సరే చేసేది ఏంటి అధ్యక్షా? అవసరమైతే ఒక రెండు నిమిషాలు కారు ఆపి దిగి అయినా సరే మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకుని, దానిని ఏవిధంగా పరిష్కరించాలో సంబంధిత మంత్రినో, సంబధిత అధికారులనో పిలిచి చెప్పాల్సింది పోయి, ఏమన్నారో తెలుసా అధ్యక్షా? దేవాలయం లాంటి ఈ సెక్రటేరియేట్‌లోకి మిమ్మల్ని ఎవరు రానిచ్చారు అని అన్నారు. అంటే దేవాలయాల్లోకి బలహీనవర్గాల వారు రాకూడదని తెలుగుదేశం పార్టీ విధానమా?

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు షేమ్ షేమ్ అని అన్నారు)

ఆవిధంగా అనటమే కాకుండా మీ తోకలు కత్తిరిస్తాను, ఏంటి మీరు మాట్లాడేది అని గర్జించారంటే, ఆ నాయకుడికి బలహీనవర్గాలంటే ఎంత అసహనం ఉందో, బలహీనవర్గాల సమస్యలు అంటే ఎంత చులకన భావన ఉందో ఒక్కసారి ఆలోచన చేయమని తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులకు నేను మనవి చేస్తున్నాను. బలహీనవర్గాలు మీకేమైనా తాబేదార్లా? ఇన్ని సంవత్సరాలు... నిజంగా చెప్పాలి అధ్యక్షా. ఇన్ని సంవత్సరాలు నాయి బ్రాహ్మణులు తెలుగుదేశం పార్టీకి వెన్నెముక లాగా ఉన్నారు. మేము కూడా చాలామందిమి నియోజకవర్గాల్లో చూస్తుంటాం. వాళ్లు ఎప్పుడూ ఏమండీ మేము తెలుగుదేశమే అనేవాళ్లు కానీ ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా వచ్చేవాళ్లు కాదు. కానీ అటువంటి కమ్యూనిటీని, వాళ్ల న్యాయమైన సమస్యను, వాళ్లు ఏమి అడిగారు, పనిలేని రోజుల్లో మాకు కనీసం కుటుంబంలో తినటానికి కూడా లేదు. మాకు కనీస వేతనాన్ని ఎంతో కొంత, ఒక రూ.10,000, రూ.12,000, రూ.15,000 ఆర్థిక సహాయం చేయమని వెళితే మీ తోకలు కత్తిరిస్తాను, మిమ్మల్ని ఈ దేవాలయం లాంటి ఈ గుడిలోకి ఎవరు రానిచ్చారని అంటే తెలుగుదేశం పార్టీ యొక్క విధానం ఏమిటో ఒక్కసారి ఆలోచించమని మనవి చేస్తున్నాను.

అదేవిధంగా చేనేత కార్మికులకు ప్రతీ సంవత్సరం రూ.24,000లు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాము. అంతేగాకుండా బీసీ కార్పోరేషన్ ద్వారా బీసీ మహిళలకు. అందరూ చేనేత కార్మికులను తీసుకుంటే, ఆ మగ్గాలను తొక్కి, తొక్కి, మోచేతులు, మోకాళ్ళు అరిగిపోయి ఉంటాయి ఆ మహిళలకు,

అదేవిధంగా రజక సోదరులు, సోదరీమణులు ఉన్నారు. వాళ్లు పాపం మూటలను వీపు మీద వేసుకుని కాలువలకో, లేకపోతే దోబీఘాట్‌లకో వెళ్లి వాళ్లు జీవితాంతం ఉతికి ఉతికి అవయవాలన్నీ బలహీనపడే పరిస్థితిలో ఉంటారు. జగన్మోహన్‌రెడ్డిగారు వాళ్ల గురించి కూడా ఆలోచించారు. ఏదో ఒక పింఛను ఇచ్చేద్దాం, ఏదో ఒక సబ్సిడీ లోన్ ఇచ్చేద్దాం అని ఆలోచించలేదు. వాళ్లను ఏవిధంగా మనం ఆదుకోవాలి, వాళ్లు వృత్తి రీత్యా, ఆరోగ్య పరంగా ఏవిధంగా నష్టపోతున్నారని బీసీ మహిళలందరికీ కూడా రూ.75,000లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రకటించిన గొప్ప వ్యక్తి మా జగన్మోహన్‌రెడ్డిగారని మీకు మనవి చేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

బీసీ కార్పోరేషన్‌తో ఏమి చేస్తారని ఇందాక అడిగారు? ఊరికే ఏదో నాటకం వేస్తున్నారని చెప్పారు. ఈ బీసీ కార్పోరేషన్ ద్వారా వీళ్లందరికీ కూడా ఈ రూ.75,000లు ఏదైతే ఉందో వాటన్నిటినీ పంపిణీ చేసే గొప్ప కార్యక్రమాన్ని మా ప్రభుత్వం చేయబోతోందని నేను మనవి చేస్తున్నాను.

అదేవిధంగా మైనార్టీ సంక్షేమం. మైనార్టీలకు మేమేదో చేశామని ప్రతిపక్షం వాళ్లు చెబుతారు. మైనార్టీల ఆత్మీయ సదస్సు. తెలుగుదేశం పార్టీకి దురదృష్టం ఏంటంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎన్నికల్లో గుర్తుకు వస్తారు, ఎన్నికల ముందు గుర్తుకొస్తారు. మిగతా సమయంలో అంతా వీళ్లు అసలు గుర్తుకు రారు. ఇటీవల, గత సంవత్సరమో, అంతకుముందు సంవత్సరమో ఎన్నికలు వస్తున్నాయని గత ప్రభుత్వంలో వాళ్ల నాయకుడు గుంటూరులో ముస్లిం ఆత్మీయ సదస్సు అని మీటింగ్ పెట్టారు. సామాన్యంగా ఏ పార్టీ పెట్టుకున్నా ఆ పార్టీ అభిమానులందరూ కూడా వెళ్తారు. జిందాబాద్‌లు కొడతారు, ఆహా ఓహో అంటుంటారు అవి మనకు తెలిసినవే. కానీ దాంట్లో కొంతమంది నంద్యాల నుంచి వచ్చిన ముస్లిం యువకులు రాజకీయాలతో సంబంధం లేకుండా, ముస్లింల సంక్షేమం గురించి, ముస్లింల అభివృద్ధి గురించి ఆలోచించి నంద్యాల ప్రాంతం నుంచి నలుగురు యువకులు ఆ మీటింగ్‌కు వచ్చారు. మీటింగ్‌కు వచ్చి చంద్రబాబునాయుడుగారు చెప్పినవన్నీ విన్నారు. విన్న తర్వాత వాళ్లు లేచి ముఖ్యమంత్రిగారూ నాలుగు సంవత్సరాలు గడుస్తోంది, ఒక్క మైనార్టీకి కూడా మంత్రిపదవి ఇవ్వలేదు, ఈ రాష్ట్రంలో మైనార్టీలు లేని మంత్రివర్గం చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా అని ప్రశ్నించారు. అదేవిధంగా ఇమామ్‌లకు, మౌజమ్‌లకు మీరు జీతాలు పెంచుతానన్నారు, ఇప్పటివరకూ మీరు జీతాలు పెంచలేదని ప్రశ్నించారు. ఏం చెప్పాలి అధ్యక్షా? మొన్న కూడా జగన్మోహన్‌రెడ్డిగారు ఒక మీటింగ్‌లో... నేను పేపర్లో చూశాను. ఒక మైనార్టీ అతను ఎన్నికల్లో ఓడిపోతే మైనార్టీ సోదరులంతా వెళ్తే, లేదూ అతన్ని ఏదో ఒక విధంగా రాజకీయంగా నేను పైకి తీసుకొస్తానని మా పార్టీ నాయకుడు హామీ ఇస్తే వారు చాలా సంతోషపడ్డారు.

మ.12.00

కానీ అక్కడ ఏమి జరిగింది. ఇవ్వలేదు, ఇవ్వకపోతే నెక్స్ట్ ఇస్తున్నానని, ఫలాన వ్యక్తికి ఇస్తున్నానని, తప్పకుండా ఇస్తున్నానని చెప్పాలి. ఇమామ్‌లకు, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు పెంచుతున్నామని, వచ్చే బడ్జెట్‌లో పెడతామని చెప్పాలి. అలా చెప్పకుండా మీ తోక కత్తిరిస్తా, మీ తోలు తీస్తానని, వాళ్లను పోలీసులకు పట్టించి, ఏమి కేసులు పెట్టారో తెలుసా? వారిపై దేశద్రోహ కేసులు పెట్టారు. ఇంతకన్నా సిగ్గుచేటు ఇంకేమైనా ఉంటుందా అని ఒక్కసారి ఆలోచించాలి.

(షేం... షేం... షేం... అని అధికారపక్ష సభ్యులు అన్నారు)

మత విద్వేశాలు రెచ్చగొట్టడానికి ఇక్కడకు వచ్చారని ఆ నలుగురిపై పోలీస్ కేసు పెట్టారు. ఆ నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టి జైల్లో పారేశారు. ఇది ఎంతఘోరమో ఒక్కసారి ఆలోచించాలి. మా ప్రభుత్వం ఇమామ్ల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచింది.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

అంతేకాకుండా గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈరోజు మా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం రూ.2,106 కోట్లు కేటాయించింది. దానిని బట్టి మైనారిటీలపట్ల మా నాయకుడి, మా వైఎస్సార్‌సీపీ కమిట్‌మెంట్ ఎంతో ఆలోచన చేయాలని కోరుతున్నాను. మాకు ఇది వారసత్వంగా వచ్చింది. మైనారిటీలపై ప్రేమ, వారి సంక్షేమం రాజశేఖర్ రెడ్డి గారి నుంచి మాకు వారసత్వంగా వచ్చింది. ఈ మాట ఎందుకంటున్నానంటే, ఈ దేశంలో గానీ, ఈ రాష్ట్రంలో గానీ దాదాపు 9 నుండి 10 శాతం వరకు మైనారిటీలు ఉంటారు. కానీ ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఒక్క ముస్లీం కూడా కనపడరు, కొంతమంది కనపడొచ్చు కానీ వారి జనాభా నిష్పత్తిలో వారు ప్రభుత్వ ఉద్యోగుల్లో కనపడరు. వాళ్లు వారి కష్టాన్ని నమ్ముకొని సైకిల్ రిపేర్లో, టైర్లు పంచర్లో, మోటర్ మెకానిక్ వృత్తుల్లో ఉన్నారు తప్ప ప్రభుత్వం తరఫు నుంచి వారికి అందిన సహాయం గతంలో చాలా తక్కువ. ఆనాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన రాజశేఖర్ రెడ్డి గారు మొట్టమొదటిసారిగా ముస్లీంలకు ఐదు శాతం రిజర్వేషన్‌ను ప్రకటించి, వారికి గొప్ప మేలు చేశారు.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

ఆ వైపు (ప్రతిపక్షం) కూర్చున్న నాయకులు యాభై శాతం దాటిపోయిందని రిజర్వేషన్ ఎలా ఇస్తారని మాట్లాడటంతోబాటు కోర్టుల్లో కేసులు కూడా వేయించారు. అయినా రాజశేఖర్ రెడ్డి గారు భయపడలేదు, కోర్టులో ఉందికదా, నేను ఏంచేయనూ, ఏంచేయలేనని ఎక్కడా వెనుకడుగు వేయలేదు. అందుకోసమే 'మాట తప్పరు, మడమ తిప్పరు' అని వైఎస్ కుటుంబానికి పేరు వచ్చింది.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

బీసీ రిజర్వేషన్స్ 51 శాతం పెరుగుతుందంటే దానిని యాభై శాతానికి కుదించి నాలుగు శాతం రిజర్వేషన్స్ ఇచ్చి, ఈరోజు కొన్ని వేల మంది, కొన్ని లక్షల మంది ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో, స్థిరపడ్డారంటే అది రాజశేఖర్ రెడ్డి గారి పుణ్యమని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

ఈ బడ్జెట్‌పై మాట్లాడడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఎందుకంటే నేను కూడా ఒక బలహీనవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టి నువ్వేమి బలహీనవర్గం వాడివని ప్రతిపక్ష సభ్యులు విమర్శిస్తుంటారు. బలహీనవర్గంలో ఎవరి స్థాయిలో వారు అవమానాలు పడుతుంటారు. పేదవాడు పేద సమాజంలో అవమానాలు పడుతున్నాడు, మధ్యతరగతికి చెందిన వ్యక్తి మధ్యతరగతిలో అవమానాలు పడుతున్నాడు, ఉన్నతవర్గానికి చెందిన బీసీలు కూడా ఉన్నతవర్గాలో అవమానాలు పడే పరిస్థితులున్నాయి. ఈ బడ్జెట్‌పై నేను మాట్లాడాలని విప్ గారిని అడిగాను. ఎందుకంటే బలహీనవర్గాలకు ఇంత మేలు చేసిన నాయకుడుగానీ, ప్రభుత్వం గానీ ఇంతవరకు లేదని తెలియజేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

ఈరోజు పోలీస్ స్టేషన్‌కు వెళితే బీసీ, ఎస్సీలకు సంబంధించిన వారిని కనీసం కూర్చోమనే పరిస్థితులు ఉన్నాయా? గ్రామంలో బ్రోకర్‌ను పట్టుకొని వారు వెళితే ఆ బ్రోకర్‌కు కుర్చీ వేస్తారు కానీ ఈ పేదవాళ్లు చినిగిన పంచా, చొక్కాతో వెళితే గౌరవమివ్వరు. ప్రభుత్వ ఆఫీసుల్లో కూడా గౌరవించని పరిస్థితుల్లో ఈ సమాజం ఉంది. ఎవరినీ నేను నిందించను గానీ అటువంటి పరిస్థితులు ఈరోజు ఉన్నాయని అంటున్నాను. వారి సమస్యలను వాళ్లు పోలీసులకు గానీ, రెవెన్యూ అధికారులకు గానీ చెప్పుకోలేరు. వారందరూ తీవ్ర నిర్లక్ష్యానికి, తీవ్ర అవమానానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. అటువంటి పరిస్థితుల్లో ఈరోజు కాంట్రాక్టుల్లో కమీషన్లు కానీ, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కానీ బలహీనవర్గాల సమాజంలో రాబోయే రోజుల్లో బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎటువంటి సందేహం లేదని తెలియజేస్తున్నాను.

గత ప్రభుత్వంలో మత్స్యకారులకు, మైనారిటీలకు ఏదో కొంత అరకొరగా నిధులు విదిలిస్తే చాలనే ఉద్దేశం ఉండేది. కానీ ఈరోజు మత్స్యకారులకు, మత్స్యవేట లేని సమయంలో వారికి రూ.4,000 నుంచి రూ.10,000లకు పెంచారు. ఈ వర్గం వారు కూడా విశాఖపట్నంలో గత ముఖ్యమంత్రి గారి దగ్గరకు వెళ్లారు. వారు కూడా ఏమీ అడగలేదు, ఏదైతే ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారో మత్స్యకారులకు ఇస్తామని చెప్పారో వాటిని ఎప్పుడు అమలుచేస్తారని అడగడం కోసం ముఖ్యమంత్రి గారి దగ్గరకు వెళితే, బలహీన వర్గాలంటే మళ్లీ అదే చులకన భావం, అదే అసహనభావం. మీ తోలు తీస్తానని గట్టిగా బెదిరించి ఆఫీసు నుంచి గెంటించిన పరిస్థితిని గుర్తు చేస్తున్నాను. ఈరోజు వారికి మేలు చేసేవిధంగా, వారు పనిలేకపోతే ఏమిచేయాలి, వారి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం.

మత్స్యకారులు ఉత్సాహంతో బోట్లు కొనుక్కుంటున్నప్పటికీ ఆర్థికంగా, పూర్తిగా వారి జీవితాలు చిన్నాభిన్నమైన పరిస్థితులున్నాయి. ప్రతి ప్రభుత్వం డీజిల్‌పై సబ్సిడీ ప్రకటిస్తుంది కానీ, సరైన

సమయానికి ఇవ్వడం లేదు. మెకనైజ్డ్ బోట్స్‌కు కూడా సబ్సిడీ ఇచ్చే కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు చేసినందుకు వారికి నేను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఈ బడ్జెట్‌లో మేము ఆలోచించాల్సింది ఏమంటే, మురికివాడల్లో నివసించేది అత్యంత పేదవాళ్లు. మురికి వాడల్లో నివసించే వాళ్లకు మురికి ఆలోచనలే వస్తాయని మాజీ ముఖ్యమంత్రి గారు ఇంతకు ముందు ఉద్ఘాటించారు. అటువంటి వాళ్ల మనస్సును ఎరిగి, అటువంటి మురికి వాడల్లో నివసించే పేదవాళ్ల సమస్యలేమిటి? వాళ్ల ఆశలు ఏమిటి? వారి ఆశలకు అద్దం పట్టేవిధంగా జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ గారు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మురికి వాడల్లో నివసించే వారని, వారు పనికిరాని వాళ్లు, వారు సమాజానికి దూరంగా ఉండాలనేవిధంగా మేము ఆలోచన చేయలేదు. మురికివాడల్లో కూడా రత్నాలుంటాయి. వాటిని వెలికి తీసి సానపట్టాలనే ఆలోచనతో ఈ బడ్జెట్‌ను రూపొందించారు. అందుకే ఈ రాష్ట్రంలో ఉన్న పేదలందరూ ఈ బడ్జెట్‌పై పూర్తి సంతోషంతో ఉన్నారు.

విద్య గురించి మాట్లాడాల్సి వస్తే, ఎవరైనా, ఎంత దూరమైన నడవాలన్నా వారి ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది. అదేవిధంగా ఎవరి బ్రతుకు బాగుపడాలన్నా చదువుతోనే ప్రారంభమవుతుంది. ఆ చదువు కుటుంబం యొక్క దృక్పథాన్ని, నేపథ్యాన్ని మార్చివేస్తుంది. బాగా చదువుకుంటే వారి కుటుంబాలు బాగుపడే అవకాశాలున్నాయి. దానివల్ల వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి తద్వారా సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది.

'అమ్మఒడి' అనే పథకాన్ని జగన్మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టారు. ఈ పథకం ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పును తీసుకొస్తుదంటే.. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నమవడానికి కారణం విద్య లేకపోవడం. ఎందుకంటే ఒకటి, రెండు ఎకరాలున్న చిన్న రైతు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి ఇష్టపడడం లేదు. ఎందుకంటే సమాజంలో వచ్చిన మార్పుల మూలంగా కానీ, ఏదైనా కానీ మా పిల్లలను కాన్వెంట్‌కు పంపాలనే ఆలోచనతో వారికి ఆదాయం ఉన్నా లేకపోయినా, వారు తిన్నా తినకపోయినా చిన్న రైతులు కూడా వారి పిల్లలను కాన్వెంట్‌కు పంపిస్తున్నారు. ఆ కాన్వెంట్‌లో ఫీజులు ఏరకంగా ఉన్నాయంటే సంవత్సరానికి పది పన్నెండువేల రూపాయలు ఉంటున్నాయి. రెండు ఎకరాలకు ఎంత ఆదాయం వస్తుంది? దేవుడు కరుణించి అన్ని విధాలా బాగుంటే ఒక ఎకరానికి రూ.10 వేలు మిగిలితే అదే చాలా గొప్ప. మనం మట్టి పిసికి పనులు చేసినట్లు, మనం కష్టపడుతున్నట్లు మన పిల్లల భవిష్యత్తు ఉండకూడదని, మన పిల్లలను చదివిస్తే సిటీలో ఏదో ఒక ఉద్యోగం వస్తుందనే ఆశతో, వారికి ఆదాయం ఉన్నా లేకపోయినా వారి పిల్లలను కాన్వెంట్‌లో చదివిస్తారు.

ఆవిధంగా ఆర్థికంగా చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలను ఆదుకునే కార్యక్రమమే ఈ 'అమ్మఒడి' పథకం. ఈ పథకం ద్వారా దాదాపు 43 లక్షలున్న తల్లులకు మేలు జరిగే కార్యక్రమం. అందరూ జగనన్న ఎప్పుడు ముఖ్యమంత్రి అవుతాడు, ఈ పథకం ఎప్పుడు వస్తుందని అందరూ ఎదురు చూశారు. ఎన్నికల రోజు చంద్రబాబు నాయుడు గారు టీవీల్లో మీరందరూ ఓట్లు వేయ్యండని అనగానే ఆడవాళ్లు పోలింగ్ బూత్‌లకు వెళ్లి రాత్రి 12 గంటల దాకా ఓటు వేశారు.

మ.12.10

మహిళలందరు కూడా ఓట్లు మాకే వేశారని తెలుగుదేశం వాళ్లు కొంత డ్రామా నడిపారు. కానీ వాళ్లు ఓట్లు వేసింది మాత్రం ఆ అమ్మఒడికి, మాకు అమ్మఒడి పథకం వస్తుంది, మా పిల్లలు బాగా చదువుకుంటారు. (సభ్యులు బల్లలు చరిచారు) నేను ఆర్థిక సమస్యల నుంచి బయట పడగలనని రాత్రి పన్నెండు గంటల వరకు మహిళలు లైన్లలో నిలబడి మరి ఓట్లు వేశారు. ఇది చాలా గొప్ప కార్య క్రమం. ఏదైతే అమ్మఒడి కార్యక్రమం ఉందో జీవితాల్లో బాగా మార్పులు తీసుకువచ్చే కార్యక్రమం. గత ప్రభుత్వం ఎంత ఘోరమంటే .. ఇంతకుముందు రాజశేఖర్ రెడ్డిగారు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం క్రింద... పిల్లల్ని మీరు చదివించండని చెప్పారు. అధ్యక్షా, మీరు కూడా బలహీన వర్గాల నుంచి వచ్చిన వారు కాబట్టి వాళ్ల నేపథ్యం గానీ, వాళ్ల సమస్యలు గానీ మీకు తెలుసు. మన జనరేషన్ మన ముందు జనరేషన్ పిల్లవాడు బాగా చదువుకొని ఇంజనీర్ సీటో, డాక్టర్ సీటో సంపాదించినా కూడా తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఉండేది. ఎందుకంటే, మనకున్న గుడిసెను తాకట్టు పెట్టాలా లేక మనకున్న పంట పొలాన్ని అమ్మేసి పిల్లలను చదివించాలా అని కలవరపడే పరిస్థితులు ఉండేవి. ఆరోజు రాజశేఖర్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తరువాత బలహీనవర్గాలకు చెందిన పిల్లల్ని పూర్తిగా చదివించే బాధ్యతను ఆయన భుజస్కందాల పైన వేసుకొని, నేను అంత ఇస్తాను, ఇంతే ఇస్తానని చెప్పలేదు. కాలేజీ ఎంత ఫీజు వసూలు చేస్తే, అంత కూడా ఫీజు రియింబర్స్ చేస్తానని చెప్పి ఫీజు రియింబర్స్‌కి అంత అర్థాన్ని చెప్పిన మహానుభావుడు ఆరోజు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారని మనవి చేస్తున్నాను. కాని తర్వాత వచ్చిన ప్రభుత్వం ఏమైంది. ఆ పథకానికి వైఎస్సార్ పథకమని పేరు ఉంటే ఎన్టీఆర్ అనే పేరు పెట్టుకోండి. కాని ఎవరు పరిపాలన ఉన్నా కూడా ఆ పథకం ఉద్దేశం మీద దాడి చేయకూడదు.

కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏమి చేసిందంటే, రాగానే ఇంజనీరింగ్ కాలేజి యాజమాన్యాలను మీటింగుకు పిలిచింది. కాలేజీ యాజమాన్యాలు మాకు నష్టాలు వస్తున్నాయని ఫీజులు పెంచాలని చెప్పుకున్నట్టు ఉన్నాయి. అంతకుముందు వాళ్లకు ఏం ముట్టాయో ఏం ఒప్పుకున్నారో తెలియదు గానీ ఫీజులు మాత్రం ఇష్టం వచ్చినట్టు పెంచుకున్నారు. ఒకొక్క కాలేజీలో ఆ కాలేజీ స్టాండర్డ్ కానివ్వండి ఆ కాలేజీకి ఉన్న రెప్యుటేషన్ కానీవ్వండి లక్షరూపాయలు, ఎనభై వేల రూపాయలు, తొంబై వేల రూపాయలు ఈ విధంగా రకరకాలుగా ఉన్నాయి. మనసుంటే ప్రభుత్వం

ఏమి చేయాలి. వాళ్ల కాలేజీలు పెంచినప్పుడు ఈ ప్రభుత్వం కూడా వీళ్లకు ఇచ్చే ఫీజు రియింబర్స్ మెంట్‌ను పెంచాలి. దాని గురించి చెప్పలేదు. నేను, రాజశేఖర్ రెడ్డిగారు ఇచ్చే రూ.35వేలే ఇస్తామని మొండిపట్టు పట్టి వాళ్లంతా చదువులు మానివేసే పరిస్థితికి తీసుకువచ్చారు. చాలా మంది ఎమ్మెల్యే దగ్గరకు వస్తారు. ఆఖరికి పాసై పోయిన తరువాత సర్టిఫికెట్లు వెనక్కి వచ్చే పరిస్థితి లేదు. కారణం ఆ బ్యాలెన్స్ ఫీజును కట్టలేక సర్టిఫికెట్లు బయటకు రాక శాసనసభ్యుల దగ్గరకి వచ్చి మేనేజ్‌మెంట్‌కి చెప్పండి సర్ అని చెబుతారు. ఇటువంటి పరిస్థితి ఆరోజు ఉండేది.

అదేవిధంగా ఎడ్యుకేషన్‌కి సంబంధించి, గత ప్రభుత్వం 2017-18లో రూ.20వేల 17కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. మేము ఈరోజు దానిని రూ.33,410కోట్లకు తీసుకువెళ్లాం. దాంట్లో 6,450కోట్ల రూపాయలు అమ్మఒడి కానీయండి, ఫీజు రియింబర్స్‌మెంట్ కానీయండి, స్కూల్స్ డెవలప్‌మెంట్ కానీయండి. నిన్న తెలుగుదేశం సభ్యులు ఎవరో మేము స్కూల్స్‌ని బ్రహ్మాండంగా బాగుచేసుకున్నామని చెప్పారు.

(గౌరవ ఉప సభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు)

వాళ్లు ఖర్చు పెట్టింది ఎంతంటే కేవలం రూ.244కోట్లు మాత్రమే స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి ఖర్చు చేశారు. మేము స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి రూ.2077కోట్లని ఈ బడ్జెట్‌లో కేటాయించి ఎడ్యుకేషన్‌పైన మా ప్రభుత్వంకి ఉన్న చిత్తశుద్ధిని పాటించాం.

అదేవిధంగా అగ్రికల్చర్‌పైన మా ప్రభుత్వం చెబుతుంది. మేము అగ్రికల్చర్‌లో రైతులను చాలా ఆదుకున్నాం. మా పరిపాలనలో రైతులందరూ చాలా సంతోషంతో ఉన్నారు. మా ప్రభుత్వంలో వాళ్లకు కావలసినవన్నీ చేశామని చెప్పుకుంటున్నారు. (ఆ సందర్భంలో అధికారపక్ష సభ్యులు రేయిన్ గన్ అని అన్నారు) నిన్న ప్రతిపక్ష సభ్యులు ఒక మాట చెప్పారు. చంద్రబాబునాయుడు గారు సభలో లేరు. ఆయన పెద్దవారు, ఆయన గురించి కామెంట్ చేయచ్చో లేదో నాకు తెలియదు గానీ మొత్తం ఆయన రాజకీయ జీవితమంతా మోసం, దగా, పునాదుల మీద నిర్మించారు. నిన్న చెబుతున్నారు. పులిచింతల మూలంగా కృష్ణా డెల్టా భోజనం చేస్తున్నారు. మొన్నటివరకు మేము భోజనం చేయలేదా.. మేము రాగులు తిన్నామా, సజ్జలు తిన్నామా ... పట్టిసీమ వచ్చిన తరువాతే ఈ కృష్ణా డెల్టా వాసులు అన్నం తింటున్నారని మాట్లాడారు. ఏదైనా చెప్పుకోనివండి మాకు పరవాలేదు. ప్రతీ రైతుకి తెలుసు ... పట్టి సీమ సంవత్సరంలో పూర్తి చేస్తామని చెప్పి ఆ కాంట్రాక్టర్‌కి మూడు వందల కోట్ల రూపాయలు ఇచ్చారు. కానీ మూడు సంవత్సరాలు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ విధంగా డీజిల్‌కి ఖర్చుపెట్టి బోర్లు ద్వారా వ్యవసాయం చేసుకున్నారో ఒక్కసారి గ్రామాల్లోకి వెళ్లి తిరిగితే అర్థమవుతుంది. ఏదో పట్టి సీమ ద్వారా డబ్బులు రాగానే నీళ్లు వచ్చేశాయని అనుకుంటారు. వాళ్ల ముడుపులు వాళ్లకు వచ్చాయి గాని నీళ్లు మాత్రం రాలేదు. పట్టిసీమపైన నేను చర్చకు వెళ్లను. కానీ ఇక్కడ మోసం ఏమిటంటే.. చంద్ర

బాబునాయుడుగారు పట్టిసీమ శంకుస్థాపన చేయగానే రాయలసీమకు వెళ్లి, నేను రాయలసీమ కోసమే పట్టిసీమను తీసుకువచ్చానంటారు.

(అధికార పక్ష సభ్యులు "ఇదే మాట చెప్పారు" అన్నారు)

రాయలసీమకి వచ్చి మీకోసమే 80టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం గల పట్టిసీమను అక్కడ నిర్మిస్తున్నానని చెప్పారు. మాకు డౌట్ వచ్చింది. ఈ నీళ్లను అక్కడికి తీసుకువెళతారేమో అని ఒకసారి మా నాయకుడు చెబితే ఆ జివో తెప్పించి చూస్తే ఆ జివోలో రాయలసీమకి కనీసం ఒక బక్కెటు నీళ్లు ఇస్తామని కూడా ఆ జివోలో ప్రకటించలేదు.

(అధికార పక్ష సభ్యులు షేమ్ షేమ్ అన్నారు)

ఏవిధంగా చెబుతారు. మీరు కృష్ణా జిల్లాలో చెప్పండి. మీకోసమే మేము పట్టిసీమను తీసుకువస్తున్నామని చెప్పండి. కృష్ణానదిలో నీళ్లు రావడం లేదు కాబట్టి ఈ పట్టిసీమ ద్వారా నీళ్లు తీసుకువస్తున్నామని చెప్పండి. కాని అక్కడికి వెళ్లి రాయలసీమ కోసమే పట్టిసీమ కడతానని ఏవిధంగా మోసం చేస్తారు.

కొత్త కొత్త విధానాలను ప్రవేశపెట్టారు. రెయిన్ గన్‌లు.. మాకు కొంచెం సేపు ఆ గన్నులు ఏమిటో అర్థం కాలేదు. బహుశా రాయలసీమ వాళ్లకు అర్థమౌతుంది వాళ్లు ఆ రెయిన్ గన్స్ అని పేరు పెట్టి ఉంటారు. దానికి ఎన్ని ట్యాంకులు అవసరమవుతాయనేది లెక్క లేకుండా రెయిన్ గన్స్ ద్వారా అనంతపురంలో బ్రహ్మాండంగా గ్రౌండ్ నట్స్ పండాయని విజయవాడకి వచ్చి చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురంలో రైతులు సంతోషంగా ఉన్నారని కృష్ణా జిల్లాలో చెప్తారు. కృష్ణా జిల్లా రైతుల గురించి కడపలో చెప్తారు. అంటే మొత్తం మోసపూరితమైన మాటలు తప్ప... నేను అడుగుతున్నాను. మీ ప్రభుత్వంలో అసలు రైతులకు ఏం మేలు జరిగింది. ఒకసారి మనం జ్ఞాపకం చేసుకుంటే, రాజశేఖర్ రెడ్డిగారి సమయంలో రూ.565 ఉన్నధాన్యం బస్తా వెయ్యి రూపాయలకు వెళ్లిన మాట వాస్తవమా కాదా అని అడుగుతున్నాను. ఎప్పుడన్నా అటువంటి పెంపును మీరు చేయగలిగారా అని నేను అడుగుతున్నాను. ఈప్రభుత్వంలో ఏమి జరిగిందంటే రూ.1700 ఎంఎస్‌పి (మినిమమ్ సపోర్ట్ ప్రైజ్) ఉంటే రూ.1300లకు కూడా కొనే దిక్కులేని పరిస్థితిని కృష్ణా డెల్టాలో చూశాం.(బెల్) అదేవిధంగా మినుములు గత ప్రభుత్వంలో రూ.1400లకు అమ్మారు. గత ప్రభుత్వంలో రూ.4800లకు కూడా అమ్ముకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో.. ప్రభుత్వం కొంటాననంటుంది, ఎప్పుడు కొంటుందంటే, రైతులందరు మినుముల వ్యాపారులకు అమ్మేసిన తరువాత అప్పుడు ఓపెన్ చేస్తారు. మేము మార్కెట్ యార్డులో మినుములు కొనుగోలు చేస్తామని పేపర్‌లో చెప్పుకోవడానికి ఓపెన్ చేస్తారు. అంటే రైతులకు మేలు చేయాలనే ఉద్దేశం లేదు. కేవలం వాళ్ల ఏజెంట్లకు, పచ్చచొక్క వాళ్లకి ఉపయోగపడాలనే ఆలోచన తప్ప ప్రతీ కార్యక్రమంలో వేరే ఆలోచన లేదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్ ..

శ్రీ కొలుసు పార్థసారథి (SRI KOLUSU PARTHASARATHI): అధ్యక్షా, బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఈ ప్రభుత్వం రూ.7569కోట్లు కేటాయిస్తే మేము రూ.20,558కోట్లను కేటాయించాం. రైతు జీవితంలో ఇది ఎంత మేలు తీసుకువస్తుందో ఒక్కసారి ఆలోచించమని కోరుతున్నాను. అదేవిధంగా రైతు రుణాలు మొత్తం మాఫీ అవుతాయని చెప్పారు. దాని గురించి చెప్పుకోవాల్సినవసరం లేదు. ఆఖ రికి గ్రామాల్లో ఏ చెట్టు దగ్గరకు, ఏ బడి దగ్గరకు వెళ్లినా రైతు రుణమాఫీ గురించే మాట్లాడుకుంటు న్నారు కాబట్టి దాని గురించి ఇక్కడ చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఏదైతే రైతు భరోసా కార్యక్రమం కింద రూ.12500 పెడతున్నారు. ఇది మనస్సుతో ఆలోచన చేసి తయారు చేసిన బడ్జెట్, ఎందుకంటు న్నానంటే జూన్ నెల వచ్చేసరికి ప్రతి రైతు కొంత పెట్టుబడి అప్పుగా ఇప్పించమని ఊర్ల వెంట పెద్ద పెద్ద రైతుల దగ్గరకి తిరుగుతుంటాడు. ధాన్యం వస్తుందని అందరూ సంతోషపడతారు. ఆ అప్పుఇచ్చిన వాడు పొలం కల్లంలోకి వెళ్లిపోయి ధాన్యం అంతా ఆ అప్పుకింద జమ వేసుకొని తీసుకెళ్లిపోతాడు. మళ్లీ నాలుగైదు బస్తాలు ఇంటికివస్తే అవి పండగలకు, పబ్బాలకు అయిపోయిన తరువాత మళ్లీ ఖరీఫ్ వచ్చేస రికి మళ్లీ ఖరీఫ్‌కి ఎక్కడ వెతుకుదామని రైతు పడే కష్టాల గురించి ఆలోచించారు కాబట్టే ఆ పెట్టుబడి ఆ రూ.12,500లు దుక్కి దున్నడానికి, ఎరువులకు, విత్తనాలకు ఉపయోగపడవచ్చు. ప్రతీ ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ సంవత్సరం రూ.12500 ఇస్తామని మేము ప్రకటించడం ఈరోజు రైతులకు చాలా మేలు జరుగు తుందని నేను మనవిచేస్తున్నాను.

మ. 12.20

అదేవిధంగా, వడ్డీలేని రుణాల వల్ల రైతులకు ఆర్థికభారం తొలగిపోతుందని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటి స్పీకర్: పార్థసారథి గారూ, సమయం తక్కువగా ఉంది. కంక్లూడ్ చేయండి.

శ్రీ కొలుసు పార్థసారథి (SRI KOLUSU PARTHASARATHI): అధ్యక్షా, స్వర్గీయ శ్రీ వై.యస్.రాజశేఖర రెడ్డి గారు అధికారంలోకి రాకముందు పేదలకు గృహాలు కావాలంటే శాసనసభ్యులు మరియు ఇతర నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. వై.యస్.రాజశేఖర రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత శాచ్యురేషన్ మోడ్‌లో కొన్ని లక్షల గృహాలను నిర్మించి ప్రతి పేదవాడికి ఇవ్వడం జరిగింది. నాకు తెలిసి దాదాపు 30లక్షల గృహాలను డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారి హయాంలో రెసిడ్యుయరీ ఆంధ్రప్రదేశ్ స్టేట్‌లో మేము నిర్మించడం జరిగింది. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగైదు లక్షల కంటే ఎక్కువ గృహాలను నిర్మించలేదు. దానికే గృహప్రవేశాలని చెప్పి

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వారు ఒక పెద్ద మీటింగును నిర్వహించారు. ఎంతసేపు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టే పరిస్థితి తప్ప, ఎక్కడా వారు పేదవారికి మేలు చేసిన పరిస్థితి కనిపించలేదు. నేడు శ్రీ వై.యస్. జగన్మోహన్‌రెడ్డి గారి నాయకత్వంలో ఈ రాష్ట్రప్రభుత్వం రాబోయే 5సంవత్సరాల్లో పేదలకోసం 25లక్షల గృహాలను నిర్మించడమే కాకుండా 25లక్షల ఇళ్లపట్టాలను ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది.

అధ్యక్షా, ఇటీవల నేను గడప గడపకూ వై.యస్.ఆర్. పార్టీ అనే కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లినప్పుడు చోడవరం అనే గ్రామంలో ఉన్న వారంతా నా వద్దకు వచ్చారు. కారణమేమంటే, వి.ఆర్.ఓ. వారి వద్దకు వచ్చి మీ ఇళ్లపట్టాలు ఇమ్మని వారివద్ద నుంచి తీసుకున్నాడు. అవి ఎప్పుడో స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు 3సెంట్ల భూమి చొప్పున వారికిచ్చిన ఇళ్లపట్టాలు. ఆరోజుల్లో కొంచెం ఎక్కువగా ఇచ్చారు. నేను సంబంధిత మండల రెవెన్యూ అధికారికి ఫోన్‌చేసి మాట్లాడితే, మేము ఇళ్లపట్టాలు తీసుకువెళ్లడం లేదండి అని నాతో చెప్పారు. ఆ తర్వాత గ్రామ రెవెన్యూ అధికారిని పిలిచి అడిగితే గతంలో ఇచ్చిన 3సెంట్ల భూమిని సెంటున్నర, సెంటున్నర చేసి ఇద్దరికి చొప్పున పట్టాలను ఇస్తారని చెప్పారు. ఆవిధంగా పేదలకు ఇచ్చి ఇక్కడకు వచ్చి మేము లక్ష ఇళ్లపట్టాలను పంపిణీ చేశామని వారు చెప్పుకుంటారు. ఈవిధంగా ప్రజలను మోసం చేసే ప్రభుత్వాన్ని ఎక్కడైనా చూస్తామా? కొన్ని ప్రభుత్వాలు బాగా పనిచేస్తాయి, మరికొన్ని ప్రభుత్వాలు సరిగ్గా చేయలేకపోవచ్చు. కానీ, ప్రజలను మోసం చేసే ప్రభుత్వం ఏదైనా ఉన్నదా అంటే ఆ ప్రభుత్వమే అని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, వారికి యోగా లేదా వ్యాయామం నేర్పిన జగ్గీ వాసుదేవ్ బాబా గారికి 400ఎకరాలు విలువైన భూమిని ఇవ్వడం కోసం చంద్రబాబు నాయుడు గారు ఆలోచించారు. మేము వారిలాగా ఏ స్వాములకు దోచిపెట్టలేదు. వారు మొత్తం ప్రపంచమంతా తిరుగుతున్నారు. ఒక విశ్వవిద్యాలయానికి ఎంత భూమి కావాలో వారికి తెలియదా? పేద రైతులవద్ద నుంచి లాక్కుని వందల ఎకరాల భూమిని మన తండ్రిగారిచ్చిన ఆస్తులను పంపకం చేసినట్లు చేస్తే ఎలా? కనీసం పేదవాడికి ఒక్క సెంటు ఇంటిస్థలం ఇచ్చారా అని నేను మీద్వారా వారిని అడుగుతున్నాను. రాష్ట్రం మొత్తం మీద 13 జిల్లాల్లో ఎక్కడైనా కనీసం 100ఎకరాల భూమిని ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసి ఒక్క సెంటు భూమినైనా ఒక పేదవాడికి ఇంటిస్థలంగా వారు ఏనాడైనా ఇచ్చారా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, వారు రెండున్నర లక్షలకోట్లను అప్పుగా తీసుకువచ్చారు. ఆ రెండున్నర లక్షలకోట్లతో ఏ ప్రాజెక్టులను నిర్మించారో, ఏమిటో తర్వాత తెలుస్తుంది. గత ప్రభుత్వంలో పేదవాడిని దృష్టిలో పెట్టుకుని కనీసం రూ.10వేలకోట్లు అయినా అప్పు తీసుకొచ్చిన దాఖలాలు ఉన్నాయా? కనీసం రూ. 1000కోట్లు అయినా అప్పుతెచ్చి పేదవారికి ఇళ్లస్థలాలు లేదా ఇళ్లు నిర్మించాలని వారు

ఆలోచించారా? ఆ ఇళ్లు నిర్మిస్తే పేదలు డబ్బుల కోసం తిరగాలి. రెండు సంవత్సరాల క్రితం కట్టుకున్న ఇంటికి కూడా పేదలకు డబ్బులు రాని పరిస్థితి నేడు గ్రామాల్లో ఉంది.

అధ్యక్షా, నా నియోజకవర్గం ఉయ్యూరులో పేదవారి ఇళ్లస్థలాల కోసం ఆనాడు అడిగితే స్వర్గీయ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు కోట్ల రూపాయల విలువచేసే భూమిని మంజూరుచేయడం జరిగింది. పేదవారి ఇళ్లస్థలాల కోసం ఆనాడు కొన్ని కోట్లరూపాయలు పెట్టి దాదాపు 13 లేదా 14ఎకరాల భూమిని మేము కొనుగోలు చేశాము. లండన్‌లో యజమాని ఉంటే ఆయనను పిలిపించి రిజిస్ట్రేషన్ కూడా చేయించాము. వారికి ఇంటిస్థలం పట్టాలు ఇచ్చేసిన తర్వాత మూడంతస్థుల భవనం నిర్మించాలని ఆ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఎక్కువమందికి వస్తుంది కాబట్టి సరే, సంతోషం. ప్రతి దానినీ విమర్శించవలసిన అవసరం లేదు. మనవద్ద చాలామంది బిల్డర్లు ఉన్నారు. స్థలం ప్రభుత్వానిది, ఇసుక ఉచితం. మనం పేదవారికి ఇచ్చే ఇంటి నిర్మాణం ఖర్చు చదరపు అడుగుకు సుమారు రూ.500లు లేక రూ.600లు కంటే ఎక్కువ అవుతుందా? కానీ, ఒక చదరపు అడుగుకు రూ.2200లు వారు చెల్లించారు. నాలుగు జిల్లాలు, ఎల్ అండ్ టి సంస్థకు, నాలుగు జిల్లాలు షాపూర్‌జీ పల్లోంజీ సంస్థకు, మరో నాలుగు జిల్లాలు ఎన్.సి.సి. సంస్థకు ఈ విధంగా ఇవ్వడం ఏమిటి? పేదవారికి ఇంటిస్థలం ఎందుకు ఇస్తాము? పేదవాడు అద్దెను కూడా కట్టుకోలేని దుర్భరమైన పరిస్థితిలో ఉన్నాడు కాబట్టి అతనికి ప్రభుత్వం చేయూతనిచ్చి ఒక ఇంటిని నిర్మిస్తే, పేదవాడు సంతోషంగా నివసిస్తాడని మనం ఇస్తున్నాము. అది కూడా వ్యాపారం చేస్తే ఎలా? ఇది వారి దోపిడీకి పరాకాష్ట. అటువంటి దౌర్భాగ్య పరిపాలన నుంచి ఈరోజు బంగారు పరిపాలన వస్తుంది. ఆ బంగారు పరిపాలనకు తార్కాణమే ఈ బడ్జెట్ అని నేను మనవిచేస్తూ, ఈ బడ్జెట్ ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది. ప్రత్యేకంగా బలహీనవర్గాల గౌరవం పెరిగే విధంగా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి శ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారికి, ఆర్థికమంత్రి గారికి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, నేను తెలుగుదేశం పార్టీ సభ్యులకు కూడా చెబుతున్నాను. చంద్రబాబు నాయుడు గారి గురించి బయట ఏమి మాట్లాడినా ఈ బడ్జెట్‌ను మనసారా ఆశీర్వదించాలని తమరిద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ రాపాక వరప్రసాద రావు(SRI RAPAKA VARAPRASADA RAO)(రాజోలు): అధ్యక్షా, ఆర్థికశాఖా మంత్రి శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ సభలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశమిచ్చిన తమరికి నా ధన్యవాదాలు. ఈ బడ్జెట్‌ను దైవగ్రంథంతో పోల్చడం విన్నాము. నిజంగా ఈ బడ్జెట్‌లోని మొదటి పేజీ నుంచి చివరి పేజీవరకూ చూస్తే, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే ఉన్నాయి. ఏ ఉద్దేశంతో ఈ బడ్జెట్‌ను భగవద్గీతతో పోల్చారో తెలియదు గానీ, చాలా పారదర్శకంగా ఈ బడ్జెట్‌ను రాష్ట్రప్రభుత్వం తయారుచేయడం జరిగింది.

అధ్యక్షా, నేను జనసేన పార్టీ నుంచి మాట్లాడుతున్నాను. మా పవన్‌కల్యాణ్ గారు ఏమి చెప్పారంటే, ఏవిషయంలో అయినా అధికారపార్టీ వారు మాట్లాడిన వెంటనే దానిని అపోజ్ చేయవద్దు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుంటే సపోర్ట్ చేయాలని చెప్పారు తప్పితే వారు అధికారపార్టీ కాబట్టి వారు ఏమి చెప్పినా వ్యతిరేకించమని మాత్రం నాకు ఆయన చెప్పలేదు. ప్రభుత్వం ప్రజలకోసం చేసే అన్ని కార్యక్రమాలకు మేము సపోర్ట్ చేస్తాము. అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తూ, అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో నడిపిస్తామని ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను తయారుచేయడం జరిగింది.

(సభలో హర్షధ్వానాలు)

అధ్యక్షా, నేడు సుమారు రూ.28వేలకోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను తయారుచేయడం జరిగింది. రైతులను పూర్తిగా ఆదుకున్న ప్రభుత్వం స్వర్గీయ వై.యస్.ఆర్. ప్రభుత్వమైతే, నేడు అదే మార్గంలో ఆయన తనయుడు శ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారు కూడా అదే రైతును దృష్టిలో పెట్టుకుని రైతు సంక్షేమం కోసమే సుమారు రూ.28వేలకోట్లను బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. రైతును గతంలో అనేక ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి వ్యవసాయం పండగ అనే పరిస్థితిని తీసుకువచ్చింది ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ వై.యస్.రాజశేఖర రెడ్డి గారు. అదేవిధంగా, నేడు మళ్లీ రైతుసంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం శ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం.

(సభలో హర్షధ్వానాలు)

అధ్యక్షా, రైతు కష్టాలు తీర్చడం కోసం రూ.12,500లు చొప్పున ఇవ్వడం కోసం రైతుభరోసా కార్యక్రమం ఈ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగింది. సాధారణంగా, వ్యాపారంలో నష్టం వస్తే, మనం ఒకసారి లేదా రెండుసార్లు చూస్తాము. మరలా నష్టం వస్తే, ఆ వ్యాపారాన్ని వదలి వేరే వ్యాపారానికి వెళతాము.

మ 12.30

కానీ రైతు అలా కాదు. అది నష్టం వచ్చినా, కష్టం వచ్చినా, లాభం వచ్చినా రైతు ఆ భూమినే నమ్ముకుంటాడు. మనందరికీ పట్టెడు అన్నం పెట్టే రైతుని, రైతు శ్రేయస్సుని చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది. అదేవిధంగా ఈరోజున పంటల్లో నష్టాలు వచ్చినప్పటికీ వ్యవసాయం చేస్తూ, అప్పుల బారిన పడితే ఆ కుటుంబాన్ని పోషించలేక పిరికితనంతో కొంతమంది ఆత్మహత్య చేసుకుంటుంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రైతు ఆ అప్పుల బాధ గురించి ఆలోచిస్తాడు తప్పితే, వెనుక ఉన్న పిల్లలు కానీ, భార్య కానీ, ఆ కుటుంబం ఏమైపోతుందో అనే

ఆలోచన లేకుండా అతను బలవన్మరణం చేసుకున్నట్లైతే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. అటువంటి కుటుంబాలను ఆదుకోవడం కోసం రూ.7లక్షలు కుటుంబ సాయంగా వైఎస్సార్ ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డిగారి నాయకత్వంలో ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం నిజంగా హర్షించదగ్గ విషయం.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.)

అదేవిధంగా కౌలు రైతుకి మనం రూ.12,500 ఇస్తున్నామో అది భూయజమానికి వెళ్తుంది. కౌలురైతుకి వెళ్లేటువంటి పరిస్థితి లేకుండా పోతుంది. ఎందుకంటే ఆ కౌలురైతు రాసిస్తే, రేపు tenants అని కోర్టుకి వెళితే అతను ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. కాబట్టి రైతు భయపడుతున్నాడు, భూ-యజమాని భయపడుతున్నాడు. అదేవిధంగా దానిపైన ఒక నిర్ణయం తీసుకుని 11 నెలల పాటు ఈ కౌలు ఒప్పంద పత్రాన్ని ప్రవేశపెడతానని జగన్మోహన్‌రెడ్డిగారు చెప్పడం నిజంగా హర్షనీయం. (అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.) ఎందుకంటే అటు రైతుకి, ఇటు కౌలు రైతుకి ఇబ్బంది లేకుండా అటువంటి కార్యక్రమం చేస్తానని చెప్పడం చాలా సంతోషం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: కంక్లూడ్ చెయ్యండి.

శ్రీ రాపాక వరప్రసాద రావు(**SRI RAPAKA VARAPRASADA RAO**): అదేవిధంగా ఇవాళ రైతుని పట్టించుకున్న ప్రభుత్వం వైఎస్సాఆర్ ప్రభుత్వం. అదేవిధంగా మాది కోనసీమ ప్రాంతం. కోనసీమ ప్రాంతం అంతా కొబ్బరి ఆధారిత పంటలు ఉంటాయి. ఈ కొబ్బరికి ఒకేవిధంగా రేట్లు ఉండవు. మూడు, నాలుగు నెలలు రేట్లు లేని పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు ఒక కొబ్బరికాయ ఖరీదు రూ.4.50 ఉంటే, అది దించడానికి ఈ కాయ పోగు చేయడానికి రూ.1.50 ఖర్చవుతుంది. అలాగే దుక్కులకు కానీ, నీరు పెట్టడానికి కానీ ఇవన్నీ చూస్తే రైతుకి ఏమీ మిగిలే పరిస్థితి లేదు. మొన్న జగన్మోహన్‌రెడ్డి గారి ప్రసంగంలో కొబ్బరిని కూడా National Agricultural Cooperative Marketing Federation of India Ltd (**NAFED**) ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పడం జరిగింది. అన్‌సీజన్ టైంలో కొబ్బరిని నాఫెడ్ ద్వారా కొనుగోలును వెంటనే మొదలుపెట్టినట్లైతే ఆ కొబ్బరి రైతుని ఆదుకున్నట్లు అవుతుంది. అదేవిధంగా రైతు పూర్తి సంతృప్తితో జగన్‌గారి ప్రభుత్వం కోసం ఎదురుచూశాడు. ఏదో ఆశతో ఆయన వస్తే మాకు ఏదో చేస్తాడు తప్పనిసరిగా మా బ్రతుకులు బాగుపడతాయని రైతులందరూ ఆలోచించడం జరిగింది. అదేవిధంగా ఈరోజు బడ్జెట్‌ని రూపొందించడం జరిగింది. అదేవిధంగా తూ.చ తప్పకుండా ఈ బడ్జెట్‌ని అమలు చేసినట్లైతే రైతులకు మేలు జరుగుతుంది. (బెల్)

అదేవిధంగా ఫిషర్‌మ్యాన్స్‌కి వేట విరామ సమయంలో ఇస్తున్న రూ.4000 అమౌంట్‌ని రూ.10,000 లకు పెంచడం. అదేవిధంగా మత్స్యకారులందరూ కూడా గంగమ్మకు పెట్టు పెడుతుంటారు. అంటే వాళ్ల బిడ్డలు కానీ, వాళ్ల భర్తలు కానీ వేటకు వెళ్లి క్షేమంగా తిరిగిరావాలని ఆ

దేవతకు మొక్కుకుంటూ సంవత్సరానికి ఒకసారి వేటలు కోసి నైవేద్యాలు పెట్టి పెట్టు పెట్టుకుంటారు. ఇప్పుడు వాళ్లు ఏమంటున్నారంటే మేము కోరికలు కోరుకుంటే తీర్చేది గంగమ్మ తల్లి అయితే కోరకుండానే మా కోర్కెలను తీర్చేది జగన్మోహన్‌రెడ్డిగారని చెబుతున్నారు. (అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు). (జనసేన పార్టీనా, జగన్ పార్టీనా అర్థం కావడం లేదు అని ప్రతిపక్షసభ్యులు అన్నారు.)

అధ్యక్షా, సముద్రంలోకి వేటకు వెళ్లిన వ్యక్తులు మళ్లీ తిరిగివచ్చేవరకూ వాళ్ల కుటుంబాలు ఎదురుచూస్తుంటాయి. అక్కడ వారు ప్రమాదవశాత్తు మరణిస్తే, వాళ్లకి రూ.10లక్షలు సహాయం చేస్తానని చెప్పడం చాలా సంతోషం. అదేవిధంగా డీజిల్ బోట్‌లకు సబ్సిడీ రూ6.03 ఉండగా ఒకేసారి రూ.12.93 లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషించాల్సిన విషయం. ఎందుకంటే రూ.40లు ఉన్నప్పుడు ఈ రూ.6 నిర్ణయం తీసుకుంటే ఇప్పుడు రూ.80 అయినా అదే రూ.6.03లు నడుస్తుంది. కానీ ఈరోజు రూ.12.93 లు సబ్సిడీ ఇస్తానని చెప్పి చెప్పడం నిజంగా హర్షనీయం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః వరప్రసాద్‌రావుగారు కంక్లూడ్ చెయ్యండి.

శ్రీ రాపాక వరప్రసాద రావు(SRI RAPAKA VARAPRASADA RAO): అదేవిధంగా నామినేటెడ్ పదవులు, మాకు డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ పెట్టిన భిక్ష. ఈరోజు చట్టసభలలో రాగలిగామంటే డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ దయ. ఈరోజు నామినేటడ్ పదవులను ఎస్సీలెవరికీ ఇచ్చే పరిస్థితి ఉండదు. పైకులాలే అవన్నీ సర్దుకుంటూ ఉంటాయి. కానీ ఇవాళ ఒక నిర్ణయం తీసుకుని 50శాతం నామినేటడ్ పదవులన్నీ బలహీన వర్గాలకు, కింద వర్గాలకి ఇస్తానని చెప్పడం నిజంగా ముఖ్యమంత్రిగారిని చాలా అభినందిస్తున్నాను. (అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు). అదేవిధంగా ఆరోజున రాజశేఖర్‌రెడ్డిగారు ఒక నిర్ణయం తీసుకుని 108,104ని తీసుకురావడం జరిగింది. 108 వల్ల రోడ్డుమీద ఏదైనా ప్రమాదం జరిగితే కొనఊపిరితో ఉన్న వాళ్లని వెంటనే ఫోన్ చేస్తే హాస్పిటల్‌కి తెచ్చి ఆ ప్రాణాలను కాపాడడం జరుగుతుంది. గతంలో అయితే అక్కడ యాక్సిడెంట్ జరిగితే ఎవరూ ముట్టుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే ముట్టుకుంటే వాళ్లని కోర్టుకి వచ్చి సాక్ష్యం చెప్పమంటారు. ఆటోలో వేసుకుంటే ఆటోవాడిని వచ్చి సాక్ష్యం చెప్పమంటారు. ఎవరు కూడా ఆటో కానీ, కారు కానీ ఆగే పరిస్థితి లేకపోతే ఏదో ట్రాక్టర్లో వేసుకుని హాస్పిటల్‌కి తీసుకువెళ్లే పరిస్థితి ఉండేది. ఒక పోలీసు ఆయన చెప్పాడు. రాజశేఖర్‌రెడ్డిగారు ఈ108 పథకాన్ని ప్రజలకోసం కంటే మా పోలీసుల కోసం పెట్టారని. ఆయన చాలా పెద్ద మనసుతో మా కోసం, మా డిపార్ట్‌మెంట్ కోసం పెట్టారని చెప్పడం జరిగింది. అదేంటయ్యా ఎలాగా అంటే జనావాసాలు లేని ప్రాంతాలలో ఎక్కడైనా యాక్సిడెంట్ జరిగి SIR ఫోన్ చేస్తే అక్కడ శవం ఉంటే రాత్రంతా ఈ కానిస్టేబుల్ వెళ్లి ఆ శవం పక్కన పడుకోవాలి. ఏదైనా వెహికల్ ఆపి శవాన్ని హాస్పిటల్‌కి తీసుకువెళ్లదామంటే ఎవరు ఆపరు. ఈగలు ముసురుకుంటూ ఆప్రక్కనే శవ జాగరం చేసే పరిస్థితి మాకుండేది. భార్య, పిల్లలని వదులుకుని శవం

ప్రక్కన మేము పడుకునే వాళ్లం. కానీ ఈరోజున ఆ పరిస్థితి లేదు. యాక్సిడెంట్ అయితే మాకు సంబంధం లేదు. ఎవరో అక్కడ ఉన్న వ్యక్తులు ఫోన్ చేస్తారు 108 వస్తుంది తీసుకెళ్తుంది హాస్పిటల్‌లో జాయిన్ చేస్తుంది. తరువాత మేము కేసు బుక్ చేసుకుంటాం. ఉదయాన్నే లేచి ఎక్కడైతే సంఘటన జరిగిందో అక్కడికి వెళ్లి టేపు పట్టుకెళ్లి అటూ-ఇటూ నాలుగు కొలతలు వేసి, మళ్లీ వెళ్లి inquest report సమర్పించి పోస్ట్‌మార్టం చేయించవలసిన పని తప్పితే, శవాన్ని ముట్టుకునే పరిస్థితి పోలీసులకు లేదు. ఇది మాకోసం పెట్టాడు. (అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు). నేను ఆ రోజున నా సర్వీస్‌లో ఎన్నో శవాల ప్రక్కన పడుకున్నాను. ఈరోజు చాలా సుఖంగా ఇంటి దగ్గర పడుకుంటున్నానంటే దానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిగారు కారణమని చెప్పక తప్పదు. ఈరోజు అటువంటి వాహనాలు పుచ్చుపట్టిపోయి మూలనపడిన పరిస్థితి. ఈ వాహనాలను కొనడానికి ఇంతవరకూ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోలేదు. కానీ జగన్మోహన్‌రెడ్డిగారు 108 నిమిత్తం 425 వాహనాలను, 104 నిమిత్తం 675 వాహనాలను కొత్తగా తీసుకుంటామని చెప్పడం హర్షించాల్సిన విషయం (అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు). నిజంగా 104 అంటే గ్రామాలలోకి వెళ్లిన తరువాత ఎవరైన తల్లిదండ్రులకు , తల్లిదండ్రులంటే ముసలి తాత-మామ్మలు అంటాం మేము, జగన్మోహన్‌రెడ్డిగారు అయితే అవ్వా-తాతలు అంటారు. ఇంట్లో ఉన్నటువంటి వాళ్లు వాళ్లకి వైద్యం చేయించాలంటే, తిండిపెడతారు కానీ వైద్యానికి తీసుకువెళ్లి బిపి ఉందా? షుగర్ ఉందా? అని చెక్ చేయించే పరిస్థితి లేదు. ఈ 104 వాహనాలు గ్రామాలకు వెళ్లి ఆ ముసలి వాళ్లందరికీ బిపి, షుగర్ అన్ని టెస్ట్‌లు చేసి, వాళ్లకి కావలసిన మందులన్నీ ఇస్తూ ఉంటే, నిజంగా చాలా సుఖమైన జీవితాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు. రాజశేఖర్‌రెడ్డిగారిని అందుకే ఎవరూ మర్చిపోలేరు.(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు) అటువంటి కార్యక్రమాలు ఆయన చెయ్యడం జరిగింది. మరలా తిరిగి అవే కార్యక్రమాలను పునరుద్ధరించడానికి, కొనసాగించడానికి కొత్త వాహనాలను తీసుకుంటున్నారు చాలా సంతోషం.

మ.12.40

ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో 25లక్షల గృహాలు కట్టిస్తామంటున్నారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: వరప్రసాద్‌గారూ, మీకిచ్చిన సమయం అయిపోయింది. త్వరగా ముగించండి.

శ్రీ రాపాక వరప్రసాద రావు(SRI RAPAKA VARAPRASADA RAO): అధ్యక్షా, రాజశేఖరరెడ్డిగారికి ముందున్న ప్రభుత్వాలు అప్పటివరకు ల్యాండ్ సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వడం తప్ప రైతులనుంచి భూములను కొని ఎస్సీలకు ఇవ్వడం రాజశేఖరరెడ్డిగారి నుంచే మొదలైనది.

అపుడు నేను మా గ్రామానికి సర్పంచ్‌గా ఉన్నాను. ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం అమలుకు అప్పటి మా రెవెన్యూ డివిజన్ అధికారి నాకు ఫోన్‌చేసి మన రెవెన్యూ డివిజన్‌లోనే భూమి కొనుగోలు పథకం అమలుచేయడానికి మీరే చూడండి, ప్రభుత్వంనుంచి చాలా వత్తిడి ఉందని చెప్పడంతో నేను మా గ్రామంలో ఒక రైతును ఒప్పించి వారి భూమిని కొనడం జరిగింది. మా రెవెన్యూ డివిజన్‌లోనే మొట్టమొదటిసారిగా ఆ పథకం కింద భూమి కొనుగోలు చేయడం జరిగింది. అప్పుడు రైతుల భూములను కొని పేదలకు పట్టాలు ఇచ్చాం. అంతకు ముందుగానీ ఆ తరవాత గానీ పేదల గురించి ఆలోచించిన ప్రభుత్వాలు లేవు. రాష్ట్రంలో 25లక్షల ఇళ్లు కట్టిస్తాం, 25లక్షల ఇంటి స్థలం పట్టాలు ఇస్తామని ముఖ్యమంత్రిగారు చెప్పడం హర్షణీయం. పేదవారికి ఇళ్లు కావాలి. గ్రామాలలో గతంలో జనాభా తక్కువగా ఉండేవారు కాబట్టి ఇళ్ల గురించి డిమాండ్ చాలా తక్కువగా ఉండేది. గతంలో వర్షం కురిస్తే ఆ నీరు భూమిలోకి ఇంకేది. అప్పట్లో డ్రెయిన్ల అవసరం లేకపోయేది. ప్రస్తుతం గ్రామాలలో ఇళ్లు చాలా దగ్గర దగ్గరగా రావడంతో డ్రెయినేజ్ వ్యవస్థ లేక ఇపుడు ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇంతకు ముందు వర్షపునీరు రోడ్డుమీదకు వచ్చి ఇంకిపోయేది, ప్రస్తుతం అన్నీ సిమెంటు రోడ్లు రావడడంతో నీరు ఇంకడంలేదు. గ్రామాలలో డ్రెయినేజ్ వ్యవస్థను బాగుచేసే విధంగా ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకొనేందుకు ఆలోచించాలి. జగన్మోహన్‌రెడ్డిగారికి ఈ పదవి వారసత్వంగా లభించినది కాదు. వారసత్వంగా వచ్చి ఉంటే వారు 2009లోనే ముఖ్యమంత్రి అయ్యేవారు. ముఖ్యమంత్రి కావడంకోసం 2019వరకు వారు ఆగారంటే అది వారి కష్టార్జితం.

ఆయన స్వయంగా 3,600కు పైగా కిలోమీటర్లు నడిచి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ఈ బడ్జెట్ 50రోజులలోనే హారీబరీగా తయారుచేసినది కాదు. వారి పాదయాత్రలో అన్ని వర్గాల, కులాల ప్రజల కష్టనష్టాలను చూసి అందరి కష్టాలను తీర్చడానికి ఈ బడ్జెట్‌లో ఇనుమడింపజేయడం జరిగింది. అందుకే వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. ఈ బడ్జెట్‌ను ఎంత పారదర్శకంగా రూపొందించారో అదే ఉద్దేశంతో నెరవేర్చాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రస్తుత ప్రతిపక్ష సభ్యులను ప్రజలు వ్యతిరేకించారు కాబట్టే వారు అధికారం నుంచి ప్రతిపక్షంవైపు వచ్చారు. మీరు కూడా ఈ బడ్జెట్‌ను తూ.చ తప్పకుండా అమలుచేయకపోతే మేం అక్కడకు వచ్చే పరిస్థితి ఉంటుంది. మా పార్టీనుంచి నేనొక్కడినే ఎన్నికయ్యాను. నేను ఎక్కడున్నానో కూడా తెలియని పరిస్థితి ఉంది. ప్రజలను విస్మరిస్తే ప్రజాస్వామ్యంలో ఏమైనా జరగొచ్చు. ప్రజలను విస్మరించినవారి సీట్లు మారుతుంటాయి. స్టాండర్డ్‌గా సీటు ఉండాలంటే ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి పనిచేయమని తెలియజేస్తూ ప్రజలకు ఎప్పుడూ మంచి చేసినా జనసేన పార్టీ నుంచి మద్దతు తెలుపుతామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కొరముట్ల శ్రీనివాసులు(SRI KORAMUTLA SREENIVASULU):అధ్యక్షా, ఒక వ్యక్తి తాను గడచిన అయిదు సంవత్సరాలుగా వారు పడిన ఇబ్బందుల వలన కడప జిల్లా మా రాజంపేట

నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం అప్పుల బాధ ఎక్కువై భార్యాభర్తలు గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విషయం తెలిసి నేను డాక్టర్లతో, అధికారులతో మాట్లాడాను. రెండు రోజుల క్రితం గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోమని ఆదేశించడంతో మా జిల్లా కలెక్టర్ హరికిరణ్‌గారు నాకు వెంటనే ఫోన్ చేసి వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రిగారు ఆదేశించిన విధంగా ఆత్మహత్య జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆ రైతు కుటుంబానికి ఏడు లక్షల రూపాయలను అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదని గర్వంగా చెబుతున్నాను. నాలుగు సంవత్సరాల క్రితం మా నియోజకవర్గంలో వెంకటరెడ్డి అనే రైతు తాను సాగుచేసిన 28ఎకరాల అరటితోట గాలికి కొట్టుకుపోయి నష్టపోతే అతను పురుగులమందు తాగి చనిపోయాడు. ఆ విషయాన్ని మేం ప్రభుత్వానికి తెలియజేసినా దాని గురించి కనీస స్పందన లేదు. అపుడు మా పార్టీ అధ్యక్షుడు బయట ఉండి కూడా నన్ను వెళ్లి ఆ కుటుంబాన్ని ఓదార్చమని, మన ప్రభుత్వం వస్తే ఆదుకుంటామని ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రిగారికి పేదలు, బడుగు బలహీనవర్గాల పట్ల ఎంత ఉదారస్వభావంతో ఉన్నారో చెప్పడానికి, వారికి (ప్రతిపక్షసభ్యులనుద్దేశించి) బుద్ధి వచ్చే ప్రయత్నం చేయాలని మీద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA): అధ్యక్షా, ధన్యవాదాలు. భారతదేశ రాజకీయ వ్యవస్థలో పర్టిక్యులర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు ముందుగా జగన్మోహన్‌రెడ్డిగారికి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. దళితుల సంక్షేమానికి ముఖ్యమంత్రిగారు ఈ బడ్జెట్‌లో కనబరచిన చొరవ, కరుణ శ్లాఘనీయం. రాష్ట్రంలో ఎస్సీ నియోజకవర్గాలు 29ఉంటే వాటిలో 27నియోజకవర్గాలలో జగన్మోహన్‌రెడ్డిగారికి హారతిపట్టి గెలిపించారు. అలాగే నాలుగు ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గాలుంటే వాటిని కూడా పళ్లెంలో పెట్టి అందించారు. జగన్మోహన్‌రెడ్డిగారు దళితుల సంక్షేమానికి, వారి అభివృద్ధికోసం పాటుపడతారనే ఉద్దేశంతోనే వారిని ఎస్సీ ప్రజానీకం గుండెల్లో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వారు ఎన్నిక కావడానికి ప్రధాన భూమిక పోషించారు. ఈ రాష్ట్రంలో మేం రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్డు కులాలకు చెందినవారం. జగన్మోహన్‌రెడ్డిగారు స్పెషల్ కులాలుగా మమ్మల్ని చూస్తున్నారు. మేం రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్‌కోసం ఉద్యమిస్తూనే ఉన్నాం. కానీ ఎస్సీలకు స్పెషల్ స్టేటస్ ఇచ్చిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిగారిని రాష్ట్రంలోని యావత్తు దళితలోకం కొనియాడుతున్నారు. ఆయన పాదయాత్ర అనుభవాలే దీనికి తార్కాణం. ఎస్సీ కార్పోరేషన్‌ను రాబోయే రోజుల్లో మూడు విభాగాలుగా విభజించి దళితులను ఆదుకుంటామని చెప్పిన బడ్జెట్ ఇది. చాలా ప్రాంతాలలో ఎస్సీలలో మాల, మాదిగలే కనిపిస్తుంటారు. ఎస్సీలలో ఇంకా రెల్లి, చచాటిలాంటి చాలా ఉపకులాలున్నాయి. వారి పాదయాత్రలో ఎదురైన అనుభవాలను ఆధారం చేసుకొని ఆయా కులాలకు ఉపయోగపడే విధంగా ఎస్సీ కార్పోరేషన్‌ను విభజించడం, ఎస్సీలకోసం బడ్జెట్‌లో దాదాపు రూ.15వేల కోట్లు కేటాయించడమనేది చాలా అదృష్టం.

పర్టిక్యులర్‌గా ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళికను తూ.చ తప్పకుండా అమలుచేస్తామని చెప్పడం నిజంగా రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ఉపయోగపడే బడ్జెట్‌గా నేను భావిస్తున్నాను.

మ 12.50

అధ్యక్షా, ఆనాడు డా.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో భూపంపిణీ జరిగింది. కొన్ని లక్షల ఎకరాలు దళితులకు, గిరిజనులకు పంపిణీ చేసిన చరిత్ర. అటవీ హక్కుల చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు పరచిన ఏకైక ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు. అయితే ఈరోజు జగన్మోహన్ రెడ్డి గారు కూడా ఎస్సీలకు సంబంధించి, ఎస్టీలకు సంబంధించి భూమి పంచి అక్కడ బోర్లు వేయించి, వ్యవసాయం చేసుకుని బ్రహ్మాండంగా రైతులు సుభిక్షంగా ఉండాలనే ఆలోచనతో ఎస్సీ, ఎస్టీల కోసం బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన తీరు శ్లాఘనీయం. ఎస్సీ, ఎస్టీ అక్కచెల్లెమ్మలకు పెళ్లి కానుక లక్ష రూపాయలు చొప్పున పెళ్లి చేసిన ప్రతీ వారికీ ఇస్తామన్నారు. నిజంగా పేదవారు పెళ్లిళ్ల సమయంలో ఎంత ఇబ్బందిపడుతున్నారో మేము చూస్తున్నాము. మావరకైతే అప్పులు తెచ్చుకోవాలి. పెళ్లి వస్తుందంటే పెళ్లి కూతుర్ని చేసినప్పటి నుంచి పెద్ద వాళ్ల ఇంటికెళ్లి అయ్యా మాకు అప్పు ఇవ్వండి. మేము కూలి చేసుకుని డబ్బులు ఇస్తామని అడుగుతున్న పరిస్థితిని కాకుండా మీకు నేను అన్నగా ఉన్నానని లక్ష రూపాయలు పెళ్లి కానుకగా ఇవ్వడం ద్వారా 2019-20 సంవత్సరానికి 28,568 మందికి ఉపయోగం జరగబోతున్నది. నభూతో నభవిష్యతి ఎందుకంటే మాపేదల పెళ్లిళ్లకు ఆదరువుగా ఈ అవకాశం కల్పించిన బడ్జెట్ ఇది. చాలా ఉపయోగపడే బడ్జెట్.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి నేను ఈ మధ్య కాలంలో ఎస్సీ విభాగానికి అధ్యక్షుడిగా కుప్పం నియోజక వర్గానికి వెళ్లాను. ఆనాటి గౌరవ ముఖ్యమంత్రి గారి నియోజక వర్గానికి నేను వెళితే అక్కడకు ఒక అవ్వ వచ్చింది. అయ్యా మా ఇంట్లో ఒక కరెంటు బల్బు ఉందయ్యా, వెనుకవైపు బల్బు కూడా లేదు. రూ.1800 కరెంటు బిల్లు వచ్చింది. కట్టలేమంటే కరెంటు కట్ చేశారని చెబితే అక్కడున్న ఇన్‌ఛార్జికి అన్నా కొంచెం సహాయం చేయండని చెప్పాను. ఆ పరిస్థితిని పాదయాత్రలో గమనించిన మా నాయకుడు 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా కరెంటు ఇస్తామని చెప్పడం జరిగింది. ఇదొక చరిత్ర.

(అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు)

అధ్యక్షా, ఎన్ని బల్బులైనా పెట్టుకునే అవకాశం కల్పించిన పరిస్థితి రాబోయే రోజుల్లో వస్తుందని చెప్పడానికి చాలా గర్వంగా ఉంది. ఇది దాదాపు 15 లక్షల 62 వేల కుటుంబాలకు ఉపయోగపడబోతోంది. రూ.348.62 కోట్లు దీనికి డబ్బులు వెచ్చిస్తున్నారు. ముఖ్యమంత్రి గారి మనసును గమనించమని అడుగుతున్నాను. ఈరోజు చూస్తున్నాం, రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు మావి. ఎక్కడికో వెళుతున్నాము. ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగితే మాకుటుంబాలను పట్టించుకునే నాథుడు ఉండడు. ఆనాడు అంబేడ్కర్ గారి ఆలోచనా విధానంలోనే పైకి తీసుకు

వచ్చేందుకు గానీ, సహాయం చేయడానికి గానీ, వాళ్ల కుటుంబాల బాగోగులకు ఆపద వచ్చినప్పుడు ఆదుకోడానికి ఆలోచించిన పరిస్థితిని ఈనాడు మనం చూస్తున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే నేనున్నానని ఆ ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పిన ఘన చరిత్ర ఈ బడ్జెట్‌లో ఉంది. అంతేకాదు, ఎస్సీ, ఎస్టీ రైతులకు సంబంధించి రైతు భరోసాలో కౌలు రైతులుగా ఎవరైనా ఉంటే రూ.12,500 చొప్పున వాళ్లకు కూడా వర్తించే విధంగా చేయడమంటే దళితులారా, గిరిజనులారా వ్యవసాయం చేసుకోండి, కౌలు చేసుకోండి నేనున్నాను మీకు అండగా అని చెప్పిన ముఖ్యమంత్రిగా ఈరోజు జగన్మోహన్ రెడ్డి గారున్నారు.

అధ్యక్షా, ఇందాక పెద్దలు పార్థసారధి గారు చెప్పారు. ఆయన చెబుతుంటే హృదయం చలించిపోయింది. ఎందుకంటే ఈరోజు చూస్తున్నాం. దళితులకు ఉద్యోగాల్లో, పదవుల్లో, కాంట్రాక్టుల్లో, ట్రస్టు బోర్డులలో ప్రభుత్వం అవకాశాలు ఇస్తున్న పరిస్థితిని మీరు చూశారు. నేను రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్‌గా పని చేశాను. నేను అధ్యక్షుడిగా తిరుపతికి వెళ్లాను. అప్పుడు కరుణాకర్ రెడ్డిగారు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా ఉన్నారు. దళిత గోవిందం అని పల్లెల్లోకి దేవుడిని తీసుకు వెళ్లిన పరిస్థితిని ఆరోజు చూశాను. అలాగే వేద పాఠశాలల్లో దళితులు వేదాలు చదువుకోడానికి అవకాశాలు కల్పించారు డా.రాజశేఖర్ రెడ్డి గారు. తరువాత ఆ పరిస్థితి లేదు. ఈరోజు చూస్తున్నాను. ట్రస్టు బోర్డుల్లో దళితులు, వివిధ పదవుల్లో దళితులు, కాంట్రాక్టులలో దళితులు. ఇది ఎంత సదవకాశం. ఇది బంగారు బడ్జెట్. అదేకాదు గ్రామ సెక్రటేరియట్‌లో ఉద్యోగాలు. నిజంగా రాబోయే రోజుల్లో ప్రతీ దళితుడు చదువుకోవాలనే కసి పెరిగి ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ చదువుకుని ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకుని రాబోయే రోజుల్లో పల్లెలు బాగుపడటానికి ఆస్కారం కల్పించే బడ్జెట్ ఇది. (బెల్)

అధ్యక్షా, మేము ఈ రాష్ట్ర జనాభాలో చాలా మందిమి ఉన్నాము. మాకు మాట్లాడే అవకాశం దయచేసి కల్పించాలి. ఈ రాష్ట్రంలో మేము ఎంత మోసపోయామో, ఈ బడ్జెట్ మాకు ఎంత ఉపయోగమో చెప్పుకునే అవకాశం మీరు ఇవ్వాలి. నేను పీజీ చదివేందుకు కావలి పీజీ కాలేజీకి అప్లికేషన్ పెట్టాను. నాకు సీటు రాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సీటు వచ్చింది. చదువుకున్నాను. అప్పుడు అనుకున్నాను. నాన్-లోకల్ అయితే ఇట్లా ఉంటుందని అనుకున్నాను. జగన్మోహన్ రెడ్డి గారు ఒక మంచి ఆలోచనతో ఎక్కడన్నా పరిశ్రమలు ఉంటే ఎక్కడ ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతం వాళ్లకే 75 శాతం రిజర్వేషన్ కల్పించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతీ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టినందువలన ఆ ప్రాంతంలో ఉండే దళితులు బాగుపడటానికి ఆస్కారం ఉంటుంది. అధ్యక్షా, ఈరోజు అనేక కార్యక్రమాలు ముఖ్యంగా వై.ఎస్.ఆర్ పింఛను కార్యక్రమం పెట్టారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకూ పింఛను రూ.1000/- ఇచ్చేవారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు జగన్మోహన్ రెడ్డి గారు చెప్పారు. అయ్యా మీరిచ్చే వెయ్యి రూపాయలు చాలదు, రెండు వేల

రూపాయలు చేయాలని చెబితే అప్పుడు నాలుగు నెలల ముందు గత ప్రభుత్వం రూ.2000కి పెంచారు. అందుకనే జగన్మోహన్ రెడ్డి గారు ఎన్నికలు అయిన తరువాత వెంటనే మరో రూ.250 పెంచారు. అది రాబోయే రోజుల్లో రూ.3000 కాబోతున్నది. ఎందుకు చెబుతున్నానంటే దీనిలో కూడా దాదాపు 65 లక్షల మందికి ఉపయోగం జరగబోతుంది. రూ.15,000 కోట్లు పైబడి వెచ్చిస్తున్నారు. దీనిలో 30 నుంచి 35 శాతం మంది దళితులకు లాభం జరగబోతున్నది. వంద శాతం దళితులకు ఈ పింఛను అందబోతున్నదని గర్వంగా చెబుతున్నాను. (బెల్)

అధ్యక్షా, వై.ఎస్.ఆర్.ఆసరా పథకం ద్వారా డ్వాక్రామహిళలకు సంబంధించి రూ.27,162 కోట్లు నాలుగు విడతలుగా మహిళలకు ఇవ్వబోతున్నారు. దాదాపుగా 93 లక్షల కుటుంబాలకు ఉపయోగం జరగబోతున్నది. ఇది కూడా రాబోయే రోజుల్లో దళితులకు చాలా ఉపయోగపడే అంశం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: కన్‌క్లూడ్ చేయండి. ఇంకా మాట్లాడాల్సిన వారున్నారు.

శ్రీ మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA): అధ్యక్షా, నాకు అవకాశం కల్పించండి. చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. రాష్ట్రంలో ఏ విధంగా మేము మోసపోయామో చెప్పాలి. నాకు అవకాశం కల్పించండి.

MR.DEPUTY SPEAKER: Please proceed.

శ్రీ మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA): అధ్యక్షా, అమ్మఒడి కార్యక్రమం మన దేశంలో పర్టిక్యులర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చదువు విషయంలో పూర్తిగా వెనుకబడి ఉన్నదని చెప్పడానికి ఏ మాత్రం సంకోచించాల్సిన అవసరం లేదు. ఈ పథకం ద్వారా దళితులు పూర్తిగా లబ్ధి పొందుతున్నారు. అధ్యక్షా, మేము చిన్న పిల్లలప్పుడు మా తల్లిదండ్రులు మమ్మల్ని పొలానికి తీసుకుని వెళ్లేవారు. పొలం పక్కన కాలువ గట్ల మీద కూర్చుని మేము ఆడుకుంటూ ఉండేవాళ్లం. బడికి వెళ్లే వాళ్లము కాదు. అదే విధంగా మేము కొంచెం పెరిగితే మమ్మల్ని కమతానికి పెట్టేవాళ్లు. మేము కమతం చేసేవాళ్లం. కానీ ఈరోజు మా స్థితి గమనించి మాకన్నా ఇది వరకు ఎస్.ఆర్.శంకరన్ గారు, కేరళ ఐఏఎస్ అధికారిగారు ఈ రాష్ట్రంలో బ్రహ్మాండంగా దళితుల అభ్యున్నతి కొరకు పనిచేశారు. ఆ కోణంలోనే వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి తండ్రి రాజశేఖర్ రెడ్డి గారు, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి గారు ఇద్దరూ మనసున్న వ్యక్తులు. ఈరోజు ఈ బడ్జెట్ పల్లెటూరులో గుడిసెలో నేల మీద కూర్చుని దళితుల ఎదుగుదల కొరకు ఆలోచిస్తున్న బడ్జెట్ ఇది. అందుకనే మా పిల్లలు చదువుకోవాలని, మా పిల్లలు చదువుకుంటే తల్లులు ధైర్యంగా బ్రతకడానికి ఆస్కారం ఉంటుందని ప్రతీ కుటుంబానికి, ప్రతీ తల్లికి రూ.15,000 చొప్పున ఇస్తున్నారంటే దాదాపుగా 43 లక్షల కుటుంబాలకు రాబోయే రోజుల్లో ఉపయోగం జరగబోతోంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA): అధ్యక్షా, అనేక కార్యక్రమాలు వై.ఎస్.ఆర్.చేయూత గానీ లేదా గ్రామ సెక్రటేరియట్‌లో ఉద్యోగాలు గానీ అనేక అవకాశాలు కల్పిస్తున్నారు. అయితే బడ్జెట్‌లో ఇన్ని పెట్టినా దళితులుగా ఇంకా మేము అవమానించ పడుతూనే ఉన్నాము. దీనికి సంబంధించి గత 10 సంవత్సరాల్లో చూస్తే ఎస్సీ, ఎస్టీలు అత్యంత నిరాదరణకు గురయ్యారు. గత పది సంవత్సరాలు మాకు చీకటి కాలం. సామాజికంగా వెనుకబడిన మేము ఈ రాష్ట్రంలో వెనుకబాటుకు గురయ్యాము. వివక్షకు గురయ్యాము. అసలు మేము ఎక్కడున్నామో తెలియని పరిస్థితి. కానీ మాట కోసం నిలబడ్డ నాయకుని వెంట మేము ఉన్నాము. మమ్మల్ని వెంటాడారు. మమ్మల్ని వేధించారు. మాకు పేదరికం ఉన్నా ఆత్మ విశ్వాసం, అభిమానం మాకు మెండు. అందుకనే ఆయన వెంట నిలబడ్డాము. ఈ రాష్ట్రంలో దళితులను, గిరిజనులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బడ్జెట్ ఇది. (బెల్) అందుకనే చెబుతున్నాను. పది సంవత్సరాల్లో మేము పడ్డ కష్టాలు చెప్పాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: కన్‌క్లూడ్ చేయండి. ఇంకా చాలా మంది సభ్యులు మాట్లాడాలి.

శ్రీ మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA): అధ్యక్షా, స్వయానా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి దళితుల్లో ఎవరు పుడతారని చెప్పారు. సిగ్గు పడాలి. ఈరోజు అసెంబ్లీలో కూర్చుని మాట్లాడే అర్హత అతనికి ఎక్కడుంది? మా కులాన్ని వంచిస్తారా? నేను చెబుతున్నాను. రాబోయే రోజుల్లో భారతదేశంలో మాలాంటి వాళ్లు మరలా మరలా దళితులుగానే పుట్టాలని కోరుకుంటున్నాము. సిగ్గుపడాలి. మీరు చెబుతున్నారు. మామీద జరిగిన దాడులు అనేకము. అంబేడ్కర్ గారి విగ్రహం పెట్టమని వారిని అడిగితే గగనపురిలో మమ్మల్ని వెలివేస్తే మీకు కళ్లు ఏమైపోయాయని అడుగుతున్నాను.

మ 1.00

మమ్మల్ని మా కులాన్ని పట్టుకొని, చనిపోయిన ఆవు చర్మాన్ని వలుస్తుంటే, మా మీద దాడి చేస్తే అప్పటి ముఖ్యమంత్రిగారు మాట్లాడరు. పెందుర్తిలో మహిళను వివస్త్రను చేస్తే వారు మాట్లాడరు, ఈరోజు చూస్తున్నాం అచ్చెన్నాయుడుగారు ప్రతి దానికి లేస్తున్నాడు. నీ దగ్గరకు (శ్రీ కె.అచ్చెన్నాయుడ్ని ఉద్దేశించి) పని కోసం వచ్చిన ఎస్సీ మహిళా ఉద్యోగిని బూటు కాలితో తన్నావే నువ్వా మాట్లాడేది. నీకు సిగ్గులేదా అని అడుగుతున్నాను. ఇలాంటి అవమానాలు అనేకం. ఇలాంటి అవమానాలు కోకొల్లలు. నేను చెబుతున్నాను నిజంగా రాజ్యాంగం మీద విశ్వాసం ఉంటే చంద్రబాబు నాయుడు గారిని అరెస్ట్ చేయించాలి. అంత గర్విష్టి ఈ భారతదేశ రాజకీయాల్లో ఎవరు ఉండరు. నేను ఎందుకు

చెబుతున్నానంటే ఎస్సీల్లో ఎవరు పుడతారని దళితుల మీద దాడులు చేసి, దళితుల మీద అమానుషాలు చేస్తే వేలు మెదపని వ్యక్తి, ఈ రాష్ట్రానికి రాజకీయ నాయకుడిగా ఉండటానికి అర్హత ఉందా అని అడుగుతున్నాను. ఎందుకు చెబుతున్నానంటే దయచేసి వినండి రాష్ట్రంలో ఈరోజు చూస్తున్నాం. ఆయన టెన్యూర్‌లో సబ్-ప్లాన్ ఉంది. సబ్-ప్లాన్ నిధులు ఎన్ని దారి మళ్లాయి? సబ్-ప్లాన్ గైడ్‌లైన్స్ ఏమి చెబుతున్నాయి? ఎవరైనా పని చేయని అధికారులను బాధ్యులను చేయాలని ఉంది. చంద్రబాబు నాయుడు గారే బాధ్యులు. ఈరోజు చూస్తున్నాం అనేక కార్యక్రమాలు పర్టికులర్‌గా సంక్షేమానికి సంబంధించి, ఎస్సీల సంక్షేమాన్ని ఎంత అన్యాయం చేశారంటే, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీలకు అది రాజ్యాంగ బద్ధంగా వచ్చిన హక్కు, ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.700 కోట్లు చేతులు మారాయి, మిస్-అప్రాప్రియేషన్ జరిగిందని విజిలెన్స్ కమీషన్ చెబితే, ఆ విజిలెన్స్ కమీషన్ నివేదికను ఎక్కడ పెట్టారని అడుగుతున్నాను. ఎస్సీ కార్పొరేషన్‌లో భూమి కొనుగోలు పథకం ద్వారా రాజశేఖరరెడ్డి గారు లక్ష ఎకరాలను పంచితే, వీళ్లేమి చేశారో తెలుసా? ఇదివరకు అసైన్‌మెంటు భూములను దళితులు సాగుచేసుకుని పండించుకుంటుంటే ఆ భూములను లాక్కొని అక్కడ ఒక లక్షా లేక రెండు లక్షల్లో ఖరీదు ఉంటే, ఎనిమిది లక్షల ఖరీదు కట్టి డబ్బులు కాజేస్తే పట్టించుకోలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందు రూ.10 కోట్లతో ఎస్సీలకు సంబంధించిన ట్రాక్టర్లు, కార్లు కొనుగోలు చేసి ఇప్పటికీ పంచలేదు. దాంట్లో బత్తాలు తీసుకున్నారు. అంతేకాకుండా ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో జిరాక్స్ బిల్లులను పెట్టి కోట్ల రూపాయలు చేతులు మారాయి. నేను తమరి ద్వారా ముఖ్యమంత్రిగారిని అదే అడుగుతున్నాను. దయచేసి ఎస్సీ కార్పొరేషన్ మీద ఎస్సీలకు సంబంధించిన రెసిడెన్షియల్ స్కూల్స్ మీద తక్షణమే ఎంక్వైరీ వేసి బాధ్యులెవరో రాబోయే రోజుల్లో దళితులకు గిరిజనులకు అన్యాయం జరగకుండా కాపాడాల్సిందిగా నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఈరోజు చూస్తున్నాం. ఈరోజు హాస్టళ్లు.. అయ్యా నేను హాస్టల్లో చదువుకున్నాను. వీరి టెన్యూర్‌లో 648 హాస్టళ్లను మూసేశారు. ఎక్కడ ప్రజాస్వామ్యం, ఎక్కడ రాజ్యాంగం, ఎక్కడ అంబేడ్కర్ ఆలోచనా విధానం. ఈ రాష్ట్రంలో వారు 648 హాస్టళ్లను ఎందుకు మూసివేయాల్సి వచ్చింది? దానిని రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మారుస్తామన్నారంట. ఎక్కడ మార్చారు? అధ్యక్షా తమరి ద్వారా నేను అడుగుతున్నాను. మూడు ఫేజుల్లో హాస్టళ్లను మూసేశారు. రెండు ఫేజులకు మాత్రమే జీఓలను జారీ చేశారు. మూడో ఫేజ్‌కి జీఓ కూడా లేదు. ఎంత దారుణమంటే 27,677 మంది దళితులు చదువుకు దూరమైపోయారు. వీళ్లను ఏమి చేయాలి? వీళ్ల మీద ఎటువంటి కేసులు పెట్టాలి? ఇటువంటి పరిస్థితులు ఉంటే సంక్షేమానికి వాళ్లు ఎక్కడ సహాయం చేశారు? అభివృద్ధిని ఎక్కడ కోరారు? అందుకనే ఈ బడ్జెట్ ప్రజారంజకమైన బడ్జెట్. ఈ బడ్జెట్ అంబేడ్కర్ ఆలోచనా విధానం కలిగిన బడ్జెట్. అందుకనే ఈ బడ్జెట్ పూరి గుడిసెలో కూర్చొని ప్రజల భవిష్యత్‌ను కోరే నాయకుడ్ని పురిగొల్పే బడ్జెట్. ఈ బడ్జెట్ రాబోయే రోజుల్లో ఆంధ్రరాష్ట్ర చరిత్రలో దళిత సంక్షేమం విరాజిల్లుతుంది. అంబేడ్కర్ ఆలోచనా విధానం విరాజిల్లుతుంది. రాజశేఖరరెడ్డి గారి కాంక్ష బలపడుతుందనే ఒక ప్రగాఢమైన విశ్వాసం రాబోతోంది. తప్పకుండా ఈ బడ్జెట్ శ్లాఘనీయమైన బడ్జెట్. Thank you very much.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : రాజన్నదొర గారూ.. మాట్లాడాల్సిన వాళ్లు ఇంకా నలుగురు ఉన్నారు. కాబట్టి దయచేసి సమయాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడండి.

శ్రీ పీడిక రాజన్న దొర **(SRI PEEDIKA RAJANNA DORA)**(సాలూరు): అధ్యక్షా నా ప్రశ్నల విషయానికి వచ్చేసరికి పోస్ట్‌పోన్ చేయడమో లేక సింగిల్ సప్లిమెంటరీ కావడమో జరుగుతుంది. అందువల్ల మాట్లాడే అవకాశం రావడం లేదు. కాబట్టి కొంచెం ఎక్కువ సమయాన్ని కేటాయించమని కోరుతున్నాను.

శ్రీ పీడిక రాజన్న దొర **(SRI PEEDIKA RAJANNA DORA)**: అధ్యక్షా, మా పరిస్థితి మీకు తెలుసు. గిరిజనులు కొండలు, కోనలు, గుట్టలు, మెట్టలు, చెట్టులు, పుట్టలలో జీవిస్తున్న వారి జీవన విధానం మీకు తెలుసు. అటువంటి గిరిజనుల కొరకు మంచి బడ్జెట్‌ని ఈరోజు మన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈరోజు రూ.2,27,974 కోట్లతో మన బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ గురించి మాట్లాడే ముందు ఒక విషయం చెప్పాలి. ఈ రాష్ట్రంలో ఏడు గిరిజన శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. ఆ ఏడుగురు శాసనసభ్యులు, ఒక ఎంపీ కూడా జగన్‌మోహన్‌రెడ్డిగారి వెంటే ఉన్నారంటే దానికి కారణం రాజశేఖరరెడ్డి గారు. వారు మా గుండెల్లో గుడి కట్టుకుని ఉన్నారు. మా ఆత్మ బంధువుగా ఉన్నారు. మమ్ములను నిత్యము మేల్కొపుతూ నేనున్నాను ముందుకెళ్లండని చెప్పేవారు. గౌరవ ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి గారు ఉన్నప్పుడు నేను ఎదురుపడితే అందరూ ప్రపంచమంతా ఆయన్ను "రాజన్నా అని పిలిస్తే" ఆయన నన్ను చూసి రాజన్నా మనవాళ్లు బాగున్నారా అని అడిగేవారు. అంతకంటే ఆత్మీయత, అంతకంటే అనురాగం ఏమి కావాలి. అదే అనురాగం అదే ప్రేమ మా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి గారిలో చూస్తున్నాము. అందుకే ఆయనకు తోడుగా నీడగా, అండగా గుండెగా ఉండాలనే ఉద్దేశంతోనే మా ఏడుగురు శాసనసభ్యులం, ఎంపీ కూడా జగన్ వెంటే ఉన్నాము. శాసనసభలో మాకు అండగా నిలిచిన నాయకులు మా గిరిజనుల కోసం ఈ బడ్జెట్లో రూ.4988.52 కోట్లను మా ఉప-ప్రణాళికకు కేటాయించారు. అంటే సుమారు రూ.5 వేల కోట్లను కేటాయించారు. అందుకు మేము ధన్యవాదాలను చెప్పాలి కదా! ఇటువంటి మంచి ఉప-ప్రణాళికను పెట్టినందుకు మా కోసం రూ.5 వేల కోట్లను మంజూరు చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన గౌరవ ఆర్థికశాఖామంత్రిగారికి మా గిరిజనుల తరపున పేరుపేరునా హృదయపూర్వకమైన ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

అంతేకాకుండా ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.5 వేల కోట్లు గత బడ్జెట్లతో పోలిస్తే రూ.811 కోట్లు ఎక్కువగా కేటాయించారు. అంటే గతంతో పోలిస్తే 19.44 శాతం అధికంగా కేటాయించారు. అంటే గిరిజనులంటే ఒక అభిమానం, గిరిజనులంటే ఒక ప్రేమ, నేనున్నాను అనే ఒక భరోసా, అటువంటి బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. మీకు ఇప్పుడే చెప్పాను మా జీవనం, మా జీవితం, మా జీవన విధానం, మా మనుగడ, మా పరిస్థితులు, చదువు లేకపోవడం, నిరక్షరాస్యత, అణగారినతనం, మాకున్న

అమాయకత్వం. మాకు తెలిసింది ఒక్కటే నమ్మడం ఒక్కటే తెలుసు. ఎవరినైతే మేము నమ్ముతామో వారి కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉంటాము. అటువంటి నాయకుడు రాజశేఖరరెడ్డి గారి బిడ్డ జగన్మోహన్‌రెడ్డి గారు, ఆయన్నే మేము నమ్ముకున్నాము. మా నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు కాబట్టి, ఈ మంచి బడ్జెట్ ద్వారా మా గిరిజన ప్రాంతాల్లో ఉన్న గూడెములు, ప్రాంతాలు, గిరిజన మెట్టలు, గుట్టలన్నీ కూడా రోడ్లు వేయించి, త్రాగునీరిచ్చి, విద్యుత్ సౌకర్యాలను కల్పించి, వైద్యం ఆరోగ్యం అన్ని సౌకర్యాలను కల్పించాలని, ఈ బడ్జెట్ ద్వారా అవన్నీ నెరవేరుతాయని నేను భావిస్తున్నాను. తప్పకుండా ఈ బడ్జెట్‌ను తెలుగుదేశం ప్రభుత్వం మాదిరిగా కాకుండా, గతంలో చేస్తున్నట్లు కాకుండా ఈ బడ్జెట్‌ను ఉన్నది ఉన్నట్లుగా అమలు చేస్తారని మాకు నమ్మకం ఉంది. ఎందుకంటే గతంలో మేము చూశాము. 2014 నుంచి 2015 వరకు ఎన్నో ప్రణాళికలను ప్రవేశపెట్టారు. కానీ ఒక్కటి కూడా అమలు చేయలేదు. ఏది కూడా నూటికినూరు శాతం గానీ, డెబ్బై-ఎనభై శాతం కూడా అమలు కాలేదు. బడ్జెట్ కేటాయింపులు ఒకళ్లకు ఉండేవి, రిలీజ్ ఒకళ్లకు ఉండేది. ఆ చేసిన ఖర్చులు కూడా ఎక్కడికి పోతున్నాయో, ఎటు దారి మళ్లిపోతున్నాయో తెలియని పరిస్థితి ఉండేది. అటువంటి పరిస్థితుల్లో ఇది మంచి బడ్జెట్. అందుకే ఈ బడ్జెట్‌ని గిరిజనులంతా మేము మనస్ఫూర్తిగా ఆమోదిస్తున్నాం. ఈ బడ్జెట్‌ను పూర్తిగా ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయాల్సిందిగా గౌరవ ఆర్థికశాఖామంత్రిగారిని, గిరిజనశాఖామంత్రిగారిని నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. అంతేకాకుండా ఈ రూ.5 వేల కోట్ల బడ్జెట్‌కి అనుబంధంగా నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారు. ఆ నవరత్నాల పథకాల ద్వారా మా గిరిజనులకు మేలు జరుగుతుంది. గిరిజనులకు మంచి జరుగుతుంది. మా గిరిజనులకు మంచి జరుగుతుంది కాబట్టి ఇది సామాన్యుడి బడ్జెట్ అనాలి. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య బడ్జెట్. అక్షరాలు రాకపోయిన తమ ఇంట్లో కూర్చొని తమ బడ్జెట్ గురించి ప్రజలు దీవిస్తున్న బడ్జెట్. ఎందుకంటే ఒక ఆదాయాన్ని చూస్తున్నారు. మా కుటుంబానికి ఏమి ఆదాయం వస్తున్నది అనే దానికన్నా నవరత్నాల పథకాల ద్వారా మన కుటుంబానికి ఏ విధమైన లబ్ధి చేకూరుతుంది?

మ 1.10

మన కుటుంబానికి వచ్చే ఆదాయం ఏమిటి? ఖర్చు ఎంత? ఇవి తీశాక ఎంత మిగులుతుందంటే, తప్పకుండా నవరత్నాల పథకాల ద్వారా అందరికీ ఆర్థికంగా, సేవల ద్వారా లబ్ధి చేకూరుతుంది. అంటే, గిరిజనులకైతేనేమి, గిరిజనేతరులకైతేనేమి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేకూర్చే మంచి బడ్జెట్ ఇది అని చెప్పక తప్పదు. కార్మికులకు, కర్షకులకు, రైతులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు, మహిళలకు అందరికీ మేలు చేసే గొప్ప బడ్జెట్‌గా చెప్పుకోవాలి. వరుసగా నేను నాలుగవ సారి ఈ శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికై రావడం జరిగింది. గతంలో నేనెప్పుడు ఈ విధంగా అనర్గళంగా మాట్లాడలేదు. బడ్జెట్ గురించి అవగాహన కూడా ఉండేది కాదు. ఎవరు చూసినా సులభంగా,

సింపుల్‌గా అర్థమయ్యే బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి గారు సభలో ప్రవేశపెట్టారు. జగనన్న 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో గ్రామాల్లో నడుచుకుంటూ వెళ్తూ అందరితో మాట్లాడారు. వాళ్ల బాధలు తెలుసుకునేవారు. ప్రజల ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాళ్లకు ఏదేది చెప్పారో, అదే స్పష్టంగా బడ్జెట్‌లో కనిపిస్తోంది. జగనన్న గారూ ఎప్పుడో చెప్పారు. ప్రజలందరి చల్లని దీవెనలతో, దేవుడి దయతో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రజలందరికీ నవరత్నాలిస్తానని చెప్పారు. అందుకే ప్రజలందరు కూడా "రావాలి జగన్-కావాలి జగన్" అని కోరుకున్నారు. అందుకే జగన్ గారు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కాబట్టి, జగనన్న వచ్చాడు, నవరత్నాలు తెచ్చాడు, ప్రజలందరికీ ఇచ్చాడు, ప్రజల మనిషి అయ్యాడు. అందుకే ఇది ప్రజల బడ్జెట్. ఈ బడ్జెట్‌ను ముఖ్యమంత్రి గారు ప్రజలకు అంకితం చేశారు అని చెప్పుకోవాలి. అంకిత భావంతో ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. కేవలం అరచేతిలో వైకుంఠం చూపించో, గ్రహ స్థితులు ఆకాశం వైపు చూపించే బడ్జెట్ కాదిది. ఇది పూర్తిగా ప్రజలకు సంబంధించిన బడ్జెట్. గిరిజనులు, హరిజనులు, బడుగు, బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీలు అందరికీ సంబంధించిన బడ్జెట్‌గా దీన్ని అభివర్ణించక తప్పదు. ప్రతి ఒక్క వర్గం దీన్ని అంగీకరించక తప్పదు. అలాగే, ఇప్పుడు మా సోదరులు, నాగార్జున గారు కూడా చెప్పారు. గతంలో ఉన్న పరిస్థితి, ఈరోజున ఉన్న పరిస్థితి వేరు అని చెప్పారు. ఆరోజున ఒక పెన్షన్ సొమ్ము తీసుకోవాలనుకుంటే, కులాలు, మతాలు, రాజకీయ పార్టీలనే విధంగా చూశారు. కానీ, డా.రాజశేఖర రెడ్డి గారు saturation system లో కులం లేదు, మతం లేదు, రాజకీయలొద్దు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వండి, పేదవాడి కన్నీటి బొట్టు మనకు వద్దు. ఆ కన్నీరు తగిలిందంటే, మనమేమైపోతామో తెలియదు కాబట్టి పేదవాడే మనవాడు. అవసరం, అర్హత ఈ రెండు చూసి పెన్షన్ మంజూరుచేసే వారు. అందుకే అవసరం చూసి, అర్హత చూసి ఆరోజున ఆ మహానేత రాజశేఖర రెడ్డి గారు పెన్షన్లు పంచారు. ఈరోజున ఈ ప్రజానేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు కూడా అవసరం, అర్హతే చూడమంటున్నారు గానీ, కులాలు, మతాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా పెన్షన్ ఇస్తున్నారంటే ఎంత గొప్ప మనస్సు వారిదనేది తెలుస్తోంది. ఈ పెన్షన్ పథకం 30 నుంచి 35 శాతం హరిజనులు, గిరిజనులు, బడుగు, బలహీనవర్గాలు, మైనారిటీలకు వర్తిస్తోంది. ముఖ్యంగా పెన్షన్‌కు అవసరమైన వయో పరిమితి తగ్గించడం వల్ల ఎక్కువ మంది గిరిజనులకు కూడా లబ్ధిచేకూరుతుంది. అటువంటి గొప్ప పెన్షన్ పథకం "వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుక". ఇంతకన్నా ఏ ఊహలు చెప్పాలి? ఇంతకన్నా గొప్ప పథకం, ఇంతకన్నా గొప్ప మనస్సు, ఇంతకన్నా గొప్ప బడ్జెట్ ప్రజలకు ఇంకేమి కావాలి? మరొక పథకం '' వై.ఎస్.ఆర్. ఆసరా". మనం ఎన్నికలకు ముందు ప్రజలకు చెప్పాం. తెలుగుదేశం పార్టీ వాళ్లు ప్రజలకు చెప్పారు. ఏమనంటే, పైసలతో సహా అక్కా, చెల్లెమ్మలు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. కానీ, ఏం చేశారు? కానీ, ఈరోజు మా నాయకుడు, జగన్మోహన్ రెడ్డి గారు ప్రజలకు చెప్పారు. నేను అధికారంలోకి రాగానే నాలుగు దఫాలుగా మీ చేతికి డబ్బులు ఇస్తాను, మీరే వెళ్లి బ్యాంకుల్లో తీసుకున్న రుణం డబ్బు కట్టుకోండని చెప్పారు. వారు ఆ మాట మీద నిలబడ్డారు. ఆ అక్కా, చెల్లెమ్మలకు రేపొద్దున డబ్బు ఇవ్వబోతున్నారు. అంతకన్నా గొప్ప మనస్సు,

అంతకన్నా మంచి మనస్సు, అంతకన్నా మానవత్వం, ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తిత్వం ఎవరికి ఉంటుంది? ఆ విధంగా ఈరోజున 93 లక్షల కుటుంబాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగుపడుతున్నాయంటే, అదొక గొప్ప విషయమే కదా! తమరు ఒకసారి ఆలోచించండి.

అధ్యక్షా, ఇంటి స్థలం విషయం గురించి మాట్లాడుకోవాలి. ఇప్పుడు మా మాజీ మంత్రివర్యులు చెప్పారు. అదే విధంగా రాపాక వరప్రసాదరావు గారు చెప్పారు. ఈరోజున ఇంటి స్థలం కొనాలంటే చాలా కష్టంగా ఉంది. ముఖ్యంగా ఈరోజున గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం కొనాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితి కనబడుతోంది. అటువంటిది, 25 లక్షలకు పైగా ఇంటి స్థలాలు కొనడం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. అందుకు ఎన్ని వేల కోట్ల రూపాయల డబ్బు అవసరం పడుతుంది. దానికి కూడా మా నాయకుడు, ముఖ్యమంత్రి గారు ఏ మాత్రం వెనుకాడటం లేదు. డబ్బుల కోసం వెనకాడకండి. ప్రజలకు మాటిచ్చాం. మాట మీద నిలబడాలి. ప్రజల కోసం, పేదల కోసం మనం ఏదైనా చేయాలి, ఎంతైనా ఖర్చు పెట్టాలని చెప్పిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి గారు. ఆ విధంగా మా నాయకుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మందికి ఇంటి స్థలాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారు. 25 వేల ఇండ్లను నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో నేనొక మనవి చేసుకుంటున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారికి, అలాగే ప్రభుత్వానికి కూడా నేను ఒక మనవి చేస్తున్నాను. చాలా మందికి గత ప్రభుత్వ హయంలో గృహాలు మంజూరైనాయి. ఆనాడు రాజశేఖర రెడ్డి గారు నా నియోజకవర్గానికి 55 వేల ఇండ్లు ఇస్తే, దాంట్లో 35 వేల ఇండ్లు వివిధ దశల్లో మంజూరు కాగా, మిగిలిన, మంజూరు కావల్సిన 15 వేల ఇండ్లను గత ప్రభుత్వం మంజూరు చేయకుండా రద్దుచేసింది. మంజూరైన వాటిలో కూడా కొన్ని పునాదులు వేసిన స్టేజిలో ఉండగా, మరికొన్ని లింటేల్ వరకు, రూఫ్ వరకు వచ్చి నిర్మాణాలు పూర్తి కాకుండా నిలిచిపోయాయి. అటువంటి లబ్ధిదారులెవ్వరికీ గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. అటువంటి ఇండ్ల నిర్మాణాన్ని కూడా పూర్తిచేయవల్సిందిగా నేను గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ ఆర్థిక శాఖ మంత్రి గారికి, గౌరవ హౌసింగ్ మినిస్టర్ గారికి, అలాగే గౌరవ గిరిజన సంక్షేమ శాఖ ఉప ముఖ్యమంత్రి గారికి మనవి చేస్తున్నాను. నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. లబ్ధిదారులు అప్పులు తెచ్చి, ఇంటి నిర్మాణానికి ఖర్చు చేశారు. చేసిన అప్పు అలాగే ఉండిపోయింది. కాబట్టి ఇప్పటికే ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులకు కూడా కొత్తగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, సగం మధ్యలో అసంపూర్తిగా ఇంటి నిర్మాణం మిగిలిపోయిన వాటికి వెసులుబాటు కల్పించాలని, అటువంటి ఇండ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వాలని తమరి ద్వారా ప్రభుత్వానికి మనవి చేసుకుంటున్నాను. అదే విధంగా ఆరోజు ఆ మహానేత రాజశేఖర రెడ్డి గారి మానస పుత్రిక "ఆరోగ్యశ్రీ" పథకం. మా నేత, ప్రజానేత, ప్రజల మనిషి , జగనన్న గారి మానస పుత్రిక "జగనన్న అమ్మఒడి". జగనన్న అమ్మఒడి అంత గొప్ప పథకం మరొకటి ఉండదు. నేను చదువుకునే రోజుల్లో వంద రూపాయలు కావాలంటే, ఇల్లు తాకట్టు పెట్టాలి, మాకుండే కొద్ది పాటి పొలాన్ని తాకట్టు పెట్టాలి లేకుంటే మాకున్న పశువులు, ఆవులు, గేదెలను కూడా తాకట్టు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఆరోజున మాకు ఉండేది.

కానీ, ఈరోజున తల్లులకు, అక్కా, చెల్లెమ్మలకు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే, రూ.15 వేలు ఇస్తున్నారంటే, ఎంత మానవత్వం, ఎంత ఆదర్శం, ఎంత గొప్ప మనస్సు. ఒక తల్లికి, ఒక అక్కకు, ఒక చెల్లికి ఇచ్చిన ఎంత గౌరవం అది. ఎందుకంటే, అమ్మఒడి పథకం గురించి మనం చెప్పొద్దు. ఎందుకంటే, అమ్మఒడి జగనన్న బడి, బడి, గుడికన్నా అమ్మఒడి, అక్కడి నుంచే లాగిపడతాం, అక్కడి నుంచే మనం జోల పాడుతాం, అక్కడి నుంచే మనం గుడి ముందు మొక్కుకుంటూ మనం బడికి వెళ్తాం. అటువంటి మంచి పథకం ఆయన మానస పుత్రిక ''అమ్మఒడి''. దీనివల్ల ఎంతో మందికి మేలు జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం వల్ల సుమారుగా 43 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఎంతో మంచి పథకం ''అమ్మఒడి'' పథకం. ఇందాక మా సోదరుడు చెప్పినట్లుగా, ఎక్కడో ఎ.సి.రూముల్లో కూర్చున్న వాళ్లకు, పెద్ద, పెద్ద భవంతుల్లో కూర్చున వాళ్లకు ఈ ఆలోచన రాదు. జగన్మోహన్ రెడ్డి గారు పాదయాత్రలో నడిచారు, ప్రజల కష్టాలు చూశారు, పూరి గుడిసెలు చూశారు, చాలాచోట్ల కూర్చున్నారు, అక్కడ వచ్చిన ఆలోచనే ఈ పథకం. ప్రజల కష్టాలన్నీ చూసి, ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితిని చూసి, ఇలా ఉంటే ఎలా? ప్రతి ఒక్కరూ చదువుకోవాలి, చదువు కొనడానికి కాదు, చదువు కావాలి అనే ఉద్దేశంతో ప్రతి తల్లికి కూడా ఈ అవకాశాన్ని కల్లజేసి మంచి గొప్ప బడ్జెట్‌ను అమ్మఒడి పథకం ద్వారా ఇచ్చారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: త్వరగా కంక్లూడ్ చేయండి.

శ్రీ పీడిక రాజన్న దొర (**SRI PEEDIKA RAJANNA DORA**): ముగింపుకు వచ్చేస్తున్నాను. అలాగే "వై.ఎస్.ఆర్. చేయూత". 45 నుంచి 60 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీ.సీ., మైనారిటీ మహిళలకు చేయూతనివ్వడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతి తల్లికి, ప్రతి అక్కకు, ప్రతి చెల్లికి నేనున్నాను, మీరు భయపడకండి, దేనికైనా మీ జగనన్న ఉన్నాడు, మీరు ఒక కొడుకుగా, ఒక అన్నగా, ఒక తమ్ముడిగా ఆదరించారు కాబట్టి నేను ఆదుకుంటానని చెప్పి రూ. 75 వేలు నాలుగు సంవత్సరాల్లో ఇచ్చి ఆర్థికంగా వాళ్లకు చేయూతనిచ్చి, వాళ్లను పైకి తీసుకు వచ్చి, రాజశేఖర రెడ్డి గారి కొడుకుగా మరొకసారి మంచి ఆదర్శమూర్తిగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తున్నారు.

ఇక గ్రామ సచివాలయాలు. ఇందాక నేను ప్రశ్న వేశాను. నా ప్రశ్న దగ్గరకు వచ్చి ఆగిపోయింది. దాంట్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల విషయాన్ని ప్రస్తావించాను. గత ప్రభుత్వంలో పది వేలకు పైగా బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీకాకుండా పెండింగ్‌లో ఉండిపోయాయి. కానీ, మా నాయకుడు, ఇక్కడున్న జగన్మోహన్ రెడ్డి గారు, మన ముఖ్యమంత్రి గారు చదువుకున్న నిరుద్యోగ యువత కోసం గ్రామ వాలంటీర్లు, వార్డు వాలంటీర్ల ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా సుమారుగా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారంటే, నిరుద్యోగ యువతకు ఎంత భరోసా. ఉద్యోగాలు లేక నిరుద్యోగ భృతి కోసం అడుగుతున్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఎంత మందికి కల్పించింది?

నిరుద్యోగ భృతి ఇవ్వడం కాదు, ఉన్న ఉద్యోగాలను ఇవ్వలేక పోయారు గత ప్రభుత్వ హయాంలో అని మనవి చేస్తున్నాను. కానీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు గ్రామ వాలంటీర్లు, వార్డు వాలంటీర్లుగా ఉద్యోగాలు ఇవ్వడం ఎంత గొప్ప విషయం. ఇవాళ గ్రామ వాలంటీర్లు కావచ్చు, అదే విధంగా వార్డు వాలంటీర్లు కావచ్చు, అదే విధంగా గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఉద్యోగాలు కావచ్చు. ఆ విధంగా హరిజన, గిరిజన, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల్లో చదువుకున్న యువతకు సుమారుగా **1,35,000** మందికి ఉద్యోగావకాశాలు కల్గుతాయి. అంతటి మంచి కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు చేపడుతున్నారు.

ఇక రైతు భరోసా పథకం గురించి చెప్పనక్కర్లేదు. మే నెలలోనో, వచ్చే నెలలోనో వచ్చేది అనుకునే పథకాన్ని ముందుకు తీసుకువచ్చి రాబోయే అక్టోబర్ మాసం నుంచే రూ. **12,500/-** లు ప్రతి రైతుకు ఇస్తానని ముందుకు వచ్చిన ప్రభుత్వాన్ని అభినందించాలి. ఆర్థిక వనరుల గురించి చూడకుండా రైతు మేలు కోసం ఆలోచించి, అన్నం పెట్టే రైతు బాగు కోసం ముందుకు వచ్చిన గొప్ప ప్రభుత్వం మనది. అలాగే మంచి ఆలోచనతో ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. అదే విధంగా స్థానిక ఉద్యోగాల కల్పన. స్థానిక ఉద్యోగాల కల్పనలో కూడా స్థానికులకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. స్థానికంగా చిన్న, చిన్న పరిశ్రమలుంటాయి కాబట్టి అక్కడ స్థానికులు ఎవరున్నారో గుర్తించి, అందులో హరిజనులు కావచ్చు, గిరిజనులు కావచ్చు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వాళ్లు కావచ్చు. కాబట్టి **75%** రిజర్వేషన్ స్థానికులకు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతుందంటే, అటువంటి ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు చెప్పాలి కదా! ఇంత మంచి అవకాశాలను కల్గజేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అలాగే గిరిజనులకైతే **200** యూనిట్ల వరకు విద్యుత్ వినియోగానికి సంబంధించి, ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతోంది. అలాగే, గిరి పుత్రిక కళ్యాణం పథకం క్రింద పెళ్లి చేసుకునే అమ్మాయికి ప్రభుత్వం రూ. **1.00** లక్ష ఇస్తోంది. అలాగే, జగనన్న విద్యోన్నతి పథకం, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం, అలాగే కులాంతర వివాహం చేసుకుంటే ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకం, కాఫీ తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం. అలాగే, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తోన్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు నెలకు జీతం క్రింద గత ప్రభుత్వం ఇస్తోన్న రూ. **400/-** లను రూ. **4** వేలకు పెంచారు. తినడానికి తిండి లేని వాళ్లకు కూడా అంతటి అవకాశం కల్పించి, ఇంకా ప్రజా సేవ చేయండని చెప్పే గొప్ప మనస్తత్వం జగన్మోహన్ రెడ్డి గారిది. అదే విధంగా గిరిజన విశ్వవిద్యాలయం. అక్కడ గిరిజన ప్రాంతంలో బ్రాడ్ బ్యాండ్‌కు సంబంధించి అవకాశాలు కల్పించారు. ఇవే కాకుండా ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే, వాళ్ల కుటుంబానికి రూ. **1.00** లక్ష బీమా పథకం క్రింద పరిహారం ఇచ్చి ఆదుకోవాలని నిర్ణయించారు. అలాగే, పాడేరు, అరుకు మరియు విజయనగరం జిల్లాలో వైద్య కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నందుకు, అందుకు అవసరమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి మీ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఒకటి, రెండు నిమిషాల్లో నా ప్రసంగాన్ని ముగిస్తాను. తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి, ప్రభుత్వానికి మనవి చేసుకుంటునాను. గిరిజన సలహా మండలి

ఏర్పాటు. ఈ గిరిజన సలహా మండలి 5వ షెడ్యూల్ ప్రకారం, ఆర్టికల్ 244 ప్రకారం ఏర్పాటు చేయాల్సి ఉంది. అటువంటి దాని కోసం గత ఐదు సంవత్సరాలుగా మా కోసం మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్రపతి గారి దగ్గరకు, గవర్నర్ గారి దగ్గరకు వెళ్లి పోరాటం చేయాల్సివచ్చింది. మా హక్కును, రాజ్యాంగపరమైన, రాజకీయపరమైన మా హక్కును సాధించుకోవడం కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు ఉన్నత న్యాయస్థానమైన హైకోర్టును కూడా మేం ఆశ్రయించాల్సి వచ్చింది. అందు నిమిత్తం త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటుచేస్తామని ఇప్పుడే గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. గిరిజనుల తరఫున నేను వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. అలాగే, ప్రత్యేక ఎస్టీ కమీషన్ ఏర్పాటు. ఎస్టీ కమీషన్ ఏర్పాటు గురించి కూడా ఆనాటి మహానేత రాజశేఖర రెడ్డి గారు గిరిజనులకు ప్రత్యేకంగా ఎస్టీ కమీషన్‌ను ఏర్పాటుచేయాలని సంకల్పించారు. ఆ మహానేత మన మధ్య లేరు కాబట్టి ఆ అంశం అంతటితో ఆగిపోయింది. కాబట్టి ప్రత్యేకంగా ఎస్టీ కమీషన్ ఏర్పాటు విషయమై సత్వరమే ప్రభుత్వం పరిశీలన చేసి ఎస్సీ కమీషన్ నుంచి ఎస్టీ కమీషన్ ఏర్పాటు దిశగా విడదీసి ప్రత్యేకంగా ఎస్టీ కమీషన్‌ను ఏర్పాటుచేయాలని కూడా ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి గారికి తమరి ద్వారా మనవి చేసుకుంటున్నాను.

మ 1.20

అధ్యక్షా, తాండాలుగా ఉన్నవి పంచాయతీలుగా చేయాలని కోరుతున్నాను. 500 గిరిజన జనాభా ఉన్న తాండాలను పంచాయతీగా చేస్తామన్నారు. 500 గిరిజనులు ఉన్న తాండాలను పంచాయతీగా చేయాలని తమరి ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

ఇప్పుడు జిసిసి ఉంది. జిసిసి అనేది భారతదేశంలో ఉండే గిరిజనుల కోసం పెట్టిన మొట్టమొదటి కార్పోరేషన్ అది. దాని పరిస్థితి ఈరోజు 1,800 ఉద్యోగాలను మంజూరు చేస్తే దానిలో కేవలం 351 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. అంటే 707 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి తమరిద్వారా నేను ప్రభుత్వానికి మనవి చేసేదేమంటే జిసిసిని ప్రభుత్వంలో కలపాలి లేదా దీనిని పునర్వ్యవస్థీకరణ చేయాలని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

ఇక ఆర్థిక మద్దతు ఇచ్చే కొన్ని పథకాలు ఉన్నాయి. Economic Support Schemes. దీంట్లో అవినీతి అనేది ఎక్కువగా జరుగుతోంది. గతంలో మనం చెప్పుకున్నాం. ఎస్సీ కార్పోరేషన్ కావచ్చు, ఎస్టీ కార్పోరేషన్ కావచ్చు, బీసీ కార్పోరేషన్ కావచ్చు, వీటిద్వారా అనేక పథకాలు ఇస్తున్నారు. అవన్నీ కూడా దొంగలపాలై పోతున్నాయి. అవన్నీ కూడా గిరిజనుల పేరున తీసుకుని తెలుగుదేశం కార్యకర్తలు వాటిని అనుభవిస్తున్నారు. ట్రాక్టర్లు కావచ్చు, బుల్డోజర్లు కావచ్చు, వ్యాన్లు కావచ్చు, జెసిబీలు కావచ్చు, కార్లు కావచ్చు, రకరకాలవి ఇస్తున్నారు. ఇవన్నీ కూడా ఇతర దారులకు మళ్లిపోయి పక్కదారి పట్టిస్తున్నారు.

కాబట్టి వీటిమీద గతంలో ఇచ్చిన వాటన్నిటి మీదా దర్యాప్తు చేయించి నిజంగా గిరిజనులకు అందాయో లేదో అనేది సమగ్ర దర్యాప్తు చేయించాలని తమరి ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, అటవీ భూములకు సంబంధించి గౌరవ ముఖ్యమంత్రిగారికి తమరి ద్వారా మనవి చేసేదేమంటే, ఇది రాష్ట్ర సమస్య కాదు, దేశ సమస్య. ఆనాడు మహానేత రాజశేఖరరెడ్డిగారు రెండు ఉమ్మడి రాష్ట్రాలు కలిపి 2006 అటవీ హక్కుల చట్టం కింద 23 లక్షల మందికి భూములు ఇచ్చారు. అటువంటి భూములను మొన్న సుప్రీం కోర్టు తీర్పుతో ఈరోజు గిరిజనులు అక్కడ ఉండకూడదు, భూముల నుంచి కిందకు దిగి వచ్చేయాలి, జూలై నెలాఖరి వరకు రాకపోతే వాళ్లని కిందకు దింపించే బాధ్యత అటవీశాఖకు, రెవెన్యూ శాఖకు ఇచ్చింది. కాబట్టి తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి మనవి చేసేదేమంటే కేంద్రప్రభుత్వంతో మాట్లాడి సుప్రీం కోర్టులో రెవ్యూ పిటీషన్ వేయించి దానిని తప్పకుండా ఆపుచేసి, మన రాష్ట్రంలో ఉన్న సుమారు 8 లక్షల మంది గిరిజనులు ఏవైతే బీడు భూములు, పోడు భూములు, కొండ భూములు సాగు చేసుకుంటున్నారో వారందరికీ న్యాయం జరిగేటట్టు చేయాలని తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగారికి అదేవిధంగా అటవీ శాఖా మంత్రిగారికి తమరి ద్వారా మనవి చేసుకుంటున్నాను.

అధ్యక్షా, మరొక పాయింట్ చెప్పి ముగిస్తాను. బాక్సైట్. తమరు చూశారు. ఈ బాక్సైట్ కోసం మేము ఎన్నో పోరాటాలు చేశాం. ఈ బాక్సైట్ అంశం మీద తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ రాజశేఖరరెడ్డిగారి గురించి చెబుతారు. కానీ 2000వ సంవత్సరంలో ఈ బాక్సైట్‌కు దారితీసింది, దారి వేసింది తెలుగుదేశం ప్రభుత్వమే. అప్పటి గిరిజన సలహా మండలి దీనిని పెట్టి విశాఖపట్నం జిసిసి ఆఫీసులో కూర్చొని అప్పుడున్న మంత్రులు, ఎమ్మెల్యేలంతా కలిసి దీనికి దారితీసి బాక్సైట్ తవ్వకాలకు పునాదులు వేసింది తెలుగుదేశం వారే అధ్యక్షా రాజశేఖరరెడ్డిగారు కాదు. అటువంటి దానిని మొన్న తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో జీఓ నెం. 97 ను జారీ చేశారు. దానికి వ్యతిరేకంగా మా నాయకుడు జగన్మోహన్‌రెడ్డిగారు చింతపల్లిలో డిసెంబరు 10, 2015న భారీ గిరిజన బహిరంగ సభను ఏర్పాటుచేయడం జరిగింది. ఆరోజు గిరిజనులకు హామీ ఇచ్చారు. మీ తరఫున నేను ఉంటాను. గిరిజనుల మనోభావాలను ఎప్పటికీ నేను గౌరవిస్తాను. మీరు చేసే పనులన్నింటికీ నేను అండగా ఉంటాను, హామీగా ఉంటాను, నన్ను నమ్మండి అని చెప్పారు.

అదేవిధంగా అవసరమైతే ఆ జీఓను రద్దు చేస్తానని ఈమధ్య మా నాయకుడు చెప్పారు. అందుకే మా గౌరవ ముఖ్యమంత్రిగారికి మనవి చేస్తున్నాను. ఆ జీఓ నెం. 97 అలాగే పెండింగ్‌లో ఉండడం వల్ల గిరిజనులు ఆలోచిస్తూ కొంచెం తికమకగా ఉంటున్నారు కాబట్టి ఆ జీఓను రద్దు చేసేందుకు ఒక నిర్ణయం తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రిగారికి మనవి చేస్తున్నాను. ఇంత మంచి బడ్జెట్, ఇది పేదలకు, ప్రజలకు, గిరిజనులకు, హరిజనులకు, దళితులకు, బడుగు, బలహీనవర్గాలకు,

అందర్నీ కూడా ఆకట్టుకునే బడ్జెట్, ఆదుకునే బడ్జెట్, గొప్ప బడ్జెట్, ఆకర్షణీయమైన బడ్జెట్. నేను నాలుగైదు సార్లు ఎమ్మెల్యే అయిన తర్వాత నేను చూసి ఇంత మంచి బడ్జెట్, ఇంత ప్రజారంజకమైన బడ్జెట్, ప్రజలందరూ చర్చించుకునే బడ్జెట్, ఇంటింటా చర్చించుకుంటున్నారు. అటువంటి గొప్ప బడ్జెట్‌ను ఈ శాసనసభలో ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రిగారికి, ఆర్థిక శాఖా మంత్రిగారికి ధన్యవాదాలను తెలియజేసుకుంటూ మీదగ్గర సెలవు తీసుకుంటున్నాను.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్: హాఫీజ్ ఖాన్ గారు.

(ప్రతిపక్ష సభ్యులు డా. నిమ్మల రామానాయుడుగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని, మా సభ్యుల్లో ఒకరికే అవకాశం ఇచ్చారని, టైం అయిపోతుందని అన్నారు)

Your time limit is very short. మీకు కూడా మాట్లాడటానికి అవకాశం ఇస్తాను. ఎందుకు గాబరా పడుతున్నారు మీరు?

శ్రీ అబ్దుల్ హాఫీజ్ ఖాన్ (ABDUL HAFEEZ KHAN)(కర్నూలు): ధన్యవాదాలు అధ్యక్షా, వాళ్లు గత 5 సంవత్సరాల్లో ఒక్క మైనార్టీ వర్గ ఎమ్మెల్యేకు కూడా మాట్లాడటానికి అవకాశం కల్పించలేదు. 5 సంవత్సరాల తర్వాత నాకు అవకాశం వచ్చింది, దయచేసి నాకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాను.

ముందుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నాకు మాట్లాడే అవకాశం కల్పించిన కర్నూలు ప్రజలకు మరియు ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వం. పేదవాడు ప్రశాంతంగా గడపడానికి ఏమి కావాలో తెలుసుకున్న ప్రభుత్వం. నవరత్నాలు లాంటి అద్భుతమైన పథకాలతో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు దేశంలోనే అందరికీ ఆదర్శవంతమైన పాలన అందించబోతున్నారని చెప్పడానికి సంతోషపడుతున్నాను.

ముఖ్యంగా అధ్యక్షా, గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున ముస్లిం మైనార్టీలకు 5 సీట్లు ఇచ్చి నలుగురిని గెలిపించుకున్న ఘనత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారికే దక్కింది.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

2014 మరియు 2019 ఎన్నికల్లో వరుసగా నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారు. మరి ఒకరు ఇక్బాల్‌గారు ఓడిపోతే ఆయనకు కూడా న్యాయం చేసి ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పిన ఘనత జగన్మోహన్‌రెడ్డిగారిదే. అదే తెలుగుదేశం పార్టీలో ఒక్కరూ కూడా 2014లో గాని, 2019లో గాని గెలిచింది లేదు. మైనార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా మైనార్టీలకు ఎప్పుడూ అండగా ఉంది.

బడ్జెట్ విషయానికొస్తే, ముందుగా రాష్ట్ర శాసనసభలో ఈ ప్రభుత్వం తరఫున బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్‌గారికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

అధ్యక్షా, ఈ దేశంలో, రాష్ట్రంలో ముస్లింలు ఎంతో వెనుకబడి ఉన్నారు. అన్ని వర్గాల కన్నా దయనీయంగా ముస్లింలు బతుకుతున్నారనేది తెలిసిన విషయమే. ఇదే విషయాన్ని "సచార్ కమిటీ" తన నివేదికలో కూడా చెప్పింది. చిన్న వృత్తులు చేసుకుంటూ పేదరికంతో కష్టపడే ముస్లింల జీవితాలను చదువు ఒక్కటే మార్చగలుగుతుందని, కానీ ఆ చదువుకునే అవకాశాలు పేదరికం వల్ల దూరమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు డ్రాపవుట్స్‌కు గాని, పేద వర్గాలకు చెందిన డ్రాపవుట్స్‌కు గాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సరిగ్గా ఈ సమయంలో రాష్ట్రప్రభుత్వం "జగనన్న అమ్మఒడి" పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చి అందరికీ చదువును దగ్గర చేసింది. సుమారు 43 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఇతర పేదవర్గాల పిల్లలు ఈ పథకం ద్వారా బాగుపడతారు. This is a step towards eradication of illiteracy. వైఎస్సార్ గారి కుటుంబం మైనార్టీలకు ఏది చేసినా నిండు మనసుతో, ప్రేమతో మేము అభివృద్ధిలో భాగం కావాలని చేశారు. దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారి హయాంలో కూడా ముస్లింల కోసం విద్య, ఉపాధి రంగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ రిజర్వేషన్ వల్ల లక్షలాది మంది ముస్లిం పిల్లలు బాగుపడ్డారు. ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారు. చాలామందికి ఉద్యోగాలు వచ్చాయి. సామాజికంగా, ఆర్థికంగా ఎదిగారు.

అధ్యక్షా, చదువు తర్వాత సగటు మనిషి కోరుకునేది ఇల్లు. సొంతంగా ఇల్లు ఉండాలనేది పేదవాని కల. ఆ కల నెరవేర్చే పథకం వై.ఎస్.ఆర్ గృహ నిర్మాణ పథకం. ఇప్పటికీ రాష్ట్రంలో ఎంతోమందికి ఇల్లు లేదు. పేద, బడుగు బలహీన వర్గాలకు, మైనార్టీలకు సొంత ఇల్లు ఒక కల. ముస్లిం మైనార్టీలు

అయితే అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లల్లో నివసిస్తున్నారు. ఒక ఇంట్లో నలుగురు మనుషులు ఉన్నప్పుడు ఆ ఇల్లు అగ్గిపెట్టెలా ఉన్నప్పుడు వాళ్లు పడే కష్టాలు గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గారికి తెలుసు. ఎందుకంటే ఆయన స్వయంగా పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. ముస్లిం వాడల్లో, ఎస్సీ, ఎస్టీ, బీసీ వాడల్లో తిరిగి స్వయంగా చూసి తెలుసుకున్నారు. అందుకే అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టారు.

అధ్యక్షా, వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఉగాది నాటికి 25 లక్షల ఇండ్ల పట్టాలు ఇవ్వబోతున్నారని చెప్పడం చాలా సంతోషకరం.

మ 1.30

భారతదేశంలోనే ఇలాంటి గొప్ప పథకం వచ్చిన ఒక నెల రోజుల్లోనే ఈ పథకంపై చర్యలు తీసుకుంటామనే మాట ఇవ్వడమనేది చాలా గొప్పగా చెప్పుకోవచ్చు. అలాగే ఇళ్లపట్టాలు, ఆ ఇంటిని ఆడవాళ్ల పేరు మీదే ఇస్తామని, ఆడవాళ్ల బాగు కోసం కూడా ఆలోచిస్తున్న ప్రభుత్వం ఇది. పట్టా అంటే ఉత్తినే కాగితం ఇవ్వడం కాదు, దానిమీద పేదలకు పూర్తి అధికారం ఉంటుంది. కష్టకాలంలో ఆ ఇంటిని తనఖా పెట్టుకోవచ్చు. ఈ పథకాన్ని ఇంత గొప్పగా తయారుచేసినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి స్ఫూర్తితో ఈ పథకం ముందుకు వెళుతోంది. ఈ సమయంలో ఆ visionary great leader ని మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక వై.ఎస్.ఆర్. ఫింఛన్ కానుక విషయానికొస్తే నాలుగు నెలల క్రితం వరకు రూ.1,000 ఫింఛన్ వచ్చేది. ఈరోజు రూ.2,250 లు ఇస్తున్నారు. ప్రతి సంవత్సరం పెంచుకుంటూపోయి రూ.3,000 దాకా ఇవ్వాలని శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి ఆలోచనకు మేము ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఈ పథకం వల్ల 65 లక్షల మంది పేదవర్గాలు, బడుగు బలహీన వర్గాలు మరియు మైనారిటీవర్గాలు లబ్ధి పొందుతారు.

అంతేకాదు, ముఖ్యంగా డయాలసిస్ పేషెంట్ల కోసం ఇచ్చే పింఛన్ రూ.10 వేలకు పెంచి ఎంతోమంది పేద కుటుంబాలను ఆదుకుంటున్నందుకు గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు 'వై.ఎస్.ఆర్ బీమా పథకం' ఒక వరం లాంటిది. ఏదైనా ప్రమాదం జరిగి ఇంటిపెద్ద చనిపోతే ఆ కుటుంబం దిక్కులేకుండా అవుతుంది. అందుకే ఆ ఇంటికి పెద్దకొడుకుగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఐదు లక్షల రూపాయలు పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించారు. అందుకు గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

డ్వాక్రా మహిళా రుణాలను మాఫీ చేస్తామని గత ప్రభుత్వం చెప్పి మొండి చేయి చూపించింది. ఈ ప్రభుత్వం నాలుగు దఫాలుగా ఆ రుణాన్ని రీయింబర్స్ చేస్తామని ప్రకటించడం చాలా సంతోషకరమైన విషయం.

(బెల్)

ముఖ్యంగా ఈ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీవర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉంది. అందుకే వారికోసం ట్రస్ట్ బోర్డులు, కార్పోరేషన్లు, మార్కెట్ యార్డు కమిటీల్లో ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో యాభై శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు బిల్లు తీసుకురావాడం చాలా సంతోషంగా ఉంది. బడుగు, బలహీన వర్గాలు, ముఖ్యంగా ముస్లిం వర్గాల్లో రాజకీయ నాయకత్వాన్ని పెంచేవిధంగా, వారిలో సాధికారత పెరిగేవిధంగా ఈ నిర్ణయం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా అనేక వేల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని మైనారిటీల అభివృద్ధి కోసం కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్థిర, చరాస్తుల వివరాలను సేకరించి వాటిని డిజిటలైజేషన్ చేస్తోందని చెప్పడం చాలా సంతోషకరమైన విషయం.

(బెల్)

అలాగే ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని ఐదు వేల నుంచి పది వేల రూపాయలకు పెంచడం మౌజామ్‌ల గౌరవ వేతనాన్ని మూడు వేల నుంచి ఐదు వేల రూపాయలకు పెంచడం చాలా ఆనందంగా ఉంది. మా గురించి ఇంతగా గత ప్రభుత్వం ఆలోచన చేయలేదని తెలియజేస్తున్నాను.

గత ప్రభుత్వం వాళ్లు చాలా హామీలిచ్చారు. నంద్యాల బైఎలక్షన్స్‌లో చాలా హామీలు ఇచ్చారు. అవన్నీ చెప్పడానికి సమయం సరిపోదు. మా నంద్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే గారికి మాట్లాడడానికి ఏదో ఒకరోజు అవకాశం వస్తే ఆయన మాట్లాడితే బాగుంటుంది.

గత సంవత్సరం డిసెంబర్‌లో కర్నూలులో ఒక ఇస్తెమా (Istema) జరిగింది. ఆ ఇస్తెమా జరిగేటప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ వచ్చి వాటి నిర్వాహణకు కోట్లాది రూపాయలు ఇస్తామన్నారు. కానీ ఇప్పటిదాకా వాటి తాలూకు బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. చెప్పి, నమ్మించి మోసం చేశారు. మాటలు చెప్పారు కానీ డబ్బులు ఇవ్వలేదు.

(బెల్)

ఇక్కడ ఇంకో మాట చెప్పాలి అధ్యక్షా, పాస్టర్లకు ఐదు వేల రూపాయలు గౌరవ వేతనం ఇచ్చేందుకు ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బడ్జెట్‌లో చేర్చిన వివిధ పథకాల కింద మైనారిటీల సంక్షేమం కోసం రూ.2,106 కోట్లు కేటాయించడం చాలా సంతోషకరం అధ్యక్షా.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

ఇక పేద బిడ్డల పెళ్లిళ్ల గురించి మనకు తెలుసు అధ్యక్షా.

(బెల్)

ఇప్పటికీ చాలమంది పేదవాళ్లు తమ బిడ్డలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నారు. పేదరికంతో ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి కష్టాలు పడుతున్నారు. అందుకే ఈ ప్రభుత్వం 'వైఎస్సార్ కళ్యాణ కానుక' పథకాన్ని పెట్టింది. ముఖ్యంగా ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన ఆడపిల్లల కోసం లక్ష రూపాయలు ఇచ్చేందుకు నిర్ణయించారు. గత ప్రభుత్వంలో పెళ్లైన సంవత్సరం లేక సంవత్సరంనర అయినా కూడా వాళ్లు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవి. డబ్బులు వచ్చే పరిస్థితులు ఉండేవి కావు.

(బెల్)

40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పడం తప్ప మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మైనారిటీలకు చేసిందేమీ లేదు. గతంలో వారు (ప్రతిపక్ష నాయకుడు) చాలా హామీలు ఇచ్చారు. అవన్నీ ఇప్పుడు చెప్పాలంటే సమయం సరిపోదు.

మిస్టర్ స్పీకర్ : సమయం అవుతోంది హఫీజ్ ఖాన్ గారూ, బడ్జెట్‌పై మినిస్టర్ గారు ఇంకా రిప్లై ఇవ్వాలి. ఇంకా ప్రతిపక్ష సభ్యులు మాట్లాడాలి.

శ్రీ అబ్దుల్ హఫీజ్ ఖాన్ (ABDUL HAFEEZ KHAN): రెండు నిమిషాల్లో పూర్తి చేస్తాను అధ్యక్షా. ఆయన (ప్రతిపక్ష నాయకుడు) మ్యానిఫెస్టోలో మరీ ముఖ్యంగా వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంకింగ్ ఇస్తామన్నారు, చేయలేదు. ముస్లిం బాలికలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అని చెప్పారు, చేయలేదు. ముస్లిం విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను నిర్మిస్తామన్నారు, అదీ చేయలేదు. ముస్లింలకు దామాషా ప్రకారం బడ్జెట్‌ను కేటాయిస్తామన్నారు, అదీ చేయలేదు. మరేం చేశారంటే..

(బెల్)

ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని 'నారా హమారా' కార్యక్రమంలో ప్లకార్డులు పట్టుకున్న పాపానికి నంద్యాల ముస్లింలను తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో పెట్టి కొట్టించారు.

మిస్టర్ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్ చేయండి.

శ్రీ అబ్దుల్ హఫీజ్ ఖాన్ (ABDUL HAFEEZ KHAN): చాలా ముఖ్యమైన విషయం అధ్యక్షా, ఐదు సంవత్సరాలలో మాకు రెప్రజెంటేషన్ రాలేదు. This the only Assembly in the history of Andhra Pradesh where there was no representation of Minorities from the Treasury Benches.

మిస్టర్ స్పీకర్ : హఫీజ్ ఖాన్ గారూ, డిమాండ్స్ ఉన్నాయి, మీరు అక్కడ మాట్లాడవచ్చు.

శ్రీ అబ్దుల్ హఫీజ్ ఖాన్ (ABDUL HAFEEZ KHAN): అమాయకులైన ముస్లింలను చిత్రహింసలకు గురిచేసి, దేశద్రోహం కేసులు పెట్టారు. మీద్వారా నేను కోరుకునేది ఒక్కటే అధ్యక్షా, దానిపై గౌరవ ముఖ్యమంత్రి గారు విచారణ జరిపించి ఆ కేసులు ఎత్తివేయాలని నేను కోరుకుంటున్నాను.

తమను పట్టించుకోవాలని, తమ సమస్యలను తీర్చాలని వందలాది వేదికల మీద ముస్లీంలు ఎంత మొత్తుకున్నా చంద్రబాబు నాయుడు గారు పట్టించుకోలేదు.

(బెల్)

ఆయన తన రాజకీయం జీవితంలో ముస్లింలకు చేసిన మేలు ఏదైనా ఉందా అంటే ఏమీ లేదు అధ్యక్షా.

(బెల్)

ముగిస్తాను అధ్యక్షా. In the empowerment of the Muslim Community, political empowerment is also an important subject and this is the platform from where we can speak about our empowerment.

(బెల్)

రెండు నిమిషాల్లో అయిపోతుంది అధ్యక్షా. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు 2014లో ఏమిచేశారంటే ముస్లిం మైనారిటీలకు ఒకటే ఒక్క సీటు ఇచ్చారు, అది కూడా ఓడిపోయే సీటు. నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లను చీల్చి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారి తమ్ముణ్ణి గెలిపించడం కోసం తెలుగదేశం తరఫున ఒక ముస్లిం అభ్యర్థిని నిలబెట్టి వారిని దారుణంగా వాడుకొని వదలివేశారు. హిందూపూర్‌లో అబ్దుల్ ఘని గారు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న స్థానాన్ని ఆయన (ప్రతిపక్ష నాయకుడు) బావమరిది నందమూరి బాలకృష్ణ గారికి ఇచ్చారు. పోనీ అబ్దుల్ ఘని గారు బలిదానం చేశారు, సిట్టింగ్ ఎమ్మెల్యే సీటును వదులుకున్నారని, వారి బలిదానానికి ఎలాంటి న్యాయం చేయలేదు.

గతంలో ఆయన (ప్రతిపక్ష నాయకుడు) మైనారిటీ మంత్రి లేకుండానే ప్రభుత్వాన్ని నడిపించారు.

(బెల్)

అదే ఆయన కొడుకు నారా లోకేశ్ బాబు గురించి మాట్లాడితే ఎమ్మెల్సీ చేసి మరునాడే మంత్రిని చేశారు. మాకు ఎందుకు ఇంత అన్యాయం అధ్యక్షా? 23 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి అనైతికంగా తీసుకొని వెళ్లినపుడు ఇద్దరు మైనారిటీ ఎమ్మెల్యేలకు కూడా మంత్రి పదవులు ఇస్తానని హామీ ఇచ్చారు. మోసంలో మోసం అంటే ఇదేనేమో, ఇంతకన్నా పెద్ద మోసం ఉండదని ఈ సందర్భంలో తెలియజేస్తున్నాను.

(బెల్)

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి గారి విధానంలో వెళితే, ఆయన, ఆయన కుమారుడు, ఆయనకు చెందిన మంత్రులు, జన్మభూమి కమిటీలు బాగుపడతాయి. అదే మా నాయకుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి ఆలోచన విధానంలో వెళితే ప్రజలు, పేదలు, బడుగు బలహీన వర్గాలు బాగుపడతారు. ఊరికే చెప్పడం కాదు, ప్రజలంతా చూస్తున్నారు. అప్పటి ప్రభుత్వంలో ఒక మైనారిటీ మంత్రికే చోటులేని ప్రభుత్వం, కానీ ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు వర్గాల నుంచి ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నారు. ఆ తేడాను ప్రజలు గమనిస్తున్నారు.

మ.1.40

అంబేడ్కర్ గారు ఏ కల అయితే కన్నారో సామాజిక న్యాయం కల ఈరోజు ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిగారు ఆ దిశగా చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మేము, మా వర్గాలు ఎవరినైనా బాగా నమ్ముతాం. నమ్మిన వారి వెంట జీవితాంతం నడుస్తాం. ఆరోజు వైఎస్సార్ గారిని మేము నమ్మాం. ఈరోజు జగన్ అన్నని నమ్మాం. అందుకే పేద, బడుగు, బలహీన వర్గాల అందరికీ న్యాయం చేసే విధంగా ఉన్న నవరత్నాల బడ్జెట్‌ను చూస్తున్నాం. ఇది ఒక చారిత్రాత్మకమైన బడ్జెట్ ప్రతీ ఇంటికి మేలు చేసే బడ్జెట్ .. (బెల్) ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : గణేష్ కుమార్ గారు.

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR)(విశాఖపట్నం దక్షిణం): అధ్యక్షా, 2019-20 బడ్జెట్ స్పీచ్‌పైన మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ బడ్జెట్ ప్రసంగంలో పెద్దలు ఫైనాన్స్ మినిస్టర్ గారు శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ గారు సత్యానికి తప్ప దేనికి లొంగను అని మహాత్మగాంధీ గారి సూక్తిని ఉటంకించారు. ఈ ఐదు సంవత్స రాలు దానికి కట్టుబడి ఉంటే చాలా మంచిది మేము అప్రీషియేట్ చేస్తాం. కానీ in the very first వ్యవ సాయ బడ్జెట్‌ని చూస్తే...జనరల్ బడ్జెట్‌లో ఇరవై వేల కోట్లు అని ఫిగర్స్‌ని కోట్ చేశారు.... వ్యవసాయ బడ్జెట్‌లోనేమో రూ.28వేల కోట్లని కోట్ చేశారు. ఈ వ్యత్యాసం ఫిగర్స్‌లో ఎలా వచ్చిందో తరువాత ఫైనాన్స్ మినిస్టర్ గారి సమాధానంలో చెప్తారని ఎదురు చూస్తున్నాం.

ముఖ్యంగా ఈ బడ్జెట్‌లో ఫిగర్స్ అన్ని కూడా Taare Zameen Par అనే సినిమా వచ్చింది. అందులో అక్షరాలు చుట్టు తిరుగుతూ ఉంటాయి. అదేమాదిరిగా ఇదంతా అట్లా అవతవకగా ఉంది. ఇది సత్యానికి చాలా దూరంగా ఉంది. 2018-19కి 2019-20కి ఫిగర్స్‌లో పెద్ద డిఫరెన్సు ఏమి లేదు. మ్యాగ్జిమమ్ వస్తే 10శాతం వస్తుంది. కానీ ఈరోజేమో స్టేట్ గవర్నమెంట్ ట్యాక్సులుచూసుకుంటే అమాంతంగా రూ.17,060కోట్లకు పెంచారు.. మొత్తం 75వేల 438కోట్లు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ సుమారుగా గత ఐదు సంవత్సరాలు చూసుకుంటే ఇరవై వేల కోట్లనుంచి ఇరవై మూడు వేల కోట్లు... కానీ ఈరోజు చూస్తే రూ.61,071కోట్లకు పెంచారు. అమాంతంగా ఇంచుమించు 42వేల కోట్లకు పెంచారు. ఇది సాధ్యమా? .. సెంట్రల్ గ్రాంట్స్ తెచ్చుకునేందుకు అంత స్కోప్ ఉందా అనేది ఒక ప్రశ్న. Loans and interests చూసుకుంటే 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఏవైతే లోన్లు వచ్చాయో మనకు సుమారు రెండు లక్షల 65వేల కోట్ల రూపాయలు అయితే, మరి ఈరోజు ఫైనాన్స్ మినిస్టర్ గారు రూ.49వేల కోట్లను ఈ ఫైనాన్షియల్ ఇయర్‌కి లోన్ తీసుకువస్తామని చెబుతున్నారు. ఈ ఐదు సంవత్సరాల్లోనే వీళ్లు చేసే అప్పు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుండి ఈరోజుకి ఆల్‌మోస్ట్ రెండు లక్షల యాభై కోట్ల రూపాయలు అవుతుంది. అది సాధ్యమా అనేది చూసుకోవాలి. ఎందుకంటే ఎఫ్ఆర్ బిఎం (Fiscal Responsibility and Budget Management) ఒకటి ఉంది. అది ఒప్పుకోదు. ఎందుకంటే స్థూల ఉత్పత్తిలో ఫిస్కల్ డెఫిసిట్ 3శాతం కన్నా పెరగకూడదు. ఈ అంకెలు చూస్తే it is almost 3.3 శాతం దాటుతోంది. So, that is not possible. Impossible figures ని ఈరోజు వీళ్లు ఇక్కడ వాడటం జరిగింది. సత్యం ఎంత దూరం ఉందో అర్థం చేసుకోవాలి. అదే నిన్న అంబటి రాంబాబు గారు బాగా చెప్పారు. He is a great orator. నో డౌట్ ఒప్పుకోవాలి. యాభై నిమిషాలు వాళ్ల మ్యాని ఫెస్టో గురించి చెప్పారు. మాది రెండే రెండు పేజీలని ఇక్కడ జయహో జగనన్నా అని 112 పేజీల మ్యాని ఫెస్టో ఉందని వారు (అధికార పక్ష సభ్యులు) తెలుసుకోవాలి. 112 పేజీలు ... మీదే ఈ booklet .

(ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని అధికారపక్ష సభ్యులు అన్నారు)

I will come to the point... ఎందుకంటే ఏది పడితే అది కాదు... మేము కూడా single pamphlet తీసుకువచ్చాం. Anyhow, ఈరోజు సుమారు 225 హామీలను పాదయాత్ర సందర్భంలో ఇచ్చారు.

(జగనన్నా అనే బుక్‌ను సభకు చూపించారు)

మ్యానిఫెస్టోలో ఉన్న హామీల 225 మరియు కొత్తవి కలిపి 67 మొత్తం 292. సుమారు 3వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నప్పుడు 300పైగా un-authenticated హామీలను ఇవ్వడం జరిగింది. ఇవన్నీ నెరవేర్చమని అడుగుతున్నాం. Our request for the C.M. Sir and all these great leaders అవన్నీ అమలు చేస్తే we will definitely appreciate you. ఈ ఫిగర్స్‌ని కోట్ చేసిన దానికి హామీలు ఇచ్చిన వాటికి సరిపోతుందా అని అడుగుతున్నాను. బీసీల సంక్షేమం కోసం సంవత్సరానికి 15వేల కోట్లకు తక్కువ లేకుండా ఐదు సంవత్సరాల్లో 75వేలకోట్ల నిధులు ఏర్పాటు

చేస్తామని చెప్పారు. కానీ ఈ ఫిగర్స్‌లో 7వేల కోట్లు మాత్రమే కోట్ చేయడం జరిగింది. ఇది కూడా ప్రత్యేకంగా వ్యత్యాసం కనిపిస్తోంది. 139 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. కానీ ఈ బడ్జెట్‌లో దాని గురించి ఏమి ప్రస్తావన చేయలేదు.

ముఖ్యంగా for the last twenty years చూస్తుంటే భారతదేశంలో మెయిన్ హెడ్‌లైన్స్‌లో రైతాంగం, మరియు రైతుల ఆత్మహత్యల గురించి చూస్తున్నాం. ఈరోజు రైతుల గురించి చెప్పాలంటే, 2016లో సెంట్రల్ గవర్నమెంట్ బీజేపి వాళ్లు Ashok Dalwai Committee అని ఒకటి వేశారు. ఏదైతే ఈ Agriculture Revolution ని Income Revolution గా మార్చాలని ఆ కమిటిని వేశారు. ఆ కమిటీ చాలా చక్కగా అధ్యయనం చేసి 14 volumesని తీసుకువచ్చి జనవరి 2019లో పార్లమెంట్‌లో ప్రజెంట్ చేయడం జరిగింది. ఆ కమిటీ అప్రూవల్ తీసుకొని స్టేట్ గవర్నమెంట్‌కి పంపించడం జరిగింది. ఆ తరువాత ఆ కమిటీని మన రాష్ట్రానికి పంపించారు. దాన్ని ఆర్థిక శాఖామంత్రి గారు అలాగే వ్యవసాయ శాఖామంత్రిగారు ఒక్కసారి అయినా రిపోర్టుని చదివారా? ఎందుకంటే వీళ్లు ప్రశాంత్ కిషోర్ కమిటీ రిపోర్టులు అయితే చదువుతారు గానీ ఈ కమిటీ రిపోర్టు చదువరు. ఈ కమిటీ రిపోర్టు చదివి ఉంటే చాలా చక్కగా it has been appreciated in the Parliament. 2022 కల్లా ఒక సగటు రైతుకి యాన్యువల్ ఇన్‌కం రూ.95వేలు వస్తుందో దాన్ని రూ.2లక్షలకు ఎలా తీసుకువెళ్లాలో చాలా చక్కగా పాయింట్స్ ఇచ్చారు. అన్ని వాల్యూంలు చదవాల్సిన అవసరం లేదు. ఒక ఆరు పాయింట్స్‌ని కేవలం ఒక రిఫరెన్సు కోసం చెప్పాను. ఈరోజు రైతాంగం పంట పండక ఆత్మహత్యలు చేసుకోవడం లేదనేది ఒక పాయింట్ ... ఎందుకంటే 2002-03 ఫైనాన్షియల్ ఇయర్ నుంచి 2017-18 ఫైనాన్షియర్ ఇయర్ ఈ పద్నాలుగు సంవత్సరాల్లో భారతదేశంలో గోధుమ పంట సుమారు 1340 మిలియన్ టన్నులు పండితే ప్రభుత్వం కేవలం 338.82మిలియన్ టన్నులు మాత్రమే ప్రొక్యూర్ చేసింది. అలాగే రైస్ చూసుకుంటే 1057.57 మిలియన్ టన్నులు పంట ఉత్పత్తి అయితే 487.6 మిలియన్ టన్నులు మాత్రమే ప్రొక్యూర్ చేయడం జరిగింది.

మ. 1.50

అంటే, ఇది కేవలం 31.30శాతం మాత్రమే. ఏవైతే 67 నుంచి 73శాతం బియ్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా లేదా ఇతర స్టేట్ ఏజెన్సీల ద్వారా ప్రొక్యూర్ చేసుకోవాలో అవన్నీ చేసుకోకపోవడం వల్లనే రైతులు నేడు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారివద్ద ఉండిపోయిన పంటకు కనీస గిట్టుబాటు ధర లేక ఉన్నవన్నీ అమ్ముకుని అప్పులపాలై లోన్లు కూడా తీసుకోలేని పరిస్థితి వస్తోందని ఈ నివేదిక చెబుతోంది.

అధ్యక్షా, మార్కెట్‌యార్డుల కొరత ఉండడం వల్ల ప్రతి 5కిలోమీటర్లకు ఒక రెగ్యులేటరీ మార్కెట్ ఉండాలని వారి యొక్క నివేదికలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చూస్తే, ఆ మార్కెట్ల మధ్య సుమారు 200 నుంచి 250కిలోమీటర్ల దూరముంది. మార్కెట్‌యార్డుల్లో కోల్డ్ స్టోరేజి యూనిట్లు, బ్యాంకింగ్ విధానం

డ్రైయింగ్ వంటి ఇతర మౌలికసదుపాయాలను కల్పించాలని చెబితే నేడు చూస్తే, రాష్ట్రంలో ఉన్న మార్కెట్ యార్డుల్లో అటువంటి సౌకర్యాలేవీ లేవు.

అధ్యక్షా, నేడు భారతదేశంలో 6లక్షల గ్రామాలుంటే కేవలం 22 సంతలు మాత్రమే జరుగుతున్నాయి. కనీసం ఒక పంచాయితీలోనైనా ఒక గ్రామసంతను ఏర్పాటుచేసి దానిని బిజినెస్ హబ్‌గా మార్చమని వారు ఇచ్చిన నివేదికలో రికమెండ్ చేశారు. ఈరోజు సంతలు జరుగుతున్నాయి గానీ రైతులు ఎక్కడకు వెళ్లి కూర్చుంటున్నారో తెలియదు. వారు ఏ రాయిపై కూర్చుంటున్నారో తెలియదు. వర్షం పడితే అక్కడ బురద సంగతి కూడా తెలియదు. రైతును కాపాడే నిజమైన ప్రభుత్వమైతే మాత్రం తప్పకుండా ఆ కమిటీ నివేదికను చదివి దానిలో ప్రతి అక్షరం అమలుచేసే బాధ్యతను తీసుకోవాలని మీద్వారా ఈ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను.

అధ్యక్షా, ముఖ్యంగా మీ అనుమతితో, వ్యవసాయబడ్జెటు రూ.28వేలకోట్లలో రూ.20వేలకోట్ల వ్యత్యాసాన్ని వెంటనే దీనిపై వారు జవాబు చెప్పవలసిన బాధ్యత ఉందని మీద్వారా తెలియజేస్తున్నాను. మరీముఖ్యంగా, రైతాంగానికి సున్నాశాతం వడ్డీకి రుణాలు ఇస్తామని మొన్ననే ఈసభలోనే చెప్పారు. దానికి వారు ఏదైనా చిల్లిగవ్వ ఇచ్చారా? వారు ఇవ్వలేరు, వెకిలినవ్వులు, పెద్దనక, చిన్ననక ఎన్ని మాటలు అన్నారో మీరంతా చూసే ఉంటారు. ప్రజలు కూడా చూశారు. బడ్జెట్ ప్రసంగం పూర్తయిన నిమిషాల్లోనే ఆరోజు రూ.4వేలకోట్లు కేటాయిస్తారేమో అని మేము భయపడ్డాము. కానీ, కేవలం రూ.100కోట్లు మాత్రమే దానికి కేటాయించారు. What you speak, you follow that. మాకు మాత్రం నీతులు చెబుతారు కానీ వారు మాత్రం ఫాలో అవ్వరు. చక్కగా వారు దీని విషయంలో సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు. అవును, ఇది సెల్ఫ్‌గోల్. ***

(బెల్)

అధ్యక్షా, భారతదేశంలో టూరిజం ద్వారా ప్రతి సంవత్సరం రూ.16.91లక్షలకోట్లు ఆదాయం వస్తోంది. అంటే, ఇది జి.డి.పి.లో ఇంచుమించు 9.2 శాతం. ఈ గణాంకాలు చివరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి. ఉద్యోగకల్పన విషయానికి వస్తే, సోషియో ఎకనమిక్ సర్వే ప్రకారం భారతదేశంలో 4.26కోట్ల ఉద్యోగాలు క్రియేట్ అయ్యాయి. దీనికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి? అంటే, 8.1శాతం ఉద్యోగాలు భారతదేశంలో క్రియేట్ అయితే, మన రాష్ట్రంలో ఇప్పటికే ఉద్యోగాలు లేవని యువతంతా ఇబ్బందులకు గురవుతోంది. 2020నాటికి the youngest country in the world, మన భారతదేశం అవుతుంది. 29 సంవత్సరాల వయస్సు కలిగిన 63శాతం యువత మన దేశంలోనే ఉంటుంది. ఇటువంటి వారికి ఉద్యోగకల్పన చేయాలంటే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి. పర్యాటక రంగంలో ఉద్యోగాలు ఒక్కటే కాదు, హెరిటేజ్, కల్చర్, సహజమైన ఆకర్షణలు కూడా చాలా అభివృద్ధి చెందుతాయి.

***Expunged as ordered by the chair

అధ్యక్షా, విశాఖపట్నానికి మోనోరైలును ప్రకటించారు. దాని గురించి మా అవంతి గారు ఏమీ మాట్లాడలేదు. విశాఖపట్నం మెట్రో గురించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పెట్టడం జరిగింది. దానిపై చాలా అధ్యయనం చేశాము. 3లేన్ల కారిడార్, 41స్టేషన్లు, 41కిలోమీటర్లు మొదలైనవన్నీ కూడా ప్లాన్‌చేసి టెండర్లు పిలిస్తే, 5 బిడ్లు కూడా వచ్చాయి. దానిలో ఆదానీ కూడా వచ్చారు. హోమ్‌వర్క్ పూర్తయింది. ఇప్పుడు కేవలం దాని అమలు మాత్రమే మిగిలింది. మోనోరైలుకు పి.పి.హెచ్.పి.డి. (Passengers Per Hour Per Direction) అని ఒకటుంది. ఈ డైరక్షన్‌లో 5వేల ప్యాసింజర్లు ఉంటే, మోనోరైలును సమ్మతించవచ్చు. సార్, 5వేల ప్యాసింజర్లు కాదు, 2015లో మేము దాని గురించి అధ్యయనం చేస్తే, ఎన్.ఏ.డి. కొత్తరోడ్డు నుండి వయా మద్దిలపాలెం, హనుమంతవాక జంక్షన్‌కు పి.పి.హెచ్.పి.డి.లో 10వేల మంది ప్యాసింజర్లు ఉన్నారు. అప్పుడు మోనో ఫెయిల్యూర్, మెట్రో టిక్‌మార్కు. సడన్‌గా ఎందుకు దీనిని మార్చారో మాకైతే అర్థంకాలేదు.

అధ్యక్షా, క్రీడల గురించి మాట్లాడే ముందు నెల్సన్ మండేలా చెప్పిన మాటల గురించి ఒకసారి చెప్పాలి. Because, he was a great leader from South Africa. "Sports has the power to change the world. It has the power to unite the people. It has the power to inspire the people. It speaks to the youth in a language they can understand. It is more powerful than the Governments, in breaking the racial barriers."

క్రీడలకు ఎంత విలువ ఉంది ఈరోజు ఆఫ్రికన్ దేశాలకు అంత గుర్తింపు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం క్రీడలు. క్రీడల కోసం మనం బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కేవలం రూ.329కోట్లు. రాష్ట్రవిభజనకు ముందు గచ్చిబౌలి, హైదరాబాదులో మనకు అంతర్జాతీయ స్టేడియాలు ఉండేవి. ఏదైనా అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగితే అక్కడే జరిగేవి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఆవిధంగా లేదు. క్రీడాకారులంతా ఇక్కడ చాలా బాధపడుతున్నారు. అందుకే, విశాఖపట్నం జిల్లా గండిగుండంలో క్రీడలకోసం 80ఎకరాల భూమిని గతప్రభుత్వం కేటాయించడం జరిగింది. దానికి రూ.350కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ విలేజ్‌ను, లంబసింగిలో స్పోర్ట్స్ స్కూలు, అరకులో ఆర్చరీ అకాడమీని నిర్మించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. జాతీయక్రీడల కోసం మనం గానీ బిడ్డింగ్‌కు వెళితే చక్కగా ఇటువంటివన్నీ మన ఆంధ్రరాష్ట్రానికి వస్తాయి. దయచేసి ఈ రాష్ట్రప్రభుత్వం వెంటనే బిడ్డింగ్‌కు వెళ్లాలని మీద్వారా ఈ రాష్ట్రప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను.

(బెల్)

అధ్యక్షా, నేడు అమరావతి ఏపాపం చేసింది? పులివెందులకు రూ.100కోట్లు, అమరావతికి కేవలం రూ.500కోట్లు.

మిస్టర్ స్పీకర్: గణేశ్ గారూ, ఇప్పటికే చాలా సమయమైంది. Because, Minister has to give a reply in this House and he has to go to Council also. Please finish it early.

మ 2.00

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): అధ్యక్షా, అది మన సంప్రదాయ రాజధాని. ఇప్పటికే అమరావతిలో రూ.30వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కసారి వెళ్లి చూడమనండి. ఇప్పుడు వేసిన అమౌంట్.... ఏమాత్రం కూడా, అంటే బుల్డోజర్ పెట్టి ఎగొట్టడానికి పనికొస్తాయంటున్నారు. Ours is a construction party. Your's is a destruction party. కాబట్టి మీరు ఇంక destruction చేసుకోవచ్చు.

(నాలుగు తుమ్మచెట్లు ఉన్నాయి అమరావతిలో అని అధికారపక్షసభ్యులు అన్నారు)

సార్ ఈరోజు ఆర్‌బిఐ నివేదిక ఇచ్చింది. మేము ఇచ్చింది కాదు. అమరావతి అలాగే ఆంధ్రరాష్ట్రంలో 2017-18 సంవత్సరంలో ఏదైతే ఇండస్ట్రీస్ వచ్చాయో, భారతదేశంలో దాంట్లో 15శాతం మనరాష్ట్రానికి అమరావతికి వచ్చాయని నివేదిక ఇచ్చింది.

(ఎక్కడ ఉన్నాయి? అని అధికారపక్షసభ్యులు అన్నారు)

ఇప్పుడు ప్రభుత్వం మీదే. వెళ్లి చెక్ చేసుకోండి. గత 40రోజులలో ఇక్కడికి ఒక్క ఇండస్ట్రీ అయినా వచ్చిందా? ముఖ్యంగా నిరుద్యోగ భృతి, ఈరోజు 6లక్షల మంది యువత రూ.2000 లు రూ.3000 చేస్తామేమోనని చెప్పేసి రావాలి జగన్-కావాలి జగన్ అనుకున్నారు. కానీ ఈరోజు ఆ పరిస్థితి లేదు..

(మేము చెప్పలేదు... మ్యానిఫెస్టోలో లేదు అని అధికారపక్షసభ్యులు అన్నారు)

మిస్టర్ స్పీకర్ః కూర్చోండి గణేష్‌గారు.. ప్లీజ్..

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): కంక్లూడ్ చేస్తాను అధ్యక్షా, ఐదు నిమిషాలు అంతే..

మిస్టర్ స్పీకర్ః Actual గా మీ టైమ్ యాక్ట్ ప్రకారం 8 నిమిషాలే, but important assignment కాబట్టి మాట్లాడతాను అన్నారు కాబట్టి అలా సమయమిచ్చాను.

(బుచ్చయ్యచౌదరిగారు 40 నిమిషాలకి 30 నిమిషాలు మాట్లాడారు సార్ అని ప్రతిపక్షసభ్యులు అచ్చెన్నాయుడు అన్నారు)

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): సార్ యువతకి కావాలసింది బాగా ఎంప్లాయిమెంట్. దానికోసమని గత ఐదు సంవత్సరాలలో 24 గంటలలో 18 గంటలు కష్టపడింది మా చంద్రబాబునాయుడుగారు సార్..

(ఎక్కడ అని అధికారపక్షసభ్యులు అన్నారు.)

ఈరోజు వచ్చిన ఇండస్ట్రీస్ Socio Economic Survey, Ministry of Statutory Programme & Implementation మీరు ఆ మినిస్టర్‌ని వెళ్లి అడగండి. సుమారు రూ.3,30,000 కోట్లు ఈ ఆంధ్రరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం జరిగింది. మూడు CI summits పెట్టిన తరువాత, 5,35,000మందికి ఉద్యోగాలు వచ్చాయి. మీరు కావాలంటే for authenticated records, you go to the Ministry of Statistics.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్..

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): అలాగే ఇళ్లు.. ఈ రోజు ఇళ్ల గురించి మాట్లాడాలంటే.......

మిస్టర్ స్పీకర్: కంక్లూడ్ చెయ్యాలండి.. ప్లీజ్..

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): ఇందిరమ్మ ఇళ్లని accept చేస్తాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిగారి హయాంలో చాలా చక్కగా ఇళ్లను కట్టారు ఒప్పుకుంటాం. కానీ దాంట్లో కూడా ఒక తిరకాసు ఉంది. ఏదైతే 43లక్షల ఇళ్ల నిర్మాణం చేశారని చెప్పి, ఆరోజు 2005-06లో ఇందిరమ్మ హౌసింగ్ భారతదేశమంతా పెద్ద స్థాయిలో వచ్చింది. ఆ తరువాత మా గవర్నమెంట్ ఫామ్ చేసిన తరువాత తీరా చూస్తే, మన రాష్ట్రానికి 21,00,000 అక్కడ తెలంగాణాకి 22,50,000 ఇచ్చారు. దాంట్లో ప్రతి మూడు ఇళ్లకి ఒక ఇల్లు కనిపించలేదు. గోస్ట్ ఇల్లు అన్నారు, సిబిఐ ఎంక్వైరీ వేశారు. మరి ఏమైందో ఒకసారి వాళ్లని అడగాలి. మన ఆంధ్రరాష్ట్రంలో సుమారు 21,00,000 ఇళ్లకు గ్రౌండ్ ఇవ్వలేదు, క్లౌడ్‌లో ఉన్నాయి. రూ.7,000కోట్లు స్కామ్ జరిగిందని చెప్పేసి...

(ఇన్నేళ్లు ఏమి చేశారు అని అధికారపక్షసభ్యులు శ్రీ అంజద్‌భాషా అన్నారు)

మిస్టర్ స్పీకర్: మీరు ముగించాలి ప్లీజ్... Minister for Finance.........

(5 minutes ఇవ్వండి సార్ అని ప్రతిపక్షసభ్యులు అచ్చెన్నాయుడు అన్నారు)

చెప్పాను మీకు.. మీరు ప్రతిదానికి ఇలా చేస్తే కుదరదు. మీకు 8 నిమిషాలు ఉంది కానీ ఎంత టైం ఇచ్చానో చూడండి. You watch it.

(కంక్లూడ్ చెయ్యనివ్వండి సార్ అని ప్రతిపక్షసభ్యులు రామకృష్ణబాబు అన్నారు)

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): అధ్యక్షా, అమ్మఒడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే అమ్మఒడి చాలా మంచి ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్ సక్సెస్ అవ్వాలని మేము కోరుకుంటున్నాం. కానీ అమ్మఒడి ఒక పిల్లాడికో, ఒక పాపకో ఇస్తే ఒడి అవ్వదు

సార్..అంటే మిగతా పిల్లలు సవతి పిల్లలా? (ప్లకార్డుని సభకు చూపిస్తూ..) ఇది సవతి అమ్మఒడా? ఏమిటి సార్? 75లక్షల మందికి ఇవ్వవలసింది.

(లోటు బడ్జెట్ ఎంత ఉంది అని అధికారపక్షసభ్యులు అన్నారు)

మిస్టర్ స్పీకర్: ప్లీజ్..

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): మడమ తిప్పము, మాట తప్పము అని చెప్పారు. 75లక్షల మందికి ఇవ్వవలసింది కేవలం 43 లక్షల మందికే ఇచ్చారు. అందరికీ ఇవ్వండి. I appreciate.

(ఆంధ్రరాష్ట్రంలో 46లక్షల మందికి పేమెంట్ జరుగుతోందని అధికారపక్షసభ్యులు అన్నారు)

చాలా హ్యాపీ ఫీల్ అవుతాం. ఎందుకంటే చక్కగా సెల్ఫీలు తీసుకున్నారు. ఎక్కడపడితే అక్కడ పిల్లలకి. (ప్లకార్డులను సభకు చూపిస్తూ).. మరి జరగాలి కదా..(బెల్)

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: కూర్చోండి. ప్లీజ్ మినిస్టర్ ఫర్ ఫైనాన్స్...

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, 2019-20 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత మూడు రోజులుగా....

(5 నిమిషాలు ఇవ్వండి సార్ అని ప్రతిపక్షసభ్యులు అచ్చెన్నాయుడు గారు తమ స్థానంలో నిలబడి కోరసాగారు)

మిస్టర్ స్పీకర్: ఎన్ని నిమిషాలు ఇవ్వాలి? There must be some reason. మీకు 8 నిమిషాలే actual గా ఉన్నా బడ్జెట్ మీద మాట్లాడుతున్నారని allow చేశాం. నాయుడుగారు మీరు కూర్చోవాలి.

("అధ్యక్షా, తమరు లేరు జనసేన పార్టీ సభ్యులు పొగిడితే 25 నిమిషాలు ఇచ్చారు" అని ప్రతిపక్షసభ్యులు అచ్చెన్నాయుడు అన్నారు)

అవన్నీ కాదు. మీరు మిగిలిన పార్టీల కోసం కాదు. మీ పార్టీకి ఉన్నది 8 minutes time. Please sit down. Don't advise me.

(ప్రతిపక్షసభ్యులచే అంతరాయం)

ఎంత సమయం ఇవ్వాలి. ప్లీజ్ వాసుగారు మీరు వెంటనే కంక్లూడ్ చెయ్యాలి. Because Minister is having business in the Council also.

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్(SRI VASUPALLI GANESH KUMAR): ముస్లిం సంక్షేమం. ఈరోజు 2017–18కి...

(కొన్ని ప్లకార్డులను ప్రతిపక్షసభ్యులు శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్ ప్రదర్శించగా, ఈ ప్లకార్డులు ఏమిటి సార్ అని అధికారపక్షసభ్యులు అన్నారు)

ఏం కాదా? సార్ మాలాస్ట్ ఫైనాన్షియల్ ఇయర్‌కి రూ.1102 కోట్లు కేటాయిస్తే, ఈ రోజు 13.56శాతం తక్కువకాదా?

మిస్టర్ స్పీకర్: కూర్చోండి, మీరు చెప్పారుగా..

(కంక్లూడ్ చెయ్యనివ్వండి అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

కూర్చోండి. గణేష్‌గారు it is not correct. ప్లీజ్ కూర్చోండి. మినిస్టర్ ఫర్ ఫైనాన్స్.

శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH): అధ్యక్షా, 2019–20 బడ్జెట్‌ను ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తరువాత మూడు రోజులుగా చర్చ జరుగుతోంది. ఈ చర్చలో భాగంగా నిన్న గౌరవ ప్రతిపక్షసభ్యులు బుచ్చయ్యచౌదరిగారు చాలా అంశాలను ప్రస్తావించారు. ఆ అంశాలన్నిటికీ దాదాపు నిన్న సమాధానం ఇవ్వడం జరిగింది. ఈరోజు ఎంతోమంది పాలకపక్షసభ్యులు, అదేవిధంగా జనసేన సభ్యులు అదేవిధంగా గౌరవ టీడీపీ సభ్యులు కూడా మాట్లాడటం జరిగింది. కాబట్టి ముఖ్యమైన పాయింట్స్, ఏవైతే ఇప్పుడే గౌరవ టీడీపీ సభ్యులు మాట్లాడారో వాటికి సమాధానం క్లుప్తంగా చెబుతాను. మొట్టమొదటి పాయింట్ confusion అని అన్నారు. నిజం చెప్పాలంటే కన్ఫ్యూజన్ ఏమీ లేదు. కన్ఫ్యూజన్ ఉండేదానికి అవకాశం కూడా లేదు. ఎందుకంటే ఇవి లెక్కలు. లెక్కల్లో కన్ఫ్యూజన్ ఉండేటందుకు అవకాశం లేదు. రెండుకు మూడు కలిపితే ఐదు అవుతుంది. మూడుకి రెండు కలిపితే ఐదే అవుతుంది తప్ప, ఆరు కావడానికి వీలు లేదు. బహుశా ఎందుకు ఆయన కన్ఫ్యూజన్ అంటున్నారంటే నెం.1 పాయింట్, పన్ను ఏవిధంగా పెరిగింది అంటారు. బహుశా పోయిన సారి 2019–20 Vote on Account Budget ఏదైతే వాళ్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిందో అది చూసినట్లు లేరు. కేవలం కొత్త పుస్తకం చూసినట్టు ఉన్నారు. ఒక్కసారి తనకోసం ఇది చదివి వినిపిస్తాను. ట్యాక్స్ రెవిన్యూ రూ.75,43,799 వాళ్లు ప్రవేశపెట్టిన బడ్జెట్. మేము ప్రవేశపెట్టింది రూ.75,43,799 same. తేడా ఏమీ లేదు. Grants in Aid కోసం వాళ్లు ప్రవేశపెట్టినది రూ.60,721కోట్లు మేము ప్రవేశపెట్టింది రూ.60,071కోట్లు అంతకంటే తక్కువనే కాబట్టి తేడా ఏమీ లేదు. నిజం చెప్పాలంటే Vote on Account Budget లో వాళ్లు ఏదైతే చూపించారో అంతకంటె తక్కువనే మేము చూపించాం తప్ప, ఎక్కువ ఏమీ లేదు. టోటల్ బడ్జెట్ ఫిగర్ వాళ్లు ప్రవేశపెట్టింది రూ.2,26,177కోట్లు.

మ.2.10

మేం ప్రవేశపెట్టినది మొత్తం రూ.2,27,974కోట్లు. తేడా ఏమీ లేదు. కేవలం వెయ్యి కోట్లకు తేడా ఉంది. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా రెండుకు మూడు కలిపినా, మూడుకు రెండు కలిపినా అది అయిదే అవుతుంది తప్ప ఆరు కావడానికి వీల్లేదు. వ్యవసాయ బడ్జెట్‌లో వారు రూ.20,675కోట్లు చూపించారు, అది వాస్తవంగా రూ.28,626 కోట్లు వచ్చిందని చెబుతున్నారు. రూ.20,677 వ్యవసాయ బడ్జెట్‌తోబాటు ఉచిత విద్యుత్ కోసం రూ.4,525కోట్లు, అదే విధంగా ఆక్వాకల్చర్‌లో చేపల చెరువులు, రొయ్యల చెరువులకు ఈ మధ్య తీసుకున్న పవర్ సబ్సిడీ కింద రూ.475కోట్లు. అవి రెండూ కలిపితే రూ.5000కోట్లు అవుతుంది. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద లింకేజ్ చేసిన రూ.3,026కోట్లు కలిపితే అది రూ.8,626కోట్లు అవుతుంది. దీనిలో వ్యవసాయ బడ్జెట్ రూ.20,677 కలిపితే అది గౌరవసభ్యులు వాసుపల్లి గణేశ్‌కుమార్ గారి ప్రశ్నకు సమాధానం.

అప్పు ఎక్కడనుంచి వస్తుందని అడిగారు, అది కూడా చెబుతాను. ఫిస్కల్ డెఫిసిట్ రాష్ట్ర స్థూలోత్పత్తిని నిష్పత్తిగా తీసుకుంటే 2015-16లో 3.58శాతం ఉంది. ఇపుడు గౌరవ సభ్యులు మాట్లాడుతూ ఆ శాతం మూడు లోపే ఉండాలి, మీరు మూడుకు పైగా ఎందుకు దాటారని ప్రశ్నించారు. 2016-17లో వారి ప్రభుత్వంలో దానిని 4.42శాతానికి తీసుకెళ్లారు. 2017-18లో అది 4.03శాతానికి తగ్గింది. 2018-19లో 3.67శాతానికి వచ్చింది. ఇపుడు మేం ప్రతిపాదిస్తున్నది అంతకంటే తక్కువగా 3.26శాతానికి వచ్చిందంటే తగ్గుతుంది కానీ పెరగడంలేదని గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

వడ్డీలేని రుణాలకు మార్చి తరవాత ఏప్రిల్‌లో కేటాయిస్తారు. అది వచ్చే బడ్జెట్‌లో వస్తుంది. వారి పాలనాకాలంలో వారెంత కేటాయించారనేది కూడా నిన్న గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. మరలా గౌరవసభ్యులు అదే ప్రశ్న వేశారు కాబట్టి సమాధానం చెబుతాను. వారు గత అయిదు సంవత్సరాలుగా కట్టాల్సినది రూ.11,595కోట్లు ఉంటే వారు కేటాయించినది కేవలం రూ.763కోట్లు. అందులో ఖర్చు పెట్టినది కేవలం రూ.629కోట్లు మాత్రమే. వారి పాలనాకాలంలో కేవలం అయిదు శాతం మాత్రమే ఖర్చు పెట్టారు. మాకు ఇంకా కేటాయించడానికి సమయం ఉంది, కానీ వారు మమ్మల్ని వేలెత్తి చూపిస్తున్నారంటే ఎంత దారుణమో ఒక్కసారి ఆలోచించాలి.

యువజన పర్యాటక శాఖకు వారు అయిదు సంవత్సరాల కేటాయింపులు చూస్తే వారి బండారం బయటపడుతుంది. లేటెస్ట్‌గా 2018-19లో కేటాయింపులు రూ.2,063కోట్లు కాగా ఇపుడే నెల్సన్ మండేలా గురించి, యువత గురించి, ఉత్సాహం గురించి, స్టేడియాల గురించి మాట్లాడారు. ఇంతకు ముందు ఒలంపిక్స్ గురించి కూడా మాట్లాడారు. అప్పటి ముఖ్యమంత్రి, ఇప్పటి ప్రధాన ప్రతిపక్ష నాయకులు 2018లో అమరావతిలో ఒలంపిక్స్ అంటే మేం అపుడు కూడా చెప్పాం. 1929లో స్పెయిన్ దేశంలోని బార్సిలోనా నగరంలో ఒలంపిక్స్ నిర్వహించాలని వారు దరఖాస్తు చేసుకుంటేవారికి

1992లో అవకాశం వచ్చింది. 1996లో (2016లో) అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు ఖోఖో మ్యాచ్ చూడడానికి విశాఖపట్నం వెళ్లి 2018లో అమరావతిలో ఒలంపిక్స్ పెడతామని చెప్పారు. ఖోఖోకు అంత ఉత్సాహం వస్తే క్రికెట్‌కు ఎంత ఉత్సాహం వస్తుందోనని మాకు భయంగా ఉంది. అయినా యువజనులకు వారి కేటాయింపులు రూ.2,063కోట్లు కాగా, వాస్తవంగా ఖర్చుచేసింది కేవలం రూ.538కోట్లు మాత్రమే. కానీ మేం కేటాయించినది రూ.603కోట్లు. అయితే వారు మాగురించి మాట్లాడితే మేం సమాధానం చెబుతున్నామంటే మేం ఎంత వినయంగా ఉన్నామో చూడండి.

ఇక అమరావతి విషయానికొస్తే విదేశాలలో ఉన్నవారు మాకు ఫోన్ చేసి అమరావతిలో మేం అది కొనాలి, ఇది కొనాలి అంటే మేం ఏమి కొంటారంటే మమ్మల్ని నమ్మడంలేదు. అమరావతి గ్రాఫిక్స్‌ను చాలా అద్భుతంగా చూపించారు. అమరావతి ప్లాన్‌లు ఫైనలైజ్ చేయడానికి అప్పటి ముఖ్యమంత్రిగారు, ఆర్థికశాఖ మంత్రిగారు ఆ బృందంలో ఉన్నారు. వారు ఎక్కడికి వెళ్లినా కలిసే వెళతారు. ముఖ్యమంత్రిగారు ఏ విదేశీ పర్యటనకు వెళ్లినా అప్పటి ఆర్థికమంత్రిగారిని ఇక్కడ వదలిపెట్టరు. వారితోనే తీసుకువెళతారు. వారు ఎక్కడికైనా కలిసి వెళ్లివచ్చు, కలిసి ఉండవచ్చు, దానికి మాకు అభ్యంతరం లేదు. మలేషియా, సింగపూర్, కొరియా, శ్రీలంక, లండన్, టర్కీ, కజికిస్థాన్, అమెరికాకు వెళ్లినా అక్కడ ఉన్నది ఒకటి తెస్తామంటారు. జపాన్ వెళ్లినపుడు బుల్లెట్ రైలు తెస్తామంటారు. లండన్‌కు వెళితే లండన్ ఐ వచ్చిందంటారు, కజికిస్థాన్‌లోని అస్థానాకు వెళ్లి బెస్ట్ సిటీ తెస్తామంటారు. చివరకు ఫైనల్‌గా డిజైన్లు సినీ దర్శకుడు రాజమౌళిగారికి అప్పగించారు. వారికి మాహిష్మతి కావాలంట. రూ.38కోట్లు ఎలా ఖర్చు అయిందంటే చెప్పాము కదా! లండన్, టర్కీ తదితర దేశాలకు ప్రైవేట్ జెట్లలో బిజినెస్ క్లాస్‌లలో తిరిగి ఖర్చు అయింది. గత అయిదు సంవత్సరాలలో వారు ఏమి చేశారనేది చూస్తే ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినది కేవలం రూ.278కోట్లు మాత్రమే. మొత్తం ఖర్చు పెట్టిన దానిలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1500కోట్లు కలిపి మొత్తం రూ.1778 కోట్లు ఖర్చుపెట్టి ఈ భవనాలు నిర్మించారు. ఈ సభలో చర్చించే విషయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా చూడాలి.

అమెరికా తదితర దేశాలనుంచి మేమంతా ఇక్కడ ఉంటున్నామని, ఇక్కడ చాలా భవనాలు వచ్చాయని, వారికి మేం చూపించడంలేదని అనుకుంటున్నారు. రాజధానికి రావడానికి కరకట్ట రోడ్డులో ఒక కారు వస్తే ఎదురుగా మరో కారు రావడానికి వీలులేదు. కొంచెం పక్కకు జరిగితే కరకట్టనుంచి కిందకు పడతాయి. అయిదు సంవత్సరాలుగా అప్పటి ముఖ్యమంత్రి అక్కడే ఉన్నారు కానీ ఆ రోడ్డును కూడా రెండు వరసలతో విస్తరించలేదు. కానీ వారు అమరావతి గురించి ప్రశ్నిస్తారు. వారి కేటాయింపులకు, మా కేటాయింపులకు ఏమైనా పొంతన ఉందా? వారి అయిదు సంవత్సరాలలో వారు రాజధానికి రూ.277కోట్లు కేటాయించి మమ్మల్ని వారు తప్పుపడుతున్నారు. వారు కట్టిన ఈ బిల్డింగుల డిజైన్లు ఒక్కసారి చూస్తే ఈ భవనాలకు ఒక్కచోట అయినా ఒక్క కిటికీ అయినా ఉందా? ట్రాపికల్ క్లైమేట్‌లో ఎవరైనా కిటికీలు లేకుండా భవనాలు నిర్మిస్తారా? ఈ భవనాలలో ఉంటున్న

అధికార్లను అడిగితే ఊపిరితిత్తుల సమస్య వచ్చిందని చెబుతున్నారు. ఆక్సిజన్ లేక నెలకొకసారి ఊపిరితిత్తుల చెకప్ చేయించుకుంటున్నారు. అది వారి డిజైన్. చ.అ.కు రూ.12,000 ఖర్చు పెట్టినారు. నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన హైదరాబాదులో గచ్చిబౌలి, నానక్‌రాంగూడలకు అంతర్జాతీయ విమానాశ్రయం అరగంటలో చేరుకునే దూరంలో, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ పక్క మల్టీ నేషనల్ కంపెనీలు ఉన్నచోట అపార్టుమెంట్లు భూమి విలువతోబాటు చ.అ. రూ.5,000లకు వస్తుంటే ఈ నల్లరేగడి భూమిలో ఒక పక్క అరటిచెట్లు, ఒకపక్క పొగమొక్కలు, ఉల్లిపాయలు, వెల్లిపాయలు, కంపచెట్ల మధ్యలో చ.అ.రూ.12వేలతో కట్టారు. ఇక్కడ కార్యాలయాల్లో పనిచేస్తుండేవారికి ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. మరలా దాని గురించి ఈ సభలో చర్చ. మరలా వర్షం పడితే బయటకంటె లోపల నీరు ఎక్కువగా ఉంటుంది. కానీ వారు మాట మాట్లాడితే అమరావతి గురించి కామెంట్లు చేస్తుంటారు.

అమ్మ ఒడి బాగుంటే వారు బాగాలేదంటారు. మనరాష్ట్రంలో 75లక్షల మంది విద్యార్థులున్నారని అందరికీ తెలుసు. అసలు వారికి ఆ ఆలోచనే లేదు. మేం పిల్లలను బడికి పంపిస్తున్నందుకు మేము ఆ పిల్లల తల్లులకు ప్రోత్సాహకంగా అమ్మ ఒడి ఇస్తున్నాం. మొట్టమొదటిసారిగా భారతదేశంలో conseptualize చేసినవి కూడా నేను మరొకసారి చదివి వినిపిస్తాను.

మ 2.20

అధ్యక్షా, నేను చదివి వినిపిస్తాను. వాళ్లు బడ్జెట్ స్పీచ్ సరిగ్గా విన్నట్లు లేరు. ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని ఎదుర్కొని తమ బిడ్డలను బాగా చదివించుకోవాలని, వారి జీవితాలను కొత్తగా నిర్మించాలన్న సంకల్పం ఉన్న అమ్మలకు మన రాష్ట్రంలో కొదవ లేదు. ఆ తల్లుల ప్రేరణే ఈ ప్రభుత్వానికి బలం. తమ పిల్లలను చదువుల బాట పట్టించి వారి రాతను తిరిగి రాయాలనుకునే ప్రతీ తల్లికీ, I repeat ప్రతీ తల్లికి ఈ ప్రభుత్వం నిండు హృదయంతో నమస్కరిస్తుంది. I repeat again. ఈ ప్రభుత్వం నిండు హృదయంతో నమస్కరిస్తుంది. వారి సంకల్ప బలానికి అవసరమైన వనరుల తోడ్పాటును అందించడం మా బాధ్యత. ఇది మొట్ట మొదటిసారిగా భారతదేశంలో బడికి పంపుతున్న పిల్లల తల్లులకు ఇన్సెంటివ్ ఇవ్వాలి అని మన గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు పెట్టిన ఈ పథకాన్ని ప్రతిపక్ష సభ్యులు అర్థం చేసుకోలేక పిల్లలు ఎంత మంది అంటున్నారు. అంటే వాళ్ల ప్రకారం ప్రతీ తల్లికి ఒక బిడ్డేనా ఉండేది. 43 లక్షల సంఖ్య ఏ విధంగా వచ్చిందంటే ఎంత మందికి ఎంత మంది పిల్లలున్నా మనమిస్తామన్న ఇన్సెంటివ్ తల్లులకు అని మీకు తెలియచేస్తున్నాను. అధ్యక్షా, 43 లక్షల మంది తల్లులకు గాను మనం కేటాయించింది రూ.6,456 కోట్లు. మొట్ట మొదటిసారిగా ఇంత పెద్ద పథకం ప్రవేశ పెడితే దానికి ఎంత మంది పిల్లలు? పిల్లలున్నారా లేదా ఇవన్నీ ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతున్నారు.

అధ్యక్షా, బేసిక్ పాయింట్లన్నీ చెప్పాను. సభ్యులు మాట్లాడిన అంశాలకు సమాధానం ఇవ్వాలి కాబట్టి ముఖ్యంగా బడ్జెట్‌లో మనం చూడాల్సింది **economic sector, social sector, general sector** అంటే ఆర్థిక సేవలు, సామాజిక సేవలు మరియు సాధారణ సేవలు వీటిని గమనించినట్లైతే ఈ బడ్జెట్‌లో ఒక గొప్పతనం ఉంది. **Holistic** గా చూసినట్లైతే ఎవరైతే దానిని బాగా గమనిస్తారో వాళ్లకు అర్థమవుతుంది. ఆర్థిక సేవల్లో ఎక్కువ పెరుగుదల అంటే 26.9 శాతం చూపించాము. ఆర్థిక సేవలకు ప్రాధాన్యత ఇవ్వడమంటే అర్థమేమిటంటే వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి, సాగునీటికి, విద్యుత్‌కి, పరిశ్రమలకి, రవాణాకి, సాధారణ ఆర్థిక సేవలకు ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించాము. కేటాయింపుల్లో రూ.86,185 కోట్లు కేవలం ఆర్థిక సేవలకు కేటాయించాము. సోషల్ సర్వీసెస్, వెల్ఫేర్‌కి కూడా తగిన **increase allocation** ఇస్తూ 12.58 శాతం పెంచుతూ రూ.75,465 కోట్లు ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, సాధారణ సేవలు ఏవైతే ఉన్నాయో వాటికి బడ్జెట్‌లో 18.20 శాతం పెరుగుదల వచ్చింది. ఎందుకంటే ఉద్యోగులకు తాత్కాలిక భృతి ఇచ్చినందుకు, పిఆర్‌సి వస్తుందనే ఉద్దేశంతో ఇవ్వడం జరిగింది. కాబట్టి **holistic** గా చూసినట్లైతే ఈ మూడు సెక్టార్లలో **economic services** కి ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించామని ఈరోజు గర్వంగా చెబుతున్నాను. అధ్యక్షా, ఇంతకు ముందే గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా మొట్ట మొదటిసారిగా మ్యానిఫెస్టో అమలు పరచడమే మన బాధ్యత కాబట్టి దానిని బడ్జెట్‌లో పొందుపరచి, 80 శాతం దాదాపుగా మన మ్యానిఫెస్టోలో ఉండేవి మొదటి సంవత్సరమే అమలు పరుస్తున్నామని సభ్యులకు తెలియచేస్తున్నాను.

(అధికార పక్ష సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, కాన్సెప్ట్ కూడా చూసినట్లైతే అన్నింటి కంటే ముఖ్యమైనది, మనం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది **human capital development.** మానవ వనరులకు సంబంధించి ముఖ్యంగా ఇంతకు ముందే అమ్మఒడి గురించి చెప్పినట్లుగా రూ.6500 కోట్లు దాదాపుగా 43 లక్షల మంది తల్లులకు వాళ్ల పిల్లలను చదివించేందుకు కేటాయించాము. తరువాత జగనన్న విద్యా దీవెనకు రూ.4900 కోట్లు, మనం పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంటు కొరకు ఇచ్చేది ఇవన్నీ మానవ వనరుల కింద ఇస్తున్నామని గమనించాల్సిన అవసరముంది. ఇది కాకుండా పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రూ.1500 కోట్లు కేటాయిస్తే , రూ.1500 కోట్లేనా కేటాయింపులు అని కౌన్సిల్‌లో మాట్లాడటం జరిగింది. వాస్తవానికి వాళ్ల కేటాయింపులు చూస్తే 5 సంవత్సరాలుగా కేవలం ఒక సంవత్సరం రూ.69 కోట్లు మాత్రమే కేటాయించారు. కానీ మొదటి సంవత్సరంలోనే రూ.1500 కోట్లు ఈ ప్రభుత్వం కేటాయించిందని మీకు తెలియచేస్తున్నాను. అధ్యక్షా, అది కాకుండా ఆసుపత్రుల కొరకు గత ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి రూ.145 కోట్లు కేటాయించి రూ.101 కోట్లు ఖర్చు పెట్టారు. కానీ ఈ ప్రభుత్వం

రూ.1824 కోట్లు కేవలం ఆసుపత్రుల ఆధునీకరణ కోసం కేటాయించడం జరిగిందని మీకు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, వ్యవసాయానికి ఏదైతే వై.ఎస్.ఆర్.రైతు భరోసా కింద కేటాయింపులు ఉన్నాయో దాంట్లో ముఖ్యంగా మనం బాగా గమనించాల్సింది ఏమిటంటే ఇన్సూరెన్స్ అనే కాన్సెప్ట్ ఉంది. ఈరోజు ఇన్సూరెన్స్ ఎంత అవసరమంటే భారతదేశంలో మనమందరం ఎంత వెనుకబడి ఉన్నామో ప్రతీ ఒక్క విషయంలో ఇన్సూరెన్స్ అనేది మనకు అలవాటు లేదు. ఇన్సూరెన్స్ అనే దానికోసం రూ.1163 కోట్లు కేటాయిస్తూ దానితోబాటు ఇన్సూరెన్స్ అనే కాన్సెప్ట్ రైతులందరికీ అలవాటు చేయాలని ఒక మంచి ఆలోచనతో పోయే ప్రభుత్వం మాది. వ్యవసాయానికి సంబంధించి వై.ఎస్.ఆర్.రైతు భరోసాకు రూ.8750 కోట్లు కేటాయించిన విషయం ఒక్కసారి మీకు తెలియచేస్తున్నాను. దీని వలన దాదాపుగా 55 లక్షల మంది రైతులు, 15 లక్షల మంది కౌలు రైతులకు ఎప్పుడూ లేని విధంగా ఉపయోగపడుతుందని బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. ప్రతీ సంవత్సరం విత్తనం వేయకముందు రైతులు ఇబ్బందిపడుతూ ఏవైతే చిన్న చిన్న రుణాలు తెచ్చుకోలేకపోతున్నారో వాళ్లందరికీ ప్రభుత్వం ఒక భరోసా ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని ఈ పథకం గురించి తెలియచేస్తున్నాను. అదే విధంగా వై.ఎస్.ఆర్. 9 గంటల ఉచిత విద్యుత్‌కి రూ.4525 కోట్లు, ఎప్పుడైనా విపత్తులు సంభవించినప్పుడు రూ.2000 కోట్లు కేటాయించడం జరిగింది. అదే విధంగా ధరల స్థిరీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ మినహా భారతదేశం మొత్తం కలిపి రూ.2000 కోట్లు కేటాయిస్తే, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే రూ.3000 కోట్లు కేటాయించిందని మీకు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు ఇప్పుడే మద్యపాన నిషేధం గురించి మాట్లాడారు. ఈరోజున మొట్ట మొదటి అడుగుగా ఈ ప్రభుత్వం బెల్టు షాపులను బంద్ చేయడం జరిగింది. ఎందుకు బెల్ట్‌షాపులు బంద్ చేయడం జరిగిందంటే ఆ విధంగా ఆటోమేటిక్‌గా సామాన్య మానవునికి, పేదవానికి మద్యం అందుబాటులో లేకుండా ఉండాలనే ఉద్దేశంతో బంద్ చేయడం జరిగింది. తరువాత రెండవ అడుగుగా మొత్తం లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే తీసుకోబోతున్నది. ఎందుకంటే ప్రైవేటు వ్యక్తులు ఉంటే, ప్రైవేటు వ్యక్తులు ఆదాయం కోసం, లాభాలు దృష్టిలో పెట్టుకుని ఆటోమేటిక్‌గా బెల్టుషాపులకు పోయే అవకాశం ఉంటుంది. ప్రభుత్వమే ఒకవేళ అమ్మకం జరిపినట్లైతే ఆటోమేటిక్‌గా బెల్టుషాపులు ఉండవనే ఉద్దేశంతో రెండవ అడుగు వేయడం జరిగింది. ఇది క్రమక్రమంగా అడుగడుగునా మొత్తం నిషేధం చేసేందుకు ముందుకు పోతున్న మాట ఈరోజు సభ్యులకు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, పశువులకు, గొర్రెలకు ఇన్సూరెన్స్ కొరకు నిధులు కేటాయించడం జరుగుతుంది. ప్రస్తుతం ఈ బడ్జెట్‌లో పశువులకు ఇన్సూరెన్స్ కొరకు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. గొర్రెలకు ఈ సంవత్సరం గానీ, వచ్చే సంవత్సరం గానీ కేటాయింపులు జరగబోతున్నాయి. గత 5 సంవత్సరాల్లో

కేవలం ఒకే ఒక సంవత్సరం అది కూడా ఎలక్షన్లకు ముందు గత సంవత్సరం వారు రూ.50 కోట్లు కేటాయించి అది కూడా ఇంత వరకూ ఖర్చు చేయలేదనే మాటను తెలియచేస్తున్నాను. అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ఇప్పుడే చెబుతున్నారు. గొర్రెలకు కూడా ఈ సంవత్సరమే ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టబోతుందని తెలియచేస్తున్నాను.

(అధికారపక్ష సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, సభ్యులు హౌసింగ్‌కి ఎంత ఇచ్చారని అడుగుతున్నారు. గత ప్రభుత్వం హౌసింగ్ కొరకు మూడువేల చిల్లర కోట్ల రూపాయలను వాళ్లు కేటాయిస్తే, ఆ మూడువేల చిల్లర కోట్ల రూపాయలతో బాటు రూ.5000 కోట్లు అదనంగా పట్టాలు ప్రొక్యూర్ చేసేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. అంటే మొత్తం మీద మూడు వేల చిల్లర కోట్ల రూపాయలను వాళ్లు గత సంవత్సరం కేటాయిస్తే ఎనిమిది వేల చిల్లర కోట్ల రూపాయలను ఈ ప్రభుత్వం ఈ సంవత్సరం కేటాయించిందని మీకు తెలియచేస్తున్నాను. అధ్యక్షా, ఆరోగ్యశ్రీ విషయానికొస్తే అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమిటంటే ఆరోగ్యశ్రీని మొట్ట మొదటిసారిగా మధ్య తరగతి వాళ్లకు అంటే రూ.5 లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్న వాళ్లకు, అంటే నెలకు రూ.40,000 ఆదాయం ఉన్న కుటుంబాలకు కూడా ఆరోగ్యశ్రీని వర్తింపచేస్తున్నాం. ఆరోగ్యశ్రీకి దాదాపుగా ఇంతకు ముందున్న 948 జబ్బుల నుంచి 1038 జబ్బులకు వాళ్లు 5 సంవత్సరాల కాలపరిమితి మీద చేయడం జరిగింది. ఇప్పుడు గర్వంగా చెబుతున్నాను. ప్రతీ జబ్బుకి కూడా చికిత్స జరుగుతుందని తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, పింఛన్ల విషయానికొస్తే ప్రతీసారీ పింఛన్ల గురించి అందరూ మాట్లాడుతున్నారు. అప్పటికీ, ఇప్పటికీ అంటున్నారు. వాస్తవానికి వాళ్లు రూ.2000 కి ఎప్పుడు పెంచారు? ఎలక్షన్లకు రెండు నెలల సమయం ఉన్నప్పుడు వాళ్లు పెంచారు.

మ 2.30

గత అయిదు సంవత్సరాలలో కేటాయించిన దానిని మనం లెక్కించినట్లయితే సరాసరిగా ఎంత వస్తుందంటే రూ.5,314 కోట్లు ఒక సంవత్సరం, రూ.4,775 కోట్లు ఒక సంవత్సరం, రూ.5,916 కోట్లు ఒక సంవత్సరం, రూ.8,215 కోట్లు ఒక సంవత్సరం. ఈ నాలుగు సంవత్సరాలు లెక్కించి రూ.24,220 కోట్లను నాలుగు సంవత్సరాలతో భాగిస్తే యావరేజ్ ఎంత వస్తుంది? రూ.6,055 కోట్లు మాత్రమే వాళ్లు కేటాయించిన కేటాయింపులు వస్తుంది. మనం మొట్టమొదటి సంవత్సరంలోనే రూ.15,868 కోట్లను కేటాయించామంటే మూడంతలు అయినట్లు కాదా అధ్యక్షా! ప్రతి ఒక్కరు దానిని వేరే విధంగా చిత్రీకరిస్తున్నారు. కానీ వాస్తవంగా వాళ్ల కేటాయింపులు, వాళ్లు చేసిన ఖర్చును మేము కేటాయించిన దాంట్లో మూడో వంతు మాత్రమేనని తెలియజేస్తున్నాను.

బీసీ వెల్ఫేర్ చూసినట్లయితే ఈరోజు గర్వంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రభుత్వం బీసీలకు ఎంత ప్రాధాన్యతనిస్తుందనేది. అది ఒక వేళ బీసీ వెల్ఫేర్ మీద ఖర్చయితేనేమి, బీసీలకు సంబంధించిన ఎన్నో

నామినేటెడ్ పదవులలో వారికి ఇచ్చిన ప్రాధాన్యతనైతేనేమి, అదేవిధంగా క్యాబినెట్‌లో బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యత అయితేనేమి, అన్నీ చూసుకున్నట్లయితే, అవన్నీ చెప్పుకుంటూ పోతే సమయం చాలా అవుతుంది. ఫిగర్స్ పరంగా చూసినట్లయితే 2018-19 బడ్జెట్ ఎస్టిమేట్స్ అంటే గత ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.11 వేల కోట్లు. కానీ ఖర్చు పెట్టింది కేవలం రూ.6,600 కోట్లు. ఈ ప్రభుత్వం గర్వంగా చెబుతోంది మొదటి సంవత్సరం కేటాయింపే రూ.15,061 కోట్లని చెబుతున్నాము. అదేవిధంగా ఎస్సీ వెల్ఫేర్ నిమిత్తం 2018-19లో కేటాయించిన బడ్జెట్‌తో పోల్చినట్లయితే రూ.11,228 కోట్లను గత ప్రభుత్వం కేటాయించగా కేవలం రూ.10,578 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టడం జరిగింది. ఈ ప్రభుత్వం గర్వంగా చెబుతోంది రూ.15 వేల కోట్లను ఎస్సీల కోసం కేటాయించింది. అలాగే ఎస్టీల కోసం రూ.4988.86 కోట్లు అంటే దాదాపు రూ.5000 కోట్లను ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ ద్వారా కేటాయించడంజరిగిందని తెలియజేస్తున్నాను. ఇవికాకుండా పరిశ్రమలకు కేటాయించిన కేటాయిపులను చూస్తే, వారు మాట మాట్లాడితే చెబుతుంటారు ఇండస్ట్రీస్ బ్రహ్మాండంగా వచ్చాయని, ఇంతకు ముందే గౌరవ సభ్యులు మాట్లాడుతూ చెప్పారు. ఏకంగా 15 శాతం పరిశ్రమలు ఇక్కడ అమరావతిలో వచ్చాయన్నారు. ఎక్కడ అమరావతిలో ఏ ఇండస్ట్రీస్ వచ్చాయో మాకైతే తెలియదు. ఇండస్ట్రీస్‌కి సంబంధించిన కేటాయింపులను ఒక్కసారి చూద్దాము. ఇక్కడ అసలు ఇంకా బిల్డింగులే తయారు కాలేదు. కంపచెట్లు ఉన్నాయి ఇండస్ట్రీస్ వస్తాయని వాళ్లు చెబుతారు.

గత ప్రభుత్వం గత సంవత్సరం పరిశ్రమల నిమిత్తం రూ.3,503 కోట్లను కేటాయించి కేవలం రూ.740 కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. ఆ విధంగా తక్కువ ఖర్చు చేసి ఈరోజు మొత్తం పరిశ్రమలు ఇక్కడకు వచ్చాయి, రాష్ట్రంలో ఉండే పరిశ్రమలన్నీ అమరావతికి వచ్చాయి, అంటే ఇక్కడే 15 శాతం కొత్త పరిశ్రమలు వచ్చాయంటే ఇక మిగిలిన రాష్ట్రంలో ఏముందోననే సందేహం కలుగుతుంది. ఎందుకంటే 15 శాతం పరిశ్రమలు అమరావతిలో ఎక్కడ వచ్చాయని అడుగుతున్నాను? అలాగే ఐటీ గురించి చూస్తే అసలు ఐటీని మొత్తం వీళ్లే తెచ్చారంట వీళ్లు లేనిదే ఐటీ లేదంట, అసలు మొత్తం మేమే కనిపెట్టామంటారు. కేటాయింపులను చూద్దాము. 2014-15లో ఐటీ ఇన్సెంటివ్స్‌కి కేటాయించిన బడ్జెట్‌ని చూస్తే రూ.2 కోట్ల 12 లక్షలు కేటాయించారు. ఆ మొత్తంలో ఖర్చు చేసింది రూ.1 కోటి 29 లక్షలు. అలాగే 2015-16 సంవత్సరంలో రూ.3 కోట్ల 20 లక్షలను కేటాయించగా ఖర్చు చేసింది కేవలం రూ.1 కోటి 24 లక్షలు మాత్రమే. 2016-17వ సంవత్సరంలో రూ.25 కోట్లను కేటాయించగా ఖర్చు చేసింది రూ.2 కోట్ల 33 లక్షలు. 2017-18వ సంవత్సరంలో మరలా రూ.25 కోట్లను కేటాయించగా ఖర్చు చేసింది రూ.15 కోట్ల 64 లక్షలు. 2018-19 సంవత్సరంలో ఎలక్షన్ సంవత్సరం కాబట్టి ఎప్పుడూ ఎక్కువ కేటాయిస్తుంటారు. కాబట్టి రూ.400 కోట్లను కేటాయించారు కానీ ఖర్చు చేసింది బలంగా లేదు వీక్ ఉంది కేవలం రూ.18 కోట్ల 50 లక్షలనే ఖర్చు పెట్టారు. మొత్తం ఐటీ ఇన్సెంటివ్స్ క్రింద కేటాయించిన మొత్తం రూ.455 కోట్లను కేటాయించగా ఖర్చు చేసింది కేవలం రూ.39 కోట్లు మాత్రమే. కానీ మొత్తం ఐటీ, ఐటీ పరిశ్రమలు వచ్చాయంట దానిని ఎవరో అడ్డుకుంటున్నారంట.

రాని ఐటీని ఎవరు అడ్డుకుంటారు? నాకర్థం కాదు. ఇది కాకుండా అసలు ముఖ్యమైన విషయాల గురించి మాట్లాడితే, ఇప్పుడు గౌరవ ప్రతిపక్ష నాయకులుగారు కూడా సభలో ఉన్నారు, వారు మాట మాట్లాడితే ఏమంటారంటే బాధ్యత ఉంది కదా మీరెందుకు ఋణమాఫీ చేయలేదని అంటున్నారు. ఆశ్చర్యకరంగా ఉంది ఎంత ఆశ్చర్యమంటే, గణాంకాలను చూస్తే అర్థమవుతుంది. ఋణమాఫీ 2014-15 మొత్తం లెక్కిస్తే వాళ్ల మేనిఫెస్టో ప్రకారం రూ.87 వేల కోట్లను ఇవ్వాలి. దానిని కుదించి కుదించి రూ.24 వేల కోట్లకు తెచ్చారు. ఈ రూ.24 వేల కోట్ల నుంచి మళ్లా ఖర్చు పెట్టి పెట్టి పెట్టి ఫైనల్‌గా ఖర్చు చేసింది - కేటాయించింది రూ.16,512 కోట్లైతే ఖర్చు చేసింది కేవలం రూ.15,279 కోట్లు. దీంట్లో పెద్ద ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఈరోజు ఈ ప్రభుత్వాన్ని మీరెందుకు కంటిన్యూ చేయడం లేదని అడుగుతున్నారు. ఆన్‌గోయింగ్ స్కీమ్స్ కదా మీకు బాధ్యత లేదా అంటున్నారు. అసలు ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఓట్-ఆన్-అకౌంటు బడ్జెట్‌లో అసలు వాళ్లే ప్రొవైడ్ చేయలేదు. వాళ్ల బడ్జెట్‌లో వాళ్లే కేటాయించలేదు. మరలా మీరెందుకు కేటాయించడంలేదని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. చెక్ చేస్తే అసలు వాస్తవానికి లాస్ట్ బడ్జెట్‌ని ఏదైతే వాళ్లు ప్రవేశపెట్టారో దాంట్లో వాళ్ల ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాము, వాళ్లకు అతి ముఖ్యమైన ప్రోగ్రాము, వాళ్లు ఏదైతే రైతుల కోసం మేము ఇవన్నీ ప్రవేశపెడతాము, ఋణమాఫీ చేస్తామని చెప్పి 2014 ఎన్నికల్లో గెలిచారో అదే రైతుల మీద ఎంత మమకారం ఉందంటే వాళ్ల ప్రోగ్రాంలోనే వాళ్లే ఇంత వరకు ఖర్చు పెట్టలేదు. వాళ్ల డ్యూస్ ఎంత ఉన్నాయో చెబుతాను. నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ రూ.3600 డ్యూ ఉంది. అయిదో ఇన్‌స్టాల్‌మెంట్ రూ.4,325 డ్యూ ఉంది. వాళ్ల లెక్క ప్రకారం ఇంతవరకు డ్యూ ఉన్న మొత్తం రూ.7,925 కోట్లు. వాళ్లు వారి చివరి బడ్జెట్‌లో దానికి కేటాయించకుండా ఈరోజు మమ్మల్ని మీరెందుకు కేటాయించలేదని అంటున్నారు. ఇదేమన్నా భావ్యముందా వాళ్లు అడిగేదాంట్లో, ఇదెవ్వరూ గమనించడం లేదని అనుకుంటున్నారా? నాకైతే ఆశ్చర్యంగా ఉంది.

ఇక వాళ్లు చేసిన బ్రహ్మాండమైన స్కీమ్స్ ఉన్నాయి. ఎట్లాంటి స్కీములంటే నీరు-చెట్టు పేర్లు బలె బాగుంటాయి వనం-మనం, మీ ఇంటికి మీ భూమి. దాదాపు అందరు భయపడ్డారు. అందరి భూములు వాళ్ల ఇళ్లకు పోయాయని. మీ ఇంటికి మీ భూమి అని స్కీమ్ పెట్టారు. హ్యాపీసన్డే కార్యక్రమాన్ని పెట్టారు. హ్యాపీగా ఎవరినన్నా ఉండనిచ్చారా? ముఖ్యంగా అధికారులంతా శనివారం ఆదివారం రోజుల్లో కూడా వీడియో కాన్ఫరెన్స్‌లను నిర్వహించడం వలన మేము అల్లాడిపోతున్నాం సార్ అంటున్నారు. కానీ హ్యాపీ సన్డే. జలహారతి అంటే హారతినివ్వడం, పసుపు పచ్చ పూలను చల్లడం, పసుపు పచ్చ ఇది చల్లడం ఇది జలహారతి. అన్నింటికంటే వాళ్లు చేసిన గొప్ప కార్యక్రమం ఏమంటే, దోమల పై దండయాత్ర.

(సభలో నవ్వులు)

దోమల పై దండయాత్ర కార్యక్రమాన్ని మా కర్నూల్‌లో అయిదు రోడ్ల సర్కిల్ ఉంది రైల్వే స్టేషన్‌కి పోయే రోడ్ ఒకటి ఉంది. అప్పటి కలెక్టర్ విజయమోహన్‌గారు అత్యుత్సాహంతో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిది చాలా పెద్ద కటౌట్ పెట్టారు. ఆ కటౌట్‌లో చంద్రబాబునాయుడు గారిని పెద్ద బలంగా చూపిస్తూ తలపైన కిరీటం కూడా పెట్టారు. చేతిలో కత్తి, కత్తి ప్రక్కన దోమను పెట్టారు.

(సభలో నవ్వులు)

వాస్తవం అధ్యక్షా, స్వయానా నేను కలెక్టర్ గారికి ఫోన్ చేసి ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి అండి ఆయన్నెందుకు అట్లా గబ్బులేపుతున్నారని చెప్పి నేను తీపించాను. ఇట్లా బలంగా చాలా పెద్ద కటౌట్ పెట్టారు. బాహుబలి టైపు కిరీటము పెట్టి చేతిలో పెద్ద కత్తి పెట్టారు, ఆ పెద్ద కత్తి ప్రక్కన ఒక చిన్న దోమను పెట్టారు. దానికి "దోమల పై దండయాత్ర" అని పేరు పెట్టారు. అందుకనే బయట పబ్లిక్ ఏమంటారంటే – వీళ్ల పరిపాలన అంతా "మేటర్ వీక్ కానీ పబ్లిసిటీ పీక్" అంటారు. ఎందుకంటే పేరు మొత్తం చూడండి. నీరు –చెట్టు, వనం –మనం ఒక్కటన్నా ఇందులో జరిగిందా? కానీ దీంట్లో ఒక గొప్పతనం ఉంది. ఏ పథకంలో కూడా కేటాయింపులకు వాళ్లు మ్యాచ్ కారు. గొప్పతనమేమిటో ఇప్పుడు చెబుతా చూడండి. నీరు చెట్టు కార్యక్రమానికి గతసారి వాళ్లు కేటాయించిన కేటాయింపుల గురించి చెబుతాను చూడండి. 2014–15 కేటాయింపు సున్నా ఖర్చు చేసింది సున్నా. 2015–16 కేటాయింపులు రూ.72 కోట్లు ఖర్చు మాత్రం రూ.492 కోట్లు. 2016–17 కేటాయించింది రూ.110 కోట్లు ఖర్చు చేసింది రూ.1,217 కోట్లు. 2017–18 కేటాయించింది రూ.110 కోట్లు మళ్లీ గత సంవత్సరం ఫిగర్‌నే దింపారు సవరించే దానికి కూడా వారికి ఓపిక లేదు. కానీ ఖర్చు చేసింది రూ.921 కోట్లు. 2018–19 అంటే ఎలక్షన్ ఇయర్, ఎలక్షన్ ఇయర్ అంటే అభ్యర్థులంతా పరిగెత్తాలి కాబట్టి రూ.500 కోట్లను కేటాయించారు. కానీ ఖర్చు చేసింది రూ.2,215 కోట్లు.

మ 2.40

అంటే, Election Year. Election Year అంటే, అభ్యర్థులందరూ ఎలక్షన్ల కోసం పరుగెత్తాలి కదా! కాబట్టి దానికి చూడండి, ఎట్లా కేటాయింపులు చేసినారో తెలుస్తుంది. రూ. 500.00 కోట్లు కేటాయించినారు. ఖర్చు పెట్టినదెంత అంటే, రూ. 2,215.00 కోట్లు. నీరు - చెట్టు క్రిందే ఖర్చు చేశారు. అంటే, మొత్తం రూ. 793.00 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే, రూ. 4,850.00 కోట్లు నీరు- చెట్టు క్రింద ఖర్చుపెట్టి ఈరోజు ఎంత దోపిడి జరిగింది ఈ ప్రోగ్రామ్‌లో అనేది అర్ధమవుతోంది. ఇదికాక, 2019-20 సంవత్సరం అంటే, పోతూ, పోతూ last Vote on Account లో కూడా మళ్లీ అప్పుడు కూడా రూ. 161.00 కోట్లు, అంటే వీళ్ల పాత పాపాలన్నీ పోవాలి కదా! మేం కూడా ఇంకా ఇంతో, అంతో కట్టాలి కదా, కొన్నైనా కట్టాలని చెప్పి, తప్పని పరిస్థితుల్లో కొంత కేటాయించాం. ఆ మొత్తమే రూ. 161.00 కోట్లు.పెండింగ్ బిల్లుల మొత్తం ఎంతనో తెలుసా, రూ. 1,183.00 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. దాంట్లో ఎన్నింటికి బడ్జెట్ శాంక్షన్ ఉందో, ఎన్నింటికి బడ్జెట్ శాంక్షన్ లేదనేది కూడా చూడాల్సిన

అవసరం ఉంది. ఈ విధంగా వాళ్లు ఘోరాతి ఘోరంగా పరిపాలన చేసి, ఈరోజు వాళ్లు దానికి కేటాయింపు తక్కువైంది, తల్లులింతేనా, పిల్లలింతేనా అంటూ ఇవన్నీ ప్రశ్నలు, వాటికి సమాధానాలు. ఇది చూసిన తర్వాత అందుకే నేను ఒకటి చెబుతున్నాను. రామకృష్ణ పరమహంస గారని ఉన్నారు కదా! గొప్ప వ్యక్తి. Social Philosopher. రామకృష్ణ పరమహంస గారి దగ్గరకు ఒక తల్లి పోయిందంట. నా కొడుకు స్వీట్లు తింటున్నాడు, కాబట్టి ఎట్లైనా గానీ వాడిని మీరు పిలిపించి, ఆ అలవాటును మాన్పించేసేయండని కోరిందట ఆ తల్లి. అప్పుడు ఆయన అన్నాడట, ఒక వారం తర్వాత రామ్మా అని చెప్పాడట ఆ తల్లికి. వారం తర్వాత మళ్లీ ఆ తల్లి పోయిందట, పోతే మళ్లీ ఒక వారం తర్వాత రామ్మా అని అన్నాడట. మూడవసారి పోయి ఆ తల్లి అడిగిందట, నాయనా స్వామి, ఒక చిన్న స్వీటు తినొద్దు అని చెప్పి పిల్లవాడికి చెప్పేదానికి, నీవు మూడు వారాల నుంచి నన్ను తిప్పుకుంటున్నావు, ఎందుకు అంటే, అప్పుడు రామకృష్ణ పరమహంస గారు చెప్పినాడట. ఏదైనా గానీ, మొదట ఆ అబ్బాయికి చెప్పక ముందు first నేను మానుకోవాలి కదమ్మా, స్వీట్ తినేది నేను మానుకోవడానికి గానూ నాకు మూడు వారాలు పట్టింది అని చెప్పాడట. ఇది సాక్షాత్తు వాళ్ల టి.డి.పి. పార్టీకి వర్తిస్తుంది. ఎన్ని నీతులు, ఎన్ని రకాల నీతులు అందరికీ చెప్పడం జరిగింది. మేం కచ్చితంగా ఉంటాం, మేం ***, మేం ఇవి, మేం అవి అని చెప్పేవాళ్లు. కానీ, first, వాటిని వాళ్లు పాటించాలి. వాళ్లు పాటించిన తర్వాత వేరే వాళ్లకు చెప్పాలి తప్ప ఇది కేవలం వినే వాళ్లున్నారు కాబట్టి చెప్పేదంతా చెప్పుకుంటూ పోవడ మనేది తప్పు అవుతుంది. ఇది conclude చేయకముందు, ముఖ్యంగా ఈ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ విపరీతమైన కష్టాల్లో, గత ప్రభుత్వం వదిలిపెట్టిన విపరీతమైన అప్పులల్లో, విపరీతమైన అసలు ఎటువంటి financial prudence లేని పరిస్థితుల్లో కూడా overall గా balance చేస్తూ, ఒక పక్క Economic services గానీ, ఒక పక్క social services గానీ, ఒకపక్క general services గానీ మేనేజ్ చేస్తూ, flagship programmes ఏవైతే ఉన్నాయో, రైతులకు "వై.ఎస్.ఆర్. రైతు భరోసా" గానీ, లేకుంటే "జగనన్న అమ్మఒడి" కార్యక్రమం గానీ, లేదా "ఆరోగ్యశ్రీ" వంటి flagship programmes అన్నీ పేదవాడికి ప్రభుత్వం పై భరోసా ఉండేట్టుగా చేస్తూ, అన్నింటికంటే ముఖ్యంగా మేనిఫెస్టో అనేది దాదాపు 80% వరకు మొట్టమొదటి సంవత్సరంలోనే దాన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నామని గర్వంగా చెబుతూ, I would like to close this with the words of John F. Kennedy, former President of America. ఆయన ఏమంటారంటే, "My heart goes out to the millions of people who are fighting misery and poverty across the Globe. Today, we all are here to take a pledge to help them and help themselves for as longer time that is required. We have to do this not for political reasons, but because it is right. If a free Society cannot take care of the millions who are poor, we cannot protect the few who are rich". తెలుగులో "నా మనస్సు అనేది, నా గుండె అనేది ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఎవరైతే ఉన్నారో, ఎవరైతే దారిద్ర్యంతో, పేదరికంతో బాధపడుతున్నారో, వాళ్లకు సహాయం చేయాలని ఉంది, మరి ఈరోజు మనం ఒక solemn pledge తీసుకోవాల్సిన, ఒక వాగ్దానం చేయాల్సిన అవసరం ఉంది. ఏది వాళ్లకు సహాయం చేసేదే

***Expunged as ordered by the chair

కాకుండా వాళ్లకు వాళ్లు సహాయ పడేందుకు శక్తి కల్పించాలనేది". ఈరోజు ఆ బడ్జెట్ వాళ్లకు వాళ్లు సహాయం చేసేదానికి శక్తి కల్పిస్తుందని చెప్పి "అమ్మఒడి" ద్వారా నేను తెలియజేస్తున్నాను.

(హర్షధ్వానాలు)

ఈరోజు జగనన్న అమ్మఒడి ద్వారా గానీ, జగనన్న విద్యా దీవెన ద్వారా గానీ, ఈ వాక్యాలు ఏవైతే చెప్పినారో, వాళ్లను వాళ్లు సహాయపడే దానికి చేస్తున్న సహాయమని తెలియజేస్తున్నాను. ఇది మన బాధ్యత. ఇది కేవలం రాజకీయ కారణాల కోసం కాదు గానీ, ఇది కరెక్టు, ఇది మంచిది, ఇది right ని చెప్పేందు కోసం అని చెబుతూ, ఒక సమాజం ఏదైతే ఉందో, free Society ఏదైతే ఉందో, కోట్లాది మంది పేదవాళ్లను ఒకవేళ చూసుకోలేని పరిస్థితుల్లో ఉంటే, ఎంతో కొంత డబ్బులున్న, కొద్దిగా వాళ్లను protect చేసేదానికి వీళ్లకు ఎక్కడ నుంచి శక్తి వస్తుంది. కాబట్టి ముఖ్యంగా కోట్లాది మంది ఎవరైతే పేదవాళ్లు ఉన్నారో, వాళ్లను చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చెబుతూ, ఈరోజు ఏదైతే బడ్జెట్ మీద ప్రసంగం ఉందో, దానికి రిప్లై ఉందో, దాన్ని ముగిస్తున్నాను. ధన్యవాదాలు.

(జోహార్ వై.ఎస్.ఆర్. అంటూ ట్రెజరీ బెంచ్ వైపు కూర్చున్న సభ్యులు నినాదాలు చేయసాగారు)

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU):అధ్యక్షా, మంత్రి గారి మాటలైతే కోటలు దాటుతున్నాయి. చేష్టలు గడప దాటతాయో, లేదో రేపు చూద్దాం.

మిస్టర్ స్పీకర్: చంద్రబాబు నాయుడు గారూ, clarifications.....

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): క్లారిఫికేషన్స్‌కే వస్తానండి. అంటే, మీరు ఒకటి గుర్తు పెట్టుకోవాలి. మీరు స్పీకర్‌గా ఉన్నప్పుడు ఆయన మమ్మల్ని గురించి మాట్లాడకపోతే, మేం కూడా ఆయన గురించి మాట్లాడం. అడుగడుగునా విమర్శలు చేసినప్పుడు దానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మా పైన ఉంది. మీరు రెండు పక్కల version విన్నారు. ఎప్పుడు కూడా బడ్జెట్ అనేది ....

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (SRI Y.S.JAGANMOHAN REDDY):అధ్యక్షా, ఇంత వరకు నేను ఐదు సంవత్సరాల పాటు ఇవే బడ్జెట్ సమావేశాలను చూశాను. Last five years, మేం ప్రతిపక్షంలో ఉన్నాం. ఎక్కడా, నేను ఎప్పుడూ చూడలేదు. బడ్జెట్ సమావేశాల్లో ఫైనాన్స్ మినిస్టర్ చివర్లో క్లారిఫికేషన్స్ ఇస్తారు. ఫైనాన్స్ మినిస్టర్ క్లారిఫికేషన్ ఇచ్చిన తర్వాత మళ్లీ ప్రతిపక్ష నాయకుడు మైక్ అందుకుని, మళ్లీ తను మాట్లాడటమనేది ఇంతవరకు ఎప్పుడూ ఈ శాసనసభలో జరగలేదు. It is the first time this is happening. ఇదే మాదిరిగా ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారు మాట్లాడతారంటే, No problem. మళ్లీ ఈ ప్రక్రియను మీరు మార్చాలి అనుకుంటే, there is no problem. It is up to you. Clarifications అనేవి total గా Finance Minister గారు చివర్లో

ఇస్తారు. క్లారిఫికేషన్స్ ఇచ్చిన తర్వాత మళ్లీ ప్రతిపక్షనాయకుడు మైక్ అందుకుని మళ్లీ ప్రసంగాన్ని start చేయడమనేది ఇంత వరకు ఎప్పుడూ జరగలేదు. But, in spite of that ఆయన మళ్లీ మాట్లాడతానంటే, మాకేమి అభ్యంతరం లేదు. మీరు పరంపర మార్చేటట్లైతే బంగారంలాగా వారికి అవకాశం ఇచ్చి మాట్లాడనివ్వండి, no problem. దాని తర్వాత మాత్రం మళ్లీ మాకు కూడా టైమ్ ఇవ్వాలి. So, that ఆయనకు ఏదైతే చెప్పాడో అంతే effective గా ఆయన మాట్లాడే అబద్ధాలను, మళ్లీ effective గా retort చేసేందుకు గానూ మా వాళ్లకు కూడా సమయం ఇవ్వమని నేను కచ్చితంగా మిమ్మల్ని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: చంద్రబాబు నాయుడు గారూ చెప్పండి.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU): మీ ద్వారా ముఖ్యమంత్రి గారికి ఒక విజ్ఞప్తి అధ్యక్షా. 40 సంవత్సరాలుగా సంప్రదాయం. గవర్నర్స్ అడ్రస్ గానీ,

(అధికారపక్ష సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

గవర్నర్ అడ్రస్ గానీ, అదేవిధంగా బడ్జెట్.. నేను 35 సంవత్సరాల నుంచి చూస్తున్నాను. 36వ సంవత్సరం చూస్తున్నాను.

(అధికార, విపక్షాల నడుమ వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి)

రికార్డులన్నీ ఒక్కసారి చూడండి. అసెంబ్లీ పెట్టినప్పటి నుంచి ఇది సంప్రదాయం. కనీసం ముఖ్యమంత్రి గారికి ప్రొసీజర్స్ తెలియదంటే, చాలా దురదృష్టం.

(బెల్)

మిస్టర్ స్పీకర్: చంద్రబాబు నాయుడు గారూ, మీకేమైనా సరే ఇప్పుడు ఆయన (సభా నాయకుడు) ఇచ్చిన దాని మీద general గానైతే what Leader of the House said is right, clarifications అన్నీ కూడా, మీరు మాట్లాడిన తరువాత ఆయన clarification speech అది.

(ఆరోపణ ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శల మధ్య సభ సాగుతోంది)

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(SRI KINJARAPU ATCHANNAIDU) : రికార్డ్స్ చూడండి. ఒక్కసారి గతాన్ని చూడండి. క్లారిఫికేషన్స్ పైన ప్రతిపక్షనాయకుడు మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది.

మిస్టర్ స్పీకర్: మీరు కొత్త సంప్రదాయాలు చేస్తున్నారు. అచ్చెన్నాయుడు గారూ, నేను చెప్పేది మీరు వింటారా? ప్రతిపక్ష నాయకుడు అడిగారనే ఒక గౌరవంతో మేము మాట్లాడటానికి అవకాశం ఇచ్చాం తప్ప సభ సంప్రదాయమైతే ఇది కాదు.

('రికార్డు తీయండి సార్' అని ప్రతిపక్షపార్టీ సభ్యులు శ్రీ కె.అచ్చెన్నాయుడు అన్నారు)

మిస్టర్ స్పీకర్: ఏమి రికార్డులు చూస్తావ్. చూడడానికి ఏముంది. వెళ్లాల్సిన పనిలేదు. ఏం సంప్రదాయాలు ఉన్నాయో మీరు చెప్పండి.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు**(SRI KINJARAPU ATCHANNAIDU) :** సంప్రదాయాన్ని మార్చమని చెప్పండి సార్. మినిస్టర్ గారి రిప్లై ఇచ్చిన తర్వాత క్లారిఫికేషన్స్ ఉన్నాయి. రికార్డ్స్ చూడండి.

మిస్టర్ స్పీకర్: సభ్యులు క్లారిఫికేషన్స్ అడిగిన తరువాత మంత్రి గారు సమాధానమిస్తారు. రామనారాయణ రెడ్డి గారూ చెప్పండి.

మ 2.50

(అధికార పార్టీ సభ్యులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డిగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి **(SRI ANAM RAMANARAYANA REDDY):** అధ్యక్షా, ఇవాళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ మీద సుదీర్ఘంగా నాలుగు రోజుల పాటు అన్ని పక్షాల సభ్యులు కూడా మాట్లాడారు. అందరం మాట్లాడిన తర్వాత చివరిగా మన ఆర్థిక శాఖా మంత్రిగారు ప్రతి పాయింటు మీదా రిప్లై ఇవ్వడం జరిగింది. ఒకవేళ మీ డిస్క్రెషన్‌లో మీరు ఏదైనా ఇవ్వాలీ అని అంటే, ఒకటి, రెండు క్లారిఫికేషన్లు ఏదైనా ఆర్థిక శాఖా మంత్రిగారు చెప్పడంలో మిస్ అయిన పాయింట్ల మీద ఒకవేళ అడిగితే సరే గానీ, మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టి మళ్లీ చర్చ జరగాలి, మళ్లీ ఆ చర్చ అంతటికీ మళ్లీ జవాబు చెప్పాలి అంటే ఈ సంప్రదాయం ఎప్పుడూ లేదు. పెద్దలు గౌరవ ప్రతిపక్షనాయకుల వారికి కూడా తెలుసు ఇది. కానీ మళ్లీ మాట్లాడాలనే ప్రయత్నం చేయడం అనేది సరైంది కాదు. తమరు ఒక నిర్ణయం తీసుకుని గతంలో ఏనాడూ లేని కొత్త సంప్రదాయాలకు తెరతీయొద్దు. ఇవాళ చాలా సుదీర్ఘమైన సమాధానం ఆర్థిక శాఖామాత్యులు ఇచ్చారు. ఒకటి, రెండు ఎక్కడైనా ప్రతిపక్షం వాళ్లు మాట్లాడిన దాంట్లో క్లారిఫికేషన్ లేదంటే అడగడంలో తప్పు లేదు గానీ, అది కూడా మీ పర్మిషన్‌తో. అంతే గానీ మళ్లీ ఉపన్యాసం చెబుతాము, మళ్లీ సుదీర్ఘంగా బడ్జెట్ మీద అంతా మనమే చర్చ చేద్దామని అంటే, అధ్యక్షా, ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన సభ ప్రస్తుతం సాయంత్రం మూడు కావస్తోంది. ఇంకా కావాలంటే మరో మూడు గంటలు ఉండడానికి మాకు అభ్యంతరం లేదు. కానీ అదేరకంగా ప్రభుత్వ

పక్షాన ఉన్న సభ్యులందరికీ మీరు సమయం ఇవ్వాలి. అందరూ మాట్లాడాలి. తిరిగి మళ్లీ ఆర్థిక శాఖా మంత్రిగారు సమాధానం చెప్పాలి. కాబట్టి ఇటువంటి పరిస్థితిల్లో తమరు ఒక నిర్ణయం తీసుకుని దీనిని ఇంతటితో క్లోజ్ చేసి వెసులుబాటు కల్పిస్తే బాగుంటుంది.

మిస్టర్ స్పీకర్: నాకు తెలిసి సంప్రదాయం అయితే బడ్జెట్ ..

(ప్రతిపక్ష పార్టీ ఉప నేత శ్రీ కె. అచ్చెన్నాయుడుగారు మాట్లాడుతూ 10, 15 సంవత్సరాలు గ్యాప్ వచ్చిందని అన్నారు)

ఆగండి సార్, నాకు తెలుసు. ఎన్ని సంవత్సరాలు గ్యాప్ వచ్చిందో, రూల్స్ ఎలాగు ఉంటాయో కూడా నాకు తెలుసు. Don't suggest the Chair. I know everything.

(ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలంటూ తన అభ్యంతరాల్ని వ్యక్తం చేయసాగారు)

కూర్చోండి. No, if it is the case... The House is adjourned to meet again at 9am on Thursday.

(The House then adjourned at 2.52p.m. to meet again at 9.00 a.m. on Thursday, the 18th July, 2019.)

“Published under Rule 347 of the Rules Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.”